
సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM



పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 16
సంచిక: 271

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | MUMBAI | BANGALORE | CHENNAI | DELHI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

'విద్యుత్'పైనా విచారణ

ఛత్తీస్‌గఢ్ ఒప్పందం, భద్రాద్రి, యాదాద్రి థర్మల్ ప్రాజెక్టులపై న్యాయ విచారణ చేయిస్తాం

- అసెంబ్లీలో 'విద్యుత్'శ్వేతపత్రంపై చర్చలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటన
- విద్యుత్ శాఖను పూర్తిగా స్కాన్ చేసి వాస్తవాలను వెల్లడిస్తున్నాం
- ఈ మూడు ఒప్పందాలు కూడా లోపభూయిష్టమైనవే..
- మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి కోరిక మేరకే విచారణకు ఆదేశిస్తున్నాం
- ఛత్తీస్‌గఢ్ విద్యుత్‌తో రాష్ట్రానికి తీవ్ర నష్టం
- కాలం చెల్లిన సాంకేతికతతో భద్రాద్రి ప్రాజెక్టు నిర్మాణం
- రాష్ట్రంలో విద్యుదుత్పత్తి పెరగడం అవాస్తవమని వ్యాఖ్య



సాక్షి, హైదరాబాద్: గత ప్రభుత్వ హయాంలో జరిగిన మూడు కీలక విద్యుత్ అంశాలపై న్యాయ విచారణ చేయిస్తామని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి శాసనసభలో ప్రకటించారు. ఛత్తీస్‌గఢ్‌తో చేసుకున్న విద్యుత్ ఒప్పందంతోపాటు భద్రాద్రి, యాదాద్రి విద్యుత్ ప్రాజెక్టులపైనా విచారణకు ఆదేశిస్తున్నట్టు చెప్పారు. మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి కోరడంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్టు పేర్కొన్నారు. తెలంగాణ ఏర్పాటైన నాటి నుంచి రాష్ట్రంలో విద్యుత్ శాఖ, వ్యవస్థల పరిస్థితికి సంబంధించి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క గురువారం శాసన సభలో శ్వేతపత్రాన్ని విడుదల చేశారు. తర్వాత జరిగిన చర్చలో మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ.. యాదాద్రి ప్రాజెక్టుకు సంబంధించి తనపై వస్తున్న ఆరోపణలపై న్యాయవిచారణ జరిపించాలని సవాల్ విసిరారు. దీనిపై సీఎం రేవంత్ స్పందించారు. ఛత్తీస్‌గఢ్ విద్యుత్ ఒప్పందంతోపాటు యాదాద్రి, భద్రాద్రి విద్యుత్ కేంద్రాలకు కాలం చెల్లిన సబ్ క్రిటికల్ టెక్నాలజీ వాడకం, పెరిగిన అంచనా వ్యయం తదితర అంశాలపై న్యాయ విచారణకు ఆదేశిస్తున్నట్టు తెలిపారు. దీనికి సంబంధించి సీఎం రేవంత్ చెప్పిన అంశాలు ఆయన మాటల్లోనే..

"గత ప్రభుత్వం తొమ్మిదిన్నరేళ్లుగా వాస్తవాలను దాచిపెట్టింది. మేం విద్యుత్ శాఖను పూర్తిస్థాయిలో స్కానింగ్ చేసి, వాస్తవాలను సభ ముందు పెడుతున్నాం. గత పాలకులు వాస్తవాలను హుందాగా ఒప్పుకోవాలి. ఒప్పందాల వెనుక ఉన్న ఉద్దేశాలు బయటికి రావాలి. ఛత్తీస్‌గఢ్ విద్యుత్ ఒప్పందం లోపభూయిష్టం. టెండర్లు లేకుండా ఒప్పందం చేసుకున్నారు. దీనిపై ఆనాడు ఈఆర్సీ ముందు మా వాదనలు వినిపించాం. సభలోనూ నిలదీస్తే మార్షల్స్‌తో బయటికి పంపారు. ఛత్తీస్‌గఢ్ ఒప్పందంపై విద్యుత్ జేఏసీ నాయకుడైన ఓ అధికారి నిజాలు చెబితే.. ఆ ఉద్యోగి

మిగతా 2వ పేజీలో ▶

పైలట్ రహిత ప్రయాణం

అమెరికా సంస్థ ప్రయోగం

- వివరాలు 6లో



టెలికం సేవలపై కేంద్రం నియంత్రణ



పార్లమెంట్ ఆమోదం

జాతి భద్రత దృష్ట్యా టెలికమ్యూనికేషన్ సేవలను తాత్కాలికంగా నియంత్రణలోకి తెచ్చుకునేందుకు కేంద్ర ప్రభుత్వానికి అధికారం కల్పించే కీలకమైన టెలికమ్యూనికేషన్స్ బిల్లు-2023ను గురువారం పార్లమెంట్ ఆమోదించింది. వేలం ప్రక్రియతో సంబంధం లేకుండా ప్రభుత్వమే నేరుగా గ్లోబల్ సర్వీస్ ప్రొవైడర్లకు శాటిలైట్ స్పెక్ట్రమ్ కేటాయింపులు జరిపేందుకు కూడా ఈ బిల్లులో నిబంధనలున్నాయి.

6లో

సాక్షి
ఫ్యామిలీ
హైదరాబాద్
శుక్రవారం ॥ 22-12-2023

ఫ్యాషన్





సిగలో నక్షత్రాలు

విరిసిన పువ్వులే కాదు... మెరిసే నక్షత్రాలు...
ఎగిరే సీతాకోక చిలుకలు...
తలకట్టులో చేరి సందడి చేస్తే...
ఏ వేడుకైనా ప్రత్యేకంగా నిలిచిపోవాల్సిందే.



కేశాలంకరణలో జ్యువెలరీ ఎప్పుడూ స్పెషల్ అట్రాక్షన్‌గానే నిలుస్తుంది. దీనికి తగినట్టు డిజైనర్లు బంగారు, డైమండ్ జ్యువెలరీతో పోటీపడుతూ ఇతర లోహాలతోనూ తయారు చేస్తున్నారు. తక్కువ ధరలో అందరికీ అందుబాటులో ఉండేలా చూస్తున్నారు.

హెయిర్ ఫాయిలింగ్

గ్లిట్టర్ మెరుపులు కేశాలంకరణకు ఉపయోగించేవారు గతంలో. ఇప్పుడు సిల్వర్, గోల్డ్ ఫాయిల్ పేపర్స్‌తో కేశాలంకరణలో మెరుపులు తీసుకువస్తున్నారు. క్రిస్మస్, న్యూ ఇయిర్ పార్టీలకు యువత ఫాయిలింగ్ మెరుపును కొత్తగా జోడిస్తున్నాయి.

కొప్పు కొప్పుకో తీరు

గోల్డెన్ కలర్ ఫ్లవర్స్, బటర్ ఫ్లైస్, మూన్ అండ్ స్టార్స్.. వంటివి వివిధ రకాల పరిమాణాల్లో ఉండే పిన్స్ వంటివి రూ.100 నుంచి అందుబాటులో ఉన్నాయి. డిజైన్, సెట్స్‌ను బట్టి వేల రూపాయల వరకు ఈ బాజీ పిన్స్ ధర పలుకుతున్నాయి.

నవరత్నాల వెలుగులు

బంగారు ఆభరణాలలో నవరత్నాల హంగులను చూస్తుంటాం. ఇప్పుడు ఈ అందం తలకెక్కి కొత్తగా మెరుస్తోంది. క్రిస్టల్స్, స్వరోస్కి, ఇతర స్టోన్స్ ఉన్న పిన్స్ నైట్ టైమ్ వేడుకల్లో తలలో అందంగా మెరిసిపోతున్నాయి.

పండగ కళ

క్రిస్మస్ ట్రీ థీమ్ ఏంటి?

క్రిస్మస్ కాంతులు సమీపించాయి.
బెంగళూరులో 100 అడుగుల నిటారుగా
ఇండియాలోనే ఎత్తయిన క్రిస్మస్ ట్రీ వెలిసింది.
క్రిస్మస్ వచ్చిందంటే ఇంటింటా స్త్రీలు, పిల్లలు
క్రిస్మస్ ట్రీని అలంకరించేందుకు ఉత్సాహపడతారు.
క్రిస్మస్ ట్రీని అనేక థీమ్‌లతో అలంకరించవచ్చు.
క్రిస్మస్ ట్రీ కథనూ ఈ సారి
అనువైన థీమ్‌లను తెలుసుకుందాం.

క్రిస్మస్ అంటే ప్రపంచమంతా నక్షత్రాలు పూసే వేళ. కేకులు సువాసనలు వెదజల్లే వేళ. కానుకలు రిబ్బన్ ముక్కల్లో అందంగా ప్యాక్ అయ్యే వేళ, శాంటా కోసం పిల్లలు ఎదురు చూసే వేళ, ప్రతి ఇంట్లో క్రిస్మస్ చెట్టు చిగురించే వేళ.

ఏసుక్రీస్తు జన్మదినాన జగతి అంతా రంగులను హత్తుకుంటుంది. కురిసే మంచును కేరింతలతో కోస్తుంది. చర్చ్ గంటలు గణగణ మోగుతాయి. స్తోత్రగీతాలు హోరెత్తుతాయి. కొవ్వొత్తులు రెపరెపలాడతాయి. ప్రేమ, త్యాగం, కరుణ... మనిషిని కాపాడేవి ఇవే కదా. ఇలాంటి పర్వదినంలో అలంకరణ ఎలా మిస్ అవుతాము?

క్రిస్మస్ ట్రీ

క్రిస్మస్ వేళ ప్రతి ఇంటిపై క్రిస్మస్ స్టార్ వెలుగుతుంది. అలాగే క్రిస్మస్ చెట్టు కూడా కొలువుదీరుతుంది. జన సంస్కృతి నుంచి మెల్లగా పండుగలోకి వచ్చిన చిహ్నం ఇది. శీతల దేశాలలో శీతాకాలం కడు దుర్భరంగా ఉంటుంది. జీవేచ్ఛ అడుగంటుతుంది. అందుకని అప్పటి ప్రజలు పచ్చటి పైన్ లేదా ఫర్ చెట్టు కొమ్మలను తెచ్చి ఇంటి బయట వాటిని అలంకరించేవారు. ఇది పాజిటివ్ వైబ్రేషన్స్‌ను తెస్తుందని భావించేవారు. క్రీస్తు జన్మదినం కూడా శీతాకాలంలో వస్తుంది కాబట్టి ఈ అలంకరణ మెల్లగా ఒక దేశం నుంచి మరో దేశానికి పాకి క్రిస్మస్‌తో జత కలిసింది. క్రిస్మస్ ట్రీని సతత హరిత జీవనానికీ, జీవితేచ్ఛకూ చిహ్నంగా భావిస్తారు. పచ్చగా వర్ధిల్లమనే కామన క్రిస్మస్ ట్రీ. క్రిస్మస్ పండగనాడు ఒక చర్చిలో ఏసు ప్రభువు విగ్రహం ఎదుట అందరూ ఖరీదైన కానుకలు పెడుతుంటే ఒక పేద బాలుడు ఒక పచ్చటి మొక్కను పెట్టాడట. ఆ మొక్క వెంటనే బంగారు కాంతులీనిందట. అప్పటి నుంచి నిరాడంబరమైన ఆరాధనకు గుర్తుగా క్రిస్మస్ ట్రీ వచ్చిందని ఒక కథ.





ముఖ్యమైన రంగులు నాలుగు

క్రిస్మస్ ట్రీ అలంకరణలో నాలుగు రంగులు కనపడతాయి. తెలుపు రంగు– ఇది స్వచ్ఛతకు గుర్తు. కురిసే మంచుకు కూడా. అందుకే క్రిస్మస్ ట్రీలో పత్తిని తెల్లదనానికి ఉపయోగిస్తారు. ఎరుపు రంగు– ఇది క్రీస్తు రక్తానికి, త్యాగానికి చిహ్నం. శాంటా కూడా ఈ రంగు దుస్తులనే ధరిస్తాడు. ఆకుపచ్చ రంగు– ఇది క్రీస్తు సజీవతను గుర్తు చేస్తుంది. బంగారు రంగు– ఇది సంపదకు, మానవాళికి బహుమతిగా దక్కిన ఏసు మార్గానికి గుర్తు. ఒకప్పుడు ఫర్, పైన్ చెట్ల కొమ్మలను తెచ్చే క్రిస్మస్ ట్రీని తయారు చేసేవారు. ఆ తర్వాత చైనా నుంచి కృత్రిమ చెట్లు వచ్చాయి. కేవలం క్రిస్మస్ ట్రీల కోసమే అమెరికా, ఆస్ట్రేలియా, కెనడా దేశాలలో 25 రకాల పైన్, ఫర్ చెట్లను సాగు చేస్తున్నారు. ఇవి ఆరడుగుల ఎత్తు పెరగడానికి ఎనిమిది నుంచి పన్నెండేళ్లు పడతాయి.



ఎన్నో థీమ్‌లు

సంప్రదాయ క్రిస్మస్ చెట్టును అలంకరించడంలో కొత్తదనం కోసం రకరకాల థీమ్‌లు కూడా వచ్చాయి. మన వీలును బట్టి ఆ థీమ్‌ను ఎంచుకోవచ్చు. ఇంటికి వచ్చిన వారిని ఆశ్చర్యపరచవచ్చు.

★ **అండర్ ద సీ:** అంటే గవ్వలు, జలకన్యలో, సొరచేపలు, తాబేళ్లు... ఇలాంటి రకరకాల బొమ్మలతో అలంకరించవచ్చు ★ **రెయిన్ బో:** అంటే ఇంద్రధనుస్సులోని ఏడు రంగులు ఒక్కో దొంతరగా కిందనుంచి పై వరకూ వచ్చేలా ఆయా రంగు కాగితాలను, రిబ్బన్‌లను, లేదా క్రిస్మస్ బాల్స్ లేదా బెల్స్‌ను కట్టొచ్చు ★ **ట్రావెల్:** విహారం థీమ్‌తో మీనియేచర్ బ్యాగులు, వాహనాలు, ఏరోప్లేన్‌లు, టికెట్లు, మైలు రాళ్ల బొమ్మలు.. ఇవి ఉపయోగించాలి ★ **జలపాతం:** క్రిస్మస్ ట్రీ నుంచి జలపాతాలు జారుతున్నట్టు బ్లూ రిబ్బను పాయలు పాయలుగా వేలాడగట్టాలి ★ **బెలూన్:** ఇది ఈజీ థీమ్. కొమ్మ కొమ్మకు మంచి మంచి బెలూన్లు రకరకాల సైజులవి కట్టడమే. ★ **చాక్లెట్లు:** పిల్లలను ఆకర్షించేలా క్రిస్మస్ ట్రీని ఏర్పాటు చేయాలంటే క్యాండీలు, చాకెట్లు, పిప్పరమెంట్లు, జెమ్స్ ప్యాకెట్లు... కొమ్మ కొమ్మలో దూర్చడమే. ★ **ఎర్ర పూలు:** మన దగ్గర దొరికే ఎర్రరంగు పూలు గులాబీలు కావచ్చు, చామంతులు కావచ్చు, మందారాలు కావచ్చు... వీటితో క్రిస్మస్ ట్రీని అలంకరిస్తే ఆ లుక్కే వేరు.

ఇవి కొన్ని సూచనలు. వీటిని అందుకొని మీ సొంత థీమ్‌తో ఈ క్రిస్మస్‌ను కళకళలాడించండి.
హ్యాపీ క్రిస్మస్.

● ముగ్గు ముచ్చట







ఆర్. రెడ్డి లక్ష్మి
హిందూపురం
21 చుక్కలు, 11 వచ్చేవరకు, నందు చుక్క



గడగోజు స్రవంతి
ఈదులూరు
నల్లగొండ జిల్లా
17 చుక్కలు, 8 వచ్చేవరకు, మధ్య చుక్క





బి.నారాయణమ్మ
మహబూబ్‌నగర్
24 చుక్కలు, 4 వరుసలు, 4 వచ్చేవరకు, సరిచుక్క

మీరు ముగ్గులు వేస్తారా? అలా అయితే ముచ్చటైన మీ ముగ్గులను అందమైన రంగులతో కాగితం మీద పెట్టండి. చుక్కల వివరాలు, ఊరు పేరుతో సహా వాటిని మాకు పంపండి. వాటిలో మంచి ముగ్గును మీ ఫొటోతో సహా మేము ప్రచురిస్తాం.



ముగ్గులకు ఆహ్వానం

ముగ్గులు పంపవలసిన చిరునామా
ముగ్గు-ముచ్చట, సాక్షి ఫ్యామిలీ, సాక్షి టవర్స్, రోడ్ నెం.1, బంజారాహిల్స్, హైదరాబాద్-34.
ఈ మెయిల్: muggulu.sakshi@gmail.com

ఇంటిప్స్

- శుభ్రంగా కడిగి తుడిచిన నిమ్మకాయలకు కొద్దిగా నూనె రాసి టిష్యూపేపర్ వేసిన బాక్స్‌లో పెట్టి రిఫ్రిజిరేటర్‌లో పెడితే ఎక్కువ రోజులపాటు తాజాగా ఉంటాయి.
- గ్లాసు నీళ్లలో కొద్దిగా వెనిగర్ వేసి టూత్‌బ్రష్‌లను నానబెట్టాలి. అరగంట తరువాత గోరువెచ్చని నీటితో కడిగితే టూత్‌బ్రష్‌లు శుభ్రపడతాయి.
- సగ్గుబియ్యం చక్కగా నానిన తరువాత నీటిని వడగట్టి ఎయిర్ టైట్ కంటైనర్‌లో వేసి రిఫ్రిజిరేటర్‌లో పెట్టాలి. ఇవి నాలుగైదు రోజులపాటు తాజాగా ఉంటాయి. అప్పటికప్పుడు సగ్గుబియ్యం నానపెట్టుకోకుండా ఇలా నిల్వచేసిన సగ్గుబియ్యాన్ని తీసుకుని వెంటనే కిచిడి, పాయసం, ఇడ్లీ, దోశల్లోకి వాడుకోవచ్చు.

వంటిల్లు

తీపి రుచుల క్రిస్మస్

క్రిస్మస్ అనగానే నోరూరించే కేకులు, స్వీట్లే గుర్తు వస్తాయి ఎవరికైనా...
అందుకే మీ మనసుతోపాటు నాలుక కూడా ఆ దేవుని ప్రేమంత తియ్యగా...
ఆయన ఆశీర్వాదం అంత హాయిగా రుచులతో నిండాలని...
మీ సమస్యలకు ఆ కరుణామయుడు ఇచ్చే సమాధానం అంత కమ్మగా కేకులు ఉండాలని కోరుకుంటూ మీ కోసం కొన్ని కొత్త కేకులు, స్వీట్ల తయారీ విధానాన్ని అందిస్తోంది మన వంటిల్లు.



అలహాబాదీ కేక్

కావలసినవి: మైదా – రెండు కప్పులు; పేతా స్వీట్ – రెండు కప్పులు; గుడ్లు – ఆరు; వెనీలా ఎసెన్స్–టీస్పూను; గరం మసాలా–రెండు టీస్పూన్లు; బటర్ – రెండు కప్పులు; పంచదార – పావు కప్పు, వంటసోడా – ఒకటిన్నర టీస్పూన్లు; షాజీరా – చిటికెడు; మర్మలైడ్ జెల్లి – అరకప్పు; మిక్స్ క్యాండైడ్ ఫ్రూట్స్ – ఒకటిన్నర కప్పులు; రమ్ – రెండు కప్పులు; నెయ్యి – టీస్పూను; పంచదార (క్యారమలైజేషన్ కోసం)–ముప్పావు కప్పు; వేడినీళ్లు– అరకప్పు.

తయారీ: ● మిక్స్ క్యాండైడ్ ఫ్రూట్స్‌ను రమ్‌లో వేసి ఒకరోజంతా నానబెట్టుకోవాలి ● మరుసటిరోజు పంచదారను బ్రౌన్ కలర్‌లోకి మారేంత వరకు వేయించాలి. రంగు మారిన వెంటనే స్టవ్ ఆపేసి అరకప్పు వేడినీళ్లు పోసి కలపాలి. మరోసారి ఈ గిన్నెను మంటమీద పెట్టి పంచదార కరిగిన తరువాత దించేయాలి ● పెద్దగిన్నెలో పావుకప్పు పంచదార, బటర్ వేసి నురగ వచ్చేంత వరకు బీట్ చేయాలి ● నురగ వచ్చిన తరువాత గుడ్లసొన వేయాలి. ఒక్కో గుడ్డు సొన వేస్తూ బీట్ చేయాలి ● గుడ్లసొన చక్కగా కలిసిన తరువాత వెనీలా ఎసెన్స్, గరం మసాలా, వంట సోడా, మర్మాలేడ్ జెల్లి, షాజీరా, నానబెట్టుకున్న మిక్స్ క్యాండైడ్ ఫ్రూట్స్ వేసి బీట్ చేయాలి ● బ్యాటర్‌లో ఉండలు లేకుండా మృదువుగా మారేంత వరకు బీట్ చేసుకోవాలి ● బేకింగ్ ట్రేకు నెయ్యి రాసి, కేక్ బ్యాటర్‌ను వేయాలి ● బేకింగ్ ట్రేను అవెన్ పెట్టి 180 డిగ్రీల వద్ద అరవై నిమిషాలు బేక్ చేస్తే ఎంతో రుచికరమైన అలహాబాదీ క్రిస్మస్ కేక్ రెడీ.



డెజర్ట్ బాస్కెట్

కావలసినవి: మైదా – ఒకటిన్నర కప్పులు; బటర్ – పావు కప్పు; పంచదార పొడి – రెండు టీస్పూన్లు; పాలు – అరకప్పు; ఉప్పు – పావు టీస్పూను; నూనె – డీప్‌ఫ్రైకి సరిపడా.

కోకోనట్ ఫిల్లింగ్: పచ్చికొబ్బరి తురుము – ఒకటిన్నర కప్పులు; పంచదార – కప్పు; రోజ్ ఎసెన్స్ – పావు టీస్పూను; నచ్చిన ఫుడ్ కలర్స్ – నాలుగైదు చుక్కలు.

తయారీ: ● మైదాలో పంచదార పొడి, బటర్, ఉప్పు, పాలు వేసి ముద్దలా కలిపి అరగంట నానబెట్టుకోవాలి ● నానిన పిండిని చపాతీల్లా వత్తుకోవాలి. చపాతీని మౌల్డ్స్‌లో పెట్టి చిన్న సైజు కప్పు ఆకారంలో వత్తుకోవాలి ● బాస్కెట్స్ అన్నీ రెడీ అయిన తరువాత నూనెలో డీప్ ఫ్రై చేసి పక్కన పెట్టుకోవాలి ● బాణలిలో కప్పు పంచదార, అరకప్పు నీళ్లుపోసి మరిగించాలి ● పంచదార కరిగిన తరువాత పచ్చికొబ్బరి తురుము, రోజ్ ఎసెన్స్ వేసి మీడియం మంట మీద తిప్పుతూ, నీరంతా ఇగిరిపోయిన తరువాత దించేయాలి ● ఈ మిశ్రమాన్ని మూడు భాగాలుగా వేరు చేయాలి. ఒక్కో భాగంలో ఒక్కో ఫుడ్‌కలర్‌ను వేసి కలపాలి ● ఫ్రై చేసిన ఒక్కో బాస్కెట్‌లో ఒక్కో కలర్ కొబ్బరి మిశ్రమం వేసి సర్వ్ చేయాలి.



మార్ష్ మల్లోస్

కావలసినవి: పంచదార – రెండున్నర కప్పులు; పింక్ ఫుడ్‌కలర్ – ఐదుచుక్కలు; వెనీలా ఎసెన్స్ –టీస్పూను; ఉప్పు – చిటికెడు; కార్న్‌ఫ్లోర్ కలిపిన ఐసింగ్ పంచదార – మూడు టేబుల్ స్పూన్లు; జిలాటిన్ – రెండు టేబుల్ స్పూన్లు; నెయ్యి – టీస్పూను.

తయారీ: ● పంచదారలో అరకప్పు నీళ్లుపోసి తీగ పాకం వచ్చిన తరువాత దించేసి చల్లారనివ్వాలి ● అరకప్పు నీటిలో జిలాటిన్ వేసి నిమిషంపాటు వేడిచేసి కరిగించాలి ● చల్లారిన పాకాన్ని బీటర్‌తో బాగా కలపాలి ● ఇప్పుడే కొద్దికొద్దిగా కరిగిన జిలాటిన్ మిశ్రమం కూడా వేసి కలపాలి ● పాకం, జిలాటిన్ చక్కగా కలిసిపోయిన తరువాత వెనీలా ఎసెన్స్, ఫుడ్ కలర్ కూడా వేసి మరో మూడు నిమిషాలు కలుపుకోవాలి ● ప్లేటుకు నెయ్యి రాసి.. బీట్ చేసుకున్న మిశ్రమాన్ని పోసి గంటపాటు డీప్ ఫ్రిజ్‌లో పెట్టాలి ● గంట తరువాత గట్టిపడిన మిశ్రమం పైన ఐసింగ్ పంచదార చల్లి నచ్చిన ఆకారంలో ముక్కలుగా కట్ చేసుకుంటే మార్ష్‌మాలోస్ రెడీ.



మార్జి పాన్

కావలసినవి: బాదం పప్పు పొడి – ఒకటిన్నర కప్పులు; పంచదార పొడి – రెండు కప్పులు; బాదం ఎసెన్స్ – రెండు టీస్పూన్లు; రోజ్ వాటర్ – టీస్పూను; ఫుడ్ కలర్స్ – నచ్చినవి ఏవైనా తీసుకోవచ్చు.


తయారీ: ● బాదం పప్పు పొడి, పంచదార పొడిని జల్లెడ పట్టుకుని పక్కన పెట్టుకోవాలి ● గిన్నెలో బాదం పప్పు పొడి, పంచదార పొడి వేసి కలపాలి ● ఇవి రెండు చక్కగా కలిసిపోయాక రోజ్ వాటర్, బాదం ఎసెన్స్ వేసి ముద్దలా మారేంత వరకు కలుపుకోవాలి. పిండి జారుగా ఉంటే కొద్దిగా బాదంపప్పు పొడి వేసి కలపాలి ● ఇలా రెడీ అయిన పిండి ముద్దను నాలుగు భాగాలుగా చేయాలి. ఒక్కో భాగానికి ఫుడ్ కలర్ వేసి కలిపి పది నిమిషాలు రిఫ్రిజిరేటర్‌లో ఉంచాలి ● పదినిమిషాల తరువాత ఒక్కోకలర్ పిండి ముద్దను మౌల్డ్స్‌లో వేసి నచ్చిన ఆకారంలో వత్తుకుంటే మార్జిపాన్ రెడీ.



కుల్కూస్

కావలసినవి: మైదా – కేజీ; పంచదార పొడి – అర కేజీ; సూజీ రవ్వ – పావుకేజీ; గుడ్లు – మూడు; నెయ్యి – మూడు టేబుల్ స్పూన్లు; ఉప్పు – అరటీస్పూను; వెనీలా ఎసెన్స్ – టీస్పూను; ఫుడ్ కలర్స్ – మూడు రకాలు; నూనె – డీప్‌ఫ్రైకి సరిపడా.

తయారీ: ● పెద్దగిన్నెలో మైదా, సూజీ రవ్వ, పంచదార పొడి, గుడ్ల సొనవేసి కలపాలి ● ఇప్పుడు ఉప్పు, వెనీలా ఎసెన్స్ వేసి కలపాలి. చివరిగా కొద్దికొద్దిగా నీళ్లు చల్లుకుంటూ ముద్దలా కలుపుకొని మూడు గంటలు నానపెట్టుకోవాలి ● నానిన పిండిముద్దను రంగుల సంఖ్యను బట్టి మూడు నాలుగు ముద్దలుగా చేయాలి ● ఒక్కోముద్దకు ఒక్కో ఫుడ్ కలర్‌ను కొద్దిగా వేసి కలుపుకోవాలి ● ఇప్పుడు ఒక్కో పిండి ముద్ద నుంచి కొద్దిగా పిండి తీసుకుని గవ్వల చెక్క మీద గవ్వల ఆకారంలో వత్తుకోవాలి ● అన్నీ రెడీ అయిన తరువాత డీప్ ఫ్రై చేసుకుంటే రుచికరమైన కుల్కూస్ రెడీ. వేడి వేడి కుల్కూస్ పైనె పంచదార పొడి చల్లుకుని సర్వ్ చేసుకోవాలి.


'నా ప్రస్థానంలో ప్రతి మలుపూ జన జీవితంతో ముడిపడి ఉంది'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 271

శుక్రవారం 22-12-2023

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



ఆసీస్‌ను పడగొట్టిన పూజ

తొలి ఇన్నింగ్స్‌లో ఆస్ట్రేలియా 219 ఆలౌట్. భారత్ 98/1. -13లో



నష్టాల నుంచి లాభాల్లోకి..

నష్టాలతో మొదలైన సూచీలు. ట్రేడింగ్‌లో పుంజుకొని లాభాలతో ముగిశాయి -13లో



సీఈసీ, ఈసీల నియామకానికి..

సీఈసీ, ఈసీల నియామకానికి ప్రత్యేక యంత్రాంగం ఏర్పాటుకు ఉద్దేశించిన కీలక బిల్లును లోక్‌సభ గురువారం ఆమోదించింది.

వివరాలు 6లో ▸



మరో ముగ్గురి సస్పెన్షన్

లోక్‌సభ నుంచి మరో ముగ్గురిని బహిష్కరించారు. దీంతో పార్లమెంట్ నుంచి సస్పెండైన సభ్యుల సంఖ్య 146కి చేరింది.

వివరాలు 6లో ▸



తమిళనాడు మంత్రికి జైలు

ఆదాయానికి మించి ఆస్తుల కేసులో మద్రాసు హైకోర్టు తమిళనాడు మంత్రి కె.పొన్ముడి, ఆయన భార్యకు మూడేళ్ల జైలు శిక్ష విధించింది.

వివరాలు 6లో ▸



క్రిమినల్ చట్టాలకు ఆమోదం

బ్రిటిష్ వలస పాలన నాటి క్రిమినల్ చట్టాల స్థానంలో తీసుకొస్తున్న మూడు కీలక బిల్లులకు పార్లమెంట్ ఆమోదం లభించింది.

వివరాలు 6లో ▸

న్యూస్‌రీల్

సింగరేణి ఎన్నికల వాయిదాకు హైకోర్టు నో



సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల వాయిదాకు హైకోర్టు నిరాకరించింది. గతంలో చెప్పిన విధంగా డిసెంబర్ 27న ఎన్నికలు నిర్వహించి, అదే రోజు ఫలితాలు వెల్లడించాలని స్పష్టంచేసింది.

- వివరాలు 5లో▶

ఆరు రోజులు.. రెండు స్వల్పకాలిక చర్చలు



శాసనసభ తొలి విడత సమావేశాలు గురువారంతో ముగిశాయి. ఆరురోజుల్లో శాసనసభ మొత్తంగా 26 గంటల 33 నిమిషాల పాటు సమావేశమైంది.

- వివరాలు 7లో▶

రేపు టీపీసీసీ విస్తృత కార్యవర్గ సమావేశం



ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత తొలిసారి ఆ పార్టీ రాష్ట్ర కాంగ్రెస్ విస్తృతస్థాయి సమావేశాన్ని నిర్వహించబోతోంది. 23న ఉదయం 12 గంటలకు గాంధీభవన్‌లో ఈ సమావేశం జరగనుంది. నామినేటెడ్ పోస్టుల భర్తీపై సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టమైన ప్రకటన చేస్తారని గాంధీభవన్ వర్గాలు చెబుతున్నాయి.


- వివరాలు 7లో▶

అప్పుల్లో 'కరెంట్'

విద్యుత్ సంస్థల అప్పులు రూ. 78,553 కోట్లు.. బకాయిలూ కలిపితే రూ.1,37,571 కోట్లు

విద్యుత్ రంగ శ్వేతపత్రంలో రాష్ట్ర ప్రభుత్వం వెల్లడి

- రూ.62,461 కోట్లకు చేరిన డిస్కంల నష్టాలు
- జెన్‌కో ఆస్తులు 3.16 రెట్లు, అప్పులు 4.28 రెట్లు పెరిగాయి
- సర్కారీ శాఖల విద్యుత్ బిల్లుల బకాయిలు రూ.28,842.72 కోట్లు
- వ్యవసాయానికి ఉచిత విద్యుత్ లెక్కల్లో తేడాతో డిస్కంలపై రూ.18,725 కోట్ల భారం.. ప్రభుత్వం మాటిచ్చి చెల్లించని 'ట్రూఅప్' భారం రూ.12,550 కోట్లు
- రాష్ట్ర ఏర్పాటు తర్వాత రూ.39,722 కోట్ల మేర తాత్కాలిక విద్యుత్ కొనుగోళ్లు
- ప్రసంగంలో పలు వివరాలను విడివిడిగా వివరించిన డిప్యూటీ సీఎం భట్టి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో విద్యుత్ రంగం ఆర్థిక పరిస్థితిపై కాంగ్రెస్ సర్కారు గురువారం అసెంబ్లీలో శ్వేతపత్రాన్ని ప్రవేశపెట్టింది. తెలంగాణ ఆవిర్భవించే నాటికి రాష్ట్ర విద్యుత్ సంస్థల అప్పులు రూ.20,856.12 కోట్ల మేర ఉండగా.. 2022–23 నాటికి రూ.78,553.92 కోట్లకు పెరిగాయని అందులో పేర్కొంది. తెలంగాణ ఏర్పడినప్పుడు విద్యుత్ సంస్థలు చెల్లించాల్సిన మొత్తం అప్పులు, బకాయిలు (లయబిలిటీస్) కలిపి రూ.37,081.64 కోట్లు కాగా.. 2022–23 నాటికి రూ.1,37,571.4 కోట్లకు చేరాయని వివరించింది. అంటే ఏకంగా రూ.1,00,489 కోట్లకుపైగా పెరిగినట్టు పేర్కొంది. విద్యుత్ సంస్థలు చెల్లించాల్సిన బకాయిల్లో.. విద్యుదుత్పత్తి కోసం జెన్‌కో కొనుగోలు చేసిన బొగ్గు వ్యయం, డిస్కంలు కొనుగోలు చేసిన విద్యుత్‌కు సంబంధించి ఇంకా చెల్లించాల్సిన బిల్లుల వంటివి ఉంటాయి. అయితే ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అసెంబ్లీలో శ్వేతపత్రాన్ని విడుదల చేసి మాట్లాడినప్పుడు.. పలు అంశాలను విడివిడిగా వివరించారు. విద్యుత్‌శాఖ మొత్తం అప్పులు రూ.81,516 కోట్లు అని పేర్కొన్నారు. ఇక ప్రభుత్వంలోని

మిగతా 2వ పేజీలో ▶

విద్యుత్ సంస్థలపై 1.14 లక్షల కోట్ల భారం

- అసెంబ్లీలో శ్వేతపత్రంపై చర్చకు డిప్యూటీ సీఎం భట్టి సమాధానం
- రాష్ట్ర విద్యుత్ రంగం ఆర్థిక పరిస్థితి ఆందోళనకరం
- గత సర్కారు ఆర్థిక క్రమశిక్షణ పాటించనందుకే ఈ సమస్య



2లో

సగానికిపైగా అప్పులు తీర్చాం

నాణ్యమైన విద్యుత్ అందించేందుకే అప్పులు తెచ్చాం



- నాడు రూ.44,438 కోట్ల ఆస్తులు.. అప్పులు రూ. 22,423 కోట్లు
- ఇప్పుడు అప్పులు రూ. 81 వేల కోట్లకు చేరితే ఆస్తులు రూ. 1.37 లక్షల కోట్లకు.. శ్వేతపత్రంపై చర్చలో మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి

2లో

దద్దరిల్లిన అసెంబ్లీ... ఇద్దరి మధ్య తీవ్ర వాగ్వాదం



రేవంత్ X అక్బర్



- మేం ఎవరికీ భయపడం.. కిరణ్‌కుమార్‌రెడ్డి జైల్లో పెట్టినా భయపడలేదన్న అక్బరుద్దీన్
- కాంగ్రెస్ తమను అణచివేసేందుకు ప్రయత్నిస్తోందని మండిపాటు
- ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్లు వైఎస్సార్ ఇచ్చారని వెల్లడి
- రేవంత్‌కు అన్ని పార్టీల్లోనూ పనిచేసిన అనుభవం ఉందంటూ చురకలు

- అక్బరుద్దీన్ ముస్లింలందరికీ ప్రతినిధి కాదన్న ముఖ్యమంత్రి
- ప్రజలు ప్రతిపక్షంగా కూర్చోబెట్టిన బీఆర్ఎస్ తరఫున వకాల్తా ఎందుకు?
- గజ్వేల్, సిద్దిపేట, హైదరాబాద్ పాతబస్తీలోనే విద్యుత్ బకాయిలెక్కువని వ్యాఖ్య
- వాటిని కేసీఆర్, హరీశ్, అక్బరుద్దీన్ రాబట్టగలరా అని ప్రశ్న

సాక్షి, హైదరాబాద్: విద్యుత్ రంగ శ్వేతపత్రంపై గురువారం అసెంబ్లీలో జరిగిన చర్చ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఎంఐఎం పక్షనేత అక్బరుద్దీన్ ఒవైసీ మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. ఇరువురి మధ్య మాటల తూటాలు పేలాయి. అక్బరుద్దీన్ మాట్లాడుతుండగా మొదలైన ఈ రగడ గంటకుపైగా కొనసాగింది. దీంతో సభలోని కాంగ్రెస్, ఎంఐఎం, బీఆర్ఎస్ సభ్యులు వాదోపవాదాలకు దిగారు. ఎవరు ఏం మాట్లాడుతున్నారో కూడా అర్థంకాని పరిస్థితి నెలకొంది. ఒకానొక సందర్భంలో స్పీకర్ పోడియం వద్దకు అక్బరుద్దీన్ సహా ఎంఐఎం సభ్యులు దూసుకెళ్లారు. ఎంఐఎం సభ్యులతోపాటు బీఆర్ఎస్ సభ్యులు హరీశ్‌రావు, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, పాడి కౌశిక్‌రెడ్డి తదితరులు పోడియం వద్దకు వెళ్లి సభాపతితో వాదనకు దిగారు. దీంతో సభ అదుపుతప్పింది.

బీఆర్ఎస్ పాలనపై ప్రశంసలతో వాదన మొదలు.. : విద్యుత్ రంగ శ్వేతపత్రంపై చర్చలో అక్బరుద్దీన్ మాట్లాడుతూ 'గత ప్రభుత్వ హయాంలో పాతబస్తీలో రూ. 25 వేల కోట్ల అభివృద్ధి జరిగింది. 2014తో పోలిస్తే విద్యుదుత్పత్తి

మిగతా 7వ పేజీలో ▶

ఎన్నికలకు సిద్ధంకండి

సార్వత్రిక ఎన్నికలకు తాము సిద్ధంగా ఉన్నామని కాంగ్రెస్ ప్రకటించింది. లోక్‌సభ ఎన్నికలు ఎప్పుడు జరిగినా తయారుగా ఉన్నామని, అతి త్వరలో స్క్రీనింగ్ కమిటీని ఏర్పాటు చేసి, అభ్యర్థులను ఎంపిక చేస్తామని పేర్కొంది. గురువారం ఏఐసీసీ ప్రధాన కార్యాలయంలో కాంగ్రెస్ అత్యున్నత నిర్ణాయక మండలి కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) సమావేశం జరిగింది.

- వివరాలు 6లో▶



కుస్తీకి సాక్షి స్వస్తి

భారత రెజ్లింగ్ సమాఖ్య మాజీ అధ్యక్షుడు బ్రిజ్‌భూషణ్ విధేయుడు సంజయ్ సింగ్ కొత్త అధ్యక్షుడిగా ఎన్నికయ్యాడు. దీనికి నిరసనగా భారత మహిళా స్టార్ రెజ్లర్ సాక్షి మలిక్ రిటైర్మెంట్ ప్రకటించింది.

- వివరాలు 13లో▶

పెట్టుబడులతో వచ్చే కంపెనీలను ఎర్రతివాచీతో స్వాగతిస్తాం

తెలంగాణలో పెట్టుబడులు పెట్టడానికి వచ్చే కంపెనీలకు అన్ని విధాలా సహకరిస్తామని నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఆటా, సీఐఐ సంయుక్త ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించిన బిజినెస్ సెమినార్‌లో ఆయన అమెరికా కాన్సుల్ జనరల్ జెన్నిఫర్ లార్సన్‌తో కలసి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.

- వివరాలు 8లో

విద్యుత్ సంస్థలపై రూ.1.14 లక్షల కోట్ల భారం

అసెంబ్లీలో శ్వేతపత్రంపై చర్చకు డిప్యూటీ సీఎం భట్టి సమాధానం

- రాష్ట్ర విద్యుత్ రంగం ఆర్థిక పరిస్థితి ఆందోళనకరం
- గత సర్కారు ఆర్థిక క్రమశిక్షణ పాటించనందుకే ఈ సమస్య
- రోజువారీ విద్యుత్ కొనుగోళ్ల కోసమూ రుణాల సేకరణ
- ఛత్తీస్‌గఢ్ విద్యుత్ కొనుగోలు నిరర్థక ఖర్చే మిగిలింది
- ఇప్పుడిస్తున్న కరెంటు కూడా కాంగ్రెస్ ముందుచూపు ఫలితమేనని వ్యాఖ్య
- తాము 24 గంటల నాణ్యమైన విద్యుత్ అందిస్తామని ప్రకటన



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ఆర్థిక పురోగతిలో, అభివృద్ధిలో కీలక పాత్ర విద్యుత్ రంగానిదేనని, ప్రజల నాణ్యమైన జీవన శైలిని సూచించేది కూడా విద్యుత్ వినియోగమేనని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పేర్కొన్నారు. రాష్ట్రంలో అలాంటి విద్యుత్ రంగం ఆర్థిక పరిస్థితి ప్రమాదకర స్థితిలో ఉందని వ్యాఖ్యానించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం డిమాండ్‌కు తగ్గట్టు విద్యుత్ ఉత్పత్తి చేయకపోగా.. విద్యుత్తు సంస్థలపై రూ.1.14 లక్షల కోట్ల భారం మోపిందని ఆరోపించారు. అసలు తెలంగాణలో ప్రస్తుతం జరుగుతున్న విద్యుత్ సరఫరాకు నాటి కాంగ్రెస్ ప్రభుత్వం ముందుచూపుతో చేపట్టిన ప్రాజెక్టులే కారణమని.. బీఆర్ఎస్ ప్రభుత్వం చొరవ ఏమాత్రం లేదని పేర్కొన్నారు. గురువారం భట్టి శాసనసభలో రాష్ట్ర విద్యుత్ రంగం పరిస్థితిపై శ్వేతపత్రాన్ని విడుదల చేసి.. స్వల్పకాలిక చర్చను ప్రారంభించారు. చివరిగా చర్చకు సమాధానమిచ్చారు. ఈ సందర్భంగా సభలో భట్టి చెప్పిన అంశాలు ఆయన మాటల్లోనే..

''కరెంటును ఒక్కరోజులో ఉత్పత్తి చేయలేరు. కానీ అధికారంలోకి వచ్చిన మరుసటి రోజు నుంచే 24 గంటల కరెంటు అందించామని చెప్పిన బీఆర్ఎస్.. అందుకు అవసరమైన విద్యుత్‌ను ఎలా అందుబాటులోకి తెచ్చిందో చెప్పలేదు. అందుకే వాస్తవాలు ప్రజలకు తెలియటం కోసం శ్వేతపత్రాన్ని విడుదల చేశాం. తెలంగాణ ఏర్పడే నాటికి టీఎస్ జెన్‌కో స్థాపిత విద్యుదుత్పత్తి సామర్థ్యం 4,365.26 మెగావాట్లు. దీనికితోడు తెలంగాణ ఏర్పాటుకు ముందే.. ఇక్కడ 2,960 మెగావాట్ల సామర్థ్యమున్న విద్యుత్ ప్రాజెక్టులకు అవసరమైన ప్రణాళికలను నాటి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రారంభించింది. రాష్ట్రం ఏర్పాటైన తర్వాత అవి ఉత్పత్తి ప్రారంభించాయి. ఆ కొత్త విద్యుత్ కేంద్రాలే అనంతర కాలంలో తెలంగాణలో నాణ్యమైన విద్యుత్‌ను అందించడంలో కీలకపాత్ర పోషించాయి.

గత ప్రభుత్వం పూర్తి చేసినది ఒక్కటే..

రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ చట్టం రూపకల్పన సమయంలోనే తెలంగాణ విద్యుత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని.. ఇక్కడి స్థాపిత విద్యుదుత్పత్తి సామర్థ్యానికి అదనంగా 1,800 మెగావాట్లు వచ్చేలా నాటి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక నిబంధనలను పొందుపరిచింది. రాష్ట్రం ఏర్పడ్డాక గత ప్రభుత్వం మొదలుపెట్టి పూర్తి చేసినది కేవలం 1,080 మెగావాట్ల భద్రాద్రి థర్మల్ ప్రాజెక్టు మాత్రమే. ఇది పూర్తి కావడానికీ సుదీర్ఘకాలం పట్టింది. ప్రమాణాలకు విరుద్ధంగా సబ్ క్రిటికల్ టెక్నాలజీ ఉపయోగించడం వల్ల పెట్టుబడి వ్యయం గణనీయంగా పెరిగింది. ఎక్కువ బొగ్గు వినియోగించాల్సి రావటం, కాలుష్యం వెదజల్లటం వంటి సమస్యలు ఏర్పడ్డాయి. దీనితో వేల కోట్ల నష్టం వాటిల్లనుంది. మరో ప్రాజెక్టు బొగ్గుగనులకు అత్యంత దూరంగా నిర్మిస్తున్న 4,000 మెగావాట్ల యాదాద్రి థర్మల్ ప్రాజెక్టు. ఈ ప్రాజెక్టుకు బొగ్గు సరఫరా కోసమే ఏటా రూ.800 కోట్లు అదనపు వ్యయం అవుతుంది. ప్రాజెక్టు జీవితకాలం 30 ఏళ్లు అనుకుంటే.. ఈ వ్యయం మరింత భారీగా ఉండబోతోంది.

భారీగా పెండింగ్ బకాయిలు

రాష్ట్ర డిస్కంలు మొత్తం రూ.62,461 కోట్ల నష్టాల్లో ఉన్నాయి. 2023 అక్టోబర్ 31 నాటికి విద్యుత్ శాఖ అప్పుల మొత్తం రూ.81,516 కోట్లు. ఇందులో రూ.30,406 కోట్లు విద్యుదుత్పత్తి సంస్థలకు బకాయిలు చెల్లించడం కోసం తీసుకున్న రోజువారీ నిర్వహణ మూలధన రుణం. ఇదేకాకుండా విద్యుదుత్పత్తి, సరఫరా సంస్థలకు మరో రూ.28,673 కోట్ల బకాయిలను ఇంకా చెల్లించాల్సి ఉంది. రాష్ట్ర ప్రభుత్వంలోని వివిధ శాఖలు ఏళ్లుగా చెల్లించని రూ.28,842 కోట్ల బకాయిల వల్లే డిస్కంలు తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో పడ్డాయి. ఈ బకాయిల్లో ఒక్క సాగునీటి శాఖ చెల్లించాల్సినవే రూ.14,193 కోట్లు. విద్యుత్ కొనుగోళ్ల వాస్తవ సర్దుబాటు ఖర్చుల (ట్రూఅప్) కింద గత ప్రభుత్వం డిస్కంలకు చెల్లిస్తానని మాటిచ్చి.. చెల్లించని రూ.14,928 కోట్ల భారం డిస్కంలపైనే పడింది.

గుండె బరువెక్కుతోంది

విద్యుత్ శాఖ అప్పులకు తోడు ప్రభుత్వం కరెంటు సంస్థలకు చెల్లించాల్సిన బకాయిలతో కలుపుకొంటే ఈ మొత్తం రూ. 1.14 లక్షల కోట్లకు చేరింది. నాకు అప్పు అంటేనే భయం. వ్యక్తిగతంగా నేను అప్పు చేయను. కానీ ప్రస్తుతం నాకు వచ్చిన ఆర్థిక, విద్యుత్ శాఖల సమీక్షల సందర్భంగా గత ప్రభుత్వం చేసిపెట్టిన అప్పులు చూసి గుండె బరువెక్కుతోంది.

ముందు చూపు ఏది?

రాష్ట్రంలో 2014 నాటికి కరెంటు డిమాండ్ 5,661 మెగావాట్లు. దానికి 2.7 రెట్లు ఎక్కువ విద్యుత్ అందించేలా నాటి కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. అలా బీఆర్ఎస్ ప్రభుత్వం కూడా ముందుచూపుతో ఉంటే.. ఇప్పటి డిమాండ్‌కు 2.7 రెట్లు ఎక్కువగా అంటే 39 వేల మెగావాట్ల కరెంటు అందుబాటులో ఉండాలి. అలా జరగలేదు. కనీసం డిమాండ్‌కు తగ్గట్టు కూడా ఉత్పత్తి చేయలేకపోయింది.

రోజువారీ మనుగడకూ కష్టంగా..

డిస్కంలు రోజువారీ మనుగడ కోసం కూడా అలవికాని అప్పులు చేయాల్సిన స్థితికి చేరాయి. విద్యుత్ కొనుగోళ్లకు అవసరమైన నిధులను ఈ అప్పుల మార్గంలో సమకూర్చుకోవడం చాలా కష్టం. గత ప్రభుత్వం సకాలంలో చెల్లింపులు జరపకపోవడం వల్ల, సంస్థలకు ఇచ్చిన వాగ్దానాలను నిలబెట్టుకోకపోవడం వల్ల.. డిస్కంలు అప్పుల ఊబిలోకి కూరుకుపోయి ఉన్నాయి. విద్యుత్ సంస్థలకు సకాలంలో నిధులు విడుదల చేయాల్సిన గత సర్కారు ఆర్థిక క్రమశిక్షణ పాటించకపోవడంతో కుదేలయ్యాయి. ఇలాంటి విద్యుత్ రంగాన్ని గత ప్రభుత్వం నుంచి వారసత్వంగా పొందినా.. మేం రాష్ట్రంలోని విద్యుత్ వినియోగదారులందరికీ నాణ్యమైన విద్యుత్‌ను బాధ్యతాయుత, పారదర్శక మార్గంలో అందించడానికి, వ్యవసాయ రంగానికి ఉచిత విద్యుత్ అందించడానికి కట్టుబడి ఉన్నాం..'' అని భట్టి పేర్కొన్నారు.

కాంగ్రెస్ హయాంలోని ప్రణాళికలతోనే..

యూపీఏ ప్రభుత్వం రెండు దశాబ్దాల క్రితమే ముందుచూపుతో తగిన ప్రణాళికలను అమల్లోకి తేవటంతో దేశవ్యాప్తంగా కరెంటు ఉత్పత్తి పెరిగింది. తెలంగాణ వచ్చేనాటికి రాష్ట్రంలో ఉత్పత్తి కేంద్రాల ద్వారా 7,778 మెగావాట్లు అందుబాటులో ఉంది. పెరుగుతున్న డిమాండ్‌కు తగ్గట్టు విద్యుత్ అందాలన్న ఉద్దేశంతో నాటి కాంగ్రెస్ ప్రభుత్వం.. కొత్తగూడెం థర్మల్ కేంద్రం, కాకతీయ రెండో దశ, సింగరేణి జైపూర్ కేంద్రం, పులిచింతల హైడల్ కేంద్రం సహా పలు కొత్త విద్యుదుత్పత్తి సంస్థలకు ప్రణాళికలు రూపొందించి పనులు ప్రారంభించింది. వీటితో 2,960 మెగావాట్ల కరెంటు అందుబాటులోకి వచ్చింది. దీనికితోడు రాష్ట్ర విభజన చట్టం ద్వారా తెలంగాణకు ఏపీ నుంచి 1,800 మెగావాట్లు, ఎన్టీపీసీ రామగుండం నుంచి 4 వేల మెగావాట్లు.. కలిపి 5,800 మెగావాట్లు సమకూరాయి. ఇలా అన్నీ కలిపి 16,538 మెగావాట్ల విద్యుత్ నాటి కాంగ్రెస్ ప్రభుత్వ చొరవతోనే రాష్ట్రానికి అందుతోంది. అదే బీఆర్ఎస్ సర్కారు చేపట్టిన యాదాద్రి, భద్రాద్రి ప్లాంట్లతో నష్టాలే తప్ప ఒరిగిందేమీ లేదు.

అప్పుల్లో 'కరెంట్'

▶ మొదటి పేజీ తరువాయి

వివిధ శాఖలు విద్యుత్ శాఖకు చెల్లించాల్సిన బిల్లులు రూ.28,842.72 కోట్లు. ఇందులో కేంద్ర ప్రభుత్వ శాఖలు బకాయిపడిన సొమ్ము రూ.720 కోట్లు.

రూ.39,722 కోట్ల తాత్కాలిక విద్యుత్ కొనుగోళ్లు

డిమాండ్‌లో హెచ్చుతగ్గులు, విద్యుత్ ప్లాంట్లలో ఉత్పత్తి నిలిచిపోవడం, స్థిరత్వం లేని పునరుత్పాదక విద్యుత్ లభ్యత వంటి కారణాలతో 2014-24(నవంబర్ 2023) మధ్య సగటున యూనిట్‌కు రూ.5.03 ధరతో 78,970 మిలియన్ యూనిట్లను మార్కెట్ నుంచి డిస్కంలు కొనుగోలు చేశాయి. ఇందుకు రూ.39,722 కోట్లను ఖర్చు చేశాయి.

పెరిగిన ఆస్తులు, నష్టాలు

- తెలంగాణ ఆవిర్భావం నాటితో పోల్చితే రాష్ట్ర విద్యుదుత్పత్తి సంస్థ (జెన్‌కో) స్థిరాస్తుల విలువ రూ.12,783 కోట్ల నుంచి రూ.40,454 కోట్లకు పెరిగింది. అప్పులు రూ. 7,662 కోట్ల నుంచి రూ.32,797 కోట్లకు పెరిగాయి. అంటే ఆస్తులు 3.16 రెట్లు పెరగగా, అప్పులు 4.28 రెట్లు పెరిగాయి. తెలంగాణ డిస్కంల నష్టాలు రూ.62,461 కోట్లుగా ఉన్నాయి. 2022-23లోనే రూ. 11,103 కోట్ల నష్టాలను మూటగట్టుకున్నాయి.
- పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ వార్షిక రేటింగ్స్‌లో 2015-16లో 'బీ+'గ్రేడ్‌లో ఉన్న డిస్కంలు.. 2021-22 నాటికి 'సీ-'గ్రేడ్‌కు పడిపోయాయి.
- రేటింగ్స్ నివేదిక ప్రకారం.. డిస్కంల నికర విలువ మైనస్‌లోకి వెళ్లిపోయింది. ప్రస్తుతం వాటి నికర విలువ 'మైనస్ రూ.30,876 కోట్లు'.
- వ్యవసాయానికి ఉచిత విద్యుత్‌కు సంబంధించి డిస్కంలు సమర్పించిన అంచనాలతో పోల్చితే తెలంగాణ ఈఆర్సీ ఆమోదించిన అంచనాలు తక్కువగా ఉన్నాయి. దీంతో డిస్కంలపై రూ.18,725 కోట్ల అదనపు భారం పడింది.
- తెలంగాణ ఈఆర్సీ 2016-17 నుంచి 2022-23 మధ్య కాలానికి సంబంధించి రూ.12,550 కోట్ల మేర ట్రూఅప్ చార్జీలను వినియోగదారుల నుంచి వసూలు చేసేందుకు డిస్కంలకు అనుమతిచ్చింది. ఈ సొమ్మును తామే చెల్లిస్తామని, వినియోగదారుల నుంచి వసూలు చేయవద్దని ప్రభుత్వం హామీ ఇచ్చింది. కానీ చెల్లించలేదు. మరో రూ.2,378 కోట్ల ఇంధన సర్దుబాటు చార్జీలనూ చెల్లించాల్సి ఉంది.
- భద్రాద్రి థర్మల్ ప్రాజెక్టును రెండేళ్లలో పూర్తి చేస్తామని చెప్పి ఏడేళ్లు చేశారు. ప్రాజెక్టు వ్యయం పెరిగిపోయింది. బొగ్గుగనులకు దూరంగా నల్లగొండ జిల్లాలో యాదాద్రి థర్మల్ కేంద్రం నిర్మాణాన్ని చేపట్టడంతో బొగ్గు రవాణా అనవసర భారంగా మారనుంది.

ఛత్తీస్‌గఢ్ విద్యుత్ రాకున్నా రూ.638 కోట్ల కారిడార్ చార్జీలు

ఒప్పందం ప్రకారం రాష్ట్రానికి ఛత్తీస్‌గఢ్ నుంచి వెయ్యి మెగావాట్ల విద్యుత్ రావాలి. కానీ 2022 ఏప్రిల్ నుంచి నిలిచిపోయింది. సర్కారు ఆదేశం మేరకు ఛత్తీస్‌గఢ్ విద్యుత్ కోసం డిస్కంలు 2,000 మెగావాట్ల సామర్థ్యమున్న కారిడార్‌ను బుక్ చేశాయి. 2017-22 మధ్య పాక్షికంగానే ఛత్తీస్‌గఢ్ విద్యుత్ సరఫరాకాగా..పూర్తిగా 1,000 మెగావాట్ల కోసం కారిడార్ చార్జీలను చెల్లించాల్సి వచ్చింది. కారిడార్‌ను ఉపయోగించకపోయినా 2020 అక్టోబర్ వరకు రూ.638.5 కోట్ల చార్జీలను చెల్లించాల్సి వచ్చింది. సరఫరా విద్యుత్‌కు మరో రూ.723 కోట్లను చెల్లించారు.

రాష్ట్ర విద్యుత్ సంస్థల ఆర్థిక పరిస్థితి వివరాలివీ.. (రూ.కోట్లలో)

అంశం	జెన్‌కో		ట్రాన్స్‌కో		డిస్కంలు	
	2014లో	2022-23	2014లో	2022-23	2014లో	2022-23
నికర విలువ	3,866	6,535	968.76	2,330.29	-7,995	-34,879
ప్రాజెక్టులకు రుణాలు	6,978	28,993	2,411.12	10,529.92	3,749	6,113
మూలధన పెట్టుబడి రుణాలు	684	3805	0	600.4	7,034	29,114
మొత్తం రుణాలు	7,662	32,797	2,411.12	10,529.92	10,783	35,227
ఇతర లయబిలిటీలు	5,107	14,631	2,897.76	11,616.19	11,382	58,783
మొత్తం అప్పులు / బకాయిలు	16,635	53,963	6,277.64	24,476.4	14,169	59,132

2014తో పోల్చితే 2023లో రాష్ట్ర విద్యుత్ రంగ గణాంకాలివీ..

అంశం	2014 జూన్ 2	2023 డిసెంబర్ 1
కాంట్రాక్ట్ కెపాసిటీ (మెగావాట్లలో)	7,778	19,475
సౌర విద్యుత్ సామర్థ్యం (మెగావాట్లలో)	74	6,123
రోజులో గరిష్ట వినియోగం (మిలియన్ యూనిట్లలో)	128	298
తలసరి విద్యుత్ వినియోగం (యూనిట్లలో)	1,356	2,126
తలసరి విద్యుత్ వినియోగంలో రాష్ట్ర ర్యాంకు	13	10
మొత్తం వినియోగదారులు (కోట్లలో)	1.11	1.82
సబ్సిడీ భారం (రూ.కోట్లలో)	3,600	11,500 (2023-24)

ప్రభుత్వ శాఖల వారీగా విద్యుత్ బకాయిలివీ.. (రూ.కోట్లలో)

ప్రభుత్వ శాఖ/విభాగం	2014 జూన్ 2 నాటికి	2023 అక్టోబర్ 31 నాటికి
కాళేశ్వరం, ఇతర ఎత్తిపోతలు	150.28	14,193
నీటిపారుదల శాఖ (ఆఫీసులు)	3.75	92.04
మిషన్ భగీరథ	35.4	3,558.83
పంచాయతీరాజ్	769.99	4,393.99
హైదరాబాద్ జలమండలి	362.04	3,932.47
మున్సిపాలిటీలు	131.37	1,657.81
మున్సిపల్ కార్పొరేషన్లు	7.4	53.68
జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ	0	4.51
వైద్యారోగ్య, కుటుంబసంక్షేమం	12.06	48.42
రెవెన్యూ	10.25	21.03
పాఠశాల విద్య	4.77	48.37
ఉన్నత విద్య	1.01	40.43
ఇతర ప్రభుత్వ శాఖలు	8.75	71.47
కేంద్ర ప్రభుత్వం	82.55	720.34
మొత్తం	1,595.37	28,842.72

రేవంత్ పదవుల కోసం పార్టీలు మారారు

మాజీ మంత్రి హరీశ్‌రావు



సాక్షి, హైదరాబాద్: శ్వేతపత్రంపై చర్చ సందర్భంగా సీఎం రేవంత్, కాంగ్రెస్ పార్టీలపై బీఆర్ఎస్ సభ్యుడు, మాజీ మంత్రి హరీశ్‌రావు ఘాటుగా విమర్శలు చేశారు. ''సిద్దిపేట, గజ్వేల్, హైదరాబాద్ పాతబస్తీలో కాంగ్రెస్ గెలవలేదనే బాధలో రేవంత్ ఉన్నారు. అందుకే అక్కడి ప్రజలు కరెంటు బిల్లులు కట్టడం లేదంటూ అక్కసు వెళ్లగక్కే ప్రయత్నం చేస్తున్నారు. అక్కడ ఏదైనా లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు బకాయి ఉందో, పరిశ్రమలు బిల్లులు కట్టలేదో చూసి వసూలు చేయండి. అంతేతప్ప నియోజకవర్గ ప్రజలను బద్నాం చేయడం సబబు కాదు..''అని పేర్కొన్నారు. గతంలో వివిధ పార్టీలతో బీఆర్ఎస్ పొత్తు పెట్టుకుందన్న విమర్శలపై స్పందిస్తూ.. ''పదవుల కోసం సీఎం రేవంత్‌రెడ్డి పార్టీలు మారారు. మేం అలాంటి పనిచేయలేదు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఇతర పార్టీలతో పొత్తు పెట్టుకున్నాం. దాంట్లో తప్పేముంది? 2004లో కాంగ్రెస్‌తో టీఆర్ఎస్ పొత్తు పెట్టుకుంది. తెలంగాణ ఇస్తామని కామన్ మినిమమ్ ప్రోగ్రాంలో పెట్టి, రాష్ట్రపతి నోట చెప్పించి కూడా కాంగ్రెస్ మోసం చేసింది. కాబట్టే ఆ రోజు టీడీపీతో పొత్తు పెట్టుకున్నాం. మేం ఎవరితో పొత్తు పెట్టుకున్నా.. ఈ రాష్ట్ర, దేశ రాజకీయ వ్యవస్థను ఒప్పించి, మెప్పించి తెలంగాణ సాధించాం. అదే సీఎం రేవంత్ వ్యక్తిగతంగా పదవుల కోసం పార్టీలు మారారు..''అని హరీశ్‌రావు విమర్శించారు.

'విద్యుత్'పైనా విచారణ

▶ మొదటి పేజీ తరువాయి

హోదా తగ్గించి మారుమూల ప్రాంతాలకు ట్రాన్స్‌ఫర్ చేశారు. ఛత్తీస్‌గఢ్ విద్యుత్ ఒప్పందం వల్ల ప్రభుత్వంపై రూ.1,362.42 కోట్ల భారం పడింది. కేంద్ర ప్రభుత్వం తక్కువ ఖర్చుతో విద్యుత్ సరఫరాకు సిద్ధంగా ఉన్నా.. ఎక్కువ ధరకు ఛత్తీస్‌గఢ్‌తో ఒప్పందం చేసుకున్నారు. ఈ ఒప్పందంపై జ్యుడీషియల్ విచారణకు ఆదేశిస్తున్నాం.

కాలం చెల్లిన విధానంలో భద్రాద్రి ప్రాజెక్టు

గత సర్కారు రాష్ట్ర ప్రజల సెంటిమెంట్‌ను అనుకూలంగా మార్చుకుని భద్రాద్రి థర్మల్ ప్రాజెక్టు చేపట్టింది. అప్పట్లో గుజరాత్‌లో ఇండియాబుల్స్ అనే కంపెనీ సబ్ క్రిటికల్ టెక్నాలజీతో 1,080 మెగావాట్ల సామర్థ్యం ఉండే థర్మల్ ప్రాజెక్టు నిర్మాణం కోసం బీహెచ్ఈఎల్‌తో ఒప్పందం కుదుర్చుకుంది. కానీ 2011-12 తర్వాత సూపర్ క్రిటికల్ టెక్నాలజీతోనే విద్యుత్ ప్రాజెక్టులు నిర్మించాలని కేంద్ర ప్రభుత్వం నిబంధనలు తేవడంతో.. ఇండియాబుల్స్ కంపెనీ బీహెచ్ఈఎల్‌తో ఒప్పందాన్ని రద్దు చేసుకుని సొమ్మును తిరిగి ఇవ్వాలని కోరింది. ఆ సమయంలో ఇండియాబుల్స్ స్థానంలో తెలంగాణ ప్రభుత్వం భద్రాద్రి ప్రాజెక్టు నిర్మించేలా బీహెచ్ఈఎల్‌తో ఒప్పందం చేసుకుంది. ఒక ప్రైవేటు కంపెనీ స్థానంలో మునిగేందుకు తెలంగాణ సర్కారు ముందుకొచ్చింది. ఇదేమిటని అడిగితే.. అత్యవసరం కావడంతో చేపట్టామని నాటి సభానాయకుడు అసెంబ్లీలో చెప్పారు. కాలం చెల్లిన సబ్ క్రిటికల్ టెక్నాలజీని ఉపయోగించి రెండేళ్లలో పూర్తి చేస్తామన్నారు. కానీ ఏడేళ్లయినా ఆ ప్రాజెక్టును పూర్తి చేయలేదు. ఒక్కో మెగావాట్ విద్యుత్ సామర్థ్యానికి రూ.6.75 కోట్ల చొప్పున ఖర్చవుతుందని చెప్పారు. కానీ ఇప్పుడు రూ.9.74 కోట్లు దాటింది. ఇలా రూ.10వేల కోట్లు ముంచారు. అదే కేటీపీఎస్ ఏడో దశను సూపర్ క్రిటికల్ టెక్నాలజీతో రూ.8.01 కోట్ల ఖర్చు లెక్కనే పూర్తిచేశారు. అందుకే భద్రాద్రి ప్రాజెక్టుపై న్యాయ విచారణకు ఆదేశిస్తున్నాం.

యాదాద్రి ప్రాజెక్టుదీ అదే పరిస్థితి

గత సర్కారు యాదాద్రి ప్రాజెక్టును ఒక్కో మెగావాట్‌కు రూ.6.27 కోట్ల ఖర్చుతో పూర్తి చేస్తామని చెప్పింది. 8 ఏళ్లు అవుతున్నా పూర్తి కాలేదు. రెండేళ్లలోనే ప్రాజెక్టు పూర్తవుతుందని చెప్పి.. టెండర్లు లేకుండానే రూ.25,099 కోట్ల వ్యయంతో ఈ ప్రాజెక్టును బీహెచ్ఈఎల్‌కు అప్పగించారు. ఖర్చు అంచనా ఒక్కో మెగావాట్ రూ.8.64 కోట్ల లెక్కన రూ. 34,543 కోట్లకు పెరిగింది. ఇది 9 కోట్ల దాకా పెరిగే అవకాశం ఉంది. రామగుండం ఫేజ్-1 ప్రాజెక్టు మెగావాట్‌కు రూ.7.63 కోట్ల వ్యయంతోనే పూర్తైంది. యాదాద్రి ప్రాజెక్టును బీహెచ్ఈఎల్ చేపట్టినా అందులోకి ఎవరెవరు వచ్చారో విచారణ లో తేలుతుంది. యాదాద్రి పూర్తి కాకపోవడం, వ్యయం అంచనాలు పెరగడంపై విచారణకు ఆదేశిస్తున్నాం.

విద్యుత్ కోసం రైతులు రోడ్డెక్కారు

శ్వేతపత్రంపై చర్చలో సభ్యులు మాట్లాడుతుండగా పలుమార్లు సీఎం రేవంత్ జోక్యం చేసుకున్నారు. ''బీఆర్ఎస్ పాలనలో విద్యుత్ కోతలే లేవన్నట్టు జగదీశ్‌రెడ్డి మాట్లాడారు. రైతులు రోడ్డెక్కారా అని ప్రశ్నిస్తున్నారు. కామారెడ్డి, సూర్యాపేట జిల్లాల్లో కరెంట్ కోసం రైతులు రోడ్డెక్కారు గుర్తులేదా. కరెంటు సరిగా లేక కొమురయ్య అనే రైతు ఆత్మహత్య చేసుకో లేదా ?''అని ప్రశ్నించారు.

ప్రభుత్వ రంగంలో సాధించింది సున్నా..

తెలంగాణ వచ్చే నాటికి ఉన్న 7,778 మెగావాట్ల విద్యుత్‌ను 19,475 మెగావాట్లకు పెంచామని బీఆర్ఎస్ నాయకులు ప్రచారం చేసుకున్నారు. కానీ ప్రభుత్వ రంగంలో గత సర్కారు సాధించింది సున్నా. సోలార్ విద్యుత్ ప్రైవేటు నుంచే వచ్చింది. భద్రాద్రి కాలం చెల్లిపోయింది. యాదాద్రి మొదలే కాలేదు. కేంద్రం నుంచి విద్యుత్ అదనంగా వచ్చింది అంతే. 24 గంటల విద్యుత్ మీద గత సర్కారు డంబాచారం చేస్తుంటే.. కోమటిరెడ్డి సబ్‌స్టేషన్లకు వెళ్లి లాగ్‌బుక్‌లు పరిశీలించారు. ఎక్కడా 12 గంటలు కూడా కరెంటు ఇవ్వలేదని తేల్చారు. దాంతో లాగ్‌బుక్‌లు మాయం చేశారు. లాగ్‌బుక్‌ల మాయం, 24 గంటల కరెంటు సరఫరాలపై అఖిలపక్షం వేస్తాం. అందరూ సూచిస్తే దానికి అనుగుణంగా విచారణ జరుపుతాం..'' అని రేవంత్ పేర్కొన్నారు.

యాదాద్రి ప్రాజెక్టులో 10వేల కోట్లు తిన్నావ్

- మాజీ మంత్రి జగదీశ్ రెడ్డిపై మంత్రి కోమటిరెడ్డి ఫైర్
- విచారణ జరిపించమని జగదీశ్ రెడ్డి కౌంటర్
- దోషులుగా తేలితే శిక్ష వేయాలి.. లేదంటే తప్పుడు ఆరోపణలు చేసిన వారికి శిక్ష పడాలన్న జగదీశ్ రెడ్డి



సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీలో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి మధ్య తీవ్ర స్థాయిలో వాదోపవాదాలు జరిగాయి. యాదాద్రి థర్మల్ పవర్ ప్రాజెక్టులో పెద్ద కుంభకోణం జరిగిందని మంత్రి కోమటిరెడ్డి ఆరోపించారు. ఇందులో 10 వేల కోట్లను అప్పటి మంత్రి జగదీశ్ రెడ్డి తిన్నారని నిందించారు. అనంతరం మంత్రి చేసిన వ్యాఖ్యలపై జగదీశ్ రెడ్డి దీటుగా స్పందించారు.

24గంటల విద్యుత్ ఎన్నడూ ఇవ్వలేదు: మంత్రి కోమటిరెడ్డి

తెలంగాణలో విద్యుత్ రంగంపై శాసనసభలో స్వల్పకాలిక చర్చ సందర్భంగా మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి మాట్లాడుతుండగా మంత్రి వెంకటరెడ్డి జోక్యం చేసుకున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో 24 గంటల ఉచిత విద్యుత్ పూర్తిగా అవాస్తవమని, ఎనిమిదిన్నర గంటల నుంచి 12 గంటల వరకే విద్యుత్ ఇచ్చేదని పునరుద్ఘాటించారు. కొన్ని ప్రత్యేక రోజుల్లో 16 గంటలు ఇచ్చి ఉండొచ్చు తప్ప 24 గంటలు ఎన్నడూ ఇవ్వలేదని వ్యాఖ్యానించారు. విద్యుత్ శాఖలో నష్టాలకు కారణం అవినీతేనన్నారు. యాదాద్రి ప్రాజెక్టును 29వేల కోట్లకు నామినేషన్ మీద అప్పగించారని, జార్ఖండ్ విద్యుత్ ప్రాజెక్టుకు యాదాద్రికి రూ. రూ.6వేల కోట్లు తేడా ఉందన్నారు. ఇందులో పెద్ద స్కాం ఉందని, రూ. 10వేల కోట్లు తిన్నారని ఆరోపించారు. అప్పటి మిర్యాలగూడ ఎమ్మెల్యే బినామీగా ఉండి తిన్నారని ఆరోపించారు. టెండర్ పెట్టకుండా ప్రాజెక్టు అప్పగించుడే పెద్ద స్కాం అని ఆరోపించారు.

సోనియా గాంధీతో కొట్లాడి వైఎస్ ఫ్రీ పవర్ తెచ్చారు

రాష్ట్రంలో ఉచిత విద్యుత్‌కు పేటెంట్ కాంగ్రెస్‌దేనని కోమటిరెడ్డి వెంకటరెడ్డి వ్యాఖ్యానించారు. 2004 ఎన్నికల్లో వైఎస్ రాజశేఖర రెడ్డి సోనియాగాంధీతో కొట్లాడి కాంగ్రెస్ మేనిఫెస్టోలో పెట్టించారని గుర్తుచేశారు. దేశంలో ఎక్కడ లేని విధంగా ఉమ్మడి రాష్ట్రంలో ఉచిత విద్యుత్ అమలు చేశారని అన్నారు.

విచారణకు జగదీశ్ రెడ్డి సవాల్

తనపై గతంలో కూడా ఆరోపణలు చేశారని, ఈ ఆరోపణలపై సిట్టింగ్ జడ్జితో లేదా కమిషన్‌తో విచారణ జరిపించాలని ప్రభుత్వాన్ని జగదీశ్ రెడ్డి సవాల్ విసిరారు. ఆ విచారణలో ఎవరు దోషులుగా తేలితే వాళ్లకు శిక్ష వేయాలన్నారు. లేదంటే ఆధారాలు లేకుండా అసంబద్ధ ఆరోపణలు చేసిన వారికి శిక్ష పడాలన్నారు. ఇటువంటి ఆరోపణలు చాలా సందర్భాల్లో బయట మాట్లాడుతుంటే విన్నానని.. కానీ ఏ ఒక్కరోజు కూడా రియాక్ట్ కాలేదని జగదీశ్ రెడ్డి చెప్పారు. ఇవన్నీ పనికిమాలిన మాటలు.. అర్థం లేని.. ఆధార రహితమైన మాటలని కొట్టిపారేశారు. ఇవన్నీ రికార్డుల్లోకి రావాలనే ఇన్ని రోజులు వెయిట్ చేశానని.. ఇవాళ రికార్డుల్లోకి వచ్చాయన్నారు. దీనిపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. సీఎం రేవంత్ మూడు అంశాలపై జ్యుడీషియల్ ఎంక్వైరీకి సిద్ధమని ప్రకటించిన నేపథ్యంలో కోమటిరెడ్డి వెంకటరెడ్డి చేసిన ఆరోపణలపై కూడా విచారణ చేయాలని జగదీశ్ రెడ్డి కోరారు. వారు చేసిన ఆరోపణలు అసంబద్ధమైతే తప్పకుండా శిక్ష పడాల్సిన అవసరం ఉందని పునరుద్ఘాటించారు. అది మీరు చేయగలుగుతారా? ప్రజా కోర్టులో తేలుస్తారా అనేది చూడాలని వ్యాఖ్యానించారు.




కూటమిలో పార్టీలకు ఫండింగ్ చేస్తే మీ పార్టీకే పీఎం అభ్యర్థి అని చెబుదాం!

సగానికిపైగా అప్పులు తీర్చాం

నాణ్యమైన విద్యుత్ అందించేందుకే అప్పులు తెచ్చాం

- నాడు రూ. 44,438 కోట్ల ఆస్తులు... అప్పులు రూ. 22,423 కోట్లు
- ఇప్పుడు అప్పులు రూ. 81 వేల కోట్లకు చేరితే ఆస్తులు రూ.1.37 లక్షల కోట్లకు
- గృహ, వ్యవసాయ, పరిశ్రమలకు 24 గంటల విద్యుత్ అందించాం
- శ్వేతపత్రంపై చర్చలో మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో విద్యుత్ రంగాన్ని బలోపేతం చేసేందుకే అప్పులు తెచ్చినట్లు మాజీ మంత్రి జి. జగదీశ్‌రెడ్డి తెలిపారు. తెచ్చిన అప్పుల్లోనూ సగానికిపైగా తీర్చేశామని చెప్పారు. శాసనసభలో విద్యుత్ రంగంపై శ్వేతపత్రం కింద గురువారం జరిగిన స్వల్పకాలిక చర్చ సందర్భంగా జగదీశ్‌రెడ్డి మాట్లాడారు. దేశంలో 24 గంటల విద్యుత్‌ను అన్ని రంగాల వినియోగదారులకు అందిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని ఆయన పేర్కొన్నారు. ఈ విషయాన్ని నీతి ఆయోగ్ సైతం స్టేట్ ఎనర్జీ అండ్ క్లైమేట్ ఇండెక్స్‌లో ప్రకటించిందని గుర్తుచేశారు. అధికారంలోకి వచ్చిన వెంటనే అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ అన్ని రంగాలకు అరకొరగా అందుతున్న విద్యుత్‌పై ప్రత్యేక దృష్టి పెట్టారని... అప్పులు చేయకుండా రాష్ట్ర ప్రజలకు, వ్యవసాయదారులకు, పారిశ్రామికవేత్తలకు నాణ్యమైన 24 గంటల విద్యుత్ ఇవ్వలేమని గుర్తించి ప్రణాళికాబద్ధంగా అమలు చేశారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం 24 గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్ అందిస్తుందా లేక అప్పుల సాకుతో కోతలు పెడుతుందో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు.

విద్యుత్ ఆస్తుల విలువ పెంచాం...

2014 జూన్ 2 నాటికి విద్యుత్ సంస్థల ఆస్తులు రూ. 44,438 కోట్లు ఉండగా అప్పులు రూ. 22,423 కోట్లు ఉండేవని జగదీశ్‌రెడ్డి తెలిపారు. ఇప్పుడు ఆ అప్పులు రూ. 81,016 కోట్లకు పెరగ్గా ఆస్తుల విలువ రూ. 1,37,570 కోట్లకు పెంచామని వివరించారు. తెచ్చిన అప్పుతో ఎక్కడా నష్టం జరగలేదని చెప్పారు. పరీక్షలు వస్తున్నాయంటే.. కిరసనాయిల్, క్యాండిల్స్ కొనుక్కురావాల్సిన పరిస్థితి ఉండేదన్నారు. ఒకప్పుడు పల్లెల్లో నీళ్ల కావాలంటే బోరుబావుల దగ్గరకు వెళ్లి తెచ్చుకోవాల్సిన దుస్థితి ఉండేదన్నారు. బోరుబావుల్లో నీళ్ల లేకపోతే ఇంట్లో ఎసరు పెట్టే పరిస్థితి లేదని జగదీశ్‌రెడ్డి గుర్తుచేశారు. ఆనాడు పరిశ్రమలు, వాణిజ్య రంగం, వ్యాపార రంగం, జనరేటర్ లేని ఏ ఒక్క షాపు, ఇన్వర్టర్ లేని ఇల్లు ఉండేదా? అని ప్రశ్నించారు.

బండెద్దు అమ్ముకునే స్థితి నుంచి...

బండెద్దు అమ్మడం నుంచి పుస్తెలు అమ్ముకునే దాకా... ఏ బోరు వేశారో ఆ భూమి అమ్ముకొనే దాకా పరిస్థితి అప్పట్లో ఉండేదని జగదీశ్‌రెడ్డి పేర్కొన్నారు. పాలమూరు రైతులు దేశమంతా వలసలు వెళ్లేవారని గుర్తుచేశారు. 33/11 కేవీ సబ్‌స్టేషన్ నుంచి కరెంటు ఇవ్వాలంటే 3 గంటలకు మించి ఒక ఫీడర్ ద్వారా విద్యుత్ ఇచ్చే అవకాశం ఉండేది కాదన్నారు. 133 కేవీ, 220 కేవీ, 400 కేవీ అందుబాటులో లేక, బ్యాక్‌డౌన్ చేయాల్సిన పరిస్థితి ఉండేదన్నారు.

అందుకే ఛత్తీస్‌గఢ్ నుంచి విద్యుత్...

తెలంగాణ రాష్ట్రం వచ్చి కేసీఆర్ సీఎం అయ్యాక వెంటనే విద్యుదుత్పత్తి చేయడం కష్టంగా ఉండటంతో ఇతర రాష్ట్రాల నుంచి విద్యుత్ కొనుగోలు చేశామని జగదీశ్‌రెడ్డి చెప్పారు. ఛత్తీస్‌గఢ్ నుంచి గ్రిడ్‌ను అనుసంధానించి విద్యుత్ సరఫరా, పంపిణీ వ్యవస్థలను బలోపేతం చేశామని తెలిపారు. మొదట అందుబాటులో ఉన్న వ్యవస్థతో గృహ, వాణిజ్య రంగానికి 24 గంటల కరెంటు ఇచ్చి ఆ తర్వాత పారిశ్రామిక రంగానికి ఇచ్చినట్లు తెలిపారు. ఒక సంవత్సరంలోనే విద్యుత్ సరఫరా, పంపిణీ వ్యవస్థను అభివృద్ధి చేసి వ్యవసాయానికి 6 గంటల కరెంటు ఇవ్వడానికి ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. తరువాత 9 గంటల కరెంటు ఇవ్వగలిగామని, రెండు సంవత్సరాల కాలంలో రైతాంగానికి కూడా 24 గంటల విద్యుత్ అందుబాటులోకి తీసుకొచ్చే ఏర్పాట్లు చేశామన్నారు. సబ్ స్టేషన్లు, విద్యుత్ లైన్లను రెట్టింపు నిర్మించామని తెలిపారు.

విద్యుత్ ప్రాజెక్టులను ప్రైవేటుకు ఇచ్చి దోచుకోలేదు..

జెన్‌కో ప్రాజెక్టులను ప్రభుత్వ సంస్థలకే అప్పగించామని, ప్రైవేటుకు ఇచ్చి దోచుకోలేదని మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం శ్వేతపత్రాలతో కొండను తవ్వి ఎలుకను కూడా పట్టలేకపోయిందని ఎద్దేవా చేశారు. గురువారం అసెంబ్లీ మీడియా పాయింట్‌లో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డితో కలసి ఆయన విలేకరులతో మాట్లాడారు. విద్యుత్ రంగంపై వాస్తవాలు చెబితే కాంగ్రెస్ నేతలు బెదిరిస్తున్నారని ఆరోపించారు.




రాతిపై చెక్కిన శివుడు, నంది శిల్పాల వద్ద రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము

రాష్ట్రపతి నిలయంలో మరిన్ని పర్యాటక హంగులు

- ప్రారంభించిన రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము
- 1948 నాటి చారిత్రక ఫ్లాగ్ పోస్ట్ ప్రతిరూపం ఆవిష్కరణ

సాక్షి, హైదరాబాద్: శీతాకాల విడిది కోసం బొల్లారంలోని రాష్ట్రపతి నిలయానికి విచ్చేసిన రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము గురువారం రాష్ట్రపతి నిలయం ఆవరణలో పలు పర్యాటకాభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. ప్రధానంగా 1948 నాటి ఫ్లాగ్ పోస్ట్ ప్రతిరూపాన్ని ఆవిష్కరించారు. 1948లో హైదరాబాద్ రాష్ట్రం భారత్‌లో విలీనమైన సందర్భంగా ఇక్కడ నిర్వహించిన వేడుకల్లో ప్రిన్స్ ఆజం షా నుంచి హైదరాబాద్ రాష్ట్ర మొదటి ముఖ్యమంత్రిగా భారత ప్రభుత్వం నియమించిన ఎంకే వెల్లోడి బాధ్యతలు స్వీకరిస్తూ హైదరాబాద్ జెండా స్థానంలో జాతీయ జెండాతో కూడిన ఫ్లాగ్ పోస్ట్‌ను ఆవిష్కరించారు. అయితే కాలక్రమేణా ఆ ఫ్లాగ్‌పోస్ట్ పాడవడంతో 2010లో దాన్ని తొలగించారు. తాజాగా అందుకు ప్రతిరూపంగా నూతనంగా టేకుతో ఏర్పాటు చేసిన ఫ్లాగ్ పోస్ట్‌ను రాష్ట్రపతి గురువారం ప్రారంభించి జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం మ్యూజికల్ ఫౌంటేన్, చిల్డ్రన్స్ పార్క్, పునరుద్ధరించిన మూడు మెట్ల బావులతోపాటు సంప్రదాయ మోట పద్ధతి ద్వారా నీటిని తోడే వ్యవస్థను సైతం ప్రారంభించారు. అలాగే రాతిపై చెక్కిన శివుడు, నంది శిల్పాల నుంచి నీళ్లు జాలువారే వ్యవస్థను రాష్ట్రపతి ప్రారంభించారు. రాష్ట్రపతి నిలయం సందర్శనకు వచ్చే పర్యాటకులను ఆకట్టుకునేలా ఈ మేరకు ఏర్పాట్లు చేసినట్లు అధికారులు తెలిపారు.

'కేంద్ర విధానాల వల్లే బీడీ కార్మికులకు అన్యాయం'



సుందరయ్య విజ్ఞాన కేంద్రం (హైదరాబాద్): కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల వల్లే బీడీ కార్మికుల బతుకు ల్లో చీకట్లు నెలకొన్నా యని, బీడీ పరిశ్రమను కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని సీఐటీయూ అఖిల భారత అధ్యక్షురాలు కె.హేమలత అన్నారు. గురువారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన ఆల్ ఇండియా బీడీ వర్కర్స్ సదస్సులో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీడీ కార్మిక సంఘాలను విస్తృత పరిచేలా పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. ఇప్పటికే మహారాష్ట్ర, బిహార్, రాజస్తాన్ వంటి రాష్ట్రాల్లో బీడీ కార్మిక సంఘాలను విస్తరింపజేశామని తెలిపారు. బీడీ ఉత్పత్తిలో దేశవ్యాప్తంగా మెజార్టీగా ఉన్న మహిళల ప్రాతినిధ్యాన్ని పెంచి వారి సమస్యలపై పోరాటం చేయాలన్నారు. కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం బీడీ పరిశ్రమను నిర్వీర్యం చేసే ప్రయ త్నం చేస్తోందని, జీఎస్టీ కారణంగా ఇప్పటికే అనేక పరిశ్రమలు మూతపడ్డాయని ఇలాంటి విధానాలను తమ ఫెడరేషన్ పూర్తిగా వ్యతిరేకిస్తుందని చెప్పారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు బీడీ పరిశ్రమకు జీఎస్టీ మినహాయింపు ఇవ్వాలని హేమలత కోరారు. కార్యక్రమంలో తెలంగాణ బీడీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు గోపాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

(ఎవరైతే సత్కార్యాలు చేశారో) అలాంటి వారి కొరకు క్రింద సెలయేళ్ళు ప్రవహించే శాశ్వత స్వర్గవనాలు ఉంటాయి. అందు వారు బంగారు కంకణాలను, ఆకుపచ్చని బంగారు జలతారు గల పట్టువస్త్రాలను ధరించి, ఎత్తైన ఆసనాలపై దిండ్లకు ఆనుకొని కూర్చొని ఉంటారు.

– ఇస్లాం ధర్మం

ఫోకస్

సాక్షి

శుక్రవారం, 22 డిసెంబర్ 2023

అయోమయంలో 'ఇండియా'

పాలకపక్షాన్ని అధికారం నుంచి దించటమే ఏకైక లక్ష్యంగా ఏర్పడిన ఇండియా కూటమి ఇప్పటికీ అయోమయాన్ని వదుల్చుకోలేకపోతున్నదని మంగళవారం జరిగిన సమావేశం రుజువుచేసింది. తాము ఎవరికి ప్రత్యామ్నాయమో, దేనిలో ప్రత్యామ్నాయమో కూటమి భాగస్వామ్య పక్షాలకు ఈనాటికీ అర్థం కాలేదని ఆ సమావేశం తీరుతెన్నులు తేటతెల్లం చేస్తున్నాయి. బిహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ మాట్లాడుతుండగా ఆయన హిందీ అర్థంకాక ఇబ్బందిపడుతున్న డీఎంకే సీనియర్ నేత టీఆర్ బాలు విషయంలో నితీశ్ స్పందించిన వైనం దిగ్భ్రాంతికరం. 'మీ ప్రసంగాన్ని ఆయనకు అర్థమయ్యేలా అనువాదం చేయొచ్చా?' అని అడిగిన ఆర్జేడీ సభ్యుడు మనోజ్ ఝాపై నితీశ్ నిప్పులు కక్కారు. పనిలో పనిగా 'హిందీ మన జాతీయ భాష. అందరి భాష. అందుకే మన దేశాన్ని హిందూస్థాన్‌గా పిలుచుకుంటాం. అది అందరికీ తెలియాల్సిందే. మీరేమీ అనువాదం చేయకండి' అన్నారట. నితీశ్ రాజకీయాల్లో కాకలు తీరిన నాయకుడు. జయప్రకాశ్ నారాయణ్ ఆధ్వర్యంలో బిహార్‌లో అవినీతికీ, అధికధరలకూ వ్యతిరేకంగా జరిగిన విద్యార్థి ఉద్యమంలో ఎదిగి రాజకీయరంగ ప్రవేశం చేసిన వ్యక్తి. పార్లమెంటేరియన్‌గా, కేంద్రమంత్రిగా సుదీర్ఘ అనుభవం ఉన్నవారు. అలాంటి నాయకుడు హిందీ మన జాతీయ భాష అనుకోవటం ఆశ్చర్యం కలిగిస్తుంది. దేశానికి ఉమ్మడి భాష అవసరమనీ, దాన్ని అందరూ నేర్చుకోవాలనీ ఉత్తరాది నాయకులు పార్టీలకు అతీతంగా చెబుతూవుంటారు. మాతృభాష కాక మరికొన్ని భాషలు నేర్చుకోవాలని చెప్పటంలో తప్పేమీ లేదు. అలా నేర్చుకోవటం వల్ల దేశంలో ఏమూలకైనా వెళ్లి జీవనం సాగించటం సులభమవుతుంది. దక్షిణాది రాష్ట్రాలతోపాటు ఉత్తరాది రాష్ట్రాల ప్రజలకు కూడా ఇది సమానంగా వర్తిస్తుంది. సివిల్స్‌లో విజేతలై దక్షిణాది రాష్ట్రాల క్యాడర్‌కు వచ్చేవారు స్థానిక భాషలు స్వల్పకాలంలోనే నేర్చుకుని అక్కడి ప్రజల మన్ననలు పొందుతున్నారు. హిందీ భాషా ప్రాంతాలనుంచీ, వేరే రాష్ట్రాలనుంచీ వస్తున్న హీరోయిన్‌లు చాలా తొందరలోనే తెలుగు భాష అర్థం చేసుకుని మాట్లాడుతున్న వైనం అందరికీ తెలుసు. కానీ హిందీ 'ఉమ్మడి భాష'గా వుండాలనీ, అది మాత్రమే దేశాన్ని ఏకం చేయగలదనీ మన నేతలు సుద్దులు చెప్పటం వింత గొలుపుతుంది. భాషాద్వేషంలాగే భాషాదురభిమానం కూడా ప్రమాదకరమేనని ఈ నేతలు గుర్తించటం లేదు.

మనకు జాతీయ భాషంటూ ఏమీ లేదు. రాజ్యాంగంలోని 343 అధికరణ ప్రకారం కేంద్ర స్థాయిలో హిందీ, ఇంగ్లిష్ అధికార భాషలు. రాష్ట్రాల్లో ఆయా ప్రాంతీయ భాషలు అధికార భాషలుగా వుంటున్నాయి. 1960 ప్రాంతంలో హిందీని బలవంతంగా రుద్దటాన్ని వ్యతిరేకిస్తూ దక్షిణాది రాష్ట్రాల్లో, మరీ ముఖ్యంగా తమిళనాడులో భారీయెత్తున ఉద్యమాలు జరిగాయి. ఆ తర్వాతే 1963లో అధికార భాషల చట్టం వచ్చింది. హిందీ అధికార భాషగా లేని రాష్ట్రాలతో ఉత్తర ప్రత్యుత్తరాలు ఇంగ్లిష్‌లో జరపాలని నిర్దేశిస్తూ 1967లో ఆ చట్టానికి సవరణ కూడా చేశారు. ఇంకా వెనక్కు వెళ్తే స్వాతంత్ర్యోద్యమ కాలంలో సైతం హిందీ భాష పెత్తనంపై తిరగబడిన దాఖలాలున్నాయి. హిందీని ఉమ్మడి భాషగా గుర్తించాలని నాటి బ్రిటిష్ ప్రభుత్వాన్ని కోరుతూ తీర్మానించాలని పురుషోత్తందాస్ టాండన్ నేతృత్వంలో కొందరు ఉత్తరాది నాయకులు జాతీయ కాంగ్రెస్ మహాసభల్లో ప్రయత్నించినప్పుడు నాటి ఆంధ్రప్రాంత ప్రముఖ నేత స్వర్గీయ ఎన్‌జీ రంగా గట్టిగా వ్యతిరేకించి అడ్డుకున్నారు. కేంద్రంలో పాలకపక్షంగా యూపీఏ వున్నా, ఎన్‌డీఏ వున్నా హిందీ వినియోగాన్ని పెంచటానికి శ్రమిస్తుండటం తరచు కనబడుతూనే వుంటుంది. 2008లో అప్పటి యూపీఏ సర్కారు కేంద్ర ప్రభుత్వ నియామకాల కోసం జరిపే పోటీ పరీక్షల్లో హిందీ ప్రశ్నపత్రం తప్పనిసరి చేయాలని ప్రతిపాదించినప్పుడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి తీవ్రంగా వ్యతిరేకించారు. ఆ ప్రతిపాదన వల్ల హిందీ భాషా ప్రాంతవాసులే లబ్ధిపొందుతారనీ, దక్షిణాది వారికి అన్యాయం జరుగుతుందనీ ఆయన ఎలుగెత్తారు. తాను కాంగ్రెస్ నాయకుడే అయినా, యూపీఏకు తమ పార్టీయే నేతృత్వం వహిస్తున్నా హిందీ భాషను రుద్దాలన్న ప్రయత్నాన్ని ఆయన సాగనివ్వలేదు. ఈ చరిత్రంతా తెలుసుకోకుండా నితీశ్ ఆగ్రహించటం కూటమికి గానీ, వ్యక్తిగతంగా ఆయనకు గానీ ప్రతిష్ఠ తీసుకురాదు.

అసలు తాము ఇండియా కూటమిగా ఎందుకు ఏర్పడ్డారో, దేశంలో ఎలాంటి ప్రజాస్వామిక వాతావరణం ఏర్పర్చటానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారో భాగస్వామ్య పక్షాల నేతలకు అవగాహన వుందా? ఉంటే నితీశ్ వంటి నాయకుడి నుంచి ఇలాంటి స్పందన రాదు. ఏ భాష అయినా పౌరులు ఎంతో ఇష్టంతో, ప్రేమతో నేర్చుకోవాలి. సినిమాలు, టీవీ చానెళ్ల వల్ల ఈరోజుల్లో హిందీతో సహా ఏ భాష నేర్చుకోవటమైనా ఎంతో సులభమవుతోంది. కూటమి ఏర్పడి అయిదు నెలలవుతోంది. తాజా సమావేశం నాలుగవది. సెప్టెంబర్ 14న ఢిల్లీలో సమావేశమైనప్పుడు లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి సీట్ల పంపకం ప్రక్రియపై 'త్వరలో' చర్చించాలని తీర్మానించారు. అది కాస్తయినా ముందుకు కదల్లేదు. ప్రధాని అభ్యర్థిగా కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేను ఖరారు చేద్దామన్న పశ్చిమబెంగాల్ సీఎం మమతా బెనర్జీ సూచన సమావేశంలో వీగిపోయింది. నితీశ్ కుమార్, లాలూ ప్రసాద్ యాదవ్ దీనిపై మండిపడగా, కాంగ్రెస్ అధినేతలు సోనియా, రాహుల్ కిక్కురుమనలేదు. దేశానికి భారత్‌గా నామకరణం చేయాలన్న ఎన్‌డీఏ ప్రతిపాదనకు నితీశ్ వంత పాడటం కూడా చాలామందికి నచ్చలేదంటున్నారు. ఇలా ఏ అంశంలోనూ ఏకాభిప్రాయానికి రాలేక, చరిత్రపై అసలే అవగాహన లేక ఇండియా కూటమి సాధించేదేమిటి?

ఇంతకన్నా మంచి మార్గాలు లేవా?

విశ్లేషణ



చక్షు రాయ్

పార్లమెంటు శీతాకాల సమావేశాలకు అంతరాయం కలిగించినందుకు గాను లోక్‌సభ, రాజ్యసభల్లో 141 మంది ప్రతిపక్ష సభ్యులు సస్పెండ్ అయ్యారు. పార్లమెంటులో ప్రతిష్టంభన కొత్తేమీ కాదు. ఈ అంతరాయాలు మన పార్లమెంటరీ వ్యవస్థలో అనేక సంవత్సరాలుగా ఉన్న విధానపరమైన స్తబ్ధత కారణంగా ఏర్పడుతున్నాయి. ఎంపీలను శిక్షించడం ద్వారా పరిష్కరించగల క్రమశిక్షణా సమస్యగానే దీన్ని చూస్తున్నారు. మన పార్లమెంటరీ వ్యవస్థలో ప్రతిపక్ష పార్టీలకు పార్లమెంటులో తగిన స్థానం లేదు. నిర్దిష్ట సమస్యలను లేవనెత్తాలని వారు డిమాండ్ చేయవచ్చు. అయితే వాటిని అంగీకరించాలా వద్దా అన్నది ప్రభుత్వంపై ఆధారపడి ఉంది. ప్రతిపక్షం కూడా ఉభయ సభల్లో చర్చకు ఎజెండాను సిద్ధం చేసేలా విధానాల్లో మార్పు రావటం అవసరం.

పార్లమెంటరీ వ్యవస్థ పనిచేయకపోవడానికి ప్రధాన కారణం, వివాదాస్పద అంశాలపై చర్చించడానికి విధానపరమైన యంత్రాంగాలు లేకపోవడమే. ప్రభుత్వం, ప్రతిపక్షాల మధ్య ప్రస్తుత ప్రతిష్టంభన ఫలితంగా ఇది కనివిని ఎరుగని పరిస్థితికి దారితీసింది. పార్లమెంటు శీతాకాల సమావేశాలకు అంతరాయం కలిగించినందుకు గాను లోక్‌సభ, రాజ్యసభల్లో 141 మంది ప్రతిపక్ష సభ్యులను సస్పెండ్ చేశారు.



పార్లమెంటులో భద్రతా లోపంపై హోంమంత్రి ప్రకటన చేయాలని ప్రతిపక్షాలు పట్టుబట్టాయి. పార్లమెంటు భద్రత అనేది సున్నితమైన అంశమనేది ప్రభుత్వ వైఖరి. ఇది లోక్‌సభ సెక్రటేరియట్ పరిధిలోకి వస్తుంది. స్పీకర్ ఓం బిర్లా ఆదేశాలను ప్రభుత్వం అనుసరిస్తుంది. దీనిపై ఉన్నతస్థాయి కమిటీ విచారిస్తోందని సభకు స్పీకర్ తెలియజేశారు. అఖిలపక్ష సమావేశంలో వచ్చిన కొన్ని సూచనలను అమలు చేశారు.

పార్లమెంటులో ప్రతిష్టంభన కొత్తేమీ కాదు. మన పార్లమెంటులో రాజకీయ పార్టీ/కూటమి పాత్రతో సంబంధం లేకుండా, చాలా సంవత్సరాలుగా ఒక సుపరిచిత కథనం వినిపిస్తోంది. ప్రతిపక్షాలు ఒక ముఖ్యమైన అంశంపై చర్చకు డిమాండ్ చేస్తున్నాయి కానీ ప్రభుత్వం తప్పించుకుంటోంది. నిజానికి ఈ రోజు మనం చూస్తున్న అంతరాయాలు, క్రమశిక్షణా ప్రతిస్పందనలు... మన పార్లమెంటరీ వ్యవస్థలో అనేక సంవత్సరాలుగా ఉన్న విధానపరమైన స్తబ్ధత కారణంగా ఏర్పడుతున్నాయి.

ఎంపీలు మన పార్లమెంటరీ కార్యక్రమాలకు అంతరాయం కలిగించడం 1960వ దశకంలో మొదలైంది. తాము ముఖ్యమైనవిగా భావించిన అంశాలను ప్రముఖంగా ప్రస్తావించడానికి సభాపతి తమకు తగిన అవకాశం ఇవ్వడం లేదని భావించిన కొందరు ఎంపీలు ఈ పనిలోకి దిగారు. మూడవ లోక్‌సభ (1962–67) సభ్యులు రామ్ సేవక్ యాదవ్, మనీరామ్ బాగ్రీ వంటి ఎంపీలు పార్లమెంటరీ నిబంధనలకు కట్టుబడి ఉండాలని స్పీకర్ పదేపదే హెచ్చరించేవారు. వివిధ సందర్భాల్లో పదేపదే అంతరాయం కలిగించడంతో సభ నుండి వారిని ఏడు రోజుల పాటు సస్పెండ్ చేశారు. లోక్‌సభ తన కార్యకలాపాల నుండి మినహాయించిన మొదటి పార్లమెంటేరియన్‌లు వారే కావచ్చు. మూడవ లోక్‌సభ తన పదవీకాలం ముగిసే సమయానికి, ఏకంగా ఎనిమిది మంది ఎంపీలను సస్పెండ్ చేసింది. మన పార్లమెంటరీ చర్చలలో అంతరాయాలు ఆనవాయితీగా మారబోతున్నాయని ఇది సూచించింది. అప్పటి నుండి, ఎంపీలు పార్లమెంటు కార్యకలాపాలకు అంతరాయం కలిగించిన ఘటనలు, దాని కోసం క్రమశిక్షణకు గురైన సందర్భాలు చాలా ఉన్నాయి.

కానీ కాలక్రమేణా, పార్లమెంటరీ అంతరాయాలు నెమ్మదిగా రాజకీయ సాధనంగా మారాయి. ఈ మారుతున్న ధోరణి గురించి పలువురు సభాపతులు నొక్కి చెప్పారు. 'చాలా సందర్భాలలో, సభా కార్యకలాపాలకు అంతరాయం కలుగుతోంది. అవి యాదృచ్ఛికంగా జరగలేదు. ఉద్దేశపూర్వకంగా అరుస్తూ, సభ వెల్‌లోకి ప్రవేశించడం ద్వారా కార్యకలాపాలను నిలిపివేయడం, పార్లమెంటు పనిచేయడానికి అనుమతించకూడదనే ఉద్దేశమే ఇక్కడ కనబడుతోంది' అన్నారు 14వ లోక్‌సభ స్పీకర్ సోమనాథ్ ఛటర్జీ.

కానీ మన పార్లమెంటరీ వ్యవస్థలో ప్రతిపక్ష పార్టీలకు పార్లమెంటులో తగిన స్థానం లేదు. నిర్దిష్ట సమస్యలను లేవనెత్తాలని వారు సూచించవచ్చు, డిమాండ్ చేయవచ్చు. అయితే వాటిని అంగీకరించాలా వద్దా అన్నది ప్రభుత్వంపై ఆధారపడి ఉంది. పైగా సమస్యంతా అందులోనే ఉంది. ప్రతిపక్ష ఎంపీలు సభలో మాట్లాడలేకపోతే, అది నిరంతరం అంతరాయాలకు దారి తీస్తుంది. ఇప్పటివరకు, సంస్థాగత ప్రతిస్పందన ఏమిటంటే, అంతరాయం కలిగించే ఎంపీలను శిక్షించడమే. కానీ ఇటీవలి సంఘటనలు చూపించినట్లుగా, ఈ విధానం పనిచేయనిదిగా మారింది.

పైగా, అంతరాయానికి చెందిన స్వభావం క్రమంగా పరిణామం చెందినప్పటికీ, పార్లమెంట్ సంస్థాగత ప్రతిస్పందన సరళంగానే ఉంటూ వచ్చింది. ఏమాత్రం మారలేదు. ఎంపీలను శిక్షించడం ద్వారా పరిష్కరించగల క్రమశిక్షణా సమస్యగానే ఇది ఇప్పటికీ అంతరాయాలను చూస్తుంది. సమస్యలో కొంత భాగం పార్లమెంటును మనం చూసే విధానంలో కూడా ఉంది. మన రాజ్యాంగ నిర్మాతలు మన జాతీయ శాసన సభను ప్రభుత్వ వ్యవహారాల కోసం ఉద్దేశించిన ఒక సంస్థగా రూపొందించారు. రాజ్యాంగ నిర్మాతలు పార్లమెంటును సమావేశపరిచే అధికారాన్ని ప్రభుత్వానికి ఇచ్చారు. పార్లమెంటరీ ప్రక్రియ నియమాలు ఈ ఆలోచనా విధానాన్ని బలపరిచాయి. ఈ నియమాలు స్వాతంత్ర్యానికి పూర్వం బ్రిటిష్ మూసపై ఆధారపడి ఉన్నాయి. వలస ప్రభుత్వ వ్యవహారాలకు ప్రాధాన్యత ఉండేలా చూడటం వారి ఉద్దేశం. ఈ భావనకు అదనంగా, వెస్ట్‌మినిస్టర్ పార్లమెంటరీ సూత్రం ప్రకారం, పార్లమెంటును సజావుగా నిర్వహించడం ప్రభుత్వ బాధ్యత.

దేశంలో అత్యున్నతమైన శాసన నిర్మాణం, జవాబుదారీతనం ఉన్న ప్రాతినిధ్య సంస్థను చూసే లోపభూయిష్ట మార్గం ఇది. ఇది పార్లమెంట్ ఎజెండాను నిర్ణయించే అధికారాన్ని, దానిలో ఏయే అంశాలు చర్చకు వస్తాయో నియంత్రించే అధికారాన్ని ప్రభుత్వానికి ఇస్తుంది. నిజానికి చట్టసభలు అనేవి సహకార స్థలాలు. ఇక్కడ ఖజానా(ప్రభుత్వం), ప్రతిపక్షాలు రెండూ కలిసి దేశానికి మంచి ఫలితం కోసం పని చేయాలి. ఎన్నికైన ప్రభుత్వ పాత్ర ఏమిటంటే శాసన, ఆర్థికపరమైన ప్రాధాన్యతలను నిర్ణయించడం. ప్రతిపక్షాల బాధ్యత ఆ ఆలోచనలను వ్యతిరేకించడం లేదా ప్రత్యామ్నాయాలను సూచించడం, అంతరాలను ఎత్తి చూపడం ద్వారా వాటిని బలోపేతం చేయడం. ఈ విధానం ఇప్పుడు ఆచరణ సాధ్యం కానిదిగా మారింది. సభను నడపటం సభాపతికి సాధ్యం కాదని 2005లో స్పీకర్ సోమనాథ్ ఛటర్జీ వ్యాఖ్యానించారు. 'సభ్యుల సమూహం సభలను నడపనివ్వకుండా మొండిగా వ్యవహరిస్తే, దానిని నియంత్రించడం చాలా కష్టం.'

పార్లమెంటు సమర్థవంతంగా పనిచేయాలంటే ఎంపీలను శిక్షించడం సరిపోదు. ప్రతిపక్షం కూడా ఉభయ సభల్లో చర్చకు ఎజెండాను సిద్ధం చేసేలా విధానాల్లో మార్పు రావటం అవసరం. ప్రస్తుతం, ముఖ్యమైన శాసనపరమైన, విధానపరమైన అంశాలను చర్చించడానికి ప్రైవేట్ సభ్యులకు మాత్రమే ప్రతి శుక్రవారం రెండున్నర గంటల సమయం లభిస్తుంది. అయితే, పార్లమెంటులో నిర్దిష్ట చర్చ జరగాలని ఎంపీల బృందం కోరే యంత్రాంగం లేదు. చర్చను బలవంతం చేయడానికి వారికి అందుబాటులో ఉన్న ఏకైక మార్గం, అవిశ్వాస తీర్మానమే. బహుశా, పార్లమెంటు సమావేశాల క్యాలెండర్‌లో ప్రతిపక్షాల కోసం నిర్దిష్ట రోజులను చేర్చడం గురించి ఆలోచించాల్సిన సమయం ఇది. హౌస్ ఆఫ్ కామన్స్ లాగా, ప్రతిపక్షాలు ముఖ్యమైనవిగా భావించే సమస్యలపై చర్చించడానికి ఈ రోజులను కేటాయించవచ్చు.

పార్లమెంటులో ఇటీవలి అంతరాయాలు, చాలామంది ఎంపీల సామూహిక సస్పెన్షన్ మన జాతీయ శాసనసభకు మేల్కొలుపు పిలుపు అనే చెప్పాలి. అత్యున్నత చర్చా వేదికగా పార్లమెంటు ఖ్యాతి ప్రమాదంలో ఉందని ఈ సంఘటనలు నొక్కి చెబుతాయి. చర్చను పెంపొందించడానికి పార్లమెంటు మెరుగైన పరిష్కారాలను కనుగొనవలసి ఉంటుంది. లేదంటే దానిపై ప్రజల విశ్వాసం నెమ్మదిగా క్షీణించే ప్రమాదం ఉంది.

వ్యాసకర్త పీఆర్ఎస్ లెజిస్లేటివ్ రీసెర్చ్‌లో పనిచేస్తున్నారు.

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

వన్ చైనా



గత పది రోజులుగా చైనాలో ఉన్నా. కొన్ని కంపెనీలను సందర్శించాం. మేము ఉత్తరాది నుంచి దక్షిణాదికి ప్రయాణించాం; ఒక్కో నగరంలో ఒక రోజు ఉంటూ. వెళ్లేకొద్దీ వారి ఆహార అలవాట్లు మారుతాయి. కానీ ఆతిథ్యం, కష్టపడే తీరు, క్రమశిక్షణ మాత్రం దేశమంతా ఒకేలా ఉన్నాయి.

– రాహుల్ రాజ్, వ్యాపారవేత్త

నాన్నతో అమ్మ



నా అందమైన అమ్మ నర్గీస్ తాపాల్ ఫతాహ్ వెళ్లిపోయింది. కుటుంబ సభ్యుల ప్రేమ, సమక్షంలో ప్రశాంతంగా పోయింది. నియమబద్ధంగా, వివేకంగా జీవితం గడిపిన మా అమ్మ, డార్లింగ్ డాడ్ తారెక్ ఫతాహ్ (యాక్టివిస్ట్; 2023 ఏప్రిల్ 24న మరణించారు)ను తిరిగి కలుసుకుంది.

– నటాషా ఫతాహ్, జర్నలిస్ట్

మరో సవాలు



రాజ్యసభలో టెలికామ్ చట్టం ఆమోదం పొందితే, దాన్ని నా లా సహచరులతో కలిసి సుప్రీంకోర్టులో సవాలు చేస్తాను. ఇది పెగసస్‌ను చట్టబద్ధం చేయడమే. మోదీ ప్రభుత్వం 2024 సాధారణ ఎన్నికలు అయ్యేవరకైనా వేచివుండాలని సూచిస్తున్నా.

– సుబ్రమణియన్ స్వామి, కేంద్ర మాజీ మంత్రి

దేశం ఉండొద్దా?



యూదులకంటూ ఒక సొంత దేశం ఉండే హక్కు ఉండటమే జియోనిజం అయితే నేను నూరు శాతం జియోనిస్టునే. ఎవరైనా జియోనిస్టు కాకుండా ఎలా ఉంటారు? ముస్లింలు, క్రైస్తవులకు కలిపి నూటికి పైగా దేశాలున్నాయి. యూదులకు కనీసం ఒక్క దేశం అయినా ఎందుకుండొద్దు?

– లుయీ అహ్మద్, యాక్టివిస్ట్

అదే గర్వం



అవును, నేను గర్వపు హిందువునే. ఒక గర్వపు క్రైస్తవుడిని పెళ్లాడిన గర్వపు హిందువును. అన్ని పండుగలూ గర్వంగా జరుపుకొంటాం. అన్ని మతాలూ, సంస్కృతులనూ గర్వంగా ఆదరిస్తాం.

– సెలీనా జైట్లీ, నటి

అపర చాణక్యుడు

స్థిత ప్రజ్ఞుడు, సంస్కరణ శీలి, న్యాయ శాస్త్రజ్ఞుడు, బహు భాషా కోవిదుడు, సాహిత్య సుగంధాలను వెదజల్లిన వాడు, మన తెలుగు బిడ్డ పాములపర్తి వెంకట నరసింహారావు అపరచాణక్యుడిగా పేరుపొందారు. భారతదేశ ఆర్థిక వ్యవస్థ గాడి తప్పినప్పుడు ప్రధానమంత్రిత్వ పగ్గాలు చేపట్టి ఆర్థిక పరిస్థితిని చక్కదిద్దిన ధీశాలి. 1921 జూన్ 28న జన్మించారు. 1938లో నిజాం రాష్ట్ర వ్యతిరేక ఉద్యమంలో పాల్గొని, స్వరాష్ట్రంలో చదువుకు దూరమయ్యారు. మహారాష్ట్రలోని పూణేలో బీఎస్సీ పూర్తిచేసి నాగ్‌పూర్ విశ్వవిద్యాలయంలో ఎల్‌ఎల్‌బీ పట్టా పొందారు. 1948లో 'కాకతీయ' పత్రికను స్థాపించి తొలితరం పత్రికా రచయితగా ప్రసిద్ధికెక్కారు. 'జయ' అనే పేరుతో అనేక రచనలు చేశారు. విశ్వనాథ సత్యనారాయణ రాసిన 'వేయి పడగలు' నవలను హిందీలోకి 'సహస్రఫణ్' పేరుతో అనువదించారు. ఈ రచనకు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు పొందారు. ఆయన స్వీయ చరిత్ర 'ఇన్‌సైడర్'(లోపలి మనిషి) విశేష ప్రాచుర్యం పొందింది.



పీవీ నరసింహారావు

పీవీ రాజకీయ ప్రస్థానం ఓటమితో ప్రారంభమైంది. 1952 ఎన్నికల్లో ఓడిపోయారు. 1957 నుండి 1972 వరకు నాలుగుసార్లు మంథని శాసనసభ నియోజకవర్గం నుండి విజయకేతనం ఎగురవేశారు. 1962లో రాష్ట్ర జైళ్లు, ప్రజా సంబంధాలు, విద్యాశాఖ, ఆరోగ్యశాఖల మంత్రిగా పనిచేశారు. ఆయా శాఖల్లో పలు సంస్కరణలు చేపట్టి అందరి మెప్పు పొందారు. మూడవసారి శాసనసభకు గెలిచినప్పుడు ముఖ్యమంత్రి పదవి అలంకరించారు. ఈ సమయములోనే భూ సంస్కరణలు అమలుపరిచేందుకు చర్యలు చేపట్టారు.

1977లో కేంద్ర రాజకీయాలలో ప్రవేశించారు. హనుమకొండ నుండి లోక్ సభ సభ్యులుగా ఎన్నికయ్యారు. ఇందిరా గాంధీకి అత్యంత విశ్వసనీయుడిగా ఉంటూ హోం శాఖ, విదేశాంగ శాఖల మంత్రిగా పనిచేశారు. 1984లో హనుమకొండ నుండి ఓటమిపాలైనా, మహారాష్ట్రలోని రామ్ టెక్ నియోజకవర్గం నుండి విజయం సాధించారు. రాజీవ్ గాంధీ మంత్రివర్గంలో మానవ వనరుల శాఖ, హోం శాఖల మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించారు. 1991లో జరిగిన ఎన్నికల తరువాత దేశ రాజకీయాలలో ఒక అనిశ్చితి ఏర్పడినప్పుడు తన రాజకీయ చతురతతో మిత్రపక్షాల మద్దతు కూడగట్టి ప్రధానమంత్రిగా మైనార్టీ ప్రభుత్వాన్ని సమర్థవంతంగా నడిపారు. సంక్షోభ సమయంలో సరళీకరణ విధానాలను అవలంబించి దేశ ఆర్థిక వ్యవస్థను ఒడ్డుకు చేర్చిన అసమాన్యుడు. దేశ విదేశ నాయకుల మెప్పుపొందిన పీవీ 2004 డిసెంబర్ 23న గుండె పోటుతో ఈ లోకం విడిచారు. ఆయన భౌతికంగా మన మధ్య లేకపోయినా ఆయన సేవలు మనకు సదా స్మరణీయాలు.

– జాధవ్ పుండలిక్ రావు పాటిల్

ట్రస్మా గౌరవ అధ్యక్షుడు, భైంసా డివిజన్

నూతన ప్రభుత్వ తక్షణ కర్తవ్యాలు

అభిప్రాయం



బి.ఎస్. రాములు

తెలంగాణ నిరుద్యోగులు, విద్యావంతులు, ప్రభుత్వ ఉద్యోగులు, పేద రైతు కూలీలు, కేసీఆర్‌ను కాదని కాంగ్రెస్‌కు పట్టం కట్టారు. కాంగ్రెస్ పార్టీ 'ఆరు గ్యారంటీల'తో కూడిన ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రజలు తక్షణం కోరుకునేవి కొన్ని ఉన్నాయి. వాటిని ముందు అమలు పరచాలి. విద్యార్థులకు చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే చెల్లించాలి. ప్రైవేటు స్కూళ్ళలో, కాలేజీల్లో, ప్రైవేటు యూనివర్సిటీలలో బీసీ, ఎస్సీ, ఎస్టీలకు 50 శాతం సీట్లు తప్పనిసరిగా ఇవ్వాలి. అందుకు చట్టసవరణ చేయాలి.

కుల గణన వెంటనే చేపట్టాలి. సమగ్ర కుటుంబ సర్వే చేసినంత వేగంగా బీసీ, ఎస్సీ, ఎస్టీ కమిషన్‌ల ద్వారా ఈ లెక్కల సేకరణ చేపట్టాలి. త్వరలో పార్లమెంటు ఎన్నికలు జరుగనున్నాయి. బీసీ కులగణన ద్వారా జాతీయ స్థాయిలో ఓబీసీల హృదయాలను గెలుచుకోవచ్చు. జాతీయ రాజకీయాల్లో గొప్ప ప్రభావం చూపవచ్చు. వందేళ్ల తర్వాతయినా కులాల లెక్కలు తీయడం ద్వారా సమగ్ర సామాజిక అభివృద్ధికి కృషి చేసినవారవుతారు. అభివృద్ధి పథకాలు, సంక్షేమ పథకాలు నియోజక వర్గాల వారీగా నిర్దిష్టంగా రూపొందించడం అవసరం. పది జిల్లాలను 33 జిల్లాలు చేశారు కానీ సిబ్బందిని పెంచకుండా ఆ పది జిల్లాల సిబ్బందినే అన్ని జిల్లాలకూ సర్దిపెట్టారు ఇప్పటివరకూ. తద్వారా పరిపాలన కుంటుపడింది. కాబట్టి ప్రతి జిల్లాలో తగిన సిబ్బందిని నియమించడం అవసరం. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులుగా పని చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు, డ్రైవర్లు, కంప్యూటర్ డేటా ఎంట్రీ ఆపరేటర్లు వంటి వారు పేదరికం నుంచి వచ్చినవారే. ఉద్యోగ పోటీ పరీక్షల్లో వీరి అనుభవానికి 10 శాతం మార్కులు కలిపి లెక్కించాలి.

'మిషన్ భగీరథ', 'మిషన్ కాకతీయ' తదితర పథకాలలోని లోటు పాట్లపై సమగ్రమైన విచారణకు కమిషన్ నియమించి వాస్తవాలు వెల్లడించాలి. ప్రతి ఊరికి రక్షిత మంచినీరు ఇచ్చామని గత ప్రభుత్వం అన్నది. కాని, చాలా ఊర్లకు ఇప్పటికీ నల్లా నీరు అందడం లేదు. క్షేత్ర పర్యటన చేసి ఇటువంటి సమాచారాన్ని సేకరించాలి. ప్రజల నుండి విజ్ఞప్తులు స్వీకరించాలి.

చేపలు, గొర్రెల వంటి ఉచిత పంపిణీ పథకాల అమలులో, డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పంపిణీలో



అనేక అవకతవకలు జరిగాయని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఈ పథకాలు ఏమేరకు సద్వినియోగం అయ్యాయో తేల్చి చెప్పడానికీ, లబ్ధిదారులు అందిన ప్రభుత్వ సాయాన్ని చక్కగా వినియోగించుకుంటున్నదీ లేనిదీ తేల్చడానికీ ప్రత్యేక విచారణ కమిషన్ ఏర్పాటు చేయడం అవసరం.

తెలంగాణ రాష్ట్ర సాధనకోసం ఉద్యమం చేసినవారిపై అనేక రకాల కేసులు పెట్టబడ్డాయి. 1996 నుండి 2023 డిసెంబర్ దాకా పెట్టిన ఇలాంటి కేసులను మొత్తం ఉపసంహరించుకోవాలి. ఉద్యమకారులకు కేటాయిస్తామన్న ఇంటి స్థలాన్నీ, ఆర్థిక సాయాన్నీ, పెన్షన్‌నూ, గౌరవ స్థానాలనూ, నామినేటెడ్ పదవులనూ ఇచ్చి వారి సేవలను సమాజానికి ఉపయోగపడేలా ఉపయోగించుకోవాలి. ఆయా కార్పొరేషన్లకు తగిన నిధులు సమకూర్చడం అవసరం. 50కి పైగా విభిన్న కార్పొరేషన్లు ఆయా సందర్భాల్లో ఏర్పాటు చేయడం జరిగింది. వాటికి బడ్జెట్లు లేక నీరసించి పోయాయి.

బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ డిపార్ట్‌మెంట్ల ద్వారా విద్యావంతులైన నిరుద్యోగులకు స్వయం ఉపాధి కల్పన కోసం బడ్జెట్ కేటాయించి వెంటనే లోన్ శాంక్షన్ చేయడం అవసరం. అన్ని శాఖల్లో ఉన్న ఖాళీల వివరాలు సేకరించడంతోపాటూ కొత్త పోస్టులను సృష్టించి నియామకాలు జరపాలి. కొన్ని డిపార్ట్‌మెంట్లలో 1996 నుంచి నియామకాలు లేవు. ఔట్‌సోర్సింగ్‌తో, కాంట్రాక్ట్ ఉద్యోగులతో నడిపిస్తున్నారు. వాటన్నిటికీ జిల్లా సెలక్షన్ కమిటీ ద్వారా నియామకాలు చేపట్టాలి. పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను పునర్వ్యవస్థీకరించడం అవసరం. ఉగాది లోగా రెండు లక్షల ఉద్యోగాలను భర్తీ చేయాలి. తొలుత స్కూళ్ళలో, కాలేజీల్లో, యూనివర్సిటీలలో సంవత్సరాల తరబడి ఉన్న ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయాలి. దీంతో ఉన్నత విద్యావంతులకు ఊరట లభిస్తుంది.

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వడం చాలా కాలం నుంచి పెండింగ్‌లో ఉంది. ఈ కేటాయింపు వెంటనే చేపట్టడం అవసరం. కొన్ని మీడియా సంస్థలకు పక్షపాతంతో ప్రభుత్వ ప్రకటనలు గత ప్రభుత్వం ఇవ్వలేదు. ఈ దుస్థితి తొలగించి అందరికీ తగువిధంగా ప్రకటనలు ఇవ్వాలి. కాంగ్రెస్ మ్యానిఫెస్టోను అచ్చువేసి ప్రతి ఇంటికి ఉచితంగా అందించాలి. ఇలాంటి చర్యల ద్వారా కొత్త ప్రభుత్వం ప్రజాదరణ పొందగలుగుతుంది.

వ్యాసకర్త తెలంగాణ బీసీ కమిషన్ తొలి ఛైర్మన్ | 83319 66987

సద్గుణాలు

మనిషిలో 'మంచి' గుణాలు వికసించాలంటే ఏం చేయాలి? తార్కికంగా చూస్తే, అలాంటి సద్గుణ వికాసానికి ప్రధానంగా మూడే మార్గాలు కదా? ఆ గుణాలేవో జన్మసిద్ధంగా పుట్టుక తోనే అబ్బి, వికసించి ఉండడం. లేదా, పుట్టిన తరవాత సాటివారిని చూసి అనాలోచితంగా వాళ్ళను అనుకరించడం వల్ల, మనలో ఉన్న గుణాల అంకురాలు అప్రయత్నంగా పుష్టి చెందడం. లేదా, స్వబుద్ధితో విషయ వివేచన చేసుకొని, పట్టుదలతో, తపనతో, స్వయంకృషితో సద్గుణ వికాసం సాధించుకోవడం. లోకంలో సాధారణంగా, ఈ మూడు మార్గాల కలగలుపు వల్ల ఒక వ్యక్తి వ్యక్తిత్వం, గుణగణాలూ రూపు దిద్దుకోవడం కనిపిస్తుంది.



జ్యోతిర్మయం

మరోలా కూడా చెప్పచ్చు. కొన్ని సద్గుణాలు తల్లిదండ్రుల నుంచి సంక్రమించిన జన్యువుల (జీన్స్) వల్ల, జన్మ సిద్ధమైన వారసత్వంగా, 'పోలిక'లుగా వస్తాయి. కొన్ని గుణాలు తల్లిదండ్రుల జన్యువులతో గూడా సంబంధం లేకుండా, ఒక వ్యక్తి పూర్వ జన్మకర్మ విశేషాల వల్ల ఏర్పడే 'సంస్కారాలు'గా వస్తాయని శాస్త్రాలు చెప్తున్నాయి. బాల మేధావుల అద్భుత ప్రతిభ ఇలాంటి జన్మాంతర సంస్కారాలకు ఉదాహరణ అంటారు. ఇవీ పుట్టుకతో వచ్చేవే.

కొన్ని సద్గుణాలు (దుర్గుణాలు కూడా) పెరిగిన పరిసరాల ప్రభావం వల్ల ప్రత్యేకమైన విశేష కృషితో పని లేకుండానే బలపడిపోతాయి. వివేకవంతుడు స్వయంగా మంచి–చెడు వివేచించుకొని, 'ఫలానా గుణం నాకు కావాలి' అని ఆ విషయంలో ప్రత్యేక సాధనా, అభ్యాసమూ, కృషీ చేసి సద్గుణాలను పెంపు చేసుకొంటాడు. అనేక రకాల నైపుణ్యాలనూ, సహనం, శాంతం, సౌమ్య వర్తనా, ఇంద్రియ నిగ్రహం, నిరాడంబరతా, పరోపకారేచ్ఛ, వైరాగ్యం లాంటి ఉత్తమ గుణాలను ఉత్తములు ఈ మార్గం ద్వారా దృఢపరచుకొంటారు. మహనీయుల ఆత్మకథలలో, వాళ్ళు సద్గుణ సమృద్ధి సాధించడం కోసం చేసిన ప్రయాసల విశేషాలెన్నో కనిపిస్తాయి.

పుట్టుకతోనే ఉండే సద్గుణ వికాసం గురించి, పుట్టేసిన మనిషి ఇప్పుడేమీ చేయలేడు. కనక పుట్టి, జీవిస్తున్న మనిషికి మిగిలినవి రెండే త్రోవలు: ఒకటి ఆ వికాసానికి అనువైన సాంగత్యం ఏర్పరచుకోవడం, అందుకు అనుకూలించని పరిసరాలనూ, అడ్డొచ్చే సాంగత్యాలనూ వదిలించుకోవడం. రెండు, పట్టుదలగా సాధన, అభ్యాసం చేస్తూ క్రమేణా యధాశక్తి వ్యక్తిత్వ వికాసంలో సాఫల్యం సంపాదించడం.

– ఎం. మారుతి శాస్త్రి

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు, మార్గశిర మాసం, **తిథి:** శు.దశమి ఉ.9.38 వరకు, తదుపరి ఏకాదశి, **నక్షత్రం:** అశ్వని రా.11.07 వరకు, తదుపరి భరణి, **వర్జ్యం:** రా.7.18 నుండి 8.52 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.42 నుండి 9.26 వరకు తదుపరి ప.12.21 నుండి 1.05 వరకు, **అమృతఘడియలు:** సా.4.15 నుండి 5.46 వరకు; **రాహుకాలం:** ఉ.10.30 నుండి 12.00 వరకు, **యమగండం:** ప.3.00 నుండి 4.30 వరకు, **సూర్యోదయం:** 6.30, **సూర్యాస్తమయం:** 5.27.

సింగరేణి ఎన్నికల వాయిదాకు నో

- డిసెంబర్ 27న నిర్వహించాల్సిందేనని హైకోర్టు స్పష్టీకరణ
- అదే రోజు ఫలితాలు కూడా వెల్లడించాలని ఆదేశం
- పోలీసుల బదిలీ నేపథ్యంలో వాయిదా కోరిన ఏఏజీ
- సింగరేణి దాఖలు చేసిన పిటిషన్ కొట్టివేత

సాక్షి, హైదరాబాద్: సింగరేణి గురింపు సంఘం ఎన్నికల వాయిదాకు హైకోర్టు నిరాకరించింది. గతంలో చెప్పిన విధంగా డిసెంబర్ 27న ఎన్నికలు నిర్వహించి, అదే రోజు ఫలితాలు వెల్లడించాలని స్పష్టంచేసింది. ఎన్నికల వాయిదా కోరుతూ సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ (ఎస్సీసీఎల్) దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టివేస్తూ సీజే నేతృత్వంలోని ద్విసభ్య ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది. సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికలు ప్రస్తుత పరిస్థితుల్లో నిర్వహించలేమని, గడువు కావాలంటూ యాజమాన్యం సెప్టెంబర్‌లో హైకోర్టును ఆశ్రయించింది. ఆరు జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు ఈ ఎన్నికలను వాయిదా వేయాలని కోరుతూ ప్రభుత్వానికి లేఖలు రాశారని చెప్పింది. వరుస పండుగలు, అసెంబ్లీ ఎన్నికలు ఉన్నాయని, ఎన్నికల సంఘం పలు భేటీలు నిర్వహించనుందని వారు లేఖలో పేర్కొన్నట్లు తెలిపింది. దీనిపై విచారణ చేపట్టిన సింగిల్ జడ్జి ఎన్నికల వాయిదాకు నిరాకరిస్తూ అక్టోబర్ 28న నిర్వహించాలని ఆదేశించారు. ఈ తీర్పును సవాల్ చేస్తూ ఎస్సీసీఎల్ డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించింది. దీనిపై నాడు విచారణ జరిపిన సీజే ధర్మాసనం.. వాయిదాకు అంగీకరిస్తూ, డిసెంబర్ 27న సింగరేణి ఎన్నికలు నిర్వహించాలని ఆదేశించింది. ప్రభుత్వం తరఫున నాడు విచారణకు హాజరైన అడిషనల్ అడ్వొకేట్ జనరల్ (ఏఏజీ) కూడా ఎన్నికలు డిసెంబర్‌లో నిర్వహించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఈ మేరకు అఫిడవిట్ కూడా దాఖలు చేశారు.



ప్రభుత్వం అక్టోబర్‌లో సమ్మతించింది..

డిసెంబర్ 27న కూడా ఎన్నికలు నిర్వహించలేమని, మార్చి వరకు వాయిదా వేయాలని కోరుతూ గత వారం ప్రభుత్వం ప్రధాన పిటిషన్‌లో మధ్యంతర అప్లికేషన్ (ఐఏ) దాఖలు చేసింది. కేంద్ర కార్మిక శాఖ ఇప్పటికే ముసాయిదా ఓటర్ల జాబితాను విడుదల చేసి ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించింది. ఈ ఐఏపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఆలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ జూకంటి ధర్మాసనం గురువారం విచారణ చేపట్టింది. ప్రభుత్వం తరఫున ఏఏజీ తేరా రజనీకాంత్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. కొద్ది రోజుల క్రితమే కొలువుదీరిన కొత్త ప్రభుత్వం పోలీస్ అధికారుల బదిలీలు చేపడుతోందన్నారు. ఎన్నికల నిర్వహణకు పోలీస్ బందోబస్తు అత్యంత కీలకమని, ఈ క్రమంలో ఇప్పటికిప్పుడే కార్మిక సంఘం ఎన్నికలు నిర్వహించలేమంటూ వాయిదా వేయాలని కోరారు. వాదనలు విన్న ధర్మాసనం.. అక్టోబర్ 11న ఇచ్చిన ఉత్తర్వులను మార్చేందుకు నిరాకరించింది. అక్టోబర్‌లో విచారణ సందర్భంగా ప్రభుత్వం ఎన్నికల నిర్వహణకు సమ్మతిస్తూ తమకు హామీ ఇచ్చిందని గుర్తు చేసింది. ఆ హామీ మేరకు డిసెంబర్ 27న ఎన్నికలు నిర్వహించాల్సిందేనని తేల్చిచెప్పింది.

టీబీజీకేఎస్‌కు ముగ్గురు అగ్రనేతల రాజీనామా

- గౌరవాధ్యక్షురాలు కవితకు ఉమ్మడిగా లేఖ



వెంకట్రావ్



మిర్యాల రాజిరెడ్డి



కెంగర్ల మల్లయ్య

గోదావరిఖని: బీఆర్ఎస్ పార్టీకి అనుబంధంగా ఉన్న తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘానికి(టీబీజీకేఎస్) ముగ్గురు అగ్రనేతలు గురువారం రాజీనామా చేశారు. యూనియన్ అధ్యక్షుడు బి.వెంకట్రావ్, ప్రధాన కార్యదర్శి మిర్యాల రాజిరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ కెంగర్ల మల్లయ్య తమ రాజీనామా లేఖను ఉమ్మడిగా సంఘం గౌరవాధ్యక్షురాలు కవితకు పంపించారు. సింగరేణిలో రెండుసార్లు గుర్తింపు యూనియన్‌గా గెలుపొంది 11 ఏళ్ల పాటు అనేక సమస్యల పరిష్కారంలో అగ్రగామిగా నిలిచిన తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘం అగ్రనేతలు ముగ్గురూ ఒకేసారి రాజీనామా చేయడం సింగరేణిలో కలకలం రేపింది. నిన్నటి వరకు టీబీజీకేఎస్ తరఫున బొగ్గుగనుల ప్రాంతంలో గుర్తింపు యూనియన్ ఎన్నికల్లో ప్రచారం నిర్వహించిన ఈ నేతలు ఆకస్మికంగా రాజీనామా నిర్ణయం తీసుకోవడంతో యూనియన్ శ్రేణులు, కార్మికులు విస్తుపోతున్నారు. గుర్తింపు ఎన్నికలను ఈనెల 27న నిర్వహించాల్సిందేనని హైకోర్టు స్పష్టం చేసిన క్రమంలో ప్రధాన యూనియన్‌గా ఉన్న టీబీజీకేఎస్ అగ్రనేతలు రాజీనామాలు చేయడంతో ద్వితీయ శ్రేణి నాయకులు అయోమయానికి గురవుతున్నారు. ఇదిలా ఉండగా ఎన్నికల్లో పోటీకి అధిష్టానం సుముఖంగా లేకపోవడంతో తాము సంఘం నుంచి వైదొలగాలని నిర్ణయించుకున్నట్లు అధ్యక్షుడు వెంకట్రావ్ తెలిపారు.

'వర్గీకరణ పట్టని కేంద్రం'

సాక్షి, న్యూఢిల్లీ: పదేళ్లుగా అధికారంలో ఉన్న మోదీ ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ సమస్యను పరిష్కరించకుండా కళ్లుండీ చూడనట్టు వ్యవహరిస్తుంటే.. ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్ నోరుండీ మాట్లాడటం లేదని తెలంగాణ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ మాదిగ దుయ్యబట్టారు. ఎస్సీ వర్గీకరణపై రెండు పార్టీల నిర్లక్ష్యానికి వ్యతిరేకంగా గురువారం జంతర్ మంతర్‌లో ధర్నా నిర్వహించారు. కళ్లకు గంతలు, నోటికి గుడ్డ కట్టుకొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వంగపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ.. నూతన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. ఎస్సీ వర్గీకరణ విషయంలో కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని డిమాండ్ చేశారు.

యాదాద్రి ఆలయ ఈవో గీతారెడ్డి రాజీనామా

- నూతన ఈవోగా రామకృష్ణారావు



బాధ్యతలు స్వీకరిస్తున్న ఈవో రామకృష్ణారావు. చిత్రంలో గీతారెడ్డి తదితరులు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ఈవో గీతారెడ్డి గురువారం రాజీనామా చేశారు. ఆమె రాజీనామాను వెంటనే ఆమోదించిన అధికారులు, ఆలయ నూతన ఈవోగా దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ రామకృష్ణారావును నియమించారు. 2014 డిసెంబర్ 2న గీతారెడ్డి యాదాద్రి ఆలయ ఈవోగా బాధ్యతలు తీసుకున్నారు. తొమ్మిదేళ్ల పాటు ఆమె ఈవోగా బాధ్యతల్లో ఉన్నారు. గీతారెడ్డి 2020 ఫిబ్రవరి 28న పదవీ విరమణ చేయాల్సి ఉండగా.. యాదాద్రి ఆలయ అభివృద్ధి అంశాన్ని దృష్టిలో పెట్టుకొని నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం ఒక సంవత్సరం పాటు అంటే 2021 ఫిబ్రవరి 28వ తేదీ వరకు గీతారెడ్డి సర్వీసును పొడిగించింది. అనంతరం ప్రధాన ఆలయ ఉద్ఘాటన నేపథ్యంలో ఆమె పదవీ కాలాన్ని బీఆర్ఎస్ ప్రభుత్వం మళ్లీ పొడిగించింది. మరో అధికారిని ఈవోగా నియమించే వరకు గీతారెడ్డినే ఆలయ ఈవోగా కొనసాగుతారని జీవో ఇచ్చింది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో పదవీ విరమణ పొందిన ప్రభుత్వ అధికారులంతా తమ రాజీనామాలు సమర్పిస్తుండటంతో ఉన్నతాధికారుల ఆదేశాలతో గీతారెడ్డి రాజీనామా చేశారు.

రామకృష్ణారావు బాధ్యతల స్వీకరణ..

యాదాద్రి ఆలయ నూతన ఈవోగా దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ రామకృష్ణారావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ముందుగా ఆయన గర్భాలయంలో స్వయంభూ, ప్రతిష్టా అలంకార మూర్తులను దర్శించుకొని, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం రామకృష్ణారావుకు ప్రధాన కార్యాలయంలో గీతారెడ్డి బాధ్యతలను అప్పగించారు.

డిగ్రీ విద్యార్థిని అనుమానాస్పద మృతి

- సాంఘిక సంక్షేమ కళాశాలలో ఉరివేసుకుని ఆత్మహత్య
- న్యాయం చేయాలంటూ విద్యార్థి సంఘాల ఆందోళన



సృజన

కరీంనగర్ రూరల్: కరీంనగర్ జిల్లా నగునూరు సాంఘిక సంక్షేమ మహిళా గురుకుల డిగ్రీ కళాశాలలో ఓ విద్యార్థిని అనుమానాస్పద స్థితిలో ఆత్మహత్య చేసుకుంది. కరీంనగర్ రూరల్ పోలీసులు, విద్యార్థిని తండ్రి వివరాల ప్రకారం... జిల్లాలోని మానకొండూరు మండలం గంగిపల్లికి చెందిన మార లక్ష్మీనారాయణ ప్రైవేటు స్కూల్ వ్యాన్ డ్రైవర్. ఆయనకు భార్య, ఇద్దరు కూతుర్లు ఉన్నారు. పెద్ద కూతురు సృజన (18) నగునూరులోని సాంఘిక సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాలలో బీఎస్సీ మొదటి సంవత్సరం చదువుతోంది. బుధవారం రాత్రి స్నేహితులతో కలిసి చదువుకున్న సృజన తన గదిలోకి వెళ్లిపోయింది. గురువారం ఉదయం 6 గంటలకు సహ విద్యార్థులకు తరగతి గదిలో సృజన చున్నీతో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకుని కనిపించింది. విషయం తెలిసి లెక్చరర్లు, వార్డెన్, ప్రిన్సిపాల్ అక్కడికి చేరుకుని పోలీసులకు, తల్లిదండ్రులకు సమాచారం అందించారు. రూరల్ సీఐ ప్రదీప్‌కుమార్ సహచర విద్యార్థులు, లెక్చరర్లను అడిగి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం మృతదేహాన్ని పోస్ట్‌మార్టం కోసం జిల్లా ఆస్పత్రికి తరలించారు. సృజన ఆత్మహత్యపై పోలీసులు సమగ్ర విచారణ చేయాలంటూ ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, ఏబీవీపీ తదితర విద్యార్థి సంఘాలు ఆస్పత్రి ఆవరణలో ఆందోళన చేపట్టాయి. కుమార్తె మృతిపై కళాశాల ప్రిన్సిపాల్, లెక్చరర్లు, కొందరు విద్యార్థులపై అనుమానముందన్న లక్ష్మీనారాయణ ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతి కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

కొడుకును పొడిచి.. పురుగు మందు తాగి

తండ్రీకొడుకులు మృతి • కాటేసిన కుటుంబ కలహాలు



వసంత్‌రావు



సురేశ్

గాంధారి(ఎల్లారెడ్డి): కుటుంబ కలహాలతో తండ్రీకొడుకులు కన్నుమూశారు. తండ్రి కత్తితో పొడవడంతో కొడుకు అక్కడికక్కడే మృతి చెందాడు. ఆ వెంటనే తండ్రి పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

కామారెడ్డి జిల్లా గాంధారి మండలం గుజ్జుల్ తండాలో జరిగిన ఈ సంఘటనపై పోలీసులు తెలిపిన వివరాలివి. తండాకు చెందిన బాదావత్ వసంత్‌రావు (48) కుమారుడు బాదావత్ సురేశ్ (27) హైదరాబాద్‌లో ప్రైవేటు ఉద్యోగి. రెండ్రోజుల క్రితం తండాకు వచ్చాడు. బుధవారం రాత్రి డబ్బుల విషయంలో తండ్రీ కొడుకులు గొడవ పడి పరస్పరం దాడి చేసుకున్నారు. ఆగ్రహం చెందిన తండ్రి ఇంట్లోని కత్తితో కొడుకు సురేశ్ ఎడమ వైపు ఛాతీపై పొడవగా తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబ సభ్యులు, తండావాసులు చికిత్స నిమిత్తం గాంధారి ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు సురేశ్ అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. కాగా, ఇంటి వద్ద ఉన్న తండ్రి వసంత్ రావు పురుగు మందు తాగాడు. బంధువులు అతడిని నిజామాబాద్ జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. తండ్రీ కొడుకును హత్య చేశాడని ఆగ్రహించిన బంధువులు వసంత్‌రావు ఇంటిని ట్రాక్టర్లతో ధ్వంసం చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ప్రేమ్‌దీప్ తెలిపారు.

బిగ్‌బాస్ ఫైనల్ గొడవలో 12 మంది అరెస్ట్

- మరో నలుగురు మైనర్లు జువెనైల్ హోంకు తరలింపు



అన్నపూర్ణ స్టూడియో వద్ద అల్లర్లకు పాల్పడ్డ నిందితులు

బంజారాహిల్స్(హైదరాబాద్): బిగ్‌బాస్ సీజన్-7 విజేతగా పల్లవి ప్రశాంత్‌ను ప్రకటించకపోతే అన్నపూర్ణ స్టూడియోను బాంబులతో లేపేస్తామని, విధ్వంసం సృష్టిస్తామంటూ యూట్యూబ్ చానళ్లకు ఇంటర్వ్యూలు ఇచ్చి రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసిన 12 మందిని రిమాండ్‌కు, మరో నలుగురు మైనర్లను జువెనైల్ హోంకు తరలించారు. జూబ్లీహిల్స్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 17వ తేదీ రాత్రి బిగ్‌బాస్ ఫైనల్స్ జరుగుతున్న సమయంలో నగరంలోని పలు ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో అమర్‌దీప్, ప్రశాంత్ అభిమానులు అన్నపూర్ణ స్టూడియో వద్దకు చేరుకున్నారు. అంతకుముందే అక్కడున్న యూట్యూబ్ చానళ్లకు అభిమానులు రెచ్చగొట్టే విధంగా ఇంటర్వ్యూలు ఇచ్చారు. ప్రశాంత్‌ను విజేతగా ప్రకటించకపోతే బీభత్సం సృష్టిస్తామంటూ వ్యాఖ్యలు చేయడంతో, వివిధ ప్రాంతాల నుంచి మరింత మంది అభిమానులు అక్కడకు చేరుకున్నారు. తాము ఓటు వేసిన ప్రశాంత్ తమను కలవకుండానే పోయిన విషయాన్ని గుర్తించిన అభిమానులు తోపులాటకు దిగారు. అమర్‌దీప్ అభిమానులతో గొడవకు దిగారు. ఇరువర్గాలు బాహాబాహీకి దిగి తోపులాటతో హంగామా చేశారు. కొందరు యువకులు రెచ్చిపోయి రాళ్లతో అటుగా వెళుతున్న బస్సు అద్దాలను పగులగొట్టారు. అక్కడున్న కార్లను కూడా ధ్వంసం చేశారు. ఈ ఘటనపై జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకొని యూట్యూబ్ చానళ్లతో మాట్లాడిన వారిని రెండు రోజుల పాటు గాలించి పట్టుకున్నారు. భూపతి బాలకృష్ణ, జి.మోహన్‌కుమార్, భూపతి రాఘవేందర్, డి.రంజిత్‌కుమార్, మొలవాల గణేష్, ధర్మపురి రోహిత్, సరళ రాఘవ, పి.సురేందర్, రాపంతు నవీన్, ఎ.సంతోష్, ధర్మపురి ఏసురత్నం, ఇడువల్ల మహేష్‌లపై ఐపీసీ సెక్షన్ 147, 148, 427, రెడ్‌విత్ 149, సెక్షన్ 3 ఆఫ్ పీడీపీపీ యాక్ట్ కింద కేసు నమోదు చేసి గురువారం నాంపల్లిలోని 17వ అదనపు మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరిచారు. ఈ ఘటనలో పాల్గొన్న నలుగురు మైనర్లను జువెనైల్ జస్టిస్ బోర్డు ఎదుట హాజరుపరిచారు. ఈ నలుగురు ఇంటర్ చదువుతున్నట్టుగా పోలీసుల దర్యాప్తులో తేలింది.

భద్రగిరిలో ముక్కోటి శోభ

- నేడు తెప్పోత్సవం, రేపు ఉత్తర ద్వార దర్శనం





విద్యుద్దీపాల అలంకరణలో రామాలయం (ఇన్‌సెట్)లో శ్రీకృష్ణావతారంలో దర్శనమిస్తున్న భద్రాద్రి రామయ్య

భద్రాచలం: భద్రాచలం దివ్యక్షేత్రంలో వైకుంఠ ఏకాదశి ప్రయుక్త అధ్యయనోత్సవాల్లో భాగంగా శుక్రవారం సాయంత్రం తెప్పోత్సవం, శనివారం తెల్లవారుజామున ఉత్తర ద్వార దర్శనానికి ఆలయ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇందుకోసం శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయాన్ని విద్యుద్దీపాలు, వివిధ రకాల పూలు, చలువ పందిళ్లు, షామియానాలతో ముస్తాబు చేశారు. గోదావరి ఒడ్డున స్వామివారికి తెప్పోత్సవం జరిపే హంస వాహనాన్ని అందంగా తీర్చిదిద్ది ఇప్పటికే ట్రయల్ రన్ పూర్తి చేశారు. ఉత్తర ద్వార దర్శనం టికెట్లు, వసతి గృహాలను ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచారు. కలెక్టర్ ప్రియాంక ఆల ముక్కోటి ఏర్పాట్లను పరిశీలించగా, ఎస్పీ వినీత్ బందోబస్తును పర్యవేక్షిస్తున్నారు.

శ్రీకృష్ణావతారంలో రామయ్య

వైకుంఠ ఏకాదశి ప్రయుక్త అధ్యయనోత్సవాల్లో భాగంగా శ్రీ సీతారామచంద్ర స్వామి వారిని గురువారం శ్రీకృష్ణావతారంలో అలంకరించారు. ఉదయం బేడా మండపంలో ఆళ్వార్లతో కూడిన స్వామి వారి ఉత్సవమూర్తుల వద్ద వేదపండితులు 200 పాశురాల దివ్యప్రబంధాన్ని పఠించారు. కృష్ణావతారంలో ఉన్న స్వామివారికి ఊంజల్‌సేవ నిర్వహించారు.

యాదాద్రిలో వైకుంఠ ఏకాదశికి ఏర్పాట్లు

- 23 నుంచి 28వ తేదీ వరకు నిత్యకల్యాణం, హోమం రద్దు



శ్రీస్వామి వారు దర్శనం ఇచ్చే ఉత్తర ద్వారం

యాదగిరిగుట్ట: 23న నిర్వహించే వైకుంఠ ఏకాదశికి (ముక్కోటి ఏకాదశి) యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయం ముస్తాబవుతోంది. ఆలయ ఉత్తర మహా రాజగోపురం ముందు వైకుంఠనాథుడి అలంకరణలో యాదాద్రీశుడు భక్తులకు దర్శనం ఇచ్చే విధంగా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. అదే రోజు నుంచి అధ్యయనోత్సవాలను జరిపించేలా అధికారులు సన్నాహాలు చేపట్టారు. 23వ తేదీ నుంచి 28వ తేదీ వరకు ఆరు రోజుల పాటు శ్రీస్వామి వారికి వైభవంగా అధ్యయనోత్సవాలను చేపట్టనున్నారు. ఆరు రోజులు శ్రీస్వామి వారి విశేష అలంకార సేవలు ఉన్న నేపథ్యంలో ఆలయంలో భక్తులచే నిర్వహించే నిత్య, శాశ్వత కల్యాణం, శ్రీసుదర్శన నారసింహ హోమం, బ్రహ్మోత్సవాలు, జోడు సేవలను రద్దు చేస్తున్నట్లు ఆలయాధికారులు వెల్లడించారు. వీటితో పాటు ఏకాదశి పర్వదినం 23వ తేదీన లక్ష పుష్పార్చన కైంకర్యం, ఆర్జిత నిజాభిషేకం, సహస్రనామార్చన సైతం రద్దు చేశామని తెలిపారు.

యుద్ధ ట్యాంక్‌ల ట్రయల్ రన్

- నీటిలో గంటకు 8 కి.మీ వేగంతో ప్రయాణం



నీటిలో ట్రయల్ రన్ చేస్తున్న యుద్ధ ట్యాంక్‌పై ఆర్మీ అధికారులు

కొండాపూర్(సంగారెడ్డి): ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ (ఓఎఫ్)లో నూతన సాంకేతికను ఉపయోగించి తయారు చేసిన యుద్ధ ట్యాంక్‌లను గురువారం సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండల పరిధిలోని మల్కాపూర్ పెద్ద చెరువులో ఓఎఫ్ మెదక్ జనరల్ మేనేజర్, జాయింట్ జనరల్ మేనేజర్ ఆధ్వర్యంలో ట్రయల్ రన్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...యుద్ధ ట్యాంక్‌లు నీటిలోకి ప్రవేశించిన 3 కి.మీ తర్వాత గంటకు 8 కి.మీ వేగంతో ప్రయాణిస్తాయని అన్నారు. 40 ఏళ్ల నుంచి 2,500 వరకు యుద్ధ ట్యాంకర్‌లను తయారు చేశామన్నారు. ఈ ట్యాంక్‌లు యుద్ధ సమయాల్లో మిలటరీలను పూర్తి భద్రతతో ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి తరలించేందుకు సహాయపడతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఓఎఫ్ జనరల్ మేనేజర్ రత్న ప్రసాద్, జాయింట్ జనరల్ మేనేజర్ సర్జిత్‌రెడ్డి, డిప్యూటీ జనరల్ మేనేజర్ వేణునాథ్, వివిధ గ్రేడ్ అధికారులు, మిలటరీ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

టెలికం సేవలపై కేంద్రం నియంత్రణ

వేలం లేకుండానే శాటిలైట్ స్పెక్ట్రమ్‌ల కేటాయింపు

రాజ్యసభలో ప్రవేశపెట్టిన మంత్రి అశ్వినీ వైష్ణవ్, ఆమోదం

న్యూఢిల్లీ: జాతి భద్రత దృష్ట్యా టెలికమ్యూనికేషన్ సేవలను తాత్కాలికంగా నియంత్రణలోకి తెచ్చుకునేందుకు కేంద్ర ప్రభుత్వానికి అధికారం కల్పించే కీలకమైన టెలికమ్యూనికేషన్స్ బిల్లు–2023ను గురువారం పార్లమెంట్ ఆమోదించింది. వేలం ప్రక్రియతో సంబంధం లేకుండా ప్రభుత్వమే నేరుగా గ్లోబల్ సర్వీస్ ప్రొవైడర్లకు శాటిలైట్ స్పెక్ట్రమ్ కేటాయింపులు జరిపేందుకు కూడా ఈ బిల్లులో నిబంధనలున్నాయి. టెలికమ్యూనికేషన్స్ బిల్లు–2023ను లోక్‌సభ బుధవారమే ఆమోదించగా గురువారం రాజ్యసభ మూజువాణి ఓటుతో ఆమోదముద్ర వేసింది. బిల్లును టెలికమ్యూనికేషన్ల శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ సభలో ప్రవేశపెట్టారు. టెలికం బిల్లు ప్రభుత్వ జోక్యానికి ఎక్కువ తావిచ్చేలా ఉందంటూ పలువురు వ్యక్తం చేసిన ఆందోళనలపై మంత్రి బదులిస్తూ.. వలస పాలన కాలం నాటి పురాతన చట్టాల స్థానంలో ఈ బిల్లును తీసుకువచ్చామన్నారు. 'టెలికం రంగంలో ఎంతో క్లిష్టమైన నిబంధనలతో కూడిన 100కు పైగా రకాల లైసెన్సులున్నాయి. ఈ బిల్లులో వీటన్నిటినీ తొలగించి, ఒకే ఒక అధికార వ్యవస్థ కిందికి తెచ్చాం.



గురువారం రాజ్యసభ కార్యకలాపాలు కొనసాగుతున్న దృశ్యం

స్పెక్ట్రమ్ కేటాయింపులు పారదర్శకంగా ఉండేందుకు పలు చర్యలు ప్రతిపాదించాం. ఒకటో షెడ్యూల్‌లోని ఏవో కొన్ని ప్రత్యేక కేటగిరీలను మినహాయిస్తే స్పెక్ట్రమ్ కేటాయింపులన్నీ ఇకపై వేలం ద్వారానే జరుగుతాయి' అని మంత్రి వివరించారు. 'బిల్లులో సుప్రీం కోర్టు ఆదేశాలకు అనుగుణంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పాత్రకు సంబంధించిన స్పష్టమైన మార్గదర్శకాలున్నాయి. ఈ విషయంలో ఎలాంటి మార్పు లేదు. జాతి భద్రతను దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం టెలికం సేవలను తాత్కాలికంగా అధీనంలోకి తెచ్చుకునేందుకు ఉద్దేశించిన నిబంధన ఇప్పటికే అమల్లో ఉంది. తాజాగా దీనిని మరింత బలోపేతం చేశాం. కొత్తగా ఏర్పాటు చేసిన డిజిటల్ భారత్ నిధి దేశంలో టెలికం రంగ సాంకేతికతను అభివృద్ధి చేసేందుకు ఉపయోగపడుతుంది'అని మంత్రి వివరించారు. పార్లమెంట్ ఆమోదం అనంతరం ఈ బిల్లును రాష్ట్రపతి ఆమోదం కోసం పంపనున్నారు. రాష్ట్రపతి ఆమోదంతో చట్ట రూపం దాల్చనుంది.

బిల్లు ముఖ్యాంశాలు..



- శాంతి భద్రతలు, దేశ ప్రయోజనాలకు భంగం కలిగించే పరిస్థితులున్నాయని భావించినప్పుడు టెలికం నెట్‌వర్క్ మొత్తాన్ని ప్రభుత్వం తన నియంత్రణలోకి తీసుకోవచ్చు. ప్రజాప్రయోజనాల పరిరక్షణ నిమిత్తం సందేశా(మెసేజీ)లను రహస్యంగా వినొచ్చు, ప్రసారాలను నిలిపివేయవచ్చు.
- ప్రకృతి విపత్తుల సమయాల్లోనూ ప్రభుత్వానికి ఇటువంటి అధికారాలు దఖలు పడతాయి.
- పై పరిస్థితుల్లో కేంద్రం నేరుగా, లేదా కేంద్రం తరఫున రాష్ట్ర ప్రభుత్వం లేదా ప్రత్యేక అధికారికి టెలికం సర్వీసులను లేదా టెలికం నెట్‌వర్క్‌ను నియంత్రణలోకి తీసుకునే అధికారం సమకూరుతుంది.
- ఎవరైనా అనధికారి టెలికం నెట్‌వర్క్‌ను, పరికరాలను, రేడియోలను వినియోగిస్తున్నారని తేలితే ప్రభుత్వం ఏ భవనాన్ని లేదా విమానం, నౌక సహా ఎటువంటి వాహనాన్ని అయినా తనిఖీ చేయొచ్చు, స్వాధీనం చేసుకోవచ్చు.
- వాణిజ్య అవసరాలకు స్పెక్ట్రమ్‌లను వేలం ద్వారానే కేటాయించాలన్న దేశీయ టెలికం సేవల సంస్థలు జియో, వొడాఫోన్ ఐడియా అభ్యర్థనలను తోసిపుచ్చుతూ ప్రపంచవ్యాప్తంగా ఉపగ్రహ సేవలందించే కంపెనీలకు పాలనా అనుమతుల ద్వారానే స్పెక్ట్రమ్‌లను కేటాయించేలా నిబంధనలను బిల్లులో పొందుపరిచారు.
- పాలనా అనుమతుల ప్రకారం..స్పెక్ట్రమ్ కేటాయింపులను దేశంలో, అంతర్జాతీయంగా సుదూర శాటిలైట్ సర్వీసెస్, విశాట్..విమానయానం, సముద్రయానంతో అనుసంధానమయ్యే నెట్‌వర్క్‌లు, బీఎస్ఎన్ఎల్, ఎంటీఎన్ఎల్ వంటి సంస్థలు పొందగలవు.
- ఇంటర్నెట్ ఆధారిత సందేశాలకు, కాల్స్ చేసుకోవడానికి వీలు కల్పించే వాట్సాప్, టెలిగ్రామ్, గూగుల్ మీట్ వంటి యాప్‌లకు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ చట్టంలోని నిబంధనలు వర్తిస్తాయి. వీటిని టెలికం చట్ట పరిధి నుంచి తొలగిస్తారు.
- ఓటీటీ(ఓవర్ ది టాప్) యాప్‌లు టెలికం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా(ట్రాయ్) పరిధి నుంచి తొలగిస్తూ బిల్లులో ప్రతిపాదించారు.

అనధికార ట్యాపింగ్‌లకు.. మూడేళ్ల జైలు, రూ.2 కోట్ల జరిమానా

అక్రమంగా, అనుమతుల్లేకుండా ఫోన్ సందేశాలను రహస్యంగా విన్నా, ట్యాపింగ్‌కు పాల్పడినా భారీ జరిమానాతోపాటు కఠిన శిక్ష విధించే నిబంధనలు ఈ బిల్లులో ఉన్నాయి. దేశ ప్రయోజనాలకు, మిత్రదేశాలతో సత్సంబంధాలకు భంగం కలిగించేలా టెలికం సేవలను దుర్వినియోగపరచడం నేరంగా పరిగణిస్తారు. దోషులకు మూడేళ్ల వరకు జైలు శిక్ష, రూ.2 కోట్ల వరకు జరిమానా, నేర తీవ్రతను బట్టి ఈ రెండూ విధించే అవకాశం ఉంది. నేరగాళ్లకు ప్రత్యక్షంగా, పరోక్షంగా టెలికం సేవలను అందించే సంస్థలపైనా చర్యలుంటాయి. కాల్ డేటా, ఇంటర్నెట్ ప్రొటోకాల్ డేటా రికార్డుల విషయంలో అక్రమాలకు పాల్పడినా శిక్ష, జరిమానా తప్పదు. టెలికం నెట్‌వర్క్‌లకు, టెలీకం సదుపాయాలకు ఉద్దేశ పూర్వకంగా నష్టం కలిగించే వారికి రూ.50 లక్షల వరకు జరిమానా విధించాలని బిల్లులో ప్రతిపాదనలున్నాయి.

తప్పుడు ధ్రువ పత్రాలతో సిమ్.. రూ. 50 లక్షల జరిమానా, జైలు

తప్పుడు ధ్రువపత్రాలతో సిమ్ కార్డు పొందే వారికి రూ.50 లక్షల జరిమానాతోపాటు మూడేళ్ల జైలు శిక్షకు ఈ బిల్లు వీలు కల్పిస్తోంది. ఎక్కువ సంఖ్యలో సిమ్ కార్డులను వాడి 'సిమ్‌బాక్స్'తో అక్రమాలకు పాల్పడే వారికి, ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌తో ఇతరుల ఫోన్ నంబర్లను స్పూఫింగ్ చేస్తూ మోసాలకు పాల్పడే వారికి కూడా ఇవే శిక్షలుంటాయి. సిమ్ దుర్వినియోగాన్ని అడ్డుకట్ట వేయడంతోపాటు ఇతరులకు వివిధ మార్గాల్లో ఇబ్బంది కలిగించే కాలర్‌లపైనా చర్యలకు ఇందులో వీలుంది. వినియోగదారులు తమ ఫిర్యాదులను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకుని, పరిష్కారం పొందేందుకు సైతం బిల్లులో ఏర్పాట్లున్నాయి.

క్రిమినల్ చట్టాలకు ఆమోదం

న్యూఢిల్లీ: బ్రిటిష్ వలస పాలన నాటి క్రిమినల్ చట్టాల స్థానంలో కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న మూడు కీలక బిల్లులకు గురువారం రాజ్యసభ ఆమోదం తెలిపింది. ఈ బిల్లులను లోక్‌సభ బుధవారం మూజువాణి ఓటుతో ఆమోదించిన విషయం తెలిసిందే. భారతీయ న్యాయ సంహిత బిల్లు, భారతీయ నాగరిక్ సురక్ష సంహిత బిల్లు, భారతీయ సాక్ష్య బిల్లును కేంద్ర హోం మంత్రి అమిత్ షా లోక్‌సభలో ప్రవేశపెట్టారు. ఇండియన్ పీనల్ కోడ్–1860, కోడ్ ఆఫ్ క్రిమినల్ ప్రొసీజర్ యాక్ట్–1898, ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్–1872 స్థానంలో ఈ మూడు బిల్లులను తీసుకొచ్చారు. 'ఈ బిల్లులు చట్ట రూపం దాల్చితే ఎఫ్ఐఆర్ నమోదు ప్రక్రియ మొదలుకొని తీర్పు వరకు అన్నీ ఆన్‌లైన్ అవుతాయి. దేశ విద్రోహ చట్టం రద్దయి పోయింది. రాజద్రోహాన్ని దేశద్రోహంగా మార్చారు. దేశ సార్వభౌమాధికారం, సమగ్రతకు భంగం కలిగించే చర్యలకు కొత్త చట్టం ప్రకారం శిక్షలుంటాయి'అని అమిత్ షా వివరించారు. దేశంలోని అన్ని పోలీస్ స్టేషన్లు, కోర్టులు డిజిటైజ్ అవుతాయని చెప్పారు. వీటిల్లో చండీగఢ్ మొట్టమొదటగా డిజిటైజ్ అవుతుందన్నారు. బ్రిటిష్ పాలనలో గాంధీజీ, తిలక్, సావర్కర్ వంటి వారిని జైళ్లకు పంపిన నిబంధనలను తొలగించడం సంతోషాన్నిచ్చిందని మంత్రి చెప్పారు. బిల్లుపై చర్చ సందర్భంగా కాంగ్రెస్ సభ్యులు సభలో లేనప్పటికీ మంత్రి ఆ పార్టీపై విమర్శలు చేశారు. ఇటాలియన్ అద్దాలు ధరించిన వారు భారత పార్లమెంట్ కొత్త క్రిమినల్ చట్టాలను రూపొందించడాన్ని సగర్వంగా భావించరంటూ కాంగ్రెస్ నేత సోనియానుద్దేశించి పరోక్షంగా వ్యాఖ్యానించారు.

పత్రికల రిజిస్ట్రేషన్ ఇక సులభతరం

బిల్లును ఆమోదించిన పార్లమెంట్

న్యూఢిల్లీ: ప్రచురణ రంగానికి సంబంధించిన బ్రిటిష్ పాలన కాలం నాటి చట్టం స్థానంలో పత్రికల రిజిస్ట్రేషన్ ప్రక్రియను సులభతరం చేసేందుకు ఉద్దేశించిన బిల్లును పార్లమెంట్ ఆమోదించింది. సమాచార, ప్రసార శాఖల మంత్రి అనురాగ్ వైష్ణవ్ గురువారం లోక్‌సభలో ప్రెస్ అండ్ రిజిస్ట్రేషన్ ఆఫ్ పీరియాడికల్స్ బిల్లు–2023ను ప్రవేశ పెట్టారు. ఇప్పటిదాకా అమల్లో ఉన్న ప్రెస్ అండ్ రిజిస్ట్రేషన్ ఆఫ్ బుక్స్(పీఆర్‌బీ) చట్టం–1867 ప్రకారం పత్రికలను రిజిస్టర్ చేసుకోవాలంటే ఎనిమిదంచెల కఠినమైన విధానాన్ని అనుసరిస్తున్నారు. తాజా బిల్లులో దీనిని సులభతరం చేశారు. కొత్తగా పత్రికను ప్రారంభించాలనుకునే వారు ఒకే ఒక విడతలో రిజిస్టర్ చేసుకునేందుకు వీలు కల్పించేలా నిబంధనలు తీసుకొచ్చారు. ఈ బిల్లు ఆగస్ట్ 3వ తేదీన రాజ్యసభ ఆమోదం పొందింది.

సీఈసీ, ఈసీల నియామకానికి ప్రధానమంత్రి ప్యానెల్!

చీఫ్ ఎలక్షన్ కమిషనర్, అదర్ ఎలక్షన్ కమిషనర్స్ నియామక బిల్లుకు పార్లమెంట్ పచ్చజెండా

- సుప్రీంకోర్టు ఉత్తర్వులకు అనుగుణంగానే బిల్లును రూపొందించాం
- లోక్‌సభలో కేంద్ర న్యాయ శాఖ మంత్రి మేఘ్వాల్ వెల్లడి
- సీఈసీ, ఈసీలకు సుప్రీం న్యాయమూర్తులతో సమాన హోదా

న్యూఢిల్లీ: ప్రధాన ఎన్నికల కమిషనర్(సీఈసీ), ఎన్నికల కమిషనర్ల(ఈసీ) నియామకం కోసం ప్రత్యేక యంత్రాంగాన్ని ఏర్పాటు చేయడానికి ఉద్దేశించిన కీలక బిల్లును లోక్‌సభ గురువారం ఆమోదించింది. చీఫ్ ఎలక్షన్ కమిషనర్, అదర్ ఎలక్షన్ కమిషనర్స్ (అపాయింట్‌మెంట్, కండీషన్స్ ఆఫ్ సర్వీస్ అండ్ టర్మ్స్ ఆఫ్ ఆఫీస్) బిల్లు–2023ని కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్‌రామ్ మేఘ్వాల్ సభలో ప్రవేశపెట్టారు. స్వల్పకాలిక చర్చ అనంతరం మూజువాణి ఓటుతో బిల్లు ఆమోదం పొందింది. ఈ బిల్లును ఈ నెల 12న రాజ్యసభ ఆమోదించిన సంగతి తెలిసిందే. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారమే బిల్లును తీసుకొచ్చినట్లు అర్జున్‌రామ్ మేఘ్వాల్ లోక్‌సభలో చర్చ సందర్భంగా ప్రకటించారు. ఈసీసీ, ఈసీల సర్వీసు నిబంధనలకు సంబంధించి 1991 నాటి చట్టంలో కొన్ని అంశాలు అపరిష్కృతంగా ఉన్నాయని, వాటిని పరిష్కరిస్తూ కొత్త బిల్లును రూపొందించినట్లు తెలియజేశారు. ప్రతిపాదిత కొత్త చట్టం సుప్రీంకోర్టు ఉత్తర్వులకు వ్యతిరేకంగా ఉందన్న వాదనను ఆయన కొట్టిపారేశారు. సీఈసీ, ఈసీల నియామకానికి చట్టాన్ని తీసుకొచ్చే వరకూ ముగ్గురు సభ్యులతో ఒక ప్యానెల్ ఏర్పాటు చేయాలని ఈ ఏడాది మార్చి నెలలో ప్రభుత్వానికి సుప్రీంకోర్టు సూచించిందని అన్నారు. ఈ ప్యానెల్‌లో ప్రధానమంత్రి, లోక్‌సభలో ప్రతిపక్ష నేత, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సభ్యులుగా ఉండాలని పేర్కొందని గుర్తుచేశారు. సుప్రీంకోర్టు ఉత్తర్వులకు అనుగుణంగానే బిల్లును తయారు చేసినట్లు స్పష్టం చేశారు. రాజ్యాంగం నిర్దేశించిన అధికారాల విభజనకు అనుగుణంగా రూపొందించామని అన్నారు. అలాగే సీఈసీ, ఈసీల హోదా, వేతనాలకు సంబంధించిన సవరణలను కూడా బిల్లులో పొందుపర్చారు.

బిల్లులో ఏముంది?

- ప్రస్తుతం సీఈసీ, ఈసీలను కేంద్ర ప్రభుత్వ సిఫార్సు మేరకు రాష్ట్రపతి నియమిస్తున్నారు.
- సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో సీఈసీ, ఈసీల నియామకం ఇకపై ప్రధానమంత్రి నేతృత్వంలోని ప్యానెల్ పరిధిలోకి రానుంది. అంటే కార్యనిర్వాహక వర్గమే సీఈసీ, ఈసీలను నియమిస్తుంది.
- బిల్లు చట్టంగా మారిన తర్వాత సీఈసీ, ఈసీల నియామకం కోసం కేంద్ర న్యాయ శాఖ మంత్రి ఆధ్వర్యంలో సెర్చ్ కమిటీని ఏర్పాటు ఏయాల్సి ఉంటుంది. ఇందులో ఇద్దరు కేంద్ర కార్యదర్శులు సభ్యులుగా ఉంటారు. సీఈసీ, ఈసీల నియామకం కోసం ఐదుగురి పేర్లతో షార్ట్‌లిస్టు తయారు చేసి సెలక్షన్ కమిటీకి పంపించాలి.



గురువారం లోక్‌సభ కార్యకలాపాలు కొనసాగుతున్న దృశ్యం

- ఆ తర్వాత ప్రధానమంత్రి నేతృత్వంలో ఒక కేంద్ర మంత్రి, లోక్‌సభలో ప్రతిపక్ష నేతతో కూడిన ప్యానెల్ ఎన్నికల సంఘం సభ్యులను ఎంపిక చేస్తుంది.
- ఒకవేళ లోక్‌సభలో ప్రతిపక్ష నేత లేకపోతే సభలోని ఏకైక అతిపెద్ద పార్టీ నాయకుడిని సెలక్షన్ ప్యానెల్‌లో సభ్యుడిగా నియమిస్తారు.
- సెర్చ్ కమిటీ సూచించిన షార్ట్‌లిస్టులో లేని పేర్లను కూడా పరిగణనలోకి తీసుకొనే అధికారం ప్యానెల్‌కు ఉంటుంది.
- సవరించిన బిల్లు ప్రకారం.. సీఈసీ, ఈసీలకు సుప్రీంకోర్టు న్యాయమూర్తులతో సమాన హోదా లభిస్తుంది.
- సీఈసీ, ఈసీలకు సుప్రీంకోర్టు న్యాయమూర్తితో సమానంగా వేతనం చెల్లిస్తారు.
- అధికారిక విధులు నిర్వర్తించే క్రమంలో సీఈసీ, ఈసీలకు కోర్టు కేసుల నుంచి రక్షణ కల్పిస్తూ సవరణ బిల్లులో కొన్ని అంశాలు చేర్చారు.
- సీఈసీ సిఫార్సు లేకుండా ఈసీలను పదవి నుంచి తొలగించడానికి వీల్లేదు.
- సుప్రీంకోర్టు జడ్జిని పదవి నుంచి తొలగించడానికి ఉపయోగించే ప్రక్రియనే సీఈసీ విషయంలోనూ ఉపయోగించాలి.
- సెక్రెటరీ ర్యాంకు లేదా సమాన హోదా ఉన్నవారిని మాత్రమే సీఈసీ, ఈసీలుగా నియమించాలి.
- సీఈసీ, ఈసీలపై గతంలోనే కేసులు ఉంటే.. వారు పదవుల్లో ఉన్నంతకాలం ఆయా కేసుల్లో విచారణ కొనసాగించకూడదు. గతంలో సీఈసీ రాజీవ్ కుమార్‌పై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని పోలీసులను ఆదేశించిన స్పెషల్ సెషన్స్ జడ్జిని తెలంగాణ హైకోర్టు సస్పెండ్ చేసింది. ఈ అంశాన్ని దృష్టిలో పెట్టుకొని పదవుల్లో ఉన్న సీఈసీ, ఈసీలపై విచారణ కొనసాగించకూడదన్న నిబంధనను బిల్లులో చేర్చారు.

పాడుబడ్డ భవనాల్లో రూ.329 కోట్లు

న్యూఢిల్లీ: కాంగ్రెస్ ఎంపీ ధీరజ్ సాహుకు చెందిన వివిధ ప్రాంతాల్లో ఇటీవలి దాడుల్లో వందల కోట్ల నగదు లభించిన ఘటనకు సంబంధించి ఆదాయ పన్ను శాఖ అధికారులు మరి కొన్ని వాస్తవాలను వెల్లడించారు. ఆ దాడుల్లో మొత్తం రూ.351 కోట్ల నగదు వెలుగు చూసిన విషయం తెలిసిందే. ఇందులో రూ.329 కోట్ల డబ్బు కట్టలను ఒడిశాలోని అంతగా పేరులేని సుదపాడ, తిత్లాగఢ్, భేత్‌రాజ్‌పూర్ వంటి పట్టణాల్లోని శిథిల భవనాల్లోని రహస్య అరల్లో దాచారన్నారు. తమ గ్రూప్ లెక్కల్లో చూపని ఆదాయాన్ని ఇలా దాచిపెట్టినట్లు ఉద్యోగులు చెప్పారని ఐటీ అధికారులు తెలిపారు.

చెక్ రిపబ్లిక్‌లో కాల్పులు.. 15 మంది మృతి

ప్రేగ్: చెక్ రిపబ్లిక్ రాజధాని ప్రేగ్‌లో జరిగిన కాల్పుల ఘటనలో నిందితుడు సహా 15 మంది చనిపోయారు. మరో 30 మంది వరకు గాయపడ్డారు. జన్ పలాచ్ స్క్వేర్‌కు సమీపంలోని చార్లెస్ యూనివర్సిటీ వద్ద ఓ వ్యక్తి యథేచ్ఛగా కాల్పులకు తెగబడ్డాడు. ఘటనలో మృతి చెందిన నిందితుడు కూడా విద్యార్థేనని పోలీసులు తెలిపారు.

ఎన్నికలకు సిద్ధంకండి

సార్వత్రిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పోరాడండి • సీడబ్ల్యూసీ సమావేశంలో అధిష్టానం పిలుపు

సాక్షి, న్యూఢిల్లీ: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీని గద్దె దించి, కాంగ్రెస్‌ను గెలుపు తీరాలకు చేర్చడమే లక్ష్యంగా పని చేయాలని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ(సీడబ్ల్యూసీ) నిర్ణయించింది. తెలంగాణ మినహా ఇటీవలి ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు నిరాశాజనకంగా ఉన్నప్పటికీ నైతిక స్థైర్యం వీడకుండా ముందుకుసాగాలని పిలుపునిచ్చింది. కూటమి పక్షాలను కలుపుకుంటూ, విజయ లక్ష్యంతో నేతలు, కార్యకర్తలు సమష్టిగా పని చేయాలని హైకమాండ్ పెద్దలు సూచించారు. సార్వత్రిక ఎన్నికలు, కూటమి పొత్తులు, సీట్ల పంపకాలపై చర్చించేందుకు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అధ్యక్షతన సీడబ్ల్యూసీ సమావేశం ఢిల్లీలోని ఏఐసీసీ కార్యాలయంలో గురువారం జరిగింది. కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియా గాంధీ, సీనియర్ నేతలు రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీ, కమిటీ సభ్యులు హాజరయ్యారు. ఈ భేటీకి ఆంధ్రప్రదేశ్ నుంచి రఘువీరారెడ్డి, టి.సుబ్బిరామిరెడ్డి హాజరయ్యారు. తెలంగాణ నుంచి హాజరు కావాల్సిన ఆ రాష్ట్ర సీఎం రేవంత్ రెడ్డి, సీడబ్ల్యూసీ సభ్యుడు దామోదర రాజనర్సింహ అసెంబ్లీ సమావేశాల కారణంగా రాలేదు. సీడబ్ల్యూసీ తీర్మానాన్ని సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. తీర్మానంలోని అంశాలను తర్వాత ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ మీడియాకు వెల్లడించారు.



సీడబ్ల్యూసీ భేటీలో సోనియా గాంధీ, ఖర్గే

'' పార్లమెంటు నుంచి 143 మంది విపక్ష సభ్యులను సస్పెండ్ చేయడాన్ని సీడబ్ల్యూసీ తీవ్రంగా ఖండించింది. బీజేపీ దాని మిత్రపక్షాలకు దీటుగా విపక్షాల 'ఇండియా' కూటమిని పటిష్టవంతం చేసేందుకు అన్ని చర్యలు తీసుకోవాలి'' అని సీడబ్ల్యూసీ తీర్మానించింది. ''నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతున్న కారణంగా ఆర్థిక అసమానతలు, నిరుద్యోగం పెరుగుతున్నాయి. ప్రధాని చెప్పే విషయాలకు క్షేత్రస్థాయిలో పరిస్థితులకు మధ్య చాలా అంతరం ఉంది' అని సీడబ్ల్యూసీ అభిప్రాయపడింది. ''దేశంలో సామాజిక ధ్రువీకరణ తీవ్రమవుతోంది. ఎన్నికల్లో లాభం పొందేందుకు ప్రజలను రెచ్చగొడుతున్నారు'' అని మండిపడింది. భేటీలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మాట్లాడారు. '4 రాష్ట్రాల ఫలితాలపై ప్రాథమిక విశ్లేషణ చేసి ఓటమి కారణాలను గుర్తించాం. ఫలితాలు ప్రతికూలంగా ఉన్నా ఓట్ల శాతం సానుకూలంగా ఉంది. శ్రద్ధ పెడితే వచ్చే ఎన్నికలను మలుపు తిప్పగలమన్న ఆశ పెరిగింది'అని చెప్పారు.

అక్రమాస్తుల కేసులో తమిళ మంత్రికి జైలు

సాక్షి, చెన్నై: ఆదాయానికి మించి ఆస్తుల కేసులో మద్రాసు హైకోర్టు తమిళనాడు ఉన్నతవిద్యా శాఖ మంత్రి కె.పొన్ముడి, ఆయన భార్యకు మూడేళ్ల జైలు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పింది. 72 ఏళ్ల పొన్ముడి, ఆయన భార్య పి.విశాలాక్షిని నిర్దోషులుగా పేర్కొంటూ దిగువ కోర్టు ఇచ్చిన తీర్పును మద్రాసు హైకోర్టు ఈనెల 19న కొట్టేయడం తెల్సిందే. నాడు తీర్పును రిజర్వ్ చేసి గురువారం వెలువరించింది. అవినీతి నిరోధక చట్టం ప్రకారం పొన్ముడి, ఆయన భార్యను దోషులుగా తేల్చి చెరో మూడేళ్ల జైలు శిక్షతోపాటు, చెరో రూ.50 లక్షల జరిమానా విధించింది. '' నిందితులు విల్లుపురం ట్రయల్ కోర్టు ఎదుట లొంగిపోయేందుకు 30 రోజుల గడువు ఇస్తున్నాం. ఈ తీర్పును సవాల్‌చేస్తూ సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ వేసేందుకు అవకాశం కల్పిస్తున్నాం'' అని జస్టిస్ జి.జయచంద్రన్ గురువారం తీర్పు చెప్పారు. ప్రజాప్రతినిధుల చట్టం ప్రకారం రెండేళ్లకు మించి జైలు శిక్ష పడితే ఆ శాసనసభ/లోక్‌సభ సభ్యుడు తమ సభ్యత్వాన్ని కోల్పోతారు. ఈ చట్టం ప్రకారం పొన్ముడి ఎమ్మెల్యేగా అనర్హతను ఎదుర్కొన్నారు. హైకోర్టు తీర్పు వెలువడ్డాక తమిళనాడు డీఎంకే సర్కార్ పొన్ముడిని మంత్రి బాధ్యతల నుంచి తప్పించింది.



పైలట్ రహిత ప్రయాణం

మానవ రహిత డ్రోన్ల వినియోగం ప్రపంచమంతటా విస్తృతమవుతోంది. రిమోట్ కంట్రోల్ టెక్నాలజీతో వీటిని ఆపరేట్ చేస్తుంటారు. ఇదే టెక్నాలజీ ఆధారంగా పైలట్ రహిత విమానాలపై చాలా ఏళ్లుగా పరిశోధనలు జరుగుతున్నాయి. ఈ దిశగా అమెరికాకు చెందిన రిలయబుల్ రోబోటిక్స్ సిస్టమ్స్ సంస్థ సత్ఫలితాలు సాధించింది. సెమీ–ఆటోమేటెడ్ ఫ్లయింగ్ సిస్టమ్‌పై ఈ సంస్థ 2019 నుంచి పరిశోధనలు సాగిస్తోంది. పైలట్ లేకుండా కార్గో విమానాన్ని విజయవంతంగా నడిపించింది. అమెరికాలో ఉత్తర కాలిఫోర్నియాలోని హోలిస్టర్ ఎయిర్‌పోర్టు నుంచి బయలుదేరిన ఈ సెస్నా కేరవాన్ విమానం దాదాపు 12 నిమిషాల పాటు గాల్లో 50 మైళ్ల మేర ప్రయాణించింది. గత నెలలో ఈ ప్రయోగం విజయవంతంగా చేపట్టామని రిలయబుల్ రోబోటిక్స్ సిస్టమ్స్ సీఈఓ రాబర్ట్ రోజ్ చెప్పారు. పైలట్ ప్రమేయం లేకుండా రిమోట్ కంట్రోలర్‌తోనే నడిపించినట్లు తెలిపారు. ఇదంతా బాగానే ఉన్నప్పటికీ ఇలాంటి పైలట్ రహిత విమానాలతో కొన్ని సమస్యలు లేకపోలేదు. ఇవి గాల్లో తక్కువ ఎత్తులోనే ప్రయాణిస్తాయి. ప్రతికూల వాతావరణ పరిస్థితులను అధిగమించలేవు. ఇలాంటి సమస్యలను పరిష్కరించి, మెరుగైన టెక్నాలజీని అందుబాటులోకి తీసుకురావడానికి కొంత సమయం పడుతుందని రాబర్ట్ రోజ్ చెప్పారు. తాము అభివృద్ధి చేసిన సాంకేతికతను వాణిజ్యపరంగా పూర్తిస్థాయిలో అందుబాటులోకి రావడానికి రిలయబుల్ రోబోటిక్స్ సంస్థ అమెరికాకు చెందిన ఫెడరల్ ఏవియేషన్ అడ్మినిస్ట్రేషన్‌తో కలిసి పని చేస్తోంది. మరో రెండేళ్లలో అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. పైలట్ రహిత విమానాల రిమోట్ ఆపరేటర్‌కు ఒక పైలట్ ఉండే అర్హతలన్నీ ఉండాలి. అలాగే పైలట్ లైసెన్స్ కలిగి ఉండాలి. సెస్నా కంపెనీ తయారు చేసిన సరుకు రవాణా విమానాలను కేరవాన్ అని పిలుస్తున్నారు. ఇది సింగిల్–ఇంజన్ ఎయిర్‌క్రాఫ్ట్. ఫ్లైట్ ట్రైనింగ్, టూరిజం, విపత్తుల సమయంలో సహాయక చర్యలు, సరుకు రవాణా కోసం వీటిని ఉపయోగిస్తుంటారు.

– సాక్షి, నేషనల్ డెస్క్

48 ఏళ్ల తర్వాత నిర్దోషిగా..



చేయని తప్పునకు శిక్ష అనుభవించడం, నిందలు మోయడం నిజంగా బాధాకరమే. అమెరికాలోని ఒక్లహోమాకు చెందిన 70 సంవత్సరాల గ్లిన్ సైమన్స్‌కు కూడా ఇలాంటి చేదు అనుభవమే ఎదురైంది. ఏ నేరమూ చేయకపోయినా ఏకంగా 48 సంవత్సరాల ఒక నెల 18 రోజులు జైలు శిక్ష అనుభవించాల్సి వచ్చింది. జీవితంలో విలువైన సమయం జైలుపాలయ్యింది. న్యాయం అతడి పక్షాన ఉండడంతో ఎట్టకేలకు నిర్దోషిగా బయటపడ్డాడు. అమెరికాలో చేయని తప్పునకు అత్యధిక కాలం శిక్ష అనుభవించింది గ్లిన్ సైమన్స్ అని నేషనల్ రిజిస్ట్రీ ఆఫ్ ఎగ్జోనరేషన్స్ అధికారులు చెప్పారు. 1974 డిసెంబర్‌లో ఒక్లహోమాలోని ఓ లిక్కర్ స్టోర్‌లో హత్య జరిగింది. ఇద్దరు దుండగులు లిక్కర్ స్టోర్ క్లర్క్‌ను కాల్చి చంపి, మద్యం సీసాలు ఎత్తుకెళ్లారు. అప్పుడు గ్లిన్ సైమన్స్ వయసు 22 ఏళ్లు. సైమన్స్‌తో పాటు డాన్ రాబర్ట్స్ అనే వ్యక్తి ఈ హత్య చేశారని పోలీసులు తేల్చారు. వారిద్దరికీ న్యాయస్థానం జైలుశిక్ష విధించింది. తాము ఈ నేరం చేయలేదని మొత్తుకున్నా అప్పట్లో ఎవరూ వినిపించుకోలేదు. పోలీసులు వారిని జైలుకు పంపించారు. డాన్ రాబర్ట్స్ 2008లో పెరోల్‌పై విడుదలయ్యాడు. కేసును మళ్లీ విచారించాలని సైమన్స్ కోర్టులో పిటిషన్లు దాఖలు చేశాడు. దాంతో కోర్టు ఆదేశాల మేరకు పోలీసులు కేసును మళ్లీ విచారించారు. సైమన్స్ హత్య చేయలేదని గుర్తించారు. అతడిని జైలు నుంచి విడుదల చేస్తూ ఒక్లహోమా కంట్రీ జిల్లా కోర్టు రెండు రోజుల క్రితం తీర్పు ఇచ్చింది. అంతేకాదు అతడికి 1.75 లక్షల డాలర్ల (రూ.1.45 కోట్లు) నష్ట పరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. సైమన్స్ మంగళవారం కారాగారం నుంచి బయటకు వచ్చాడు. తాను నేరం చేయలేదు కాబట్టి శిక్షను ధైర్యంగా ఎదుర్కొన్నానని, ఎప్పటికైనా నిర్దోషిగా విడుదలవుతానన్న నమ్మకంతో ఉన్నానని సైమన్స్ చెప్పాడు.

– సాక్షి, నేషనల్ డెస్క్

మరో ముగ్గురి సస్పెన్షన్

న్యూఢిల్లీ: పార్లమెంట్ నుంచి విపక్ష ఎంపీల సస్పెన్షన్ల పర్వం యథావిధిగా కొనసాగింది. భద్రతా వైఫల్యంపై ప్రభుత్వం వివరణ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేయడంతో గురువారం లోక్‌సభ నుంచి ముగ్గురు కాంగ్రెస్ సభ్యులు డీకే సురేష్, దీపక్ బైజ్, నకుల్‌నాథ్‌ను స్పీకర్ బహిష్కరించారు. ప్రస్తుతం సెషన్ ముగిసేదాకా వారికి సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించారు. ప్రస్తుతం శీతాకాల సమావేశాల్లో లోక్‌సభ నుంచి సస్పెండైన సభ్యుల సంఖ్య 100కు చేరుకుంది. ఇప్పటిదాకా పార్లమెంట్ నుంచి మొత్తం 146 మంది సస్పెండయ్యారు. వీరిలో రాజ్యసభ సభ్యులు 46 మంది ఉన్నారు.

లోక్‌సభ నిరవధికంగా వాయిదా

లోక్‌సభ గురువారం నిరవధికంగా వాయిదా పడింది. శీతాకాల సమావేశాల్లో షెడ్యూల్ కంటే ఒక రోజు ముందే దిగువ సభ వాయిదా పడడం గమనార్హం. ఈ నెల 4న ప్రారంభమైన ఈ సెషన్‌ను షెడ్యూల్ ప్రకారం ఈ నెల 22న ముగించాల్సి ఉంది. పార్లమెంట్ నూతన భవనంలో పూర్తిస్థాయిలో జరిగిన తొలి సెషన్ ఇదే. ఈసారి సభలో 74 శాతం ప్రొడక్టివిటీ నమోదైనట్లు లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా తెలిపారు. మొత్తం 18 బిల్లులను ఆమోదించినట్లు చెప్పారు. శీతాకాల సమావేశాలు ఈసారి వాడీవేడిగా జరిగాయి. లోక్‌సభలో అనూహ్య సంఘటనలు చోటుచేసుకున్నాయి. ఇద్దరు ఆగంతకులు సభలోకి ప్రవేశించడం, రంగుల గొట్టాలు ప్రయోగించడం వంటివి దేశవ్యాప్తంగా తీవ్ర సంచలనం సృష్టించాయి. పార్లమెంట్‌లో చోటుచేసుకున్న భద్రతా వైఫల్యంపై ప్రభుత్వాన్ని నిలదీయడం, నినాదాలు చేయడం, ప్లకార్డులు ప్రదర్శించడంతో రికార్డు స్థాయిలో 146 మంది ప్రతిపక్ష ఎంపీలు ఉభయ సభల నుంచి సస్పెండయ్యారు. ప్రశ్నలకు లంచాలు కేసులో టీఎంసీ ఎంపీ మహువా మొయిత్రాపై సస్పెన్షన్ వేటు పడింది.

జమ్మూకశ్మీర్‌లో ఉగ్ర ఘాతుకం

సైనిక వాహనాలపై దాడి • నలుగురు జవాన్లు మృతి...

జమ్మూ: జమ్మూకశ్మీర్‌లోని పూంచ్ జిల్లాలో సాయుధ ఉగ్రవాదులు రెచ్చిపోయారు. రెండు సైనిక వాహనాలపై మెరుపుదాడి చేశారు. విచక్షణారహితంగా కాల్పులు జరిపారు. ఈ ఘటనలో నలుగురు జవాన్లు మృతిచెందారని, మరో ముగ్గురు గాయపడ్డారని అధికారులు వెల్లడించారు. సురాన్‌కోట్ పోలీసు స్టేషన్ పరిధిలో గురువారం మధ్యాహ్నం 3.45 గంటలకు ఈ దాడి జరిగిందని చెప్పారు. గాలింపు చర్యల కోసం వెళ్తున్న సైనిక వాహనాలపై దత్యార్‌మోర్ వద్ద ముష్కరులు దాడి చేశారని పేర్కొన్నారు. ఒక ట్రక్కు, మరో జీప్‌పై తుపాకులతో కాల్పులు జరిపారని తెలిపారు. అప్రమత్తమైన జవాన్లు వెంటనే ఎదురు కాల్పులు ప్రారంభించారని, కాల్పులు ఇంకా కొనసాగుతున్నాయని వివరించారు. దాడికి పాల్పడింది తామేనని లష్కరే తోయిబా అనుబంధ పీపుల్స్ యాంటీ–ఫాసిస్ట్ ఫ్రంట్(పీఏఎఫ్ఎఫ్) ప్రకటించింది.

సీఐఎస్ఎఫ్ చేతికి పార్లమెంట్ భద్రత

న్యూఢిల్లీ: పార్లమెంట్‌లోకి ఆగంతకుల చొరబాటుతో భద్రతా వైఫల్యం వెలుగుచూసిన నేపథ్యంలో పార్లమెంట్‌ను అత్యంత కట్టుదిట్టమైన భద్రతా వలయంగా మార్చాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఎయిర్‌పోర్ట్‌లో తనిఖీల తరహాలో బాడీ చెకింగ్, చేత్తో పట్టుకునే డిటెక్టర్లతో సోదాలు, ఎక్స్‌రే మెషీన్‌తో వస్తువుల స్కానింగ్ వంటి సమగ్ర తనిఖీ వ్యవస్థను పార్లమెంట్ వద్ద ఏర్పాటుచేయనున్నారు.

క్లుప్తంగా...

మోసం చేయడం కాంగ్రెస్‌కు వెన్నతో పెట్టిన విద్య



సాక్షి, హైదరాబాద్: అధికారంలోకి రాగానే ఆరుగ్యారంటీల హామీలను నెరవేరుస్తామని కాంగ్రెస్ ఇచ్చిన మాట ఏమైందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ప్రశ్నించారు. గురువారం అసెంబ్లీ మీడియా పాయింట్‌లో ఆయన మాట్లాడుతూ, ప్రజలను మోసం చేయడం కాంగ్రెస్ పార్టీకి వెన్నతో పెట్టిన విద్య అని ఆరోపించారు. అధికారంలోకి రాగానే నిరుద్యోగ భృతి ఇస్తామన్నారని, ఇప్పుడేమో నిరుద్యోగభృతి ఇస్తామని ఎక్కడా చెప్పలేదని ఆర్థిక మంత్రి భట్టి చెబుతున్నారని మండిపడ్డారు. హైదరాబాద్‌లో ప్రియాంకా గాంధీ యూత్ డిక్లరేషన్ ప్రకటించిన విషయం మరిచిపోయారని ఎద్దేవా చేశారు. ఇచ్చిన హామీలపై కాంగ్రెస్ తప్పించుకోవాలని చూస్తోందని కడియం ఆగ్రహం వ్యక్తం చేశారు.

ప్రభుత్వం డిఫెన్స్‌లో పడింది: దానం



సాక్షి, హైదరాబాద్: 'శ్వేతపత్రాల పేరిట సభలో కాంగ్రెస్ పార్టీ కావాలని మరీ తిట్లు పడుతోంది. విపక్ష పార్టీలకు సమాధానం చెప్పలేక అసెంబ్లీలో ప్రభుత్వం డిఫెన్స్‌లో పడింది. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చడం ఆలస్యమవుతుండటంతో శ్వేతపత్రాలు తెరమీదకు తెస్తున్నారు. అప్పులు బయట పెడితే ప్రభుత్వానికి భవిష్యత్తులో ఇబ్బంది అవుతుంది'అని ఖైరతాబాద్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. శాసనసభ సమావేశాల సందర్భంగా గురువారం తనను కలిసిన మీడియా ప్రతినిధులతో ఆయన పిచ్చాపాటీగా మాట్లాడారు. 'కేటీ రామారావు, హరీశ్‌రావు లేవనెత్తుతున్న ప్రశ్నలకు మంత్రులు ఇస్తున్న సమాధానం దీటుగా లేవు. నీటిపారుదల శాఖపై చర్చ జరిగితే హరీశ్‌రావు ప్రభుత్వాన్ని ఉతికి ఆరేయడం ఖాయం. మంత్రులు అసలు విషయాలు చెప్పకుండా పైపై వ్యాఖ్యలకు పరిమితం అవుతున్నారు'అని దానం పేర్కొన్నారు. 'సీఎం పదవి రేవంత్‌కు చిరకాల వాంఛ, ఆయన ఆ పదవిని అంత తేలికగా వదులుకోరు. కాంగ్రెస్ సీనియర్ నేతలు రిటైర్ అవుతున్నారు. నేను సీఎం అవుతా అని రేవంత్ చెప్పారు'అని ఆయన అన్నారు.

నేడు ఇండియా కూటమి నిరసనలు

సాక్షి, హైదరాబాద్: పార్లమెంటు నుంచి ప్రతిపక్ష పార్టీలకు చెందిన ఎంపీలను సస్పెండ్ చేయడానికి నిరసనగా నేడు ఇండియా కూటమిలోని పార్టీలు నిరసనలు చేపట్టనున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా ఇండియా కూటమి పార్టీల ఆధ్వర్యంలో శుక్రవారం ఆందోళనలు చేపట్టనున్నట్టు టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్‌గౌడ్ గురువారం ఓ ప్రకటనలో వెల్లడించారు. కాంగ్రెస్‌తో పాటు ఇండియా కూటమిలోని పార్టీల నేతలు, కార్యకర్తల ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ధర్నా ఉంటుందని చెప్పారు. అదే విధంగా శుక్రవారం రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో పెద్ద ఎత్తున ధర్నాలు, నిరసన కార్యక్రమాలు చేపట్టాలని ఆయన పిలుపునిచ్చారు.

'ఉచిత విద్యుత్' అమలు ఎప్పటినుంచి?

ఆందోళనలు అణచివేసిన నైజం బీఆర్ఎస్‌ది: పాయల్ శంకర్



సాక్షి, హైదరాబాద్: ప్రజలకు 200 యూనిట్ల వరకూ ఉచిత విద్యుత్ పథకాన్ని ఎప్పటి నుంచి అమలు చేస్తారో చెప్పాలని బీజేపీ శాసనసభ్యుడు పాయల్ శంకర్ శాసనసభలో డిమాండ్ చేశారు. గురువారం విద్యుత్ రంగంలో శ్వేతపత్రంపై జరిగిన చర్చలో ఆయన పాల్గొన్నారు. విద్యుత్ రంగానికి ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తోందని, అయినా బీఆర్ఎస్ నేతలు నిందలు మోపడం సరికాదన్నారు. విద్యుత్ కోతలపై ప్రజలు ధర్నాలే చేయలేదని బీఆర్ఎస్ సమర్థించుకోవడంలో అర్థం లేదని, ధర్నా చౌక్ ఎత్తివేసి, ఆందోళనలను అణిచివేసిన నైజం ఆ పార్టీదని ఆయన ఎద్దేవా చేశారు. మోటర్లకు మీటర్లు పెట్టమని కేంద్రం ఏనాడూ చెప్పలేదన్నారు.

వేధింపులకు గురైన వారిని ఆదుకోవాలి: వంశీకృష్ణ

గత ప్రభుత్వ హయాంలో విద్యుత్ రంగంపై వాస్తవాలు మాట్లాడిన వ్యక్తులను వేధించారని, ప్రమోషన్లు ఇవ్వకుండా డీమోషన్ ఇచ్చారని కాంగ్రెస్ సభ్యుడు డాక్టర్ వంశీకృష్ణ ఆరోపించారు. అన్యాయానికి గురైన వాళ్లను ఆదుకోవాలని సర్కార్‌కు సూచించారు.

తబ్లిగీ జమాతే సమావేశాన్ని రద్దు చేయాలి: వీహెచ్‌పీ

సాక్షి, హైదరాబాద్: బలవంతపు మతమార్పిడి వంటి వాటితో సమాజంలో చిచ్చు పెట్టే తబ్లిగీ జమాతే సమావేశాన్ని వెంటనే రద్దు చేయాలని విశ్వహిందూ పరిషత్ (వీహెచ్‌పీ) డిమాండ్ చేసింది. దీనిపై పోలీస్ యంత్రాంగం వెంటనే స్పందించి సమావేశ అనుమతిని రద్దు చేయాలని సూచించింది. లేనిపక్షంలో వీహెచ్‌పీ, భజరంగ్ దళ్ ఆందోళన కార్య క్రమాలు చేపట్టి, ఈ సమావేశాన్ని అడ్డుకుంటామని వీహెచ్‌పీ నేతలు సురేందర్ రెడ్డి, పండరీనాథ్, పగుడాకుల బాలస్వామి, భజరంగ్ దళ్ రాష్ట్ర కన్వీనర్ శివ రాములు హెచ్చరించారు.



ఆదిలాబాద్ పట్టణంలోని టీటీడబ్ల్యూ ఆర్‌జేసీ బాలుర పాఠశాలలో చలి తీవ్రత తట్టుకోలేక చుట్టూ దుప్పట్లు కట్టుకొని నిద్రిస్తున్న విద్యార్థులు

'చలి'ంచిన ఏజెన్సీ

రికార్డుస్థాయిలో కనిష్ట ఉష్ణోగ్రతలు

తిర్యాణి(ఆసిఫాబాద్): కుమురంభీం జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాలు చలికి వణుకుతున్నాయి. రెండు రోజులుగా రికార్డు స్థాయిలో కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఏజెన్సీ మండలమైన సిర్పూర్(యూ)లో గురువారం రాష్ట్రంలోనే అత్యల్పంగా 6.6 డిగ్రీలు, తిర్యాణి మండలం గిన్నెధరిలో 7.3 డిగ్రీల సెల్సియస్ కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఉమ్మడి ఆదిలాబాద్‌లోని పలు ప్రాంతాల్లో రాత్రి ఉష్ణోగ్రతలు సున్నాకు పడిపోవడంతో ప్రజలు వణుకుతున్నారు.

రేవంత్ ✗ అక్బర్

▶ మొదటి పేజీ తరువాయి

భారీగా పెరిగింది. బీఆర్ఎస్ హయాంలో జెన్‌కో ఆస్తులు రూ. 12,783 కోట్ల నుంచి రూ. 40,454 కోట్లకు పెరిగాయి. పాతబస్తీలో ఇంకా 5 వేల స్తంభాలు, కొత్త కండక్టర్ (తీగ), ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుకు కొత్త ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి'అని కోరారు. దీనిపై మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ జోక్యం చేసుకుంటూ అక్బరుద్దీన్ గత పదేళ్ల కాలంలో ఆ పనులేవీ చేయించుకోలేక పోగా ఇప్పుడు ప్రశ్నించడం ఏమిటంటూ నిలదీశారు. దీనిపై అక్బరుద్దీన్ ఘాటుగా ప్రతిస్పందించారు. పెద్దలు మాట్లాడుకుంటుండగా చిన్న పిల్లాడిలా మాట్లాడొద్దని వ్యాఖ్యానించారు.

రేవంత్‌రెడ్డి జోక్యం...

అక్బరుద్దీన్ మాట్లాడుతుండగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జోక్యం చేసుకున్నారు. 'అక్బరుద్దీన్ సహచర ఎమ్మెల్యేలను గౌరవించాలి. సభలో ప్రస్తుతం 57 మంది కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలు ఉన్నారు. కవ్వంపల్లి సత్యనారాయణ దళితుడు. ఆయన మాట్లాడితే ఆగ్రహం వ్యక్తం చేయాలా? అధికారంలోకి రాగానే అక్బరుద్దీన్‌ను ప్రొటెం స్పీకర్‌ను చేశాం. ముస్లింల అభివృద్ధికి కాంగ్రెస్ కట్టుబడి ఉంది. అక్బరుద్దీన్ కేవలం ఎంఐఎం నేత మాత్రమే. ఆయన్ను మేం ముస్లిం ప్రతినిధిగా చూడట్లేదు. చాంద్రాయణగుట్టలో హిందువులు కూడా ఆయనకు ఓటు వేశారు. మాకు ఓల్డ్ సిటీ, న్యూ సిటీ అనే తేడాలేదు. బీఆర్ఎస్ దుర్మార్గాలు మిత్రపక్షమైన ఎంఐఎంకు కనిపించలేదా? గత ప్రభుత్వాన్ని అదే పనిగా ఎంఐఎం పొగుడుతుంటే వినేందుకు మేం సిద్ధంగా లేము. మైనారిటీల విషయంలో కాంగ్రెస్ చిత్తశుద్ధిని శంకించాల్సిన అవసరం లేదు'అని రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు.

మా ముస్లిం నేతలను ఓడించారు..

'అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్, మజ్లిస్ కలసి పనిచేశాయి. నిజామాబాద్ అర్బన్‌లో షబ్బీర్ అలీని, జూబ్లీహిల్స్‌లో అజాహరుద్దీన్‌ను ఓడించేందుకు కేసీఆర్‌తో కలసి మజ్లిస్ పనిచేసింది. అదే మజ్లిస్ పార్టీ సిరిసిల్ల, సిద్దిపేట, గజ్వేల్ నియోజకవర్గాలలో ఎందుకు పోటీ చేయలేదు? కాంగ్రెస్ పార్టీ మైనారిటీలను ముఖ్యమంత్రులుగా, రాష్ట్రపతులుగా చేసింది. మైనారిటీలకు 4 శాతం రిజర్వేషన్ ఇచ్చింది కాంగ్రెస్ ప్రభుత్వమే. అక్బరుద్దీన్.. కేసీఆర్‌కు మిత్రుడు కావొచ్చు. మోదీకి మద్దతివ్వవచ్చు.. అది వాళ్లిష్టం. మజ్లిస్, బీఆర్ఎస్ మిత్రపక్షాలు అని కేసీఆర్ పలుమార్లు చెప్పారు. మజ్లిస్ కేసీఆర్‌ను రక్షించేందుకు ప్రయత్నిస్తోంది'అని రేవంత్ వ్యాఖ్యానించారు.

విద్యుత్ బకాయిలు రాబడతారా?

'విద్యుత్ మొండి బకాయిల్లో సిద్దిపేట 61.37 శాతం, గజ్వేల్ 50.29 శాతం, హైదరాబాద్ సౌత్ 43 శాతంతో టాప్‌లో ఉన్నాయి. కేసీఆర్, హరీశ్‌రావు, అక్బరుద్దీన్ బాధ్యత తీసుకొని విద్యుత్ బకాయిలను క్లియర్ చేస్తారా?'అని రేవంత్ ప్రశ్నించారు. ఈ బిల్లులు వసూలు చేస్తే బకాయిల నుంచి బయటపడతామన్నారు. పాతబస్తీలో విద్యుత్ బకాయిల చెల్లింపులు జరిపే బాధ్యత తనదని అక్బరుద్దీన్ చెప్పడం లేదని రేవంత్ విమర్శలు గుప్పించారు. రేవంత్ మాట్లాడుతుండగా మజ్లిస్ సభ్యులు వెల్‌లోకి దూసుకెళ్లే ప్రయత్నం చేశారు.

వైఎస్సార్ వల్లే ముస్లింలకు 4% రిజర్వేషన్లు...

రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలపై అక్బరుద్దీన్ తీవ్రంగా స్పందించారు. 'మేము ఎవరికీ భయపడం. కిరణ్‌కుమార్‌రెడ్డి జైల్లో పెట్టినా భయపడలేదు. కాంగ్రెస్ మమ్మల్ని అణచివేసే ప్రయత్నం చేస్తోంది. వై.ఎస్. రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలోనే కాంగ్రెస్, ఎంఐఎం కలసి ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్లు తీసుకొచ్చాయి. వైఎస్సార్ నిజమైన జెంటిల్‌మన్... గొప్ప నాయకుడు. కాంగ్రెస్‌కు చెందిన అప్పటి ఢిల్లీ నేతలు ఢిల్లీ నుంచి హైదరాబాద్‌కు వచ్చిన మా నాన్నను కలిశారు. ఆ తర్వాతే కాంగ్రెస్ మేనిఫెస్టోలో రిజర్వేషన్ల అంశాన్ని చేర్చారు. కాంగ్రెస్, ఎంఐఎం కలసే అప్పుడు ఎన్నికలను ఎదుర్కొన్నాయి'అని పేర్కొన్నారు.

సీఎంకు చాలెంజ్..

షబ్బీర్ అలీని ఓడించేందుకు ప్రయత్నించామని రేవంత్ ఆరోపించారు. మేము నిజామాబాద్ అర్బన్‌లో పోటీ చేయలేదు. షబ్బీర్ అలీ ఓటమితో మాకేం సంబంధం? జూబ్లీహిల్స్‌లో మాకు కార్పొరేటర్ ఉన్నారు. బలమైన అభ్యర్థిని నిలిపాం. అంబేడ్కర్ వంటి మహానేతను కూడా ఓడించిన ఘనత కాంగ్రెస్‌దే. మమ్మల్ని బీజేపీ బీ–టీం అంటున్నారు. మేము బతికి ఉన్నంత వరకు బీజేపీతో కలసి పని చేయం. సీఎం రేవంత్‌కు చాలెంజ్'అంటూ కామెంట్స్ చేశారు. ఏబీవీపీ, బీజేపీ, టీఆర్ఎస్, టీడీపీ, కాంగ్రెస్‌లో రేవంత్‌రెడ్డి ఉన్నారని... అన్నిచోట్లా సీఎంకు అనుభవం ఉందని వ్యాఖ్యానించారు. అనంతరం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. అక్బరుద్దీన్ సభానాయకుడిని కించపర్చేలా ఇష్టం వచ్చినట్లు మాట్లాడటం సరికాదన్నారు. స్పీకర్ కూడా జోక్యం చేసుకొని సభానాయకుడు మాట్లాడుతున్నప్పుడు ఎవరూ మధ్యలో మాట్లాడవద్దన్నారు. ఈ దశలో మరోసారి జోక్యం చేసుకున్న సీఎం రేవంత్‌రెడ్డి 'నాదెండ్ల భాస్కర్‌రావు, ఎన్టీఆర్, చంద్రబాబు, వైఎస్ఆర్, కిరణ్‌కుమార్‌రెడ్డి, కేసీఆర్ హయాం వరకు ఎంఐఎం ఎవరెవరితో దోస్తీ చేసిందో అందరికీ తెలుసు. ఆ అంశంపై చర్చించాలంటే మరోసారి చర్చిద్దాం'అని పేర్కొన్నారు. దీనికి అక్బరుద్దీన్ బదులిస్తూ 'మేము ఎవరితో కలసి పనిచేసినా రాష్ట్ర అభివృద్ధి కోసమే. నిర్మాణాత్మక ప్రతిపక్షంగా ఉన్నాం'అని అన్నారు.

2 శ్వేతపత్రాల్లో వేర్వేరు అంకెలా?

సాక్షి, హైదరాబాద్: శాసనసభ ముందు ప్రభుత్వం ఉంచిన రెండు శ్వేతపత్రాల్లో విద్యుత్ పంపిణీ సంస్థల రుణాలను ఒకదాంట్లో (ఆర్థిక శాఖ) రూ.39,461 కోట్లని, మరో దాంట్లో (విద్యుత్ శాఖ) రూ. 35227 కోట్లని చూపడాన్ని ఎంఐఎం శాసనసభాపక్ష నేత అక్బరుద్దీన్ ఒవైసీ తప్పుబట్టారు. ఇది సభా హక్కుల ఉల్లంఘన కిందకు వస్తుందని పేర్కొన్నారు. వేర్వేరు అంకెలు ఇచ్చిన అధికారులపై చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో ప్రధాన ప్రతిపక్షంతో చర్చించి సభాహక్కుల తీర్మానం తీసుకొస్తామని హెచ్చరించారు. విద్యుత్‌పై గురువారం సభలో ప్రవేశపెట్టిన శ్వేతపత్రంపై స్వల్పకాలిక చర్చ సందర్భంగా ఆయన ఈ అంశాన్ని ప్రస్తావించారు. దీనిపై శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు స్పష్టత ఇచ్చారు. రెండు అంకెలూ సరైనవేనని... అందులో ఒకటి మార్చి 31 నాటి అంకె అని, రెండోది అక్టోబర్ 31 నాటిదన్నారు.

జవాబు చెప్పలేక బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు తెల్లమొహం వేశారు

శాసనసభ వ్యవహారాలశాఖ మంత్రి శ్రీధర్‌బాబు ఎద్దేవా



సాక్షి, హైదరాబాద్: పదేళ్ల పాలనలో అప్పులపై బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు జవాబు చెప్పలేక తెల్లమొహం వేశారని శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు ఎద్దేవా చేశారు. రేషన్‌బియ్యం పంపిణీ మొదలుకొని రైతులకు మద్దతు ధర, విద్యావ్యవస్థ వంటి వాటిపై సభలో సమాధానం చెప్పలేక నీళ్లు నమిలే పరిస్థితి ఏర్పడిందన్నారు. దళితులకు మూడు ఎకరాల భూమి పంపిణీ, ఎస్సీ, ఎస్టీలకు నిధుల కేటాయింపుపై సమాధానం చెప్పలేకపోయారన్నారు. గురువారం మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టో ప్రజలకు పూర్తిగా అందించాలనే ఉద్దేశంతో తాము రాష్ట్ర ఆర్థిక అంశాలు ప్రజల ముందు ఉంచామని తెలిపారు. గత పదేళ్లలో బీఆర్ఎస్ పాలన ఎలా సాగిందో అసెంబ్లీలో శ్వేతపత్రం విడుదల చేశామన్నారు. శాసనసభలో కాంగ్రెస్ ప్రభుత్వం విడుదల చేసిన శ్వేతపత్రాలు నిజమే అని తమ హయాంలో అప్పులు చేశామని, తాము ప్రభుత్వపరంగా చేసిన వ్యయం వల్ల ప్రయోజనాలు కలగలేదని వారు ఒప్పుకున్నారని చెప్పారు. గత ప్రభుత్వ పాలన కారణంగా రాష్ట్రంలోని ప్రతి యువకుడిపై రూ.7లక్షల అప్పు మోపారన్నారు. అంతకు ముందు కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అభివృద్ధికి అడుగులు వేస్తే, ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ హయాంలో పదేళ్ల పదవులు అనుభవించారని మండిపడ్డారు. ఆనాడు కాంగ్రెస్ ప్రభుత్వం ముందుచూపుతో విద్యుత్‌రంగంలో చర్యలు చేపట్టకపోతే ఆ తర్వాత బీఆర్ఎస్ ప్రభుత్వం 12 గంటల కరెంట్ ఇవ్వగలిగేది కాదన్నారు. అసెంబ్లీలో విడుదల చేసిన శ్వేతపత్రాల్లో లెక్కలు, తప్పులు అనేది అవాస్తవం...తేదీలు వెయ్యలేదు కాబట్టి కన్ఫ్యూజన్ ఏర్పడిందని ఆయన వివరణ ఇచ్చారు. అసెంబ్లీలో పెట్టిన ప్రతి లెక్క వాస్తవం కావాలంటే స్పీకర్ ఆదేశంతో ప్రతీ సభ్యుడికి ఆ వివరాలు అందజేస్తామన్నారు. శ్వేతపత్రం లెక్కలు ఎవ్వరినీ కించపరచడానికి కాదని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీలు, వ్యవసాయం, పరిశ్రమలు, డొమెస్టిక్ వినియోగదారులకు పూర్తి స్థాయిలో కరెంట్ ఇస్తామన్నారు. అప్పుడు టీఆర్ఎస్ సర్కార్ ఏర్పడిన 36 రోజులకు అసెంబ్లీ సమావేశాలు పెట్టి సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారని గుర్తుచేశారు. తాము మాత్రం కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన రెండో రోజే అసెంబ్లీని సమావేశపరిచామన్నారు.

ప్రాజెక్టుల సమాచారం పక్కాగా ఉండాలి దాచితే కఠిన చర్యలు

- సాగునీటి ప్రాజెక్టులపై శ్వేతపత్రం విషయంలో సీఎం రేవంత్ హెచ్చరిక

సాక్షి, హైదరాబాద్: సాగునీటి ప్రాజెక్టులపై త్వరలో రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయనున్న శ్వేతపత్రంలో ప్రాజెక్టులకు సంబంధించిన వివరాలు ప్రజలకు తెలియకుండా దాచిపెట్టే ప్రయత్నం చేయొద్దనీ, ఒకవేళ అలా చేస్తే కఠిన చర్యలు తప్పవని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హెచ్చరించారు. ప్రతి ప్రాజెక్టుకు సంబంధించిన మార్గదర్శకాలు, అన్ని గణాంకాలు శ్వేతపత్రంలో సంపూర్ణంగా ఉండాల్సిందేనని స్పష్టం చేశారు. గురువారం ఆయన తన నివాసంలో వ్యవసాయం, నీటిపారుదల శాఖలపై మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, ఉత్తమ్ కుమార్ రెడ్డితో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు.


ప్రజలకు వాస్తవాలు వివరించండి


ప్రతి నిర్ణయం పారదర్శకంగా ఉండాల్సిందేనన్న ఉద్దేశంతో ప్రతి అంశాన్ని ప్రజలకు విడమరచి చెబుతున్నామని సీఎం పేర్కొన్నారు. ఈ విషయంలో అధికారులు పూర్తి అప్రమత్తంగా ఉండి నిజాలను ప్రజలకు వివరించాలని ఆదేశించారు. 1956 నుంచి 2014 వరకు, 2014 నుంచి 2023 వరకు నిర్మించిన ప్రాజెక్టులు, వాటి నిర్మాణ వ్యయాలు, ప్రాజెక్టుల వారీగా సాగులోకి తెచ్చిన ఆయకట్టు వివరాలను సీఎం అధికారులను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రంలోని సాగు నీటి ప్రాజెక్టులకు సంబంధించి పూర్తి స్థాయి నివేదిక అందించాలని అధికారులను ఆదేశించారు. సమీక్షలో సీఎస్ కూడా పాల్గొన్నారు.

'ఖబడ్దార్'పై కలకలం

అసెంబ్లీలో ఇరుపక్షాల వాగ్వాదం

- కిరాయి ఇంట్లో ఉన్న జగదీశ్‌రెడ్డికి వేలకోట్లు ఎక్కడివన్న రాజగోపాల్ రెడ్డి
- ఈ వ్యాఖ్యలపై బీఆర్ఎస్ సభ్యుల అభ్యంతరం
- అధికార పక్షం వైపు వేలెత్తి చూపిన కౌశిక్ రెడ్డి
- పదేళ్లు భరించాం.. ఇంకా మాట్లాడితే ఊరుకోం.. ఖబడ్దార్' అంటూ రాజగోపాల్ రెడ్డి హెచ్చరిక... ఆ పదాన్ని రికార్డుల నుంచి తొలగించిన స్పీకర్





సాక్షి, హైదరాబాద్: విద్యుత్ రంగంపై ప్రభుత్వం విడుదల చేసిన శ్వేతపత్రంపై చర్చ గురువారం దారి తప్పింది. 'ఖబడ్దార్'అంటూ కాంగ్రెస్ సభ్యుడు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి చేసిన వ్యాఖ్య సభలో కలకలం సృష్టించింది. విపక్ష బీఆర్ఎస్ సభ్యులు అంతే దూకుడుతో రాజగోపాల్ రెడ్డి వ్యాఖ్యలపై విరుచుకుపడ్డారు. ఆ పార్టీ సభ్యుడు పాడి కౌశిక్‌రెడ్డి ఆవేశంతో ప్రతి సవాళ్లు విసరడం సభలో వేడిని మరింత పెంచింది. మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి ప్రసంగాన్నే లక్ష్యంగా చేసుకున్న కాంగ్రెస్ సభ్యుడు రాజగోపాల్ రెడ్డి వ్యంగ్యాస్త్రాలు సంధించారు. 'కిరోసిన్ దీపం కింద చదువుకున్న... కిరాయి ఇంట్లో ఉన్న మాజీ మంత్రి వేల కోట్లు ఎలా సంపాదించారు?'అని ప్రశ్నించారు. ప్రజల కోసమే తాను పార్టీ మారిన విషయాన్ని గుర్తు పెట్టుకోవాలన్నారు. కేసీఆర్‌కు జోకడం తప్ప, ఎదురు చెప్పలేని స్థితి మాజీ మంత్రిది అంటూ ఎద్దేవా చేశారు. ఈ వ్యాఖ్యలతో విపక్ష సభ్యులు మూకుమ్మడిగా లేచి అభ్యంతరం చెప్పారు. ప్రతిగా అధికార పక్ష సభ్యులూ లేవడంతో సభలో గందరగోళ పరిస్థితి నెలకొంది. బీఆర్ఎస్ సభ్యుడు పాడి కౌశిక్ రెడ్డి అధికార పక్షం వైపు వేలెత్తి చూపారు. పరస్పర వాగ్వాదం కొనసాగుతున్న తరుణంలోనే రాజగోపాల్‌రెడ్డి 'పదేళ్లు భరించాం.. ఇంకా నోటికొచ్చినట్టు మాట్లాడితే ఊరుకోం. ఖబడ్దార్'అంటూ చేసిన హెచ్చరిక సభా వాతావరణాన్ని మరింత వేడెక్కించింది.

కొత్త వాళ్లున్నారు... కాస్త జాగ్రత్త

వాగ్వాదాల మధ్య మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి జోక్యం చేసకుని 'ఈ సభలో కొత్త వాళ్లున్నారు. సభా మర్యాద కాపాడాలి. వాళ్లకు ఆదర్శంగా ఉండాలి. వ్యక్తిగత దూషణలు, తిట్టుకోవడం మంచిది కాదు'అంటూ సలహా ఇచ్చారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కూడా ఈ అభిప్రాయంతో ఏకీభవించారు. సభలో 'ఖబడ్దార్'అనే పదం వాడొచ్చా? అని బీఆర్ఎస్ సభ్యుడు జగదీశ్‌రెడ్డి ప్రశ్నించారు. దీనిపై రూలింగ్ ఇవ్వాలని స్పీకర్‌ను కోరారు. ఏం జరిగిందో పరిశీలిస్తానని, ఖబడ్దార్ అనే పదాన్ని రికార్డుల నుంచి తొలగిస్తానని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ తెలిపారు. ఆ తర్వాత సభ సర్దుమణిగింది. చర్చ కొనసాగుతుండగానే బీఆర్ఎస్ సభ్యులు సభలో లేకపోవడాన్ని గమనించిన మంత్రి జూపల్లి కృష్ణారావు ఈ అంశాన్ని ప్రస్తావించారు. అనంతరం కొద్ది సేపటికే బీఆర్ఎస్ సభ్యులు సభలోకి ప్రవేశించారు.

'సీడబ్ల్యూసీ'కి వెళ్లని సీఎం

- షెడ్యూల్ రెడీ చేసుకుని రద్దు చేసుకున్న రేవంత్‌రెడ్డి
- కేసీ వేణుగోపాల్‌కు ఫోన్‌లో వెల్లడించిన సీఎం
- సభలో సీరియస్‌నెస్ పోతుందనా..? వేరే కారణమా?



సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి హోదాలో కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) సమావేశానికి వెళ్లాల్సిన సీఎం రేవంత్‌రెడ్డి ఉన్నట్టుండి ఢిల్లీ పర్యటన రద్దు చేసుకోవడం చర్చనీయాంశమైంది. షెడ్యూల్ ప్రకారం గురువారం సాయంత్రం 3 గంటలకు సీడబ్ల్యూసీ సమావేశంలో పాల్గొనాల్సి ఉంది. గురువారం అసెంబ్లీలో విద్యుత్ రంగంపై శ్వేతపత్రం ప్రవేశపెట్టిన అనంతరం ఢిల్లీ వెళ్లేలా ఆయన ఏర్పాట్లు చేసుకున్నారు. ఈ కారణంగానే ఇదే రోజు జరగాల్సిన కలెక్టర్ల సదస్సు కూడా వాయిదా వేశారు. అందుకు అనుగుణంగా ఉదయం తన నివాసంలోనే సాగునీటి శాఖపై రివ్యూ చేశారు. కానీ, అసెంబ్లీకి వచ్చిన తర్వాత రేవంత్ షెడ్యూల్ మారిపోయింది. విద్యుత్‌పై చర్చ సందర్భంగా వాడీవేడిగా సభ సాగడంతో ఆయన అసెంబ్లీలోనే ఉండిపోయారు. ఒక దశలో సీఎం జోక్యం చేసుకొని విద్యుత్ ఒప్పందాలపై న్యాయ విచారణ చేస్తామని ప్రకటన కూడా చేశారు. ఈ ప్రకటన పూర్తయిన తర్వాత రేవంత్ ఢిల్లీ వెళతారనే చర్చ అసెంబ్లీ లాబీల్లో జరిగినా, సీఎం ఢిల్లీకి బయలుదేరలేదు. అసెంబ్లీ సమావేశాల కారణంగా తాను సీడబ్ల్యూసీకి రాలేనని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ.వేణుగోపాల్‌కు చెప్పి ఢిల్లీ పర్యటన విరమించుకున్నారని సమాచారం. అయితే సీడబ్ల్యూసీ సమావేశానికి ఎందుకు వెళ్లలేదన్న అంశం అటు ప్రభుత్వ వర్గాల్లోనూ, ఇటు రాజకీయ వర్గాల్లోనూ ఆసక్తికర చర్చకు దారితీసింది.

కారణమేంటి?

సీడబ్ల్యూసీ సమావేశానికి సీఎం రేవంత్‌రెడ్డి వెళ్లకపోవడానికి అసెంబ్లీ సమావేశాలు జరుగుతుండడమే కారణమని కాంగ్రెస్ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. బుధ, గురువారాల్లో రెండు కీలక అంశాలపై ప్రభుత్వం శ్వేతపత్రాలను ప్రవేశపెట్టిన నేపథ్యంలో సీఎం సభలో లేకుండా పార్టీ సమావేశానికి వెళితే ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేని కారణంగానే సీఎం సభలో లేకుండా వెళ్లిపోయారని ప్రతిపక్షాలు ఎత్తిపొడిచే అవకాశం వచ్చి ఉండేదని, దీనికి తోడు కీలక రంగాలపై చర్చ జరుగుతున్న సందర్భంగా సీఎం సభలో లేకపోతే అధికార పక్షానికి కూడా సమాధానం చెప్పుకునే అవకాశం లేకుండా పోతుందనే కారణంతోనే రేవంత్ ఢిల్లీ వెళ్లలేదని ప్రభుత్వ, పార్టీ వర్గాలంటున్నాయి. అయితే, కేవలం అసెంబ్లీ సమావేశాలే కాదని, మరో ముఖ్యమైన పనిలో ఉన్న కారణంగానే సీఎం ఢిల్లీ వెళ్లలేదనే చర్చ కూడా జరిగింది. గురువారం మధ్యాహ్నం సమయంలో మంత్రి ఉత్తమ్ కూడా రేవంత్‌రెడ్డితో చాలా సేపు అసెంబ్లీ లాబీల్లోని సీఎం చాంబర్‌లో ఉన్నారు. ఈ సందర్భంగా జరిగిన చర్చ తర్వాతే రేవంత్ తన టూర్ రద్దు చేసుకున్నారనే చర్చ కూడా జరిగింది.

రేపు టీపీసీసీ విస్తృత కార్యవర్గ సమావేశం

- హాజరు కానున్న సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి తదితరులు
- రానున్న లోక్‌సభ ఎన్నికలపై చర్చ.. పార్టీ మండలాధ్యక్షులతో భేటీ
- నామినేటెడ్ పోస్టులపై కాంగ్రెస్ నేతలకు తీపికబురు ప్రకటించనున్న సీఎం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటయిన తర్వాత తొలిసారి ఆ పార్టీ రాష్ట్ర స్థాయిలో విస్తృతస్థాయి సమావేశాన్ని నిర్వహించబోతోంది. ఈ నెల 23న ఉదయం 12 గంటలకు గాంధీభవన్‌లో టీపీసీసీ విస్తృత కార్యవర్గ సమావేశం జరగనుంది. సమావేశానికి టీపీసీసీ అధ్యక్షుడు, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో పాటు రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావ్ ఠాక్రే, రాష్ట్ర మంత్రులు, పీఏసీ సభ్యులు, టీపీసీసీ ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, డీసీసీ అధ్యక్షులు, అనుబంధ సంఘాల అధ్యక్షులు హాజరు కానున్నారు. అనంతరం మధ్యాహ్నం 3 గంటలకు ప్రకాశం హాల్‌లో రాష్ట్రంలోని అన్ని మండలాలల పార్టీ అధ్యక్షులు, అనుబంధ సంఘాల రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, డీసీసీ అధ్యక్షులు, అధికార ప్రతినిధులు హాజరు కానున్నారు. ఈ రెండు సమావేశాల్లో రాష్ట్రంలో పార్టీ బలోపేతంతో పాటు త్వరలో జరిగే పంచాయతీ ఎన్నికలకు సన్నద్ధత, సింగరేణి ఎన్నికలు, పార్లమెంటు ఎన్నికలు తదితర అంశాలపై చర్చ జరగనున్నట్టు సమాచారం. దీంతో పాటు పదేళ్లుగా అధికార పదవులు లేక వేయి కళ్లతో నామినేటెడ్ పదవుల కోసం ఎదురు చూస్తున్న రాష్ట్ర కాంగ్రెస్ నేతలకు ఈ సమావేశాల్లోనే సీఎం రేవంత్‌రెడ్డి తీపికబురు చెప్తారని, నామినేటెడ్ పోస్టుల భర్తీపై ఆయన స్పష్టమైన ప్రకటన చేస్తారని గాంధీభవన్ వర్గాలు చెబుతున్నాయి.

ముఖ్యమంత్రి ఓఎస్డీగా అజిత్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఓఎస్డీ (ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ)గా రక్షణశాఖ అధికారి బి.అజిత్‌రెడ్డి గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇండియన్ డిఫెన్స్ ఎస్టేట్స్ సర్వీస్‌కు చెందిన అజిత్‌రెడ్డి స్వస్థలం కొల్లాపూర్ సమీపంలోని ముత్తిరెడ్డిపల్లి. మద్రాస్ ఐఐటీలో చదివిన ఆయన 2012 సివిల్ సర్వీస్ బ్యాచ్‌కు ఎంపికై రక్షణశాఖలో ఉత్తరాఖండ్, తమిళనాడు, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లో వివిధ హోదాల్లో పనిచేశారు. 2020 జూలై నుంచి 2022 నవంబర్ వరకు సికింద్రాబాద్ కంటోన్మెంట్ సీఈఓగా కూడా పనిచేశారు. ఇదే సమయంలో కంటోన్మెంట్ బోర్డులో ప్రత్యేక ఆహ్వానితుడిగా ఉన్న స్థానిక ఎంపీ, ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పలుమార్లు బోర్డు సమావేశాలకు హాజరయ్యారు. బోర్డు పరిధిలోని సమస్యల పరిష్కారంలో ఇద్దరి మధ్య సాన్నిహిత్యం పెరిగింది. బొల్లారంలోని కంటోన్మెంట్ జనరల్ ఆసుపత్రి ఆధునీకరణ విషయంలో ఎంపీగా రేవంత్‌రెడ్డి పెద్ద మొత్తంలో ఎంపీ నిధులు కేటాయించడంతో పాటు దగ్గరుండి మరీ పనులు పర్యవేక్షించారు. 2022 నవంబర్లో అజిత్‌రెడ్డి బెంగళూరు డిఫెన్స్ ఎస్టేట్స్ ఆఫీసర్‌గా బదిలీపై వెళ్లారు. రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన వెంటనే అజిత్‌రెడ్డిని తన పేషీకి రావాల్సిందిగా ఆహ్వానించడంతో వెంటనే ఆయన రక్షణశాఖ ఉన్నతాధికారుల అనుమతితో డిప్యూటేషన్‌పై రాష్ట్ర ప్రభుత్వ సర్వీసులో చేరారు.

అసెంబ్లీలో అదే వేడి!

- విద్యుత్ రంగ శ్వేతపత్రంపై అధికార, ప్రతిపక్షాల మధ్య సై అంటే సై
- ఓవైపు భట్టి, రేవంత్, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి.. మరోవైపు జగదీశ్‌రెడ్డి, కేటీఆర్, అక్బరుద్దీన్..
- ఆరు రోజుల పాటు సాగిన సభ.. నిరవధిక వాయిదా వేస్తున్నట్టు స్పీకర్ ప్రకటన

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర విద్యుత్ రంగ (ఇంధన శాఖ) శ్వేతపత్రంపై శాసనసభలో గురువారం జరిగిన స్వల్పకాలిక చర్చ మళ్లీ వేడి పుట్టించింది. అధికార కాంగ్రెస్, విపక్ష పార్టీలు బీఆర్ఎస్, మజ్లిస్ మధ్య పరస్పర విమర్శలు, ఆరోపణలు, ప్రత్యారోపణలతో హోరెత్తింది. గురువారం ఉదయం 11 గంటలకు స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అధ్యక్షతన ప్రారంభమైన అసెంబ్లీ ఆరో రోజు సమావేశంలో 2014లో తెలంగాణ ఏర్పడిన నాటి నుంచి ఇప్పటి వరకు విద్యుత్ పరిస్థితిపై శ్వేతపత్రాన్ని డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క ప్రవేశపెట్టారు. ఇందులో భట్టి పేర్కొన్న పలు అంశాలను బీఆర్ఎస్ సభ్యుడు, మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి తప్పుపట్టారు. విద్యుత్ రంగంపై ఏ తరహా విచారణకైనా సిద్ధమని సవాల్ చేశారు. ఈ సమయంలో జగదీశ్‌రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. మరోవైపు జగదీశ్‌రెడ్డి సవాల్‌పై స్పందించిన సీఎం రేవంత్‌రెడ్డి ఒక విద్యుత్ ఒప్పందం, రెండు ప్రాజెక్టులపై న్యాయ విచారణకు ఆదేశిస్తున్నట్టు ప్రకటించారు. హైదరాబాద్ పాతబస్తీ సమస్యలపై ఎంఐఎం పక్షనేత అక్బరుద్దీన్ ప్రసంగిస్తున్న సమయంలో.. కాంగ్రెస్ సభ్యుడు కవ్వంపల్లి సత్యనారాయణ లేవనెత్తిన ప్రశ్న ఇరుపక్షాల మధ్య వాగ్వాదానికి దారితీసింది. సీఎం రేవంత్, అక్బరుద్దీన్ నడుమ విమర్శలు, సవాళ్ల పర్వం కొనసాగింది. మరోవైపు 55 ఏళ్ల చరిత్రలో విద్యుత్ రంగానికి కాంగ్రెస్ చేసిన నష్టానికి శ్వేతపత్రం అద్దం పట్టిందని మాజీ మంత్రి కేటీఆర్ విమర్శించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, అక్బరుద్దీన్ ఇలా ఎవరు మాట్లాడినా మంత్రులు నోటికొచ్చినట్టు మాట్లాడుతూ అవమానిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సుమారు ఎనిమిది గంటల పాటు జరిగిన స్వల్పకాలిక చర్చపై చివరిగా డిప్యూటీ సీఎం మల్లుభట్టి విక్రమార్క సమాధానం ఇచ్చారు. తర్వాత సభను నిరవధిక వాయిదా వేస్తున్నట్టు స్పీకర్ ప్రకటించారు.

ఆరు రోజులు.. రెండు స్వల్పకాలిక చర్చలు

ముగిసిన శాసనసభ తొలి విడత సమావేశాలు

సాక్షి, హైదరాబాద్: శాసనసభ తొలి విడత సమావేశాలు గురువారంతో ముగిశాయి. ఈ నెల 9న ప్రారంభమైన అసెంబ్లీ సమావేశాలను నిరవధికంగా వాయిదా వేస్తున్నట్టు స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ ఇంధన రంగంపై జరిగిన స్వల్పకాలిక చర్చ అనంతరం ప్రకటించారు. డిసెంబర్ ఏడో తేదీన కొత్త ప్రభుత్వం కొలువుదీరగా, ఈ నెల 9న ఉదయం 11 గంటలకు ప్రొటెం స్పీకర్ అక్బరుద్దీన్ ఒవైసీ అధ్యక్షతన ప్రారంభమైన అసెంబ్లీ సమావేశంలో తొలిరోజు కొత్తగా ఎన్నికైనవారు శాసనసభ్యులుగా ప్రమాణస్వీకారం చేశారు. 11న స్పీకర్ ఎన్నికకు నోటిఫికేషన్, 13న నామినేషన్ల స్వీకరణ, కాంగ్రెస్ పార్టీ నుంచి ఒకే నామినేషన్ దాఖలు కావడంతో స్పీకర్ ఎన్నిక ఏకగ్రీవమైంది. 14న నూతన స్పీకర్‌గా గడ్డం ప్రసాద్‌కుమార్ బాధ్యతలు స్వీకరించారు. 15న శాసనసభ, శాసనమండలి సంయుక్త సమావేశాన్ని ఉద్దేశించి గవర్నర్ తమిళిసై ప్రసంగించారు. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చించేందుకు 16న శాసనసభ, మండలి వేర్వేరుగా సమావేశమై చర్చ అనంతరం ఆమోదం తెలిపాయి. ధన్యవాద తీర్మాన ఆమోదం అనంతరం శాసనమండలిని చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి నిరవధికంగా వాయిదా వేశారు. శాసనసభను మాత్రం 20వ తేదీకి వాయిదా వేస్తున్నట్టు స్పీకర్ ప్రకటించారు. 20న రాష్ట్ర ఆర్థిక స్థితిగతులపై, 21న ఇంధన రంగంపై శాసనసభలో స్వల్పకాలిక చర్చ తీవ్ర వాగ్వాదం నడుమ సాగింది.

26 గంటల 33 నిమిషాలు

ఆరురోజుల్లో శాసనసభ మొత్తంగా 26 గంటల 33 నిమిషాల పాటు సమావేశమైంది. 19 మంది సభ్యులు చర్చలో పాల్గొనగా, రెండు అంశాలపై స్వల్పకాలిక చర్చ జరిగింది. తుంటి ఎముక శస్త్ర చికిత్స అనంతరం కోలుకుంటున్న మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మినహా మిగతా 118 మంది శాసనసభ్యులుగా ప్రమాణ స్వీకారం చేశారు.

క్లుప్తంగా...

సమస్యలు పరిష్కరించండి

ఎల్ఐసీ ఉద్యోగుల ఆందోళన



సాక్షి,హైదరాబాద్: ఉద్యోగుల వేతన సవరణకు సంబంధించిన సంప్రదింపులు వెంటనే మొదలు పెట్టాలని, నూతన పింఛను విధానంలో ప్రస్తుతమున్న 10% ఉన్న మేనేజ్‌మెంట్ కాంట్రిబ్యూషన్ 14 శాతానికి పెంచాలని ఎల్ఐసీ ఉద్యోగులు డిమాండ్ చేశారు. నగరంలోని ఎల్ఐసీ సిటీ బ్రాంచ్ వద్ద భోజన విరామ సమయంలో ఫెడరేషన్ ఆఫ్ ఎల్ఐసీ క్లాస్ వన్ ఆఫీసర్స్ అసోసియేషన్, ఎన్ఎఫ్ఐఎఫ్ డబ్ల్యూఐ (డెవలప్‌మెంట్ ఆఫీసర్ల సంఘం), ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్, ఎల్ఐసీ ఎంప్లాయీస్ ఫెడరేషన్‌ల ఆధ్వర్యంలో ఎల్ఐసీ ఉద్యోగులు, సిబ్బంది ఆందోళన నిర్వహించారు. గంటకు పైగా నిర్వహించిన ధర్నాలో అధికారుల సమస్యలపై యాజమాన్యం నిర్ణయాలను వ్యతిరేకిస్తూ నినాదాలు చేశారు. ఎల్ఐసీలోని అన్ని కేడర్లలో తగినన్ని నియామకాలు వెంటనే చేపట్టాలని కోరారు. ఈ ఆందోళన కార్యక్రమానికి అసోసియేషన్ రాష్ట్ర ,జిల్లా నాయకులు తిరుపతయ్య, వీరగోని రమేశ్‌గౌడ్, వెంకటేశ్వర్‌రావు,చంద్రప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగ భృతి చెల్లించండి



కాంగ్రెస్ మేనిఫెస్టో ప్రతులతో నిరుద్యోగ జేఏసీ నేతలు

ఉస్మానియా యూనివర్సిటీ: నిరుద్యోగ భృతి చెల్లించాలని తెలంగాణ నిరుద్యోగ జేఏసీ చైర్మన్ కోటూరి మానవతరాయ్ డిమాండ్ చేశారు. గురువారం ఆర్ట్స్ కాలేజీ ఎదుట గత అసెంబ్లీ ఎన్నికల్లో విడుదల చేసిన కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోను దహనం చేశారు. అనంతరం రాయ్ మాట్లాడుతూ ఎన్నికల ముందు నిరుద్యోగ భృతి నెలకు రూ.4,000 చెల్లిస్తామని మేనిఫెస్టోలో పేర్కొని అసెంబ్లీ సమావేశాల్లో డిప్యూటీ సీఎం నిరుద్యోగ భృతి గురించి చెప్పలేదని పేర్కొనడం దారుణమన్నారు.

వేములవాడ గౌడ సత్రం నిర్మాణానికి

రూ.30 లక్షల విరాళం



మంత్రి పొన్నంతో రూ. 11 లక్షల డీడీని అందజేస్తున్న బాలరాజ్ గౌడ్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం (హైదరాబాద్): వేములవాడ గౌడ సత్రం నిర్మాణానికి తెలంగాణ గౌడ సంఘాల సమన్వయ కమిటీ రూ.30 లక్షల విరాళాన్ని ప్రకటించింది. ఆ మొత్తంలో తొలివిడతగా గురువారం రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి, శ్రీ రాజరాజేశ్వరి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ పొన్నం ప్రభాకర్‌గౌడ్‌తో గౌడ సత్రం నిర్మాణ పర్యవేక్షకుడు పుంజాల హరిచరణ్‌గౌడ్‌కు గౌడ సంఘాల సమన్వయ కమిటీ చైర్మన్ బాలగోనీ బాలరాజ్‌గౌడ్ రూ.11 లక్షలను డీడీ రూపంలో అందజేశారు. కార్యక్రమంలో ఉమ్మడి ఏపీ మాజీ మంత్రి పితాని సత్యనారాయణ పాల్గొన్నారు.

'ఉద్యమ జర్నలిస్టుల వేదిక దిక్సూచిగా మారాలి'

హిమాయత్‌నగర్ (హైదరాబాద్): తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న జర్నలిస్టుల కోసం దశాబ్దకాలం తర్వాత ఓ వేదిక రూపొందడం చారిత్రక అవసరమని, ఈ వేదిక తెలంగాణ స్ఫూర్తిని చాటడంతోపాటు భవిష్యత్ తరాలకు ఓ దిక్సూచిగా మారాలని పలువురు వక్తలు ఆకాంక్షించారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న జర్నలిస్టులను ఏకతాటిపైకి తీసుకొచ్చే లక్ష్యంతో 'తెలంగాణ ఉద్యమ జర్నలిస్టుల కార్యాచరణ సమావేశం' పేరిట హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో గురువారం ఒక కార్యక్రమం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి, టీజేఎస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం తదితరులు హాజరయ్యారు.

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల హామీకి కట్టుబడి ఉన్నాం

టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు మల్లు రవి

గన్‌ఫౌండ్రీ (హైదరాబాద్): జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇచ్చింది.. రేపు ఇవ్వబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు మల్లు రవి అన్నారు. జవహర్‌లాల్ నెహ్రూ జర్నలిస్టు హౌసింగ్ సొసైటీ స్థలంపై సుప్రీం తీర్పును అమలు చేస్తామని ప్రభుత్వం తరపున ఆయన హామీ ఇచ్చారు. గురువారం రవీంద్రభారతిలో టీమ్ జేఎస్‌జే ఆధ్వర్యంలో జవహర్‌లాల్ నెహ్రూ జర్నలిస్టు మాక్ హౌసింగ్ సొసైటీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జర్నలిస్టుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు.

చదువే ఆయుధం

- పేదరికంపై ఎక్కుపెట్టి ఎదిరిద్దాం: చింతపల్లి సభలో ఏపీ సీఎం జగన్
- 55 నెలలుగా ప్రతి అడుగూ విప్లవాత్మక మార్పు దిశగానే
- విద్యారంగంలో సమున్నత మార్పులు తెచ్చాం
- ట్యాబ్‌లలో చదువు అంశాలే.. తల్లిదండ్రులు ఆందోళన చెందొద్దు
- అల్లూరి జిల్లా చింతపల్లిలో ట్యాబ్‌ల పంపిణీని ప్రారంభించిన సీఎం
- రూ.620 కోట్లతో 4,34,185 మందికి బైజూస్ కంటెంట్‌తో ఉచితంగా ట్యాబ్‌లు
- పిల్లల సమక్షంలోనే పుట్టినరోజు వేడుకలు.. కేక్ కోసి తినిపించిన ఏపీ సీఎం జగన్



అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లిలో నిర్వహించిన ట్యాబ్‌ల పంపిణీ కార్యక్రమంలో విద్యార్థులతో కలిసి కేక్ కట్ చేస్తున్న ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం: పేద కుటుంబాలకు చెందిన పిల్లల చదువుల పట్ల దేశ చరిత్రలో ఏ ప్రభుత్వమూ తీసుకోనంత శ్రద్ధ వహిస్తూ తరతరాల తలరాతలను మారుస్తున్న మనందరి ప్రభుత్వంపై కొందరు పెత్తందారులు దుర్బుద్ధితో, దురుద్దేశాలతో బురద చల్లుతున్నారని ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మండిపడ్డారు. పేదరికం నుంచి ప్రజలను బయటకు తీసుకురావాలని మీ జగన్ ఆరాట పడుతుంటే దిక్కుమాలిన రాజకీయాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఇవ్వాలని విప్లవాత్మక సంస్కరణలు చేపడితే విష ప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. తప్పుడు రాతలతో పేద విద్యార్థులపై విషం కక్కొద్దని సూచించారు. పిల్లలు మరింత మెరుగ్గా పాఠ్యాంశాలను అవగాహన చేసుకునేలా ట్యాబ్‌లు అందిస్తుంటే వారిని చెడగొడుతున్నారంటూ, పాడు చేస్తున్నారంటూ దుర్మార్గమైన కథనాలు ప్రచురిస్తున్నారని, మరి మీ పిల్లలు, మనవళ్ల చేతిలో ట్యాబ్‌లు, ల్యాప్‌టాప్‌లు ఉండవచ్చా? అని పెత్తందారులను నిలదీశారు. అసలు అది పేపరా?.. పేపర్‌కు పట్టిన పీడా? అని తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ప్రభుత్వ స్కూళ్లను ఇంగ్లిషు మీడియం, ఇంగ్లిషు ల్యాబ్‌లు, ఐఎఫ్‌పీలు, డిజిటల్ బోధనతో తీర్చిదిద్ది బైజూస్ కంటెంట్‌తో ఖరీదైన ట్యాబ్‌లను పిల్లలకు ఉచితంగా అందిస్తున్నామని, ప్రాథమిక స్థాయి నుంచి టోఫెల్ శిక్షణతోపాటు సీబీఎస్ఈ నుంచి ఐబీ దాకా అడుగులు వేయడంతో ఇప్పుడు ప్రైవేట్ స్కూళ్లు ప్రభుత్వ పాఠశాలలతో పోటీ పడాల్సిన పరిస్థితి కల్పించామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే 8వ తరగతి విద్యార్థులకు వరుసగా రెండో ఏడాది ట్యాబ్‌లు పంపిణీ కార్యక్రమాన్ని గురువారం అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి నుంచి ముఖ్యమంత్రి జగన్ ప్రారంభించారు. ఆశ్రమ పాఠశాలలో డిజిటల్ లెర్నింగ్ స్టాల్‌ని పరిశీలించి విద్యార్థులతో కలసి క్లాస్ రూమ్‌లో కూర్చొని ఆప్యాయంగా ముచ్చటించారు. క్లాస్‌లు ఎలా జరుగుతున్నాయి? భోజనం ఎలా ఉంది? చదువులు బాగా చెబుతున్నారా చిన్నా? అంటూ విద్యార్థులను ఆరా తీశారు. అనంతరం చింతపల్లి మైదానంలో సభా వేదిక వద్దకు చేరుకుని బైజూస్ ప్రీలోడెడ్ కంటెంట్ ట్యాబ్స్ రాష్ట్రవ్యాప్తంగా 9,424 ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందించే కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించి మాట్లాడారు. ఆ వివరాలివీ..

పేద బిడ్డల బంగారు భవిష్యత్ కోసం..

రాష్ట్రంలోని పిల్లలే మన భవిష్యత్తు, మన వెలుగులు. మన తర్వాత, మనం వెళ్లిపోయిన తర్వాత కూడా రాష్ట్ర భవిష్యత్తును నిలిపే వారసులు వారంతా. వరుసగా రెండో ఏడాది ఎనిమిదో తరగతి పిల్లలకు ట్యాబ్‌లిచ్చే కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నాం. రూ.620 కోట్లు ఖర్చు చేస్తూ 4,34,185 మంది పిల్లల చేతుల్లో ట్యాబ్‌లు పెడుతున్నాం. ట్యాబ్‌ల్లో ఏమైనా సాంకేతిక సమస్యలు తలెత్తినా ఆందోళన చెందొద్దు. వాటిని హెడ్ మాస్టార్‌కు లేదా గ్రామ సచివాలయంలో అందచేస్తే రసీదు ఇచ్చి మరమ్మతులకు పంపిస్తారు. వారం రోజుల్లోనే ట్యాబ్ రిపేరు చేసి ఇస్తారు. లేదంటే మరో ట్యాబ్ మీ చేతిలో పెడతారు. వాటిలో సెక్యూర్డ్ మొబైల్ డివైస్ మేనేజ్‌మెంట్ సాఫ్ట్‌వేర్ లోడ్ చేయడం వల్ల పిల్లలు పాఠాలు, బోధనకు సంబంధించిన అంశాలను మాత్రమే చూడగలుగుతారు. పిల్లలు ఏం చూశారు? ఏం చదివారు? అన్నది టీచర్లకు, తల్లిదండ్రులకు ఈ సాఫ్ట్‌వేర్ ద్వారా తెలుస్తుంది కాబట్టి ఎలాంటి ఆందోళన అవసరం లేదు.

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

విద్యార్థుల సమక్షంలో బర్త్‌డే

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన పుట్టినరోజు వేడుకలను విద్యార్థుల సమక్షంలో నిర్వహించారు. విద్యార్థుల నడుమ భారీ కేక్ కట్ చేసి వారికి తినిపించారు. హ్యాపీ బర్త్‌డే మామయ్యా అంటూ విద్యార్థులు ఆయనకు ఆప్యాయంగా కేక్ తినిపించారు. పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు సీఎం జగన్‌కు బర్త్‌డే శుభాకాంక్షలు తెలిపారు.

సీఎం జగన్‌కు ప్రధాని మోదీ జన్మదిన శుభాకాంక్షలు



సాక్షి, న్యూఢిల్లీ: ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రధానమంత్రి నరేంద్రమోదీ గురువారం జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. 'ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు. ఆయన ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని కోరుకుంటున్నా'అని ప్రధాని మోదీ ట్వీట్ చేశారు. అనంతరం ప్రధాని మోదీకి సీఎం జగన్ ధన్యవాదాలు తెలిపారు.

ఉచితంగా రూ.33 వేల ట్యాబ్, కంటెంట్..

ఒక్కో పిల్లాడి చేతిలో పెడుతున్న ఈ ట్యాబ్ మార్కెట్ విలువ రూ.17,500. దీనికి తోడు బైజూస్ కంటెంట్ ఇస్తున్నాం. రూ.33 వేలు విలువ చేసే ట్యాబ్, కంటెంట్ ఉచితంగా ఇస్తున్నాం. శ్రీమంతుల పిల్లలు బైజూస్ కంటెంట్ కొనుగోలు చేసి డౌన్‌లోడ్ చేసుకోవాలంటే రూ.15 వేలు చెల్లించాలి. మన పిల్లలు దేశంలోనే కాదు ప్రపంచంలోనే నెంబర్‌వన్‌గా నిలవాలన్న తలంపుతో ఇంత ఖర్చు పెడుతున్నాం.



ఏపీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా కేపీహెచ్‌బీ రమ్యా గ్రౌండ్స్ వద్ద కేక్ కట్ చేసి సంబరాల్లో పాల్గొన్న సాక్షి డైరెక్టర్ ఈశ్వరప్రసాద్ రెడ్డి, బండి మధుసూధన్ రెడ్డి తదితరులు

ఘనంగా ఏపీ సీఎం వైఎస్ జగన్ జన్మదిన వేడుకలు

ఎక్కడికక్కడ విస్తృతంగా సేవా కార్యక్రమాలు

కూకట్‌పల్లి, మూసాపేట: ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి ప్రదాత, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలను గురువారం కూకట్‌పల్లి నియోజకవర్గంలో ఘనంగా నిర్వహించారు. కూకట్‌పల్లి, బాలాజీనగర్, కేపీహెచ్‌బీ, మూసాపేట, మోతీనగర్, బాలానగర్, ఫతేనగర్ తదితర ప్రాంతాల్లో జగన్ మోహన్ రెడ్డి అభిమానులు భారీ ర్యాలీలు చేపట్టారు. బాలాజీనగర్‌లోని విజయదుర్గ టిఫిన్ సెంటర్‌వద్ద భారీ కేక్ కట్ చేశారు. తొలుత దివంగత సీఎం డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కేపీహెచ్‌బీ కాలనీలోని రమ్యాగ్రౌండ్స్ వరకు బైక్‌ర్యాలీ నిర్వహించారు. అనంతరం రమ్యాగ్రౌండ్స్‌లో తలసేమియా వ్యాధిగ్రస్తుల కోసం వైఎస్ఆర్‌సీపీ ఐటీ విభాగం ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో సంక్షేమ పథకాల విప్లవాన్ని జగన్‌మోహన్ రెడ్డి తీసుకొచ్చారని ప్రశంసించారు. రానున్న ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్‌లో వైయస్ జగన్ విజయం కోసం కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సాక్షి ఫైనాన్షియల్ డైరెక్టర్ వై.వి.ఈశ్వర ప్రసాద్ రెడ్డి, సినీ నటుడు కృష్ణుడు తదితరులు పాల్గొన్నారు. భరత్‌నగర్ కాలనీ పోచమ్మ గ్రౌండ్‌లో ఏపీ సీఎం వైఎస్ జగన్ అభిమానులు ఆయన జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు.

ట్రెండింగ్‌లో దుమ్ము రేపిన సీఎం బర్త్‌డే విషెస్

సాక్షి, అమరావతి: ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చరిష్మా ఏపాటిదో గురువారం మరోసారి ప్రపంచానికి తెలిసింది. సీఎం పుట్టిన రోజు సందర్భంగా సామాజిక మాధ్యమాల వేదికగా అభినందల వెల్లువతో రికార్డులు సృష్టించింది. హెచ్‌బీడీ వైఎస్ జగన్ పేరుతో ఏర్పాటు చేసిన హ్యాష్ ట్యాగ్ ద్వారా ఎక్స్ వేదికగా 3.50 లక్షల మందికి పైగా శుభాకాంక్షలు తెలుపడం ద్వారా ఇండియా ట్రెండింగ్‌లో మొదటి స్థానంలో నిలిచింది. ప్రపంచ వ్యాప్తంగా జగన్ పుట్టిన రోజు సందేశం 18.1 కోట్ల మందికి చేరినట్లు ఎక్స్ గణాంకాలు పేర్కొంటున్నాయి. అమెరికా, బ్రిటన్, ఆస్ట్రేలియా వంటి దేశాల నుంచి పోస్టులు వెల్లువెత్తాయి.

టీడీపీలో కలిపెయ్

బాబును నమ్మినప్పుడు జనసేన ఎందుకు?: సజ్జల



సాక్షి, అమరావతి: చంద్రబాబు నాయకత్వంపై పవన్‌కు అంత నమ్మకం ఉన్నప్పుడు ఇక ప్రత్యేకంగా జనసేన పార్టీ ఎందుకు? అని వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి, ఏపీ ప్రభుత్వ సలహాదారు (ప్రజా వ్యవహారాలు) సజ్జల రామకృష్ణారెడ్డి సూటిగా ప్రశ్నించారు. పవన్ తన పార్టీని టీడీపీలో కలిపేసి ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్ష పదవిని తీసుకోవాలని సూచించారు. గురువారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో సజ్జల మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. 'చంద్రబాబుతో ఏ అంశంపై అవగాహన లోపంతో 2019 ఎన్నికల్లో పవన్ విడిగా పోటీ చేశారు? ఇప్పుడు దేనిపై అవగాహన కుదిరిందని పొత్తు పెట్టుకున్నారో చెప్పాలి'అని పేర్కొన్నారు. చంద్రబాబునో లేదంటే లోకేష్‌నో ముఖ్యమంత్రిని చేస్తానంటే ఇప్పుడు నీ వెనుక ఉన్న వారంతా నీ వెంట నడుస్తారా? అని పవన్‌ను ప్రశ్నించారు. ప్రజా స్పందనే లేకుండా మార్నింగ్ వాక్, ఈవెనింగ్ వాక్‌లా సాగిన లోకేష్ పాదయాత్ర ముగింపును విజయోత్సవ సభలా నిర్వహించడం విడ్డూరంగా ఉందన్నారు. పార్టీ నేతలు, కార్యకర్తలను కాపాడుకునేందుకే ఇంటికి వెళ్లి మరీ పవన్‌ను చంద్రబాబు ఆహ్వానించారని చెప్పారు. సభా వేదికపై ఉన్న చంద్రబాబు, పవన్ కళ్యాణ్, లోకేష్, బాలకృష్ణ తదితరులందరిలోనూ సీఎం జగన్‌ను ఎదుర్కోలేమనే భయం స్పష్టంగా కనిపించిందని తెలిపారు. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు మీరిద్దరూ ఏం చేశారని ప్రజలు ఓట్లేస్తారని చంద్రబాబు, పవన్‌ను నిలదీశారు.

జీవో 46పై సీఎంకు ఉమ్మడి నల్లగొండ జిల్లా ఎమ్మెల్యేల విజ్ఞప్తి



సాక్షి, హైదరాబాద్: పోలీస్ ఉద్యోగాల భర్తీలో జీవో నెంబర్ 46పై మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉమ్మడి నల్లగొండ జిల్లా ఎమ్మెల్యేలు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఈ జీవో నుంచి కోడ్ నెంబర్ 24 టీఎస్ఎస్‌పీ (5000) మినహాయించాలని వారు కోరారు. గురువారం అసెంబ్లీలోని ముఖ్యమంత్రి ఛాంబర్‌లో సీఎంను కలిసి స్థానిక నిరుద్యోగుల ఇబ్బందులను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. సీడీ 1, సీడీ 2 ప్రకారం ఫలితాలు ప్రకటించి మెరిట్ విద్యార్థులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఇందులోని తప్పుడు ప్రశ్నలను తొలగించి మళ్లీ ఫలితాలు ఇవ్వాలన్న హైకోర్టు తీర్పును అమలు జరిగేలా చూడాలని కోరారు. పలు జిల్లాల్లో మిగిలిపోయిన ఖాళీలను భర్తీ చేసి నిరుద్యోగులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఉమ్మడి జిల్లాల్లోని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు సంతకం చేసిన లేఖను ముఖ్యమంత్రికి అందించారు. సీఎంను కలిసిన వారిలో ఎమ్మెల్యేలు కుందూరు జైవీర్‌రెడ్డి, పద్మావతి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, బాలు నాయక్, కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, బీర్ల ఐలయ్య, మందుల సామ్యూల్, బత్తుల లక్ష్మారెడ్డి ఉన్నారు.

కేసీఆర్‌పై ఈపీని కొట్టివేసిన హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావుపై 2019లో దాఖలైన ఎన్నికల పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసింది. 2018లో గజ్వేల్ నుంచి పోటీ చేసిన కేసీఆర్ 1,25,444 ఓట్లతో విజయం సాధించారు. అయితే ఆయన తన ఎన్నికల అఫిడవిట్లో అనేక వాస్తవాలను దాచారని, కేసుల వివరాలన్నీ పొందుపర్చలేదని, అందువల్ల ఆయన ఎన్నిక రద్దు చేయాలని కోరుతూ సిద్దిపేట జిల్లా మామిడ్యాలకు చెందిన టి.శ్రీనివాస్ 2019లో హైకోర్టులో ఎన్నికల పిటిషన్ దాఖలు చేశారు. ప్రజాప్రాతినిధ్య చట్టంలోని నిబంధనలకు లోబడి కేసీఆర్ నామినేషన్ దాఖలు చేయలేదని, ఆయనపై మొత్తం 64 కేసులుంటే, 2 కేసుల గురించే అఫిడవిట్‌లో ప్రస్తావించారని ఆయన పేర్కొన్నారు. దీనిపై విచారణ చేపట్టిన జస్టిస్ విజయ్‌సేన్‌రెడ్డి ధర్మాసనం గురువారం తీర్పు వెలువరించింది. 2018లో జరిగిన ఎన్నికల కాల పరిమితి ముగిసినందున, ఇప్పుడు ఈ పిటిషన్‌లో విచారణ అవసరం లేదంటూ పిటిషన్‌ను కొట్టివేసింది.

28న బీజేపీ లోక్‌సభ ఎన్నికల సన్నాహక సమావేశం

అమిత్ షా లేదా నడ్డా పాల్గొనే అవకాశం

సాక్షి, హైదరాబాద్: ఈ నెల 28న లోక్‌సభ ఎన్నికల సన్నాహక సమావేశానికి బీజేపీ సిద్ధమైంది. ఈ భేటీకి మండల పార్టీ అధ్యక్షుల స్థాయి నుంచి రాష్ట్రస్థాయి నేతల వరకు ఆహ్వానాలు పంపినట్టు సమాచారం. వచ్చే లోక్‌సభ ఎన్నికలకు పార్టీని సిద్ధం చేసేందుకు, శ్రేణులకు దిశానిర్దేశం చేసేందుకు ఉద్దేశించిన ఈ సమావేశానికి బీజేపీ అగ్రనేత అమిత్‌షా లేదా పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా పాల్గొనే అవకాశాలున్నాయి. శనివారం ఢిల్లీలో జరగనున్న పార్టీ జాతీయ పదాధికారుల సమావేశంలో...లోక్‌సభ ఎన్నికలకు సంబంధించిన తయారీ, రాష్ట్రాల వారీగా చేపట్టాల్సిన కార్యాచరణపై చర్చించనున్నట్టు తెలుస్తోంది. ఈ సమావేశంలో రాష్ట్రం నుంచి ముఖ్యనేతలు డా.కె.లక్ష్మణ్, బండి సంజయ్, డీకే అరుణ, మురళీధర్‌రావు, పొంగులేటి సుధాకరరెడ్డితో పాటు కేంద్రమంత్రి, రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి కూడా పాల్గొంటున్నారు. రాష్ట్రానికి అమిత్‌షా, నడ్డాలలో ఎవరు వస్తారనే దానిపై పదాధికారుల భేటీలో స్పష్టత వస్తుందని చెబుతున్నారు.



హైదరాబాద్ నాలెడ్జిసిటీలోని టీహబ్‌లో నిర్వహించిన ఆటా, సీఐఐ బిజినెస్ సెమినార్‌లో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

పెట్టుబడులతో వచ్చే కంపెనీలను ఎర్రతివాచీతో స్వాగతిస్తాం

మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

- 'టీహబ్'లో ఆటా, సీఐఐ ఆధ్వర్యలో బిజినెస్ సెమినార్

రాయదుర్గం: తెలంగాణలో పెట్టుబడులు పెట్టడానికి వచ్చే కంపెనీలకు అన్ని విధాలా సహకరిస్తామని నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని 'టీహబ్'లో ఆటా, సీఐఐ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన బిజినెస్ సెమినార్ కార్యక్రమంలో ఆయన హైదరాబాద్‌లో అమెరికా కాన్సుల్ జనరల్ జెన్నీఫర్ లార్సన్‌తో కలసి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. పెట్టుబడులు పెట్టడానికి వచ్చే కంపెనీలకు తమ ప్రభుత్వం ఎర్రతివాచీ పరిచి స్వాగతం పలుకుతుందన్నారు. ఆటాతో తనకు మంచి అనుబంధం ఉందని పేర్కొన్నారు. జెన్నీఫర్ లార్సన్ మాట్లాడుతూ అమెరికాలో తెలుగు వారు అధికంగా ఉన్నారని, వారికి ప్రాతినిధ్యం వహిస్తున్న ఆటా కార్యక్రమానికి రావడం ఆనందంగా ఉందని అన్నారు. అమెరికాలో తెలుగు వారు చాలా ఉన్నతంగా ఎదిగారని గుర్తు చేశారు. హైదరాబాద్, అమెరికా మధ్య సంధానకర్తగా ఆటా వ్యవహరించడం అభినందనీయమన్నారు. హైదరాబాద్‌కు అమెరికా నుంచి పెట్టుబడులు రావడానికి తన వంతు కృషి చేస్తానన్నారు. 'ఆటా'అధ్యక్షురాలు మధు బొమ్మినేని మాట్లాడుతూ.. ఆటా వేడుకల్లో భాగంగా ఈ బిజినెస్ సెమినార్ ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమం తెలంగాణ, అమెరికా మధ్య మరింత మంచి సంబంధాలు పెంపొందించడానికి ఉపయోగపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. 2024 జూన్ 7,8,9 తేదీలలో నిర్వహించే ఆటా మహాసభలకు అతిథిగా మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. సీఐఐ అధ్యక్షుడు శేఖర్‌రెడ్డి మాట్లాడుతూ, ఆటాతో కలసి ఈ సెమినార్‌ని నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. ఆటా వేడుకల ఎలెక్ట్ ప్రెసిడెంట్ జయంత్ చల్లా మాట్లాడుతూ పెట్టుబడి పెట్టడానికి వచ్చే కంపెనీలకు తెలంగాణ ప్రభుత్వం పూర్తిగా సహకరించాలని కోరారు.

సాహితీ ఇన్‌ఫ్రాటెక్ వెంచర్స్ ఆస్తుల జప్తు

- సంస్థ డైరెక్టర్, మాజీ డైరెక్టర్, కుటుంబసభ్యులకు
- చెందిన రూ.161.50 కోట్ల ఆస్తులు సీజ్ చేసిన ఈడీ

సాక్షి, హైదరాబాద్: సాహితీ ఇన్‌ఫ్రాటెక్ వెంచర్స్ ఇండియా ప్రై లిమిటెడ్ (ఎస్ఐవీఐపీఎల్) ఎండీ బి.లక్ష్మీనారాయణ్, మాజీ డైరెక్టర్ ఎస్ పూర్ణచంద్ర రావు, వారి కుటుంబ సభ్యులకు చెందిన రూ.161.50 కోట్ల చర, స్థిరాస్తులను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు జప్తు చేశారు. ఈ మేరకు ఈడీ అధికారులు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. వినియోగదారుల నుంచి డబ్బులు వసూలు చేసి నిర్మాణాలు చేపట్టకుండా మోసగించిన ఆరోపణలపై తెలంగాణ పోలీసులు ఐపీసీ సెక్షన్ 420 కింద కేసు నమోదు చేశారు. అపార్ట్‌మెంట్లు, విల్లాల నిర్మాణం పేరిట సదరు సంస్థ 655 మంది కొనుగోలుదారుల నుంచి రూ.248.27కోట్ల మేర వసూలు చేసి, నిర్మాణాలు చేపట్టకుండా మోసానికి పాల్పడింది.

మనీలాండరింగ్ కోణంపై దర్యాప్తు

ఈ కేసులో మనీలాండరింగ్ కోణంపై దర్యాప్తు చేస్తున్న ఈడీ అధికారులు దర్యాప్తు ముమ్మరం చేశారు. ఎస్ఐవీఐపీఎల్ మాజీ డైరెక్టర్ పూర్ణచంద్ర రావు 2018 ఆగస్టు నుంచి 2020 మధ్యకాలంలో రూ.126కోట్లు వినియోగదారుల నుంచి వసూలు చేసినట్టు ఈడీ అధికారులు దర్యాప్తులో గుర్తించారు. కోట్ల రూపాయల విలువైన స్థిరాస్తులను తన పేరిట, తన కుటుంబ సభ్యుల పేరిట పూర్ణచంద్ర రావు కొనుగోలు చేసినట్టు ఆధారాలు సేకరించారు. ఈ మొత్తం వ్యవహారంలో మరిన్ని కీలక ఆధారాల సేకరణ కోసం దర్యాప్తు కొనసాగిస్తున్నట్టు ఈడీ అధికారులు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

సంక్రాంతికి 20 ప్రత్యేక రైళ్లు

సాక్షి, హైదరాబాద్: సంక్రాంతి సందర్భంగా ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకొని వివిధ మార్గాల్లో 20 ప్రత్యేక రైళ్లు నడిపేందుకు ఏర్పాట్లు చేసినట్లు దక్షిణమధ్య రైల్వే సీపీఆర్వో సీహెచ్.రాకేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు కాచిగూడ-కాకినాడ (07653/07654) ప్రత్యేక రైలు ఈ నెల 28, జనవరి 4, 11, 18, 25 తేదీల్లో రాత్రి 8.30 గంటలకు బయల్దేరి.. మర్నాడు ఉదయం 8 గంటలకు కాకినాడ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో ఈ నెల 29, జనవరి 5, 12, 19, 26 తేదీల్లో సాయంత్రం 5.10 గంటలకు బయల్దేరి.. మర్నాడు ఉదయం 4.50 గంటలకు కాచిగూడ చేరుకుంటుంది. హైదరాబాద్-తిరుపతి (07509/07510) ప్రత్యేక రైలు ఈ నెల 28, జనవరి 4, 11, 18, 25 తేదీల్లో సాయంత్రం 7.25 గంటలకు బయల్దేరి మర్నాడు ఉదయం 8.20 గంటలకు తిరుపతికి చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో రాత్రి 8.15 గంటలకు బయల్దేరి మర్నాడు ఉదయం 8.40 గంటలకు హైదరాబాద్ చేరుకుంటుంది.

పట్టాల కింద కూలిన మట్టి

పలు రైళ్లను రద్దుచేసిన అధికారులు

కాచిగూడ: కాచిగూడ - మలక్‌పేట్ రైల్వే స్టేషన్ల మధ్య ఉన్న అండర్ బ్రిడ్జి వద్ద రైలు పట్టాల కింది మట్టి గురువారం సాయంత్రం 3.30 గంటల ప్రాంతంలో కూలిపోయింది. వెంటనే అప్రమత్తమైన రైల్వే అధికారులు ఈ మార్గం గుండా వెళ్లే పలు రైళ్లను రద్దు చేశారు. మరమ్మతులు పూర్తయిన తర్వాత రైళ్లను పునరుద్ధరించడంతో కొన్ని రైళ్లు ఆలస్యంగా బయలుదేరాయి. మలక్‌పేట్ అండర్ బ్రిడ్జి వద్ద పనులు జరుగుతుండగా పట్టాల కింద ఉన్న మట్టి కూలిపోయింది. దీంతో అధికారులు వెంటనే అప్రమత్తమై ఈ మార్గంగుండా నడిచే 24 ఎంఎంటీఎస్ రైళ్లను రద్దు చేశారు. హంద్రి ఎక్స్‌ప్రెస్, కాచిగూడ- కర్నూల్ సిటీ, కర్నూల్ సిటీ- కాచిగూడ రైళ్లను పూర్తిగా రద్దు చేశారు. మహారాష్ట్రలోని అమరావతి నుంచి కాచిగూడ మీదుగా తిరుపతి వెళ్లే అమరావతి ఎక్స్‌ప్రెస్ రైలును సికింద్రాబాద్, వికారాబాద్, గుత్తి, గుంతకల్ మీదుగా తిరుపతికి దారి మళ్లించారు. కాచిగూడ రైల్వే స్టేషన్ నుంచి బయలుదేరే చెన్నై చెంగల్ పట్టు ఎక్స్‌ప్రెస్ రైలు, కాచిగూడ- మైసూర్, కాచిగూడ- చిత్తూరు, వెంకటాద్రి రైళ్లు ఆలస్యంగా బయలు దేరాయి. దక్షిణ మధ్య రైల్వే హైదరాబాద్ డీఆర్ఎం లోకేష్ వైష్ణోయ్, ఏడీఆర్ఎం ఎంఏ రహమాన్, సీనియర్ డీఈఎన్ కె.ముత్యాల నాయుడు ఘటన స్థలానికి చేరుకొని మరమ్మతు పనులను పర్యవేక్షించారు. మహబూబ్‌నగర్ నుంచి విశాఖపట్నం వెళ్లే ఎక్స్‌ప్రెస్ రైలు రాత్రి 8:20 గంటలకు కాచిగూడ రైల్వే స్టేషన్‌కు చేరుకుంది. పట్టాల మరమ్మతుల తర్వాత అధికారులు ఈ రైలును పంపించారు.

వైభవంగా పత్రీజీ ధ్యాన వేడుకలు

కడ్తాల్: కడ్తాల్‌లోని మహేశ్వర మహా పిరమిడ్‌లో గురువారం సాయంత్రం పత్రీజీ ధ్యాన మహాయాగం-2 వేడుకలు వైభవంగా ప్రారంభమ య్యాయి. దివంగత ధ్యాన గురువు సుభాష్ పత్రీజీ కూతుళ్లు పరిణిత, పరిమళ, పిరమిడ్ ట్రస్ట్ సభ్యులు, చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డితో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి సంబరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ.. విశ్వశాంతి కోసం చేపట్టిన పత్రీజీ ధ్యాన మహాయాగం 11 రోజుల పాటు కొనసాగుతుందని తెలిపారు. ధ్యాన జ్ఞానంతో గొప్ప అనుభూతి పొందాలని సూచించారు. అనంతరం పరిణిత, పరిమళ మాట్లాడుతూ.. ధ్యాన యజ్ఞం నిరంతరం కొనసాగాలని ఆకాంక్షించారు. పలువురు పిరమిడ్ మాస్టర్ల సందేశాలు, సంగీత కార్యక్రమాలతో అలరించారు.

'విద్యుత్ ఒప్పందాలపై విచారణను ఆహ్వానిస్తున్నాం'

సాక్షి, హైదరాబాద్: విద్యుత్ శాఖ 81,516 కోట్ల అప్పుల్లో ఉన్నట్లు అసెంబ్లీలో ప్రభుత్వం ప్రకటించిన శ్వేతపత్రంలో పేర్కొందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం తెలిపారు. యాదాద్రి, భద్రాద్రి పవర్ ప్రాజెక్టుల్లో కాలం చెల్లిన సబ్ క్రిటికల్ టెక్నాలజీ వాడకం, ఛత్తీస్‌గఢ్ విద్యుత్ ఒప్పందంపై న్యాయ విచారణకు ఆదేశించడాన్ని ఆహ్వానిస్తున్నామని ఆయన అన్నారు. రెగ్యులేటరీ కమిషన్‌లో వినియోగదారులు చేసిన సూచనలను ప్రభుత్వం, డిస్కంలు పాటించకపోవడంతో నష్టాలు వచ్చి అప్పులు పెరిగాయని పేర్కొన్నారు. మరోవైపు డిస్కంలను గత ప్రభుత్వం ఇష్టానుసారంగా వాడుకుందని, సబ్ స్టేషన్లు, ట్రాన్స్‌ఫార్మర్ల, కండక్టర్ల నిర్వహణ లోపాల వల్ల నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయలేదని విమర్శించారు.

సాక్షి
హైదరాబాద్

శుక్రవారం । 22 । డిసెంబర్ । 2023



పాత వాహనాలతోనే ప్రమాదాలెక్కువ!
రాష్ట్రంలోని రోడ్ల మీద కాలం చెల్లిన వాహనాలు దూసుకెళుతున్నాయి. దీంతో ఏటా రోడ్డు ప్రమాదాల సంఖ్య పెరిగిపోతోంది. -10లో



ప్రజల సహకారంతోనే శాంతి భద్రతల పరిరక్షణ
శాంతి భద్రతల పరిరక్షణకు పోలీసులు, అధికారులు నిరంతరాయంగా పని చేయాలని నగర సీపీ కె.శ్రీనివాస్ రెడ్డి అన్నారు. -10లో

నేడు జేఎన్‌టీయూహెచ్‌కు గవర్నర్
బాలానగర్: జేఎన్‌టీయూహెచ్ పూర్వ విద్యార్థుల ప్రపంచ సమ్మేళనాన్ని రెండు రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు వర్సిటీ వీసీ కట్టా నర్సింహారెడ్డి తెలిపారు. గురువారం ఆయన ఇక్కడ మాట్లాడుతూ.. శుక్రవారం జేఎన్‌టీయూహెచ్ గ్లోబల్ అలుమ్ని మీట్‌ను గవర్నర్ తమిళిసై సౌందర రాజన్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభిస్తారన్నారు. సుమారు 2 వేల మందికిపైగా సదస్సుకు రానున్నారని ఆయన తెలిపారు.

సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రిలో కోవిడ్ టెస్టులు..



బంజారాహిల్స్‌లోని అర్బన్ హెల్త్ సెంటర్‌లో..



ఎందుకిలా?

- మళ్లీ పెరుగుతున్న కోవిడ్ కేసులు
- టెస్టుల పట్ల పెరుగుతున్న నిరాసక్తత
- లక్షణాలున్న 9 మందిలో ఒక్కరే పరీక్షకు సై
- వెల్లడించిన సోషల్ సర్కిల్స్ అధ్యయనం

లక్షణాలున్నా.. కరోనా పరీక్షకు డుమ్మా...

సాక్షి, సిటీబ్యూరో: నగరానికి చెందిన లోకల్ సోషల్ మీడియా కమ్యూనిటీ ఔట్‌లెట్ అయిన లోకల్ సర్కిల్స్ తాజా సర్వే ప్రకారం, కోవిడ్–19 లక్షణాలు కనిపిస్తున్న ప్రతి తొమ్మిది మందిలో ఒకరు మాత్రమే సంబంధిత పరీక్ష కోసం వెళ్తున్నారు. కోవిడ్ పరీక్షలు చేయించుకుంటున్నారా లేదా? లేకపోతే అయిష్టతకు గల కారణాలను అంచనా వేయడానికి గత నెల 20 నుంచి ఈ నెల 18 మధ్య ఈ సర్వే నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాల నుంచి 3,568 మందిని ఎంచుకున్నారు.

పరీక్షలు చేయించుకోం.. ఎందుకంటే..

సర్వేలో పాల్గొన్న వారిలో 85% మంది తమకు కోవిడ్ లక్షణాలు ఉన్నప్పటికీ పరీక్షకు వెళ్లడం లేదని చెప్పారు. లక్షణాలున్నప్పటికీ కోవిడ్–19 పరీక్ష అనవసరమని భావించి, అవసరమైన చికిత్స తీసుకుంటున్నామని తమకు నయమైపోతోందని వీరు ధీమా వ్యక్తం చేశారు. ఇక కోవిడ్ పరీక్షలు అసౌకర్యంగా భావించామని 6 శాతం మంది, ఖర్చు అవుతుందని 4 శాతం మంది, పరీక్షల్లో కచ్చితమైన ఫలితాలు వస్తాయన్న నమ్మకం లేదని 9శాతం మంది.. పరీక్షలు చేయించుకోకపోయినా నయమైపోతుందనే ధైర్యాన్ని దాదాపు అందరూ వ్యక్తం చేయడం గమనార్హం.

నలుగురికి కోవిడ్ పాజిటివ్

నల్లకుంట: నల్లకుంట ఫీవర్ ఆస్పత్రి వైరాలజీ ల్యాబ్‌లో నిర్వహించిన కోవిడ్ టెస్టుల్లో నలుగురికి పాజిటివ్ నిర్ధారణ అయ్యిందని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె. శంకర్ తెలిపారు. కేసులు పెరుగుతున్నప్పటికీ ఆందోళన అవసరం లేదన్నారు. ఫీవర్ ఆస్పత్రి ల్యాబ్‌లో నిర్ధారణ అయిన నాలుగు కేసుల్లో ఒకరు బుధవారం ఫీవర్ ఓపీలో పరీక్షించుకోగా మిగిలిన ముగ్గురు వేరే ప్రాంతాల్లోని యూపీహెచ్‌సీల నుంచి వచ్చిన వారి శాంపిల్స్ అని చెప్పారు. పాజిటివ్‌గా తేలిన నలుగురుకి జేఎన్–1 వేరియంటా? కాదా? అని తెలుసుకునేందుకు వాళ్ల శాంపిళ్లను గాంధీ ఆస్పత్రికి పంపించామని తెలిపారు. దీర్ఘకాలిక వ్యాధులు ఉన్నవాళ్లకు కొత్త వేరియంట్ త్వరగా సోకే ప్రమాదం ఉందని చెప్పారు. ముఖ్యంగా పదేళ్ల లోపు పిల్లలు, 60 ఏళ్లు దాటిన, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వాళ్లు గుంపుల్లోకి వెళ్లకపోవడం మంచిదని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో బయటకు వెళ్లే వాళ్లు విధిగా మాస్కులు ధరించి, సామాజిక దూరం పాటించాలని సూచించారు.



– డా.శంకర్, ఫీవర్ ఆస్పత్రి సూపరింటెండెంట్

నిర్లక్ష్యం చేయవద్దు..



తాజాగా కోవిడ్ జేఎన్–1 కేసుల సంఖ్య నగరంలో అర డజనుపైగా నమోదయ్యాయి. ఈ పరిస్థితుల్లో.. పరీక్షలు తక్కువగా ఉన్నట్లయితే ఆలస్యంగా గుర్తించే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. దీనిని దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలి. లక్షణాలు కనపడిన వారు నిర్లక్ష్యం చేయకుండా పరీక్షలు చేయించుకోవాలి.

– సచిన్ తపాడియా, లోకల్ సర్కిల్స్ వ్యవస్థాపకుడు

నిధులిస్తేనే.. ట్రాఫిక్ ఫ్రీ

లేదంటే చిక్కులే

- పురోగతిలో బైరామల్‌గూడ, ఆరాంఘర్ ఫ్లై ఓవర్లు
- నిధుల కోసం జీహెచ్‌ఎంసీ ఎదురు చూపులు
- నత్తనడకన సాగుతున్న ఎస్సార్‌డీపీ పనులు




పురోగతిలోని పనులు ఇలా..

పని	అంచనా (రూ.కోట్లు)	ఎప్పటిలోగా పూర్తికావాలి
బైరామల్‌గూడ రెండో లెవల్ ఫ్లై ఓవర్	134.25	డిసెంబర్ 2023
బైరామల్‌గూడ ఎడమవైపు లూప్	21.63	డిసెంబర్ 2023
బైరామల్‌గూడ కుడివైపు లూప్	22.30	డిసెంబర్ 2023
ఫలక్‌నుమా ఆర్‌ఓబీ	47.10	మార్చి 2024
శాస్త్రిపురం ఆర్‌ఓబీ	71.00	మార్చి 2024
శిల్పా లే ఔట్(స్టేజ్–2)	275.00	ఆగస్టు 2024
ఆరాంఘర్–జూపార్క్ ఫ్లై ఓవర్	636.80	డిసెంబర్ 2024
ఉప్పల్ జంక్షన్ ఫ్లై ఓవర్	311.00	డిసెంబర్ 2024

సాక్షి, సిటీబ్యూరో: నగరంలో ఐదారేళ్లుగా వడివడిగా సాగిన వ్యూహాత్మక రహదారుల అభివృద్ధి పథకం (ఎస్సార్‌డీపీ) పనులు ప్రస్తుతం కుంటుతున్నాయి. ట్రాఫిక్ చిక్కుల పరిష్కారం, సిగ్నల్ ఫ్రీ రవాణా కోసం దాదాపు రూ.25వేల కోట్ల అంచనా వ్యయంతో ఎస్సార్‌డీపీ పనుల్లో తొలిదశ పనులు దాదాపు పూర్తి కావచ్చాయి. మొత్తం 42 పనులకుగాను 33 పూర్తి కాగా, 9 పురోగతిలో వివిధ దశల్లో ఉన్నాయి. 2014–15లో ఎస్సార్‌డీపీని ప్రారంభించినప్పుడు పనులు ఆగిపోకుండా నిధుల కటకట లేకుండా ఉండేందుకు బాండ్ల జారీ, బ్యాంకుల నుంచి ఫ్రీ టర్మ్‌లోన్ ద్వారా నిధులు సేకరించారు. పనులు పూర్తవుతున్న కొద్దీ కాంట్రాక్టర్లకు నేరుగా చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకోవడంతో అప్పట్లో పనులు వేగంగా సాగాయి. 2020లో కరోనా కారణంగా ప్రధాన రహదారుల్లో జనసంచారం లేకపోవడం వల్ల కూడా పనులు వేగంగా జరిగాయి.

- అప్పట్లో పనులు జరుగుతున్న కొద్దీ వెనువెంటనే చెల్లింపులు కూడా జరగడంతో పనులు త్వరితగతిన జరిగాయి. బాండ్లు, బ్యాంకుల ద్వారా నిధులు పొందేందుకు ప్రభుత్వం జీహెచ్‌ఎంసీకి పరిపాలన అనుమతులు మంజూరు చేసిన రూ. 5వేల కోట్లు ఖర్చయిపోయాక జీహెచ్‌ఎంసీ ఖజానా నుంచే ఖర్చు చేస్తున్నారు. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల కారణంగా ట్యాక్స్ సిబ్బంది ఎన్నికల విధుల్లో ఉండటంతో సిబ్బంది జీతాల చెల్లింపులకు కూడా కటకట ఏర్పడింది. ఈ నేపథ్యంలో వందల కోట్ల నిధులవసరమైన ఎస్సార్‌డీపీ పనులకు ప్రస్తుతం నిధులు విడుదల చేసే పరిస్థితి లేదు. దీంతో పనులు కుంటుతున్నాయి.



- పురోగతిలో ఉన్న 9 పనులు పూర్తి కావడంలోనూ ఆలస్యం జరుగుతోంది. ప్రభుత్వం నుంచి నిధులందితే తప్ప ఆ పనులు పూర్తయ్యే పరిస్థితి లేదు. నిర్ణీత లక్ష్యం మేరకు బైరామల్‌గూడ రెండో లెవెల్ ఫ్లై ఓవర్, ఎడమ వైపు లూప్(క్లోవర్2), కుడివైపు లూప్(క్లోవర్1) ఈనెలలోనే ప్రారంభోత్సవం కావాల్సి ఉండగా, ఇప్పట్లో పూర్తయ్యే పరిస్థితి కనిపించడం లేదు. వాటికి మరో రెండు మూడు నెలలు పట్టే అవకాశం ఉంది. వాటితో పాటు వచ్చే సంవత్సరం మరో ఆరు పనులు పూర్తి కావాల్సి ఉంది. నిధులు లేని పక్షంలో వాటిల్లోనూ జాప్యం జరగనుంది. పనులు జరుగుతున్న ప్రాంతాల్లో ఇప్పటికే ట్రాఫిక్ చిక్కులు ఎదురవుతున్నాయి. పనులూ పూర్తయ్యేంత వరకు ప్రజలు ఈ ఇబ్బందులు పడక తప్పదు.

న్యూస్‌రీల్

నేడు అంబేడ్కర్ కాలేజీకి సీఎం రేవంత్‌రెడ్డి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: బాగ్‌లింగంపల్లిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విద్యా సంస్థల వార్షికోత్సవం, అంబేడ్కర్ లా కాలేజీ గ్రాడ్యుయేషన్‌కు శుక్రవారం ఉదయం 10 గంటలకు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి హాజరుకానున్నారు. కార్యక్రమంలో బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సభ్యులు పి.విష్ణువర్ధన్‌రెడ్డి, ఓయూ బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్ ప్రొఫెసర్ ఎస్.వెంకటేశ్వర్లు, తెలంగాణ రాష్ట్ర జుడీషియల్ అకాడమీ డైరెక్టర్ ఎం.రాజేందర్, అంబేడ్కర్ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ జి.వివేక్ వెంకటస్వామి, సెక్రటరీ డాక్టర్ జి.వినోద్, కరస్పాండెంట్ డాక్టర్ జి.సరోజావివేక్, జాయింట్ సెక్రటరీ పి.వి.రమణకుమార్ పాల్గొననున్నారు.

నేడు ట్రాఫిక్ ఆంక్షలు

- రాష్ట్రపతి ఎట్ హోమ్, క్రిస్మస్ వేడుకల నేపథ్యంలో

సాక్షి, సిటీబ్యూరో: బొల్లారంలోని రాష్ట్రపతి భవన్‌లో జరగనున్న ఎట్ హోమ్ కార్యక్రమం, ఎల్బీ స్టేడియంలో ముఖ్యమంత్రి నిర్వహిస్తున్న క్రిస్మస్ వేడుకల నేపథ్యంలో ఆయా ప్రాంతాల్లో శుక్రవారం ట్రాఫిక్ ఆంక్షలు, మళ్లింపులు అమలులో ఉండనున్నాయి. సాధారణ వాహన చోదకులు వీటిని దృష్టిలో పెట్టుకుని సహకరించాలని పోలీసు అధికారులు సూచించారు. మధ్యాహ్నం 3 నుంచి రాత్రి 8 గంటల మధ్య లోతుకుంట–జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు మధ్య ఉన్న ప్రాంతాల్లో, సాయంత్రం 5 నుంచి రాత్రి 9 గంటల మధ్య ఎల్బీ స్టేడియం కేంద్రంగా ఆంక్షలు అమలు కానున్నాయి. ఆయా చోట్ల అవసరాన్ని బట్టి వాహనాలను పూర్తిగా ఆపేయడమో, దారి మళ్లించడమో చేయనున్నారు.

బొటానికల్ గార్డెన్‌కు బ్యాటరీ వాహనాల అందజేత



గచ్చిబౌలి: బొటానికల్ గార్డెన్‌లో 1,600 రకాల జాతుల మొక్కలు ఉన్నాయని, మరో 400 రకాల జాతి మొక్కలను నాటేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు టీఎస్‌ఎఫ్‌డీసీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. గురువారం కొత్తగూడలోని బొటానికల్ గార్డెన్‌లో బ్యాంక్ ఆఫ్ ఇండియా హైదరాబాద్ జోన్ సీజీఎం భాస్కర్ రావు రెండు గోల్ఫ్ కార్ట్ బ్యాటరీ వాహనాలను ఎండీ చంద్రశేఖర్ రెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బొటానికల్ గార్డెన్‌లో 1600 రకాల మొక్కలు ఉన్నాయని, పాఠశాల, కళాశాలల విద్యార్థులకు వృక్ష పరిచయం చేసేందుకు గోల్ఫ్ కార్ట్ బ్యాటరీ వాహనాలు అవసరమన్నారు. కాక్టస్ గార్డెన్, హెర్బల్ మెడిసినల్ గార్డెన్, క్లింబర్స్, క్రీపర్స్, నక్షత్ర వనం, నవగ్రహ వనం, రాసి వనం, మ్యూజికల్ ట్రీ గార్డెన్, బటర్‌ఫ్లై గార్డెన్, కీటక ఆహార వనాలను చూసేందుకు నిత్యం వెయ్యి మందికి పైగా సందర్శకులు వస్తారని పేర్కొన్నారు. బ్యాంక్ ఆఫ్ ఇండియా డీజీఎం శ్రీనివాస్ రావు, సీనియర్ మేనేజర్ శివ కుమార్, సుమలత, టీఎస్‌ఎఫ్‌డీసీ డైరెక్టర్ అక్బర్, జీఎం స్కైలాబ్ తదితరులు పాల్గొన్నారు.

నయాసాల్.. చలో టూర్

- అక్కడే నూతన సంవత్సర వేడుకలు
- బ్యాంకాక్, సింగపూర్, మలేషియా, దుబాయ్ ప్రాంతాలకు డిమాండ్
- గోవా, కశ్మీర్‌లకు కూడా వెళ్తున్న నగర వాసులు
- వారం రోజులుగా 20 శాతానికి పైగా పెరిగిన ప్రయాణాలు
- భారీగా పెరిగిన విమాన చార్జీలు

విదేశాలకు భారీగా వెళ్తున్న సిటీజనులు



సాక్షి, సిటీబ్యూరో: నగరవాసికి నయాసాల్ జోష్ వచ్చేసింది. ఏటా డిసెంబర్ చివరి వారంలో ఏదో ఒక నచ్చిన ప్రదేశానికి వెళ్లి కొత్త సంవత్సరానికి ఘనంగా స్వాగతం పలికే సిటీజనులు ఈ ఏడాది వేడుకలకు సైతం 'చలో టూర్' అంటూ చెక్కేస్తున్నారు. క్రిస్మస్ సెలవులు కూడా కావడంతో వివిధ ప్రాంతాలకు వెళ్లేందుకు ఫ్లైట్ ఎక్కేస్తున్నారు. మరోవైపు నూతన సంవత్సర వేడుకలను విదేశాల్లో జరుపుకొనేందుకే ఎక్కువ శాతం మొగ్గు చూపుతున్నారు. ఈసారి గోవాతో పాటు కశ్మీర్‌ను సైతం ఎంపిక చేసుకుంటున్నారు. గతంలో కంటే ప్రస్తుతం కొంత మేరకు కశ్మీర్‌లో సాధారణ పరిస్థితులు నెలకొనడంతో పర్యాటకుల రాకపోకలు పెరిగాయి. దీంతో సిటీ టూరిస్టులు గోవాతో పాటు కశ్మీర్, హిమాచల్‌ప్రదేశ్ తదితర ప్రాంతాలకు వెళ్లేందుకు బారులు తీరుతున్నారు. మరోవైపు విదేశీ టూర్లలో బ్యాంకాక్, మలేసియా, మాల్దీవులు, సింగపూర్, దుబాయ్ తదితర దేశాలకు డిమాండ్ అనూహ్యంగా పెరిగింది. వారం రోజులుగా సుమారు 20 శాతానికి పైగా విదేశీ ప్రయాణాలు పెరిగినట్లు పలు ట్రావెల్ ఏజెన్సీలు వెల్లడించాయి. అడ్వాన్స్ బుకింగ్‌లు సైతం బాగా పెరిగినట్లు థామస్ కుక్, కాక్స్ అండ్ కింగ్స్, తదితర సంస్థల ప్రతినిధులు పేర్కొన్నారు. నూతన సంవత్సరం వేడుకల సందర్భంగా సుమారు లక్ష మంది ప్రయాణికులు అదనంగా బయలుదేరి వెళ్లనున్నట్లు అంచనా.

బ్యాంకాక్ వైపు బారులు..

- నగరం నుంచి సింగపూర్, మలేషియా.మాల్దీవులు, బ్యాంకాక్, దుబాయ్‌లకు డిమాండ్ అనూహ్యంగా పెరిగింది. ఈ ఐదింటిలోనూ బ్యాంకాక్‌కు వెళ్లే వాళ్లే ఎక్కువ సంఖ్యలో ఉన్నారు. దీంతో చార్జీలు బాగా పెరిగాయి. సాధారణంగా హైదరాబాద్ నుంచి బ్యాంకాక్‌కు వెళ్లి వచ్చేందుకు రూ.30 వేల నుంచి రూ.40 వేల వరకు ఉండే చార్జీలు ఇప్పుడు ఏకంగా రూ.60 వేల వరకు పెరిగినట్లు ట్రావెల్స్ ఏజెన్సీలు చెబుతున్నాయి. వారం. పది రోజుల నుంచే బ్యాంకాక్‌కు బుకింగ్‌లు బాగా పెరిగినట్లు బంజారాహిల్స్‌కు చెందిన ఒక సంస్థ ప్రతినిధి తెలిపారు. 'కౌలాలంపూర్ పెట్రోనాట్స్ దగ్గర ఏటా నూతన సంవత్సర వేడుకలు అద్భుతంగా జరుగుతాయి. రంగరంగుల బాణాసంచా కాల్చుతారు. దీంతో ఆకాశమంతా హరివిల్లులు విరబూస్తాయి. ఆ వేడుకలను చూసేందుకు ఇంటిల్లిపాది వెళ్తున్నాం' అని ఎల్‌బీ నగర్‌కు చెందిన సత్యవతి తెలిపారు. ఒక్కొక్కరికి రూ.70 వేల వరకు ఫ్లైట్ చార్జీలు అయినట్లు చెప్పారు. గతంలో మలేసియాకు వెళ్లి వచ్చేందుకు రూ.39 వేల వరకు మాత్రమే చార్జీలు ఉండేవని విస్మయం వ్యక్తం చేశారు.
- అలాగే హైదరాబాద్ నుంచి దుబాయ్‌కు కూడా పెద్ద సంఖ్యలోనే వెళ్తున్నారు. దుబాయ్‌కు వెళ్లి రావడానికి ఫ్లైట్ చార్జీలు రూ.75 వేలకు పెరిగాయి. కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లేవాళ్లు మలేసియాతో పాటు సింగపూర్‌ను కూడా ఎంపిక చేసుకుంటున్నారు. ఈ రెండు దేశాల తర్వాత మాల్దీవులకు వెళ్తున్న వారి సంఖ్య కూడా బాగానే ఉంది. ప్రత్యేకంగా నూతన సంవత్సర వేడుకల కోసమే చాలామంది మాల్దీవులకు పయనమవుతున్నారు. దుబాయ్‌లో షాపింగ్‌కు ఇది అనుకూలమైన సమయం కావడంతో ఎక్కువ మంది దుబాయ్‌కు వెళ్తున్నట్లు ఐఆర్‌సీటీసీ అధికారి ఒకరు చెప్పారు.

సోలో జర్నీయే సో బెటర్..

మరోవైపు హైదరాబాద్ నుంచి వివిధ దేశాలకు వెళ్లే ఒంటరి పర్యాటకుల సంఖ్య కూడా ఈ ఏడాది బాగా పెరిగింది. సుమారు 28 శాతం ఇలా ఒంటరిగా విదేశీ టూర్‌లకు వెళ్తున్నట్లు అంచనా. తమకు నచ్చిన పర్యాటక స్థలాల్లో ఏకాంతంగా గడపాలనే కోరిక, ఎలాంటి బాదరాబందీ లేకుండా ఎక్కడి నుంచి ఎక్కడికైనా తేలిగ్గా ప్రయాణించేందుకు అవకాశం ఉండడంతో చాలా మంది సోలో జర్నీయే సో బెటర్ అనుకుంటున్నారు. సోలోగా వెళ్తున్న వారిలోనూ ఎక్కువ మంది బ్యాంకాక్, సింగపూర్, దుబాయ్‌లతో పాటు శ్రీలంకకు వెళ్తున్నారు. విదేశాలతో పాటు దేశంలోని బెంగళూర్, గోవా, జైపూర్, కొచ్చిన్, గౌహతి, విశాఖ నగరాలకు సైతం సోలో టూరిస్టుల తాకిడి ఎక్కువగా ఉండడం గమనార్హం. గత సంవత్సరం కంటే ఈ సంవత్సరం హైదరాబాద్ నుంచి జాతీయ, అంతర్జాతీయ ప్రయాణాలు 20 శాతం అదనంగా పెరిగాయి. ఇందుకు దేశంలోని వివిధ నగరాల్లో ఉడాన్ పథకం కింద ఎయిర్‌పోర్టులు అందుబాటులోకి రావడం, విదేశీ విమాన చార్జీలు కొంతమేర తగ్గుముఖం పట్టడం పర్యాటక ప్రియులకు చక్కటి అవకాశంగా మారింది.

శివారులో హుషారుగా..

ఒకవైపు న్యూ ఇయర్ వేడుకలను విదేశాల్లో, ఇతర రాష్ట్రాల్లో జరుపుకునేందుకు కొందరు నగర వాసులు ఉత్సాహం చూపిస్తుండగా.. మరికొందరు నగర శివారు ప్రాంతాల్లోని ఫాంహౌస్‌లు, రిసార్ట్‌లు, వ్యక్తిగత గృహాలను అద్దెకు తీసుకుని న్యూ ఇయర్ వేడుకలకు రెడీ అవుతున్నారు. పబ్‌లు, క్లబ్‌లలో కొత్త ఏడాది సెలబ్రేషన్స్‌పై పోలీసుల పరిమితుల నేపథ్యంలో వ్యక్తిగత ఏర్పాట్లు చేసుకుంటున్నారు. గేటెడ్ కమ్యూనిటీలోని రెండు మూడు ఫ్యామిలీలు కలిసి కొత్త సంవత్సర వేడుకలకు ప్లాన్ చేస్తున్నారు. శివరాంపల్లి, శామీర్‌పేట, భువనగిరి, కొల్లూరు వంటి ఔటర్ రింగ్ రోడ్డుకు చేరువలో ఉన్న శివారు ప్రాంతాల్లోని విల్లాలు, వ్యక్తిగత గృహాలను యజమానులు న్యూ ఇయర్ వేడుకల కోసం అద్దెకు ఇస్తున్నారు. దీంతో చాలా మంది ఫాంహౌస్‌లలో పార్టీలు చేసుకునేందుకు ప్లాన్ చేస్తున్నారు. వీటి యజమానులు రోజుకు అద్దె రూ.5 వేలు చెబుతున్నారు.

బషీర్‌బాగ్‌లో సీపీ క్యాంప్!



- పాత కమిషనరేట్ భవనం వినియోగం
- వారంలో రెండు రోజులు ఇక్కడే కొత్వాల్
- త్వరలో ప్రారంభం కానున్న ఈ విధానం

సాక్షి, సిటీబ్యూరో: నగరవాసులకు మరింత అందుబాటులోకి రావడం కోసం పోలీసు కమిషనర్ కొత్తకోట శ్రీనివాసరెడ్డి కీలక నిర్ణయం తీసుకున్నారు. బషీర్‌బాగ్ చౌరస్తాలో ఉన్న పాత కమిషనరేట్ భవనాన్ని తన క్యాంపు కార్యాలయంగా మార్చుకోనున్నారు. ప్రతి వారం కనీసం రెండు రోజుల పాటు ఇక్కడ అందుబాటులో ఉండనున్నారు. త్వరలో దీన్ని అమలులోకి తీసుకురావడానికి కొత్వాల్ సన్నాహాలు చేస్తున్నారు. కమిషనరేట్ పాతబస్తీలోని పురానీ హవేలీ ఉన్నప్పుడు తప్ప నగర పోలీసు కమిషనర్‌కు క్యాంపు కార్యాలయం ఉండేది. బషీర్‌బాగ్‌లో కమిషనరేట్ ఉన్నతం కాలం పురానీ హవేలీని క్యాంప్ ఆఫీస్‌గా వినియోగించుకున్నారు. దాదాపు ప్రతి శుక్రవారం, కీలక సందర్భాల్లో పోలీసు కమిషనర్లు అక్కడే ఉండేవారు. గతేడాది సీపీ కార్యాలయం బంజారాహిల్స్‌లోని తెలంగాణ స్టేట్ ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌లోకి (టీఎస్ ఐసీసీసీ) మారింది. అదే సమయంలో పురానీ హవేలీకి మరమ్మతులు ప్రారంభమయ్యాయి. దీంతో నాటి నుంచి కొత్వాల్‌కు క్యాంపు కార్యాలయం లేకుండాపోయింది.

వ్యయ ప్రయాసల నివారణకు..

బంజారాహిల్స్ రోడ్ నెం.12లో టీఎస్ ఐసీసీసీ భవనంలోని టవర్ ఏలో ఉన్న 18వ అంతస్తులో పోలీసు కమిషనర్ ఛాంబర్ ఉంది. ఈ ప్రాంగణానికి చేరుకోవడానికి సాధారణ ప్రజలు, బాధితులు అనేక వ్యయ ప్రయాసలకు గురవుతున్నారు. మరోపక్క ఇందులోనే సైబర్ సెక్యూరిటీ బ్యూరో, నార్కోటిక్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్‌లతో పాటు మరికొన్ని కీలక కార్యాలయాలు ఉన్నాయి. దీంతో సామాన్య ప్రజలు ఇందులోకి ప్రవేశించడానికి కొన్ని అనుమతులు తీసుకోవాల్సి రావడం వారికి ఇబ్బందులు కలిగిస్తోంది. ఈ విషయాలను గమనించిన కొత్వాల్ కొత్తకోట శ్రీనివాసరెడ్డి క్యాంప్ కార్యాలయం ఏర్పాటుకు సంబంధించి కీలక నిర్ణయం తీసుకున్నారు. నాంపల్లి ఉండే సెంట్రల్ క్రైమ్ స్టేషన్, సైబర్ క్రైమ్ పోలీసుస్టేషన్, డిటెక్టివ్ డిపార్ట్‌మెంట్స్ బషీర్‌బాగ్‌లోని పాత కమిషనరేట్‌కు మారాయి. అయినప్పటికీ ఐదో అంతస్తులో ఉన్న పోలీసు కమిషనర్ ఛాంబర్ అలాగే ఉంది. గణేష్ సామూహిక నిమజ్జనంతో పాటు ఇతర సందర్భాల్లో పోలీసు కమిషనర్ ఇక్కడ నుంచే పర్యవేక్షిస్తున్నారు. ప్రస్తుతం అక్కడే తన క్యాంపు కార్యాలయం ఏర్పాటు చేయడానికి కొత్వాల్ నిర్ణయించారు. ప్రతి వారం కనీసం రెండు రోజుల పాటు ఈ క్యాంప్ ఆఫీస్‌లోనే అందుబాటులో ఉండనున్నారు.

లోక్‌సభ ఎన్నికల్లో సత్తా చాటాలి

- ఇకపై మీతో నెలకోసారి సమావేశమవుతా
- ఆరు గ్యారంటీల అమలుకు కాంగ్రెస్‌ను నిలదీయాలి
- జీహెచ్‌ఎంసీ కార్పొరేటర్లతో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

భారీ మెజార్టీతో పార్టీ అభ్యర్థులను గెలిపించుకోవాలి

సాక్షి, సిటీబ్యూరో/బంజారాహిల్స్: అసెంబ్లీ ఎన్నికల్లో గ్రేటర్ పరిధిలో సాధించిన ఘన విజయం స్ఫూర్తితో త్వరలో జరగబోయే లోక్‌సభ ఎన్నికల్లోనూ బీఆర్‌ఎస్ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జీహెచ్‌ఎంసీ కార్పొరేటర్లకు పిలుపునిచ్చారు. అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేసినందుకు వారికి ధన్యవాదాలు తెలిపారు. గురువారం సాయంత్రం బీఆర్‌ఎస్ కేంద్ర కార్యాలయంలో ఆ పార్టీ కార్పొరేటర్లతో కేటీఆర్ సమావేశమై మాట్లాడారు. గ్రేటర్ పరిధిలో పార్టీ పటిష్టంగా ఉందని, రానున్న పార్లమెంట్ ఎన్నికల్లోనూ గులాబీ జెండాను ఎగరేసేందుకు సమష్టిగా కృషి చేయాలన్నారు. అధికారంలోకి రాలేదని నిరాశ పడకుండా ప్రజల తరఫున ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చేలా బాధ్యతాయుతమైన ప్రతిపక్ష పాత్రను నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. కాంగ్రెస్ పార్టీ అడ్డగోలుగా హామీలు ఇచ్చి ఎన్నికల్లో గెలిచిందని, వాటిని నెరవేర్చేలా కాంగ్రెస్ ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తామన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన గ్యారంటీలు అందడం లేదని ప్రజలు మీ దృష్టికి తెస్తే కాంగ్రెస్‌వారినే నిలదీయాల్సిందిగా చెప్పాలన్నారు. అభివృద్ధి కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని సూచించారు. ఇప్పటి వరకు మంత్రిగా బాధ్యతలు, తరచూ పర్యటనల కారణంగా మీతో సమావేశం కావడానికి తగినంత సమయం దొరకలేదని, ఇకపై ప్రతి నెలా సమావేశమవుతానన్నారు. నియోజకవర్గాల పునర్విభజన జరిగే అవకాశమున్నందున నియోజకవర్గాలు పెరుగుతాయని, దాదాపు పదిమంది కార్పొరేటర్లకు ఎమ్మెల్యేలయ్యే అవకాశాలు వస్తాయన్నారు. కాగా.. పార్టీ కార్పొరేటర్లు కాంగ్రెస్ వైపు మళ్లకుండా ఉండేందుకు కూడా ఈ సమావేశం నిర్వహించినట్లు తెలుస్తోంది. సమావేశానికి ఇద్దరు ముగ్గురు కార్పొరేటర్లు హాజరు కాలేదని సమాచారం.



బీఆర్‌ఎస్ కార్పొరేటర్లతో మాట్లాడుతున్న ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

స్టార్ ఆస్పత్రిలో అరుదైన శస్త్ర చికిత్స

ఇద్దరు దాతల కాలేయాన్ని ఒకే వ్యక్తికి అమర్చిన డాక్టర్ల బృందం

- విజయవంతంగా కాలేయ మార్పిడి
- తెలుగు రాష్ట్రాల్లో ఇదే ప్రథమం

రాయదుర్గం: ఒకే వ్యక్తికి ఇద్దరు దాతల నుంచి సేకరించిన కాలేయాన్ని అమర్చి స్టార్ ఆస్పత్రి వైద్య బృందం వైద్య చరిత్రలో సరికొత్త రికార్డు సృష్టించింది. ఈ తరహా వైద్య చికిత్స మొట్టమొదటి సారిగా నానక్‌రాం గూడ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ప్రాంతంలోని స్టార్ ఆస్పత్రిలో జరిగింది. గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ గోపిచంద్ మన్నం, లివర్ ట్రాన్స్‌ప్లాంట్ చీఫ్ డాక్టర్ రాఘవేంద్రబాబు వివరాలు వెల్లడించారు. కర్నూలు జిల్లాకు చెందిన మహేష్ లివర్ సిరోసిస్ వ్యాధితో బాధపడుతూ అక్టోబర్ 23న స్టార్ ఆస్పత్రి వైద్యులను సంప్రదించాడన్నారు. వైద్యులు అతడికి మెల్‌స్కోర్ నిర్వహించగా 28 రావడంతో వ్యాధి తీవ్రత ఎక్కువగా ఉందని గుర్తించామన్నారు. మందులతో నయం చేసే అవకాశం లేకపోవడం, జీవన్‌దాన్‌లో రిజిస్టర్ చేస్తే వేచి చూసే సమయం లేకపోవడంతో వారి కుటుంబసభ్యులకు విషయాన్ని వివరించారు. కుటుంబ సభ్యులతో సంప్రదించిన అనంతరం మహేష్ భార్య కాలేయాన్ని దానం చేసేందుకు ముందుకు వచ్చిందన్నారు. అయితే రోగికి అవసరమైన పూర్తి కాలేయాన్ని అతని భార్య నుంచి సేకరించే అవకాశం లేకపోయిందని, దీంతో మహేష్ సోదరుడికి పరీక్షలు నిర్వహించామన్నారు. అతని తమ్ముడి వద్ద నుంచి సైతం పూర్తి కాలేయాన్ని సేకరించే అవకాశం లేకపోవడంతో ఇద్దరి నుంచి కాలేయాన్ని సేకరించి మహేష్‌కు అమర్చాలని నిర్ణయించినట్లు తెలిపారు. శస్త్ర చికిత్స విజయవంతం కావడంతో కుటుంబసభ్యులు, వైద్యులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ రకమైన శస్త్ర చికిత్స తెలుగు రాష్ట్రాల్లో మొదటిసారి నిర్వహించామని, ప్రస్తుతం దాతలు రోగి పూర్తి ఆరోగ్యంగా ఉన్నట్లు తెలిపారు. బాధితుడు మహేష్ మాట్లాడుతూ స్టార్ ఆస్పత్రి డాక్టర్లు, తనకు మరో జన్మను ప్రసాదించారని కొనియాడారు. కార్యక్రమంలో ఆస్పత్రి వైద్యులు రాహుల్, రమేష్, ఆదిత్య, భరత్, ప్రవీణ్, హరీష్ పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న ఆస్పత్రి వైద్య బృందం, రోగి, దాతలు

పాత వాహనాలతోనే ప్రమాదాలెక్కువ!

- రోడ్లపై దూసుకెళ్తున్న 10 ఏళ్లకు మించిన వాహనాలు
- గతేడాది రాష్ట్రంలో 3,585 రోడ్డు ప్రమాదాలు
- 1,225 మంది మృతి, 472 మందికి గాయాలు
- ప్రతి మూడు ప్రమాదాల్లో ఒకటి ఓల్డ్ వెహికిల్స్ కారణంగానే..
- ఫిట్ నెస్ లేకపోవడమే ప్రధాన కారణం

సాక్షి, సిటీబ్యూరో: అతివేగం ప్రమాదకరం.. వాహనం కొత్తదైనా, పాతదైనా! రాష్ట్రంలోని రోడ్ల మీద కాలం చెల్లిన వాహనాలు దూసుకెళుతున్నాయి. దీంతో ఏటా రోడ్డు ప్రమాదాలు పెరిగిపోతున్నాయి. గతేడాది 10 ఏళ్ల కంటే మించిన వాహనాలతో రాష్ట్రంలో 3,585 రోడ్డు ప్రమాదాలు జరిగాయి. వీటిలో 1,225 మంది మృతి చెందగా.. 3472 మంది క్షతగాత్రులయ్యారని కేంద్ర రోడ్డు ప్రమాదాల గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ఓల్డ్ వెహికిల్స్‌తో రోడ్డు ప్రమాదాలు ఏడాది కాలంలో రెట్టింపయ్యాయి. 15 ఏళ్ల కంటే మించిన వాహనాల కారణంగా 2021లో 722 రోడ్డు ప్రమాదాలు జరగగా.. 2022లో 1,306కు పెరిగాయి. ఈ ప్రమాదాల్లో 418 మంది మృతి చెందగా, 132 మంది గాయపడ్డారు. 10–15 ఏళ్ల మధ్య ఉన్న వాహనాలతో 2022లో 2,279 రోడ్డు ప్రమాదాలు నమోదయ్యాయి. వీటిలో 807 మంది మృతి చెందగా.. 340 మంది తీవ్రంగా, 1,786 మందికి స్వల్ప గాయాలయ్యాయి.

ఫిట్‌నెస్ లేనందునే..

పాత వాహనాలకు ఫిట్‌నెస్ సరిగా లేకపోవడమే రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణం. 10 ఏళ్లు దాటిన వాహనాలకు తరుచూ ఆయిల్ కారడం, బ్రేక్‌లు, క్లచ్‌లు సరిగా పని చేయకపోవడం తదితర సమస్యలు ఎదురవుతుంటాయి. దీంతో డ్రైవర్లు నియంత్రణ కోల్పోయి ప్రమాదాలు జరుగుతాయని రోడ్డు భద్రతా నిపుణులు చెబుతున్నారు. ఈ ఘటనల్లో పాదచారులు, కారు, ద్విచక్ర వాహనదారులు ఎక్కువగా ప్రమాదాల బారిన పడుతున్నారు. ఫిట్‌నెస్ ఉన్న వాహనాలను మాత్రమే రోడ్ల మీదకు అనుమతించేలా చర్యలు తీసుకుంటేనే ప్రమాదాలను నియంత్రించగమని నిపుణులు సూచిస్తున్నారు.

కాలుష్యం కూడా..

రాష్ట్రంలో ప్రతి మూడు రోడ్డు ప్రమాదాల్లో ఒకటి పాత వాహనాల వల్లే జరుగుతున్నాయి. కాల పరిమితి దాటిన బస్సులు, లారీలు, ట్యాక్సీలు ఎక్కువగా రోడ్ల మీద తిరుగుతుంటాయి. సాధారణంగా ఒక బస్సు జీవితకాలం దాదాపు 12 లక్షల కిలోమీటర్లు ఉంటుంది అది కూడా నిర్వహణ సరిగా ఉంటేనే. అయితే రాష్ట్రంలో 15 లక్షల కిలో మీటర్లు దాటిన బస్సులు కూడా తిరుగుతున్నాయి. ఈ వాహనాలతో రోడ్డు ప్రమాదాలతో పాటు కాలుష్యాన్ని కూడా వెదజల్లుతుంటాయి.

రాష్ట్రంలో పాత వాహనాలతో రోడ్డు ప్రమాదాలు గణాంకాలివీ..

10 నుంచి 15 ఏళ్ల వాహనాలు	2022	2021	2020
ప్రమాదాలు	2,279	2,270	2,023
మృతులు	807	797	643
క్షతగాత్రులు	340	212	212

15 ఏళ్లకు మించిన వాహనాలు	2022	2021	2020
ప్రమాదాలు	1,306	722	799
మృతులు	418	226	219
క్షతగాత్రులు	132	82	44

సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ ఆత్మహత్య



నాగచక్రపాణి(ఫైల్)

గచ్చిబౌలి: ఓ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ జేమ్స్ బాబు కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. నంద్యాల జిల్లా, బత్తలూరు గ్రామానికి చెందిన దంపతులు గజ్జల నాగశేషులు, రామలక్ష్మమ్మ దంపతుల కుమారుడు గజ్జల నాగచక్రపాణి(28) ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లోని ఓ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పని చేస్తూ గచ్చిబౌలిలోని పీజీ హాస్టల్‌లో ఉంటున్నాడు. రెండు రోజులుగా ఆఫీసుకు సెలవు పెట్టి గదిలోనే ఉన్నాడు. బుధవారం మధ్యాహ్నం హాస్టల్ వద్దకు వచ్చిన శివ నాగరాజుతో మాట్లాడిన అనంతరం గదిలోకి వెళ్లి గడియ పెట్టుకున్నాడు. సాయంత్రం డ్యూటీ నుంచి వచ్చిన రూమ్మేట్ వేణుగోపాల్ రెడ్డి ఎంత పిలిచినా స్పందించలేదు. హాస్టల్ నిర్వాహకులతో కలిసి కిటికీలోంచి చూడగా సీలింగ్ ఫ్యాన్‌కు బెడ్ షీట్‌తో ఉరి వేసుకుని కనిపించాడు. గచ్చిబౌలి పోలీసులకు సమాచారం అందించడంతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని ఉస్మానియా హాస్పిటల్‌కు తరలించారు. పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. ప్రేమ విఫలం కావడంతోనే ఆత్మహత్యకు పాల్పడినట్లు ప్రాథమిక విచారణలో తెలిసిందని పోలీసులు పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

తాళం తెరవాలని పిలిస్తే..

రూ. 30 లక్షల విలువైన ఆభరణాలు చోరీ

వెంగళరావునగర్: బీరువా తాళాలు కనిపించక పోవడంతో డూప్లికేట్ తాళాలతో బీరువా తెరవాలని పిలిచినందుకు ఇద్దరు వ్యక్తులు దాదాపు రూ. 30 లక్షల విలువైన అరకిలో బంగారు నగలు దోచుకెళ్లిన సంఘటన మధురానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. మధురానగర్ పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. వెంగళరావునగర్ డివిజన్ కళ్యాణ్‌నగర్ ఫేజ్–1లో నివసించే పి.సూర్యనారాయణరాజు గత నెలలో తన ఇంట్లో శుభకార్యం ఉండటంతో బ్యాంకులో ఉన్న దాదాపు 488 గ్రాముల బంగారు ఆభరణాలు ఇంటికి తీసుకువచ్చాడు. శుభకార్యం ముగిసిన అనంతరం వాటిని అల్మారాలో పెట్టి తాళం వేశాడు. ఈ నెల 9న అల్మరా తెరిచేందుకు చూడగా తాళాలు కనిపించలేదు. దీంతో మధురానగర్‌లో తారసపడిన తాళాలు తీసే ఇద్దరు వ్యక్తులను ఇంటికి తీసుకువచ్చాడు. వారు ఎంతో ప్రయత్నించినా అల్మరా తాళం తెరుచుకోలేదు. దీంతో రేపు వచ్చి తెరుస్తామని చెప్పి వెళ్లిపోయారు. 10వ తేదీ ఇంటికి వచ్చిన వారు తాళం తీస్తున్నట్లుగా నటిస్తూ ఇంటి యజమానిని మంచినీళ్లు కావాలని అడిగారు. నీళ్లు తాగిన కొద్ది సేపటికి అల్మరా లాక్ జామ్ అయ్యిందని, తెరుచుకోవడం కష్టమని చెప్పడంతో యజమాని వారికి రూ. 200 ఇవ్వగా తీసుకుని వెళ్లిపోయారు. ఆ తర్వాత కొద్ది రోజులకే కనిపించకుండా పోయిన కీ దొరకడంతో దాని సహాయంతో అల్మరా తెరవడానికి ప్రయత్నించారు. అయితే అల్మరా తెరుచుకోకపోవడంతో ఈ నెల 16న యూసుఫ్‌గూడలో బీరువా తాళాలు బాగుచేసే వ్యక్తిని తీసుకు రాగా, అతను మరమ్మతు చేసి అల్మరా తెరిచాడు. అయితే అందులో ఉండాల్సిన బంగారు ఆభరణాలు కనిపించలేదు. దీంతో ఆందోళనకు గురైన సూర్యనారాయణ రాజు తొలుత తమ ఇంటికి వచ్చిన ఇద్దరు వ్యక్తులపై అనుమానం వ్యక్తం చేస్తూ మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజల సహకారంతోనే శాంతి భద్రతల పరిరక్షణ

నగర పోలీసు కమిషనర్ కె.శ్రీనివాస్‌రెడ్డి

చార్మినార్: శాంతి భద్రతల పనిరక్షణకు పోలీసులు, అధికారులు నిరంతరాయంగా పని చేయాలని నగర పోలీస్ కమిషనర్ కె.శ్రీనివాస్ రెడ్డి అన్నారు. గురువారం పాతబస్తీలో పర్యటించిన ఆయన ముందుగా పురానీహవేలీలోని దక్షిణ మండలం డీసీపీ కార్యాలయాన్ని సందర్శించారు. పాతబస్తీలో శాంతి భద్రతలతో పాటు దక్షిణ మండలంలోని రౌడీషీటర్ల వివరాలను డీసీపీ పి.సాయిచైతన్యను అడిగి తెలుసుకున్నారు. అనంతరం దక్షిణ మండలం డీసీపీ కార్యాలయ భవన నిర్మాణ పనులను పరిశీలించారు.అక్కడి నుంచి నేరుగా చార్మినార్‌కు చేరుకుని పరిసరాలను పరిశీలించారు. చార్మినార్ ఏసీపీ కార్యాలయంతో పాటు చార్మినార్ పోలీసు స్టేషన్‌ను సందర్శించి బందోబస్తు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా చార్మినార్ వద్ద విలేకరులతో మాట్లాడుతూ..శాంతి భద్రతల పరిరక్షణలో నగర పోలీసులు రౌండ్ ది క్లాక్ సేవలను అందజేస్తున్నారన్నారు. విధినిర్వహణలో నిర్లక్ష్యం పనికిరాదన్నారు. శాంతి భద్రతల పరిరక్షణలో అన్ని వర్గాల ప్రజలు పోలీసులకు సహకరించాలన్నారు. కార్యక్రమంలో దక్షిణ మండలం అదనపు డీసీపీ షేక్ జహంగీర్, చార్మినార్ ఏసీపీ రుద్రభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



చార్మినార్ ఏసీపీ కార్యాలయం వద్ద నగర పోలీస్ కమిషనర్ కె.శ్రీనివాస్‌రెడ్డి

చంపేసి..చెత్త కుండీలో వేసి కాల్చేసి...

జియాగూడలో వ్యక్తి దారుణ హత్య

జియాగూడ: ఓ వ్యక్తిని దారుణంగా హత్యచేసి అతడి చేతిని నరికేసి మృతదేహాన్ని చెత్తకుండీలో వేసి పెట్రోల్‌పోసి తగలబెట్టిన సంఘటన కుల్సుంపురా పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికుల సమాచారంతో డీసీపీ బాలస్వామి, ఏసీపీ జావేద్, కుల్సుంపురా ఇన్‌స్పెక్టర్ అశోక్‌కుమార్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ... కుల్సుంపురా పోలీస్‌స్టేషన్ పరిధిలోని జియాగూడ, జోర్‌బస్తీ శ్మశానవాటిక పక్కన చెత్తకుండీలో పూర్తిగా కాలిపోయిన వ్యక్తి మృతదేహం ఉన్నట్లు గుర్తించిన స్థానికులు సమాచారం అందించడంతో సంఘటనా స్థలాన్ని పరిశీలించామన్నారు. మృతుడు అనిల్‌కుమార్ (35)గా గుర్తించినట్లు తెలిపారు. ఇదే ప్రాంతానికి చెందిన వ్యక్తులు పాత కక్షల కారణంగా హత్య చేసి ఉండవచ్చునని భావిస్తున్నామన్నారు. నిందితులు హత్య అనంతరం అనిల్ కుమార్ చేతిని నరికి జియాగూడలో తిరిగినట్లు తెలిసిందన్నారు. సంఘటనా స్థలానికి చేరుకున్న క్లూస్‌టీం ఆధారాలు సేకరించాయి. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు.



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న డీసీపీ బాలస్వామి తదితరులు

స్టడీ సర్కిళ్ల మాటున నకిలీ సర్టిఫికెట్ల విక్రయం

- ఇద్దరి అరెస్ట్
- పలు యూనివర్సిటీల నకిలీ సర్టిఫికెట్లు స్వాధీనం

ఉప్పల్: దేశంలో వివిధ ప్రాంతాల్లోని యూనివర్సిటీలకు చెందిన నకిలీ సర్టిఫికెట్లను విక్రయిస్తూ పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్న ముఠా గుట్టును ఎల్‌బీనగర్ ఎస్‌వోటీ పోలీసులు రట్టు చేశారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మంచిర్యాల రామ్‌నగర్ ప్రాంతానికి చెందిన ముదాం రవి ఎంఆర్ స్టడీ సర్కిల్ నిర్వహిస్తున్నాడు. అతను అదే జిల్లా జయపూర్ ప్రాంతానికి చెందిన వికాస్ స్టడీ సర్కిల్ నిర్వాహకుడు సయ్యద్ నౌషద్‌తో కలిసి ముఠాగా ఏర్పాటు చేశాడు. పంజాబ్ ప్రాంతానికి చెందిన ప్రింటర్‌తో చేతులు కలిపి మేడిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో కేంద్రాన్ని ఏర్పాటు చేసి నకిలీ డిగ్రీ సర్టిఫికెట్లను విక్రయిస్తున్నారు. దీనిపై సమాచారం అందడంతో ఎస్‌ఓటీ పోలీసులు నిఘా ఏర్పాటు చేశారు. గురువారం వారి స్థావరంపై దాడి చేసి వా నుంచి వివిధ గుర్తింపు పొందిన యూనివర్సిటీల ఫేక్ సర్టిఫికెట్లు, బీటెక్ సర్టిఫికెట్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ప్రింటర్ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.



పోలీసుల అదుపులో నిందితులు

దారి దోపిడీకి యత్నం

- ఇద్దరు యువకుల అరెస్ట్
- మారణాయుధాలు స్వాధీనం

మైలార్‌దేవ్‌పల్లి: దారి దోపిడీకి పథకం పన్నిన ఇద్దరు యువకులను పోలీసులు అరెస్ట్ చేసిన సంఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది .సీఐ మధు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి..గంజాయి సరఫరా జరుగుతున్నట్లు సమాచారం అందడంతో బుధవారం లక్ష్మిగూడ వాంబేకాలనీ రోడ్డులో శంషాబాద్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఆదేశాల మేరకు కానిస్టేబుళ్లు లింగయ్య, హరినాథ్ వాహనాలను తనిఖీ చేస్తున్నారు. అదే సమయంలో బైక్‌పై వస్తున్న ఇద్దరు యువకును అనుమానంతో ఆపడానికి యత్నించగా, వారు తమ వద్ద నున్న పెప్పర్ స్ప్రే బాటిల్‌తో పోలీసులపై స్ప్రే చేసి బైక్‌ను అక్కడే వదిలి పరారయ్యారు. కానిస్టేబుళ్లు ఈ ఘటనపై ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. మైలార్‌దేవ్‌పల్లి ఇన్ స్పెక్టర్ మధు, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ వారు వదిలి వెళ్లిన బైక్ నంబర్ ఆధారంగా నిందుతులను అదుపులోకి తీసుకున్నారు.వారి నుంచి రెండు స్టీల్ కత్తులు, డమ్మీ పిస్టల్ ,రెండు చిల్లీ స్ప్రే బాటిళ్లు, రెండు సెల్ ఫోన్లు స్వాధినం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. నిందితులు ఫలక్‌నుమాకు చెందిన ఖారింఖాన్ మోతిజైన్, మతిన్ ఖాన్ (23గా గుర్తించారు. చెడు వ్యసనాలకు బానిసలైన వీరు ఇరువురు సులువుగా డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో నిర్మానుష్య ప్రాంతాల్లో ఒంటరిగా వెళ్లే వారిని బెదిరించి డబ్బులు లాక్కోవాలని పథకం పన్నినట్లు తెలిపారు. నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.



స్వాధీనం చేసుకున్న మారణాయుధాలు

బైక్ తీయలేదని..

- యువకులపై దాడి
- ఇద్దరికి తీవ్ర గాయాలు
- చికిత్స పొందుతూ ఒకరి మృతి

దుండిగల్: ట్యాంకర్ ముందు అడ్డుగా ఉన్న బైక్‌ను తీయమన్నందుకు నిరాకరించడంతో జరిగిన దాడిలో ఓ యువకుడు మృతి చెందిన సంఘటన దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. జగద్గిరిగుట్టకు చెందిన భద్రారావు కుమారుడు నాగశివ(29) క్యాటరింగ్ పనులు చేస్తుంటాడు. ఈ నెల 20న క్యాటరింగ్ పని ఉండడంతో సూరారం ప్రాంతానికి చెందిన తన సహచరుడు మహ్మద్ సోహెన్ వద్దకు వెళ్లాడు. అక్కడి నుంచి బైక్‌పై డి.పోచంపల్లి కృష్ణానగర్‌లో ఉంటున్న మరో యువకుడి వద్దకు వెళ్లారు. అతని ఇంటి పక్కనే బైక్‌ను పార్క్ చేసి అతడి కోసం వేచి చేస్తున్నారు. అదే సమయంలో కృష్ణానగర్‌కు చెందిన అనుశ్ బగిడి తన సెప్టిక్ ట్యాంకర్‌కు అడ్డుగా పెట్టిన బైక్‌ను తీయాలని కోరగా, వారు నిరాకరించారు. దీంతో వారి మధ్య మాటా మాటా పెరిగింది. దీంతో అనుశ్ వారిపై దాడి చేశాడు. అతని నుంచి తప్పించుకుని వెళ్తున్న నాగశివ, సోహెన్‌పై గండిమైసమ్మ చౌరస్తాలో అనుశ్ తన మనుషులు అరుణ్‌సింగ్, విజయ్ సింగ్, ఆసిస్ చౌదరి,రాహుల్ బగిడి, అనురాగ్‌తో కలిసి మరో సారి దాడి చేశాడు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన నాగశివను స్థానికులు ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. సోహెన్‌కు గాయాలయ్యాయి. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు దుండిగల్ పోలీసులు నిందితులపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చిక్కడపల్లి మాజీ డీఐ పై కేసు నమోదు

చిక్కడపల్లి: చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఇటీవల డీఐగా నెలరోజుల పాటు పనిచేసిన వి.ప్రసాద్‌పై చిక్కడపల్లి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. రియల్టర్‌పై దాడి చేసినట్లుగా ఫిర్యాదు అందడంతో మాజీ డిఐ ప్రసాద్‌పై కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ ఎ.సీతయ్య తెలిపారు. ఇన్‌స్పెక్టర్ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఎన్నికల సమయంలో వి.ప్రసాద్ చిక్కడపల్లి డీఐగా ఒక నెలరోజుల పాటు పనిచేశారు. రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసం అతను తన స్నేహితుడైన రాజు అనే రియల్టర్‌కు డబ్బులు ఇచ్చారు. అయితే కంపెనీ రిజిస్ట్రేషన్‌లో తన అన్న శేఖర్ పేరు పెట్టాలని మాజీ డీఐ ప్రసాద్ రాజుకు సూచించాడు. అయితే రాజు అందుకు విరుద్ధంగా మరో పేరుతో కంపెనీ రిజిస్టర్ చేయడంతో తన డబ్బులు తిరిగి ఇవ్వాలని కోరాడు. రాజు డబ్బులు తిరిగి ఇవ్వకపోవడం చిక్కడపల్లి పీఎస్‌కు చెందిన కానిస్టేబుళ్లు ఇద్దరితో కలిసి అతడిని పీఎస్‌కు తీసుకువచ్చి చితకబాదినట్లు సమాచారం. అయితే ఈ దాడిలో కానిస్టేబుళ్లు ఎవరూ పాల్గొన లేదని, ముగ్గురు బయటి వ్యక్తులే దాడి చేశారని, బాధితుడు రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

మరోసారి వార్తల్లోకి చిక్కడపల్లి పీఎస్...

గత మూడేళ్లుగా చిక్కడపల్లి పీఎస్ తరచూ వివాదాలకు కేంద్రంగా మారుతోంది. గతంలో ఇన్‌స్పెక్టర్ శివశంకర్‌రావు, డీఐ ప్రభాకర్ భార్యాభర్తల కేసులో జోక్యం చేసుకున్నట్లు ఆరోపణలు రావడంతో సస్పెండయ్యారు. పోటీ పరీక్షల అభ్యర్థిని ప్రవళిక ఆత్మహత్య కేసులో తాత్సారం చేశారని ఆరోపణలు ఎదుర్కొన్న సీఐ నరేష్ సస్పెండైన విషయం తెలిసిందే. ఇటీవల చిక్కడపల్లి ఏసీపీ ఎన్నికల్లో డబ్బుల పంపిణీ విషయంలో అలసత్వం వ్యవహరించినట్లు ఆరోపణలు రావడంతో సస్పెండైన విషయం విదితమే.

'ఫిల్మ్‌సిటీ భూములపై విచారణ జరిపించాలి'

సాక్షి,సిటీబ్యూరో: రామోజీ ఫిల్మ్ సిటీ భూములపై విచారణ జరిపి సీలింగ్, అసైన్డ్ భూముల నిగ్గు తేల్చాలని తెలంగాణ రియలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నారగోని ప్రవీణ్‌కుమార్ ప్రభుత్వానికి డిమాండ్ చేస్తూ గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. గత ముఖ్యమంత్రి కేసీఆర్ తెలంగాణ ఏర్పాటు అనంతరం రామోజీ ఫిల్మ్ సిటీ ని లక్ష నాగళ్లతో దున్నుతామని ప్రకటించి వెనుకకు తగ్గారని విమర్శించారు. ఫిల్మ్‌సిటీలో దున్నడానికి నాగళ్లు దొరక లేదా లేక ప్రభుత్వ భూమి లేదా నిగ్గు తేలాల్సి అవసరం ఎంతైనా ఉందన్నారు. గత ప్రభుత్వం రామోజీ రావుతో కుమ్మక్కైనట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయన్నారు. పదేళ్ల పాటు ప్రభుత్వానికి రామోజీ రావు పత్రిక అధిక ప్రాధాన్యం ఇవ్వడం ఇందుకు బలం చేకూర్చుతుందన్నారు. అదే విధంగా మాజీ నక్సలైట్ నయీం మరణాంతరం అతని ఆస్తులు ఏమయ్యాయన్న అంశంపై ప్రజలకు అనుమానాలున్నాయని వాటిపై కూడా విచారణ చేసి నిజాలను ప్రజల ముందు ఉంచాలన్నారు.

ఘరానా దొంగ అరెస్ట్

- 23 తులాల బంగారు ఆభరణాలు
- రూ. 93 వేల నగదు స్వాధీనం

ముషీరాబాద్: ఇళ్ల తాళాలు పగలగొట్టి చోరీలకు పాల్పడుతున్న ఘరానా దొంగను ముషీరాబాద్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ముషీరాబాద్ ఇన్‌స్పెక్టర్ వెంకట్‌రెడ్డి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. గుంటూరు జిల్లా, తాళ్లూరుకు చెందిన రాయపాటి వెంకటరావు(51) నిజాంపేట్‌లోని పీఆర్ హోమ్స్‌లో నివాసం ఉంటున్నాడు. చోరీలనే వృత్తిగా ఎంచుకున్న అతడిపై ఎస్ఆర్‌నగర్, కూకట్‌పల్లి, కేపీహెచ్‌బీ తదితర పోలీస్ స్టేషన్లలో పలు కేసులు ఉన్నాయి. గత నెల 28న ముషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని లక్ష్మి అనూష అపార్ట్‌మెంట్‌లో ఉంటున్న డెబోరా ఇంటి తాళాలు పగులగొట్టి బీరువాలో ఉన్న 23.2 తులాల బంగారు నగలు, రూ.93 వేల నగదు, మూడు ఏటీఎం కార్డులు చోరీ చేశాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టిన ఎస్సై చలపతిరెడ్డి సీసీ కెమెరాల ఫుటేజీ ఆధారంగా నిందితుడు రాయపాటి వెంకటరావును అరెస్టు చేశారు. అతడి నుంచి చోరీ సొత్తును స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు.



మంత్రి కొండా సురేఖకు అభినందన



బంజారాహిల్స్: తెలంగాణ రాష్ట్ర దేవాదాయ శాఖామంత్రిగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన కొండా సురేఖను తెలంగాణ రాష్ట్ర దేవాలయాల కార్యనిర్వహణాధికారుల సంఘం అధ్యక్షుడు నరేందర్ ఆధ్వర్యంలో సభ్యులు గురువారం జూబ్లీహిల్స్ రోడ్ నెం. 10సీలోని ఎంపీ, ఎమ్మెల్యే కాలనీలో ఆమె నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. అర్చకులు ఆమెను సంప్రదాయబద్ధంగా ఆశీర్వదించారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షులు అంబుజ, ఎస్. లావణ్య, కార్యదర్శి శ్రీనివాస్‌శర్మ, తదితరులు పాల్గొన్నారు.

రౌండ్‌టేబుల్ స్కూల్‌లో నీటి సమస్య పరిష్కారానికి చర్యలు



ఫిలింనగర్ రౌండ్‌టేబుల్ స్కూల్‌లో చేపట్టిన పైప్‌లైన్ పనులు

ఫిలింనగర్: జూబ్లీహిల్స్ డివిజన్ పరిధిలోని ఫిలింనగర్ రౌండ్‌టేబుల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు గత కొంత కాలంగా మరుగుదొడ్లలో నీళ్లు రావడం లేదు. దీంతో ఈ పాఠశాలను దత్తత తీసుకున్న రోటరీ క్లబ్ ఆఫ్ జూబ్లీహిల్స్ ప్రతినిధులు స్పందించారు. గ్రౌండ్‌ఫ్లోర్ నుంచి పై అంతస్తులో ఉన్న ట్యాంక్‌లకు నీళ్లు ఎక్కించి అక్కడి నుంచి పైపుల ద్వారా మరుగుదొడ్లకు కనెక్షన్లు ఇచ్చే ప్రక్రియను ఈ స్వచ్ఛంద సంస్థ చేపట్టింది. పైన వాటర్ ట్యాంకర్ ఏర్పాటు చేసి పైప్‌లైన్ కనెక్షన్ కూడా ఇస్తున్నారు. రూ. 70 వేల వ్యయంతో రోటరీ క్లబ్ ఆఫ్ జూబ్లీహిల్స్ ఈ పనులు చేపట్టింది. వారం రోజుల నుంచి పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. మరో రెండు రోజుల్లో పనులు పూర్తవుతాయని విద్యార్థులకు మరుగుదొడ్లలో సమస్య పూర్తిగా పరిష్కారం అవుతుందని సంస్థ ప్రతినిధులు చంపకారావు తెలిపారు.

రక్షణ కోసం పోలీసులను ఆశ్రయించిన దంపతులు

వెంగళరావునగర్: రక్షణ కల్పించాలంటూ దంపతులు మధురానగర్ పోలీసులను ఆశ్రయించారు. పోలీసుల సమాచారం మేరకు... నగరంలోని మల్కాజ్‌గిరిలో నివసించే మీనా(25), రహమత్‌నగర్ డివిజన్ కార్మికనగర్‌లో నివాసం ఉండే జ్ఞానేశ్వర్ కొంతకాలంగా పంజగుట్టలోని ఓ జ్యువెలరీ షాపులో విధులు నిర్వహిస్తుండేవారు. జ్ఞానేశ్వర్‌కు గతంలోనే వివాహం జరిగింది. పిల్లలు కూడా ఉన్నారు. కొన్నేళ్ల కిందట జ్ఞానేశ్వర్ భార్య మృతి చెందడంతో ఆమె తల్లిదండ్రులు పిల్లలను కూడా తమ వెంట తీసుకెళ్లారు. ఇదిలా ఉండగా రెండేళ్ల కిందట జ్ఞానేశ్వర్ తాను పని చేసే చోటనే విధులు నిర్వహించే మీనా అనే యువతిని ప్రేమించాడు. ఇరువురు నాటి నుంచి పెళ్లి చేసుకోవాలని అనుకున్నారు. మీనా ఈ విషయాన్ని తమ తల్లిదండ్రులు, సోదరిలకు తెలియజేసింది. దాంతో ఆగ్రహించిన మీనా కుటుంబ సభ్యులు నాటి నుంచి ఆమెతో మాట్లాడటం మానేశారు. ఈ నెల 7వ తేదీన ఇరువురూ రిజిస్ట్రార్ కార్యాలయంలో వివాహం చేసుకున్నారు. దాంతో యువతి తల్లిదండ్రులు మల్కాజ్‌గిరి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఇరువురిని మల్కాజ్‌గిరి పోలీసు స్టేషన్‌కు తీసుకెళ్లి విచారించారు. అనంతరం వారు మేజర్లు అవడమే కాకుండా ఇరువురు అంగీకారంతో వివాహం చేసుకోవడంతో వారిని మధురానగర్ పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చారు. స్థానిక పోలీసులు ఇరు కుటుంబాల వారిని పిలిపించి వారి వివాహాన్ని అంగీకరించాలని సూచించారు. ఈ నేపథ్యంలో తమకు రక్షణ కల్పించాలంటూ దంపతులు పోలీసులను కోరారు.

వేడుకగా ఒరియా సెమీ క్రిస్మస్ సంబరాలు



క్రీస్తు సందేశం ఇస్తున్న పాస్టర్ ప్రభుదాస్

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నెం. 12లోని ఎమ్మెల్యే కాలనీలోని షారోన్‌ఫుల్ గాస్పెల్ చర్చిలో గురువారం న్యూ లైఫ్ ఒరియా కమ్యూనిటీ చర్చి ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలు కనుపండువగా జరిగాయి. నగరంలోని నివసిస్తున్న క్రిస్టియన్ ఒడిస్సీలు ఈ వేడుకల్లో పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. రెవరెండ్ సుశీల్ కుమార్‌చత్తార్, పాస్టర్ రష్మీ చత్తార్, రెవరెండ్ పాస్టర్ ఎం. ప్రభుదాస్‌లు క్రీస్తు సందేశం ఇచ్చారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అనంతరం క్రిస్మస్ కేక్ కట్ చేశారు.

వైకుంఠ ఏకాదశికి ఆహ్వానం



బంజారాహిల్స్: ఈ నెల 23న జరగనున్న వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని ఉత్తరద్వార దర్శనం చేసుకొని స్వామివారికి విశేష పూజలు నిర్వహించాల్సిందిగా దేవాదాయ శాఖామంత్రి కొండా సురేఖను గురువారం శ్రీనగర్ కాలనీ శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానం ఈవో ఎస్. లావణ్య, ప్రధాన అర్చకులు మురళీధర శర్మ తదితరులు ఆహ్వానించారు. ఇందుకు మంత్రి సానుకూలంగా స్పందించారు.

ఆలయ కాపలాదారుడికి బీఆర్‌ఎస్ నేత బెదిరింపు

బోరబండ పీఎస్‌లో బాధితుడి ఫిర్యాదు

రహమత్‌నగర్: ఓంనగర్‌కు చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు తనను బెదిరిస్తున్నాడని, అతని వల్ల తనకు ప్రాణహాని ఉందని అమ్మవారి ఆలయ కాపల దారుడు ముద్దంగుల ఎల్లయ్య గురువారం బోరబండ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ సందర్భంగా ఎల్లయ్య మాట్లాడుతూ... వడ్డెర సంఘం ఆధ్వర్యంలో క్వారీ స్థలంలో నిర్మాణంలో ఉన్న అమ్మ వారి ఆలయానికి కాపలాదారునిగా తనను వడ్డెర సంఘం నాయకులు నియమించారని తెలిపారు. ఆలయ స్థలంలో గుడి పక్కన చిన్న గుడిసెను ఏర్పాటు చేసి కాపలా కాస్తున్నానని ఎల్లయ్య చెప్పారు. ఓంనగర్ బస్తీకి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు సుబ్బారాజు కొన్ని రోజులుగా తమ ఉండే గుడిసె వద్దకు వచ్చి ఈ స్థలం తనదని వెంటనే ఖాళీ చేసి వెళ్లాలని తనను బెదిస్తున్నాడని వాపోయారు. ఈ స్థలం తాను కొన్నాను అంటూ తన సంతకాన్ని ఫోర్జరీ చేసిన పత్రాన్ని చూపించి భయాభ్రాంతులకు గురిచేస్తున్నాడని ఎల్లయ్య ఆరోపించారు. అతని వల్ల తనకు ప్రాణాహాని ఉందని, సుబ్బారాజుపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ఎల్లయ్య పోలీసులను కోరారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

కోవిడ్ మాక్‌డ్రిల్!

- అప్రమత్తమైన ఆస్పత్రుల వైద్య సిబ్బంది
- ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, బస్తీ దవాఖానాల్లో నో మాస్క్ నో ఎంట్రీ
- అనుమానితులకు ర్యాపిడ్ పరీక్షలు, తీవ్రతను బట్టి ఆర్టీపీసీఆర్ టెస్టులు
- ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మాక్‌డ్రిల్ నిర్వహించిన వైద్య సిబ్బంది



బంజారాహిల్స్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో కరోనా వైద్య పరికరాలతో మాక్ డ్రిల్ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

బంజారాహిల్స్: కరోనా మహమ్మారి మరోసారి కలవరపెడుతున్న నేపథ్యంలో సర్కారు దవాఖానాలు అప్రమత్తమయ్యాయి. గురువారం ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ నియోజకవర్గాల పరిధిలో ఉన్న 11 ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 19 బస్తీ దవాఖానాల్లో వైద్య బృందం మాక్ డ్రిల్ నిర్వహించారు.

- గతంలో కరోనా సమయంలో పరీక్షల కోసం తీసుకొచ్చిన పరికరాలతో మాక్‌డ్రిల్ నిర్వహించారు. ఆయా ఆస్పత్రుల్లో వేసిన కుర్చీలను తొలగించి ఆస్పత్రికి వచ్చే వారు భౌతిక దూరాన్ని పాటించేలా సూచనలు ఇచ్చారు. అదే విధంగా బస్తీ దవాఖానాల్లో, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో నో మాస్క్ నో ఎంట్రీ నిబంధనను కఠినంగా అమలు చేయనున్నట్లు బంజారాహిల్స్ ప్రాథమిక వైద్యాధికారి కార్తీక్ తెలిపారు.
- అనుమానితులకు ర్యాపిడ్ టెస్టులు చేయడంతో పాటు వ్యాధి తీవ్రత లక్షణాలు ఎక్కువ ఉన్న వారికి ఆర్టీపీసీఆర్ పరీక్షలను చేయనున్నారు. పలువురు అనుమానితులకు అక్కడికక్కడే ర్యాపిడ్ టెస్టులు కూడా నిర్వహించారు. తగిన మందులు కూడా అందజేశారు.
- కరోనా మరోసారి తన ప్రతాపాన్ని చూపిస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తప్పనిసరిగా మాస్క్ ధరించడంతో పాటు సోషల్ డిస్టెన్స్ పాటించాలని ప్రభుత్వ వైద్యులు హెచ్చరిస్తున్నారు.
- ఏ మాత్రం లక్షణాలు కనిపించినా వెంటనే ఆస్పత్రుల్లో పరీక్షలు నిర్వహించుకోవాలని సూచించారు. అన్ని ఆస్పత్రుల్లో కరోనా సంబంధిత పరీక్షలు చేయడానికి సౌకర్యాలు ఉన్నాయని వైద్యులు తెలిపారు.
- ఇదిలా ఉండగా మూడు రోజుల నుంచి కరోనా పాజిటివ్ కేసులు తెలంగాణలో నమోదు అవుతుండగా దగ్గు, జలుబు, జ్వరంతో బాధపడుతున్న పలువురు సర్కారు దవాఖానాలకు రాగా వారికి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు ఎలాంటి కరోనా లక్షణాలు లేవని తేలుస్తున్నారు.
- దీంతో బాధితులు ఊపిరిపీల్చుకుంటున్నారు. అదే సమయంలో వ్యాధి నివారణకు జాగ్రత్తలు పాటించాలంటూ వైద్యులు సూచిస్తున్నారు.



మాస్కులు ధరించి ఆస్పత్రికి వచ్చిన రోగులు

24న ప్రవాసి తెలంగాణ దివస్



పోస్టర్ ఆవిష్కరిస్తున్న టీడీఎఫ్ ప్రతినిధులు

పంజగుట్ట: తెలంగాణ డెవలప్‌మెంట్ ఫోరం యూఎస్‌ఏ (టీడీఎఫ్) ఆధ్వర్యంలో ఈ నెల 24న రవీంద్రభారతిలో ప్రవాసీ తెలంగాణ దివస్ నిర్వహిస్తున్నట్లు టీడీఎఫ్ అధ్యక్షులు దివేష్ అవిరెడ్డి తెలిపారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో కార్యక్రమ పోస్టర్‌ను అడ్వైజర్ డీ.పీ. రెడ్డి, మాజీ అధ్యక్షురాలు కవితా చల్లా, మురళి చింతలపాణితో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ .. టీడీఎఫ్ 25 సంవత్సరాల క్రితం తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ ప్రారంభించారని గుర్తు చేశారు. తమ సంస్థ ఆధ్వర్యంలో రెండేళ్లకోసారి ప్రవాసి తెలంగాణ దివస్ నిర్వహిస్తామని కార్యక్రమంలో భాగంగా పుట్టిన గడ్డపైకి వచ్చి గ్రామీణ ప్రాంతాల్లో విద్యా, వైద్యం, వ్యవసాయం, మహిళాసాధికారతపై వివిధ కార్యక్రమాలు చేస్తుంటామన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌళిక వసతులు కల్పించడం, గ్రామాలను దత్తత తీసు కుని అభివృద్ధి చేయడం, మెడికల్ క్యాంపులు ఏర్పా టు చేస్తుంటామన్నారు. 24వ తేదీన తెలంగాణలో విశేష సేవలు అందిస్తున్న ఎన్‌ఆర్‌ఐలకు సన్మానం, వివిధ రంగాల్లో సేవ చేసిన వారి ప్రసంగాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈ సమావేశంలో టీడీఎఫ్ ప్రతినిధులు రణధీర్ రెడ్డి, మట్ట రాజేశ్వర్ రెడ్డి, అంజన త్రివేణి పాల్గొన్నారు.

రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై శ్వేతపత్రం శుభ పరిణామం

హిమాయత్‌నగర్: శాసనసభలో ప్రభుత్వం నూతన ఒరవడికి శ్రీకారం చుట్టిందని, రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై శ్వేత పత్రం విడుదల చేయడంపై డాడి లంబాడీ హక్కుల సాధన సమితి (డీఎల్‌హెచ్ఎస్ఎస్) రాష్ట్ర అధ్యక్షుడు రఘునాయక్ రూడావత్ హర్షం వ్యక్తం చేశారు. బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... రాష్ట్ర పరిస్థితులను ప్రజలకు వివరించడం శుభ పరిణామమని కొనియాడారు. ప్రభుత్వ ఆర్థిక పరిస్థితి అగమ్యగోచరంగా ఉన్నా ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీలను అమలు చేసి తీరుతామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సభలో ప్రకటించడం హర్షించదగ్గ విషయమన్నారు. అసెంబ్లీలో శ్వేత పత్రం విడుదల చేయగా ఒక్కో పార్టీ ఒక్కో విధంగా మాట్లాడుతున్నారని, అందరూ పార్టీలకతీతంగా రాష్ట్ర అభివృద్ధికి సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

అనేక పరిశోధనలతో తక్కువ ధరకే సోలార్ ఎనర్జీ



విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేస్తున్న దృశ్యం

ఖైరతాబాద్: నేటి పరిస్థితుల్లో సోలార్ పవర్‌పై జరిగిన అనేక పరిశోధనలతో యూనిట్ చార్జీ రూ. 3కు వచ్చిందని గతంలో యూనిట్ సోలార్ పర్ ఉత్పత్తి చేసేందుకు ఎక్కువ స్థలం అవసరమయ్యేది, ప్రస్తుతం అతి తక్కువ స్థలం ఉపయోగించి ఎక్కువ మోతాదులో సోలార్ విద్యుత్‌ను ఉత్పతి చేయగలుగుతున్నామని ఐఆర్‌ఈడీఏ మాజీ డైరెక్టర్ (టెక్నికల్) ఇంజినీర్ బి.వెంకటేశ్వర్‌రావు పేర్కొన్నారు. నేషనల్ ఎనర్జీ కన్జర్వేషన్ వీక్ వారోత్సవాల్లో భాగంగా ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్ తెలంగాణ స్టేట్ సెంటర్ ఆధ్వర్యంలో ముగింపు సమావేశం విశ్వేశ్వరయ్య భవన్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఐఈఐ చైర్మన్ డాక్టర్ జి.వెంకటసుబ్బయ్య వారోత్సవాల ముగింపు సందర్భంగా స్వాగతోపన్యాసం చేశారు. ఈ సందర్భంగా విద్యుత్ ఉత్పత్తి, వినియోగంపై ఇంజినీరింగ్, డిగ్రీ, పాఠశాల విద్యార్థులకు ఐఈఐ ఈసీఎం కన్వీనర్ ప్రొఫెసర్ డాక్టర్ మహ్మద్ మోయినుద్దీన్ ఆధ్వర్యంలో సభ్యులు అవగాహన కల్పించారు. ముగింపు సమావేశంలో వివిధ రకాల పోటీలు నిర్వహించిన విజేతలకు సర్టిఫికెట్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐఈఐ గౌరవ కార్యదర్శి డాక్టర్ కె.సీ తారాంబాబు, కో కన్వీనర్లు ఇంజనీర్ ఎ.అరుణ, డాక్టర్ ఎ.శ్రీనివాస్‌రెడ్డి, ఇం.జనీర్ మర్రి రమేష్ పాల్గొన్నారు.

విద్యార్థినులకు ఎక్స్‌లెన్స్ అవార్డులు

వెంగళరావునగర్: యూసుఫ్‌గూడ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ముత్తూట్ ఫైనాన్స్ ఎక్స్‌లెన్స్ అవార్డులు లభించాయి. ఇటీవలు ముత్తూట్ ఫైనాన్స్ సంస్థ వివిధ పోటీలను ఏర్పాటు చేసింది. ఈ పోటీల్లో యూసుఫ్‌గూడ ప్రభుత్వ పాఠశాల విద్యార్థినులు జె.శివానీ (10 క్లాస్), ఎ.అన్ను (9 క్లాస్) విద్యార్థినులు పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు. వారికి హైదరాబాద్ జిల్లా విద్యాధికారి రోహిణి అవార్డులను ప్రదానం చేశారు. అవార్డులు అందుకున్న విద్యార్థినులను యూసుఫ్‌గూడ టీచర్లు అభినందించారు. కార్యక్రమంలో శాంతి టీచర్‌తోపాటు ముత్తూట్ ఫైనాన్స్ సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య

వెంగళరావునగర్: తల్లిదండ్రులు ఫంక్షన్‌కు వెళ్లి వచ్చేలోగా వారి కుమారుడు ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మధురానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఎల్లారెడ్డిగూడకు చెందిన శివ (25) తల్లిదండ్రులతో కలిసి ఉంటూ ఓ ప్రైవేటు సంస్థలో ఉద్యోగం చేస్తున్నాడు. ఈ నెల 20న రాత్రి అతడి తల్లిదండ్రులు వెంకటేష్, భవానీ బోరబండ సమీపంలోని తులసీనగర్‌లో ఓ శుభాకార్యానికి వెళ్లగా శివ ఒక్కడే ఇంట్లో ఉన్నాడు. అర్థ రాత్రి ఇంటికి తిరిగి వచ్చిన వెంకటేష్, భవానీ లోపల గడియ పెట్టి ఉండటంతో తమ కుమారుడిని ఎంత సేపు పిలిచినా స్పదించలేదు. దీంతో వెంకటేష్ బలవంతంగా తలుపులు తెరిచి లోపలికి వెళ్లి చూడగా శివ ఫ్యాన్‌కు ఉరేసుకుని కనిపించాడు. దీంతో ఆందోళనకు గురైన వారు స్థానికులతో కలిసి అతడిని కిందకు దింపి అమీర్‌పేటలోని ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే అతను మృతి చెందినట్లు నిర్ధారించారు. శివ మృతిపై అనుమానాలు వ్యక్తం చేస్తూ అతని తల్లి భవానీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మధురానగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నేటి నుంచి ఛాతీ ఆస్పత్రిలో కోవిడ్ పరీక్షలు



డాక్టర్ మహబూబ్‌ఖాన్

వెంగళరావునగర్: ఎర్రగడ్డ ప్రభుత్వ ఛాతీ ఆస్పత్రిలో శుక్రవారం నుంచి కోవిడ్ ర్యాపిడ్ యాంటిజన్ టెస్ట్‌లు చేయనున్నట్టు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మహబూబ్‌ఖాన్ తెలిపారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఈ ఏడాది రోగులకు అధికంగా టెస్ట్‌లు చేయనున్నామని పేర్కొన్నారు. రోజూ వందల సంఖ్యలో తమ ఆస్పత్రికి శ్వాసకోశ వ్యాధితో బాధపడేవారు వస్తుంటారని, వారిని పరీక్షించి అవసరమైన వారికి అన్ని పరీక్షలు చేసి అనుమానితుల శాంపిల్స్ గాంధీ ఆస్పత్రికి పంపనున్నామన్నారు. ఆస్పత్రిలో అడ్మిట్ అయ్యే వారికి ఆర్‌టీపీసీఆర్ టెస్ట్‌లు చేస్తామన్నారు. గురువారం ఒక్కరోజే నార్మల్‌గా అడ్మిట్ అయిన వారిలో అనుమానం ఉన్న 29 మంది శాంపిల్స్ గాంధీ ఆస్పత్రికి పంపామన్నారు. వారిలో పాజిటివ్ వచ్చిన వారిని ఐసోలేషన్ చేసి కోవిడ్ వార్డులోకి తరలించడం జరుగుతుందని చెప్పారు. ఇప్పటికే ఆస్పత్రిలో అన్ని శ్వాసకోశ రోగులకు, కోవిడ్ రోగులకు విడివిడిగా బెడ్స్ సిద్ధం చేశామని వివరించారు.

కేంద్ర మంత్రి అమిత్‌షా స్పందన అమోఘం



అమిత్‌షాకు వినతి పత్రం ఇస్తున్న సుదర్శన్‌రావు

బంజారాహిల్స్: తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారులందరిని స్వాతంత్ర్య సమరయోధులుగా గుర్తించి వారికి ఇస్తున్న అన్ని బెనిఫిట్స్‌ను కల్పించాలని తాము కేంద్రమంత్రి అమిత్‌షాకు వినతి పత్రం అందజేయగా ఆయన సానుకూలంగా స్పందించారని 1969 తెలంగాణ ఉద్యమకారుల సమితి ప్రధాన కార్యదర్శి దుశర్ల సుదర్శన్‌రావు తెలిపారు. తెలంగాణ తొలి, మలి ఉద్యమకారులను తెలంగాణ సాధకులుగా గుర్తించి స్వాతంత్ర్య సమరయోధులకు ఇచ్చినట్లుగానే పింఛన్లతో పాటు రైలు, బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించాలని, నివాస యోగ్యం కూడా అందించాలని విజ్ఞప్తి చేయగా ఈ విషయంపై పరిశీలన జరిపి న్యాయం చేస్తామని ఆయన హామీ ఇవ్వడం తమను ఎంతగానో ఆనందానికి గురి చేసిందన్నారు. అలాగే తెలంగాణ ఉద్యమకారుల చరిత్ర తరతరాలకు గుర్తిండిపోయేలా 100 ఎకరాల్లో స్మృతి వనం నిర్మించాలని విజ్ఞప్తి చేయగా అందుకు ఆయన సానుకూలంగా స్పందించారని వెల్లడించారు.

రేపు, ఎల్లుండి గీతా ప్రవచనాలు

వెంగళరావునగర్: శ్రీనగర్‌కాలనీ బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 23, 24 తేదీల్లో భగవద్గీత ప్రవచనాల కార్యక్రమాన్ని సిద్ధార్థనగర్‌కాలనీ కమ్యూనిటీ హాల్‌లో ఏర్పాటు చేస్తున్నట్లు సంస్థ నిర్వాహకులు తెలిపారు. రెండు రోజుల పాటు సాయంత్రం 6 నుంచి రాత్రి 8 గంటల పాటు జరుగుతుందన్నారు. అంతర్జాతీయ గీత స్పీకర్, శిక్షకులు బి.కె.త్రినాథ్ గీతా ప్రవచనాలను తెలియజేస్తారన్నారు. గీతలోని ఆధ్యాత్మిక రహస్యం, అంతరంగిక శాంతి, సుఖం కోసం యోగా అభ్యాసం తదితర అంశాలను ఆయన భక్తులకు వివరించనున్నారని పేర్కొన్నారు. భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గ్లోబల్ బ్రాండింగ్‌కు అవార్డు

లక్డీకాపూల్: టాడ్ గ్లోబల్ బ్రాండింగ్ మరోసారి ప్రతిష్టాత్మకమైన పెప్పర్ అవార్డ్స్ 2023 కాంస్య ట్రోఫీని సాధించింది. సృజనాత్మక నైపుణ్యం, వినూత్న బ్రాండింగ్ వ్యూహాలతో కూడిన అద్భుతమైన ప్రదర్శనలో తన ఆధిక్యతను నిరూపించుకుంది.ఈ అవార్డులు, అత్యుత్తమ ప్రమాణాలకు బెంచ్‌మార్క్, బ్లాక్ గోల్డ్‌గా నిర్వాహకులు పేర్కొంటున్నారు. 'సెంట్రో షూస్' ఇంటిగ్రేటెడ్ రిటైల్, ఈ–కామర్స్ బ్రాండింగ్ సీజన్ ముగింపులో అమ్మకాల్లో ఈ అవార్డును సొంతం చేసుకున్నారు.

భక్తుల కోసం సకల ఏర్పాట్లు చేశాం



ఆలయంలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న టీటీడీ అడ్వయిజరీ కమిటీ అధ్యక్షుడు రవి ప్రసాద్...

బంజారాహిల్స్: ఈ నెల 23న వైకుంఠ ఏకాదశి సందర్భంగా జూబ్లీహిల్స్ టీటీడీ శ్రీవారి ఆలయంలో భక్తుల కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు టీటీడీ లోకల్ అడ్వయిజరీ కమిటీ అధ్యక్షుడు రవి ప్రసాద్‌తెలిపారు. గురువారం ఆలయంలో ఆయన టీటీడీ ఎల్ఏసీ సభ్యులతో కలిసి ఏర్పాట్లు పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉత్తర ద్వార దర్శనం ద్వారా స్వామివారిని దర్శించుకునేందుకు గతేడాది 50 వేలమందికి పైగా భక్తులు విచ్చేశారని ఈ సారి ఆ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంటుందని అన్నారు. తొక్కిసలాటలు జరగకుండా భక్తులకు బారికేడ్లు నిర్మించడంతో పాటు నీటి వసతి, పార్కింగ్ వసతి కూడా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సంత్ నిరంకారీ స్థలంతో పాటు అపోలో ఆస్పత్రిలో కూడా భక్తుల వాహనాలు పార్కింగ్ చేసేందుకు అనుమతులు తీసుకున్నామని పైకి రావడానికి ఇబ్బందులు ఉండే భక్తులకు రెండు ప్రత్యేక వాహనాలను సైతం అందుబాటులో ఉంచినట్లు ఆయన తెలిపారు.

ఆటో డ్రైవర్లకు న్యాయం చేస్తామని మంత్రి పొన్నం హామీ

ఐఎన్‌టీయూసీ ఆటో యూనియన్



మంత్రి పొన్నంకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న యూనియన్ నాయకులు

హిమాయత్‌నగర్: కార్మికుల సంక్షేమం, హక్కులు, చట్టాల అమలుకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో కృషి చేసిందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. ఆటో డ్రైవర్ల సమస్యలు ప్రభుత్వం దృష్టిలో ఉన్నాయని, వారికి త్వరలో న్యాయం చేస్తామని మంత్రి హామీ ఇచ్చారని ఐఎన్‌టీయూసీ ఆటో యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు నర్సింహారెడ్డి తెలిపారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి గోదాం మల్లేష్ గౌడ్, కార్య నిర్వాహక అధ్యక్షుడు శంకర్ లాల్ రామావత్ ఆధ్వర్యంలోని ప్రతినిధి బందం గురువారం మంత్రిని కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు బస్సుల్లో ఉచితంగా రవాణా సౌకర్యం కల్పించడాన్ని తాము స్వాగతిస్తున్నామని, కానీ ఆటో డ్రైవర్లకు ఉపాధి లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ఆటో డ్రైవర్లకు ప్రభుత్వం న్యాయం చేయాలని వారు మంత్రికి విజ్ఞప్తి చేశారు. మంత్రిని కలిసిన వారిలో ఐఎన్‌టీయూసీ నాయకులు ఇ.నాగరాజు, మల్లేష్, శంకర్, బోడ్యానాయక్, రాములునాయక్, రవినాయక్ తదితరులు పాల్గొన్నారు.

జనతా బార్ వద్దు మహాప్రభో...



బంజారాహిల్స్ రోడ్ నెం.14లో తెరవనున్న జనతాబార్

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నెం. 14లోని బీఎన్‌రెడ్డి కాలనీ వెనుక జీహెచ్ఎంసీ పార్కును ఆనుకొని పార్కింగ్ సదుపాయం లేని ఓ బహుళ అంతస్తుల భవనంలో జనతా బార్ తెరవనున్న నేపథ్యంలో స్థానికులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ జనతాబార్‌కు అనుమతి ఇవ్వొద్దంటూ ఇటీవలే ప్రజావాణిలో కూడా స్థానికులు ఫిర్యాదులు చేశారు. గతంలో ఈ భవనంలో వెన్నెల లిక్కర్ మార్ట్ నిర్వహించేవారు. దీనిపైనే రెండు పబ్‌లు కూడా ఉండేవి. వీటన్నింటికి సరిపడేంత పార్కింగ్ సదుపాయం ఈ భవనానికి లేకపోవడంతో రోడ్లపక్కనే అక్రమ పార్కింగ్‌లు చేస్తుంటారు. మందుబాబులు పక్కనే ఉన్న జీహెచ్ఎంసీ పార్కును ఓపెన్ బార్‌గా మార్చారు. విధులు ముగించుకొని రాత్రిపూట ఇక్కడి నుంచి వెళ్లే మహిళలు ప్రత్యక్ష నరకాన్ని చవి చూస్తున్నారు. తాగుబోతుల ఆగడాలతో మహిళలు పడుతున్న పాట్లు వర్ణనాతీతంగా ఉంటున్నాయి. ఇళ్ల ముందే అక్రమ పార్కింగ్‌లు, ఫుట్‌పాత్‌లపై మందుబాబుల ఆగడాలు, ఇక్కడే తూలిపడిపోవడాలు తదితర సమస్యలతో స్థానికులు సతమతం అవుతున్న సమయంలోనే తాజాగా అనుభూతి పేరుతో జనతా బార్‌ను తెరిచేందుకు యత్నాలు జరుగుతున్నాయి. ఇకనైనా పోలీసులు, ఎక్సైజ్ అధికారులు జనతా బార్ అనుమతులు నిలిపివేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

27న కళాకారులకు అవార్డుల ప్రదానం

లిబర్టీ: ఇంద్రజాల రంగంలో విశిష్ట సేవలు అందిస్తున్న కళాకారులకు అవార్డులు ప్రదానం చేయనున్నట్లు ఆదిలీలా ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ ఎస్.ఆదినారాయణ వెల్లడించారు. ఇంద్రజాల మాంత్రికుడు పద్మశ్రీ డాక్టర్ నేరెళ్ల వేణుమాధవ్ స్మారకార్థం ఆ రంగంలో ప్రావీణ్యత ప్రతిభ కనబరిచిన వారికి అవార్డులు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. గురువారం ఆదిలీలా ఫౌండేషన్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ మిమిక్రీ ఆర్టిస్ట్ ఆదిలీలా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 27వ తేదీన సాయంత్రం 5 గంటలకు శ్రీకృష్ణ పీఎం కాలేజ్ ఆడిటోరియంలో జరుగుతుందని వివరించారు.

ప్రజాభవన్‌కు వచ్చిన వృద్ధురాలి అదృశ్యం



బాసమ్మ

పంజగుట్ట: ప్రజా భవన్‌కు వినతిపత్రం ఇచ్చేందుకు వచ్చిన ఓ వృద్ధురాలు కనిపించకుండా పోయిన సంఘటన పంజగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు... నారాయణపేట జిల్లా మద్దూర్ మండలానికి చెందిన బి.వెంకటయ్య అతని భార్య బి.బాసమ్మ(65) ఈ నెల 15వ తేదీన జ్యోతి బాపూలే ప్రజాభవన్‌లో ప్రజాదర్బార్‌లో వినతిపత్రం సమర్పించేందుకు వచ్చారు. వినతి పత్రం ఇచ్చి ఇంటికి వెళ్లే క్రమంలో బస్సు ఎక్కేందుకు సమీపంలోని పెట్రోల్ బంక్ వద్దకు వచ్చారు. వెంకటయ్య టాయిలెట్‌కు వెళ్లివస్తాను ఇక్కడే ఉండు అని చెప్పి ఐదు నిమిషాల్లో తిరిగి వచ్చే సరికి బాసమ్మ కనిపించకుండా పోయింది. చుట్టుపక్కల వెతికినా కనిపించకపోవడంతో సొంత గ్రామం వెళ్లి వెతికాడు. అక్కడా కనిపించకపోవడంతో గురువారం పంజగుట్ట పోలీసులను ఆశ్రయించాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

బీరువాలోని బంగారు ఆభరణాల చోరీ

రహమత్‌నగర్: బోరబండ డివిజన్‌లో సైట్–1లోని ఓ ఇంట్లో ఉన్న బీరువాలోని బంగారు ఆభరణాలను దొంగలు అపహరించారు. పోలీసుల సమాచారం మేరకు... రామ్మోహన్ అనే వ్యక్తి సైట్–1లో నివాసం ఉంటున్నాడు. ఇతను ప్రైవేటు ఉద్యోగిగా పని చేస్తున్నాడు. తాను పనికి వెళ్లగా తన భార్య లేని సమయంలో ఇంట్లోని బీరువా నుంచి ఏడున్నర తులాల బంగారు ఆభరణాలను దొంగలు ఎత్తుకెళ్లినట్లు రామ్మోహన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

యువర్స్



చేనేత్రం

● ఆర్ట్ అండ్ కల్చర్

సమాజంలో పుట్టిన కళ ఆ సమాజానికి దూరంగా ఏకాంతవాసంలో ఉండదు. సమాజాన్ని ప్రతిబింబించే అద్దం అవుతుంది. పాత చరిత్రకు కొత్త వెలుగు ఇస్తుంది.

కేరళలోని కొచ్చికి చెందిన రీమా కలింగల్ డ్యాన్సర్, కొరియోగ్రాఫర్, మమంగం డ్యాన్స్ స్టూడియో ఫౌండర్. 'నేతే' నృత్యరూపకం ద్వారా చేనేతకు దేశవ్యాప్తంగా ప్రచారం కల్పిస్తుంది. 'చేనేత కళలో మ్యూజిక్‌తో పాటు మూమెంట్ ఉంటుంది' అంటున్న రీమ వీవింగ్ ప్రాసెస్‌లోని ప్రతి దశకు నృత్యరూపకల్పన చేసింది.

'ఒక డ్యాన్సర్‌గా నేను రోజువారి జీవితానికి సంబంధించిన సాధారణ దృశ్యాలలోని అసాధారణ సౌందర్యాన్ని చూడడానికి ఇష్టపడతాను. నేతకళాకారుల పనిలోనూ నాకు ఎంతో సౌందర్యం కనిపిస్తుంది. నేతే నృత్యరూపకాన్ని చూసే ప్రేక్షకులకు చేనేత గొప్పతనం అర్థమవుతుంది' అంటుంది రీమ. 2018లో కేరళ వరదల సమయంలో సహాయకార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్న రీమ దృష్టి 'చెండమంగళం'పై పడింది. ఇది చేనేత గ్రామం. నేతప్రక్రియలో ఆర్గానిక్ రిథమ్, కొరియోగ్రఫీని గ్రహించిన రీమా కలింగల్ 'నేతే' పేరుతో నృత్యరూపకాన్ని డిజైన్ చేసింది.



చైతన్య దూబే

చైతన్య పథం

● గ్రీన్ ఇన్నోవేషన్

కొత్త విషయాలు తెలుసుకుంటే ఏమొస్తుంది? కొత్తగా ఆలోచిస్తాం. కొత్తగా ఆలోచిస్తే ఏమొస్తుంది? కొత్తదారులు కనిపిస్తాయి. కొత్త ఆవిష్కరణలు జరుగుతాయి. చైతన్య దూబే కొత్తదారులలో ప్రయాణిస్తున్నాడు. సంప్రదాయ థర్మోకోల్‌కు భిన్నంగా బయోడిగ్రేడబుల్ థర్మోకోల్ తయారు చేసి ప్రపంచ దృష్టిని ఆకర్షించాడు.

వేడుకలు, స్కూల్ ప్రాజెక్ట్‌లు, ప్యాకింగ్ అవసరాలు... మొదలైన వాటి కోసం థర్మోకోల్‌ను ఉపయోగిస్తుంటాం. స్టోర్‌రూమ్‌లలో వాడేసిన థర్మోకోల్‌లు కుప్పలుగా పడి ఉంటాయి. మన అవసరం మేరకు తప్ప వాటి గురించి అంతగా ఆలోచించం. పర్యావరణంపై వాటి ప్రభావం ఉంటుందా?

థర్మోకోల్ నాన్-బయోడిగ్రేడబుల్.

థర్మోకోల్‌కు సూర్యరశ్మి తగిలి హానికరమైన వాయు కాలుష్య కారకాలు ఉత్పత్తి అవుతాయి, థర్మోకోల్ కాల్చడం వల్ల విషపూరిత రసాయన సమ్మేళనాలు విడుదల అవుతాయి. దీని ప్రభావంతో కంటి, ఊపిరితిత్తులకు సంబంధించి సమస్యలు తలెత్తుతాయి. ఇలాంటి విషయాలు తెలుసుకున్న చైతన్య ప్రత్యామ్నాయాన్ని గురించి ఆలోచించాడు. విజయం సాధించాడు.

బయోడిగ్రేడబుల్ థర్మోకోల్



ఉత్తర్‌ప్రదేశ్‌లోని కాన్పూర్‌లో పుట్టి పెరిగిన చైతన్య బెంగళూరులో ఇంజనీరింగ్ చేశాడు. ఎంబీఏ చేసిన తరువాత బెంగళూరులోని ఏదైనా కంపెనీలో ఉద్యోగం చేయాలనుకున్నాడు. అయితే చిన్న బిజినెస్ కోర్స్ ఒకటి చేయడంతో అతడి ఆలోచనల్లో మార్పు వచ్చింది. ఉద్యోగం కాదు బిజినెస్ చేయాలి అనుకున్నాడు. ఆ కోర్స్ తన గమనాన్నే మార్చింది. కెరీర్‌కు సంబంధించి ఎన్నో అవకాశాలను పరిచయం చేసింది. పుట్టగొడుగుల పెంపకంపై ఆసక్తి పెరిగింది.

ఔషధ పుట్టగొడుగుల పెంపకం మొదలుపెట్టాడు. రకరకాల పుట్టగొడుగుల గురించి తెలుసుకునే క్రమంలో పుట్టగొడుగుల నుంచి లెదర్ తయారు చేసే కాన్సెప్ట్ చైతన్యను ఆకట్టుకుంది. 'ఇలాంటిదే కొత్తగా ఏదైనా చేయవచ్చు' అని ఆలోచించి పరిశోధనలు మొదలుపెట్టాడు. పరిశోధనలో భాగంగా ఐఐటీ-కాన్పూర్ వెళ్లి ప్రొఫెసర్‌లతో మాట్లాడాడు. పుట్టగొడుగులను ఉపయోగించి పర్యావరణానికి హాని కలిగించని వస్తువులను తయారుచేయాలనే ఆలోచనలో భాగంగా రూపొందించిందే సరికొత్త థర్మోకోల్.

పుట్టగొడుగులతో పాటు సహజమైన పదార్థాలతో బయోడిగ్రేడబుల్ థర్మోకోల్‌ను తయారుచేశాడు. ఇది 60 నుంచి 90 రోజుల్లో కుళ్లిపోవడం మొదలవుతుంది. దీన్ని మొక్కలకు సహజ ఎరువుగా ఉపయోగించవచ్చు.

ఈ థర్మోకోల్ తయారీకి అయిదు నుంచి ఏడు రోజులు పడుతుంది. 'మీ అవసరాలకు ఉపయోగించుకున్న తరువాత క్రష్ చేయండి. ఇది మొక్కలకు సహజ ఎరువుగా పని చేస్తుంది' అంటున్నాడు చైతన్య.

ఎప్పుడూ ఏదో ఒక కొత్త విషయం గురించి తెలుసుకోవడం, దాని గురించి లోతుగా ఆలోచించడం అంటే చైతన్యకు ఇష్టం. 29 సంవత్సరాల చైతన్య దూబే బయోటెక్ కంపెనీ 'కినోకో బయోటెక్' ప్రారంభించి ఎంటర్‌ప్రెన్యూర్‌గా మారాడు.

బయోడిగ్రేడబుల్ థర్మోకోల్ దగ్గరే ఆగిపోలేదు చైతన్య దూబే. పుట్టగొడుగుల ద్వారా విగ్రహాల తయారీకి ఉపయోగపడే పదార్థం గురించి పరిశోధనలు చేస్తున్నాడు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్(పీవోపి)కి ప్రత్యామ్నాయాన్ని కనిపెట్టే ప్రయత్నంలో ఉన్నాడు.

● అవును... ఇది నిజమే!



- యూరోపియన్ యూనియన్-ఫండెడ్ ప్రాజెక్ట్ 'ఒడెరఫా' రకరకాల సెంట్‌ల చరిత్రకు సంబంధించిన ఆన్‌లైన్ ఎన్‌సైక్లోపీడియాను క్రియేట్ చేసింది. యూరోపియన్ సంస్కృతిలో సెంట్‌లు, రోగ నిరోధక సెంటులు...మొదలైన వాటికి సంబంధించిన సమాచారం ఉంటుంది. 16వ శతాబ్దం నుంచి 20వ శతాబ్దం ప్రారంభం వరకు చారిత్రక గ్రంథాలు, చిత్రాల నుంచి వాసనలను గుర్తించడానికి, విశ్లేషించడానికి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సాంకేతికతను ఉపయోగించారు.
- 'గాడ్‌ఫాదర్' సినిమాలో మార్లోన్ బ్రాండో చేతిలో పిల్లి కనిపిస్తుంది. అయితే ఇది స్క్రిప్ట్‌లో రాసుకున్నదేమీ కాదు. డైరెక్టర్‌కు స్టూడియోలో ఒక పిల్లి కనిపించింది. దాన్ని తీసుకొని మార్లోన్ చేతిలో పెట్టి సీన్ తీశాడు. 'గాడ్‌ఫాదర్' సినిమాలోని ఫేమస్ డైలాగులలో 'లీవ్ ది గన్, టేక్ ది కనోలి' ఒకటి. అయితే స్క్రిప్ట్‌లో మాత్రం 'లీవ్ ది గన్' అని మాత్రమే ఉండేది. ఆ తరువాత 'టేక్ ది కనోలి' చేర్చారు.

● టెక్.. టాక్



నూబియ రెడ్ మ్యాజిక్ 9 ప్రో

డిస్‌ప్లే: 6.80 అంగుళాలు
రిజల్యూషన్: 1116 x 2480 పిక్సెల్స్
రిఫ్రెష్ రేట్: 120 హెచ్‌జడ్
బరువు: 229 గ్రా.
మెమోరీ: 256జీబి 12జీబి ర్యామ్/512జీబి 16జీబి ర్యామ్
బ్యాటరీ: 6500 ఎంఏహెచ్
వోఎస్: ఆండ్రాయిడ్ 14



హువావే మేట్‌ప్యాడ్ ప్రో 13.2

సైజ్: 13.2 అంగుళాలు : రిఫ్రెష్ రేట్: 144 హెచ్‌జడ్
రిజల్యూషన్: 2,880 x 1,920 పిక్సెల్స్
బ్యాటరీ: 10,100 ఎంఏహెచ్ : మెమోరీ: 256జీబి 12జీబి ర్యామ్/512జీబి 12జీబి ర్యామ్
బరువు: 580గ్రా. : వోఎస్: హార్మనీ వోఎస్

మిడ్‌జర్నీ ఆల్ఫా వెర్షన్



పాపులర్ ఏఐ ఇమేజ్ జనరేటర్ 'మిడ్‌జర్నీ' తమ వెబ్‌సైట్‌కు సంబంధించి 'ఆల్ఫా' వెర్షన్‌ను ప్రారంభించింది. ప్రస్తుతం ఈ వెబ్‌సైట్ కొద్ది మందికి మాత్రమే(మిడ్‌జర్నీలో పదివేలకు పైగా ఇమేజ్‌లను జనరేట్ చేసిన వారికి) అందుబాటులో ఉంది. రాబోయే నెలల్లో మరింత మందికి అందుబాటులో తేనున్నట్లు కంపెనీ ప్రకటించింది. ఆల్ఫా మోడల్ ఎలా పనిచేస్తుందో చూపించే వీడియోను 'మిడ్‌జర్నీ' యూజర్ నిక్ సెయింట్ 'ఎక్స్'లో షేర్ చేశాడు. 'ఒక ఇమేజ్‌ను రీమిక్స్ చేయడానికి లేదా యాస్పెక్ట్ రేషియో మార్చడానికి సరైన కోడ్స్, ఇన్‌పుట్స్ తెలుసుకోవడం అవసరం. ఆల్ఫా వెర్షన్‌లో మాత్రం యూజర్ ఫ్రెండ్లీ స్లైడర్‌లు ఉపయోగపడతాయి. ఇమేజ్ యుఆర్‌ఎల్‌ను గ్రాబ్ చేయడానికి బదులు క్లిక్ చేస్తే సరిపోతుంది' అని రాశాడు నిక్.

గూగుల్ క్రోమ్ స్పీడప్ చేయడానికి...



పాపులర్ ఇంటర్నెట్ బ్రౌజర్ 'గూగుల్ క్రోమ్'ను వేగవంతం చేయడానికి 'హార్డ్‌వేర్ ఎక్సలరేషన్' ఫీచర్ ఉపయోగపడుతుంది. దీని కోసం...

1. క్రోమ్ లాంచ్ చేసి స్క్రీన్ టాప్‌రైట్‌లో కనిపించే త్రీ-డాట్ బటన్ క్లిక్ చేయాలి.
2. 'సెట్టింగ్స్'ను క్లిక్ చేసి లెఫ్ట్ ప్యానెల్‌లోని 'సిస్టమ్' ట్యాబ్‌లోకి వెళ్లాలి. 3. 'యూజ్ హార్డ్‌వేర్ ఎక్సలరేషన్ వెన్ అవైలబుల్' ఆప్షన్ కనిపిస్తుంది. దీన్ని ఆన్ చేసి క్రోమ్‌ను రీలాంచ్ చేయాలి.

వాట్సాప్ చాట్స్ లాక్ చేయడానికి...



1) యాప్ ఓపెన్ చేసి లాక్ చేయాలనుకున్న కాన్వర్‌జేషన్‌ను లాంగ్-ప్రెస్ చేయాలి. 2) స్క్రీన్ టాప్ రైట్‌లో కనిపించే త్రీ-డాట్ మెనూను ప్రెస్ చేయాలి
3) లాక్ చాట్-ట్యాప్
4) 'కంటిన్యూ' బటన్‌ను క్లిక్ చేయాలి
5) లాక్‌డ్ చాట్స్‌ను క్విక్‌గా అన్‌లాక్ చేయడానికి యూజర్‌లు 'సీక్రెట్ కోడ్'ను కూడా ఏర్పాటు చేసుకోవచ్చు.

డు సమ్‌థింగ్ ఆఫ్ యువర్ వోన్ బ్యాట్

ఎవరు చెప్పకుండానే, ఎవరి సలహా తీసుకోకుండానే ఒక పని చేసే సందర్భంలో ఉపయోగించే మాట...డు సమ్‌థింగ్ ఆఫ్ యువర్ వోన్ బ్యాట్.
ఉదా: ఐ డిడ్‌నాట్ టెల్ ది గార్డెనర్ టు కట్ డౌన్ ది ట్రీ. హీ డిడ్ ఇట్ ఆఫ్ హిజ్ వోన్ బ్యాట్.

★★★

అండర్ ది వెదర్

'నాకు ఒంట్లో బాగలేదు' అని చెప్పే సందర్భంలో వాడే మాట అండర్ ది వెదర్.
ఉదా: ఐయామ్ ఫీలింగ్ ఏ బిట్ అండర్ ది వెదర్. ఐ థింక్ ఐయామ్ గెటింగ్ ఏ కోల్డ్



సినిమా

అణచగనే పుడతాడు రాజే ఒకడు..


● ప్రభాస్

'విజయ్.. యస్ టీచర్... నేను నేర్పించిన పాట గుర్తుంది కదా.. పాడు...' అనే డైలాగ్స్‌తో మొదలై... 'ప్రతి గాథలో రాక్షసుడే హింసలు పెడతాడు. అణచగనే పుడతాడు రాజే ఒకడు.. శత్రువునే కడతేర్చే పనిలో మన రాజు.. హింసలనే మరిగాడు.. మంచిని మరిచే...' అంటూ సాగుతుంది 'సలార్' సినిమాలోని 'ప్రతి గాథలో..' పాట. ప్రభాస్ హీరోగా ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో రెండు భాగాలుగా విడుదల కానున్న 'సలార్' తొలి భాగం 'సలార్: సీజ్‌ఫైర్' చిత్రంలోని పాట ఇది. శ్రుతీహాసన్ నాయికగా నటించిన ఈ చిత్రంలో పృథ్వీరాజ్ సుకుమారన్, ఈశ్వరీ రావు, జగపతిబాబు, టీనూ ఆనంద్ కీలక పాత్రలు పోషించారు. విజయ్ కిరగందూర్ నిర్మించిన 'సలార్: సీజ్‌ఫైర్' చిత్రం నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా ఈ చిత్రంలోని 'ప్రతి గాథలో..' పాట లిరికల్ వీడియోను గురువారం విడుదల చేశారు. తెలుగు వెర్షన్‌కు కృష్ణకాంత్ లిరిక్స్ అందించగా, బాల గాయనీ గాయకులు ఈ పాటను పాడారు. ఈ చిత్రానికి సంగీతం: రవి బస్రూర్.


● రాజ్ తరుణ్, నాగార్జున, 'అల్లరి' నరేశ్

సెట్స్‌లో నా సామిరంగ

నా సామిరంగ... డ్యాన్స్ అంటూ సెట్స్‌లో రెచ్చిపోతున్నారు నాగార్జున, 'అల్లరి' నరేశ్, రాజ్ తరుణ్. కొరియోగ్రాఫర్ విజయ్ బిన్నీని దర్శకుడిగా పరిచయం చేస్తూ, నాగార్జున హీరోగా నటిస్తున్న యాక్షన్ ఫిల్మ్ 'నా సామిరంగ'. 'అల్లరి' నరేశ్, రాజ్ తరుణ్ కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రంలో ఆషికా రంగనాథ్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. పవన్‌కుమార్ సమర్పణలో శ్రీనివాసా చిట్టూరి నిర్మిస్తున్న ఈ చిత్రం సంక్రాంతికి విడుదల కానుంది. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ హైదరాబాద్‌లో జరుగుతోంది. ఓ సెట్‌లో నాగార్జున, 'అల్లరి' నరేశ్, రాజ్ తరుణ్‌లతో పాటు 300మంది డ్యాన్సర్స్ పాల్గొంటుండగా, టైటిల్ సాంగ్‌ను చిత్రీకరిస్తున్నారు. చిత్ర సంగీతదర్శకుడు ఎంఎం కీరవాణి స్వరపరచిన ఈ పాటకు చంద్రబోస్ సాహిత్యం అందించారు.

బర్త్ డే స్పెషల్


● జీవా, మమ్ముట్టి

'ఆనందో బ్రహ్మ', 'యాత్ర' చిత్రాల ఫేమ్ మహీ వి. రాఘవ్ దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'యాత్ర 2'. ఈ చిత్రంలో దివంగత సీఎం వైఎస్ రాజశేఖర రెడ్డి పాత్రలో మమ్ముట్టి, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాత్రలో జీవా నటిస్తున్నారు. త్రీ ఆటమ్ లీవ్స్, వి సెల్యులాయిడ్, శివ మేక నిర్మిస్తున్న 'యాత్ర 2' 2024 ఫిబ్రవరి 8న విడుదల కానుంది. కాగా గురువారం (డిసెంబర్ 21) వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పుట్టినరోజుని పురస్కరించుకుని వైఎస్ జగన్ పాత్రలో నటిస్తున్న జీవా లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు మేకర్స్. ఈ సందర్భంగా మహీ వి. రాఘవ్ మాట్లాడుతూ ''వైఎస్ రాజశేఖర రెడ్డి పాదయాత్ర నేపథ్యంలో తెరకెక్కిన 'యాత్ర' సినిమా ఘనవిజయం సాధించిన విషయం తెలిసిందే. ఈ చిత్రానికి కొనసాగింపుగా 'యాత్ర 2' రూపొందుతోంది. 2009 నుంచి 2019 వరకు ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన రాజకీయ ఘటనలు, వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిగారు ప్రజా నాయకుడిగా ఎదిగిన తీరుని 'యాత్ర 2'లో చూపిస్తున్నాం. షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ''యాత్ర'ని 2019 ఫిబ్రవరి 8న విడుదల చేశాం. ఇప్పుడు 'యాత్ర 2'ని కూడా అదే తేదీన (2024 ఫిబ్రవరి 8) ప్రేక్షకుల ముందుకు తీసుకువస్తున్నాం'' అన్నారు. ఈ చిత్రానికి కెమెరా: మధి, సంగీతం: సంతోష్ నారాయణన్.

స్టూడెంట్

'సూరరై పోట్రు' (తెలుగులో 'ఆకాశం నీ హద్దురా!') వంటి విజయవంతమైన చిత్రం తర్వాత హీరో సూర్య, దర్శకురాలు సుధ కొంగర కాంబినేషన్‌లో మరో సినిమా తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రంలో దుల్కర్ సల్మాన్, నజ్రియా ఫాహద్, విజయ్ వర్మ కీలక పాత్రలు పోషించనున్నారు. పీరియాడికల్ గ్యాంగ్‌స్టర్ యాక్షన్ డ్రామాగా రూపొందనున్న ఈ సినిమా 1970 నేపథ్యంలో ఉంటుందని, సూర్య క్యారెక్టర్‌లో డిఫరెంట్ షేడ్స్ ఉంటాయని, అందులో ఒకటి స్టూడెంట్ రోల్ అని కోలీవుడ్ సమాచారం. ఫిబ్రవరిలో ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ ఆరంభం కానుందట. 2డీ ఎంటర్‌టైన్మెంట్స్ నిర్మించనున్న ఈ చిత్రం 2025లో విడుదలయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.



● సూర్య


● త్రిప్తి దిమ్రి

నిద్రలేని రాత్రులు గడుపుతున్నా!

'యానిమల్' సినిమాతో ఒక్కసారిగా ట్రెండింగ్ స్టార్ అయ్యారు బాలీవుడ్ బ్యూటీ త్రిప్తి దిమ్రీ. సోషల్ మీడియాలో ఆమెకు విపరీతమైన ఫాలోయర్స్ పెరిగిపోయారు. ఈ సడన్ స్టార్‌డమ్ గురించి త్రిప్తి దిమ్రీ స్పందిస్తూ- ''ప్రేక్షకులు, అభిమానుల నుంచి నాకు లభిస్తున్న ప్రేమ ఆనందాన్నిస్తోంది. ఈ అనుభూతి ఎంతో ప్రత్యేకంగా అనిపిస్తోంది. చెప్పాలంటే నా మొబైల్ ఫోన్ మెసేజ్‌లతో మోగుతూనే ఉంది. చివరికి ఈ మెసేజ్‌ల వల్ల నేను నిద్ర లేని రాత్రులు గడపాల్సి వస్తోంది. అన్ని వస్తున్నాయి. అవి చదువుతూ రాత్రి సమయాన్ని గడిపేస్తున్నాను. కానీ ఇది బాగుంది. ఇక రణ్‌బీర్ కపూర్ అమేజింగ్ యాక్టర్. చాలా సపోర్టివ్. రష్మికా మందన్నా కూడా చాలా కో-ఆపరేటివ్'' అని చెప్పుకొచ్చారు. రణ్‌బీర్ కపూర్, రష్మికా మందన్నా హీరో హీరోయిన్లుగా, త్రిప్తి దిమ్రీ, బాబీ డియోల్, అనిల్ కపూర్ కీలక పాత్రల్లో సందీప్‌రెడ్డి వంగా దర్శకత్వంలో రూపొందిన 'యానిమల్' సినిమా ఈ నెల 1న విడుదలైన విషయం తెలిసిందే. సూపర్ హిట్ టాక్‌తో ఈ చిత్రం దూసుకెళుతోంది.

డేట్ ఫిక్స్


● సందీప్ కిషన్

హీరో సందీప్ కిషన్, దర్శకుడు వీఐ ఆనంద్ కాంబినేషన్‌లో రూపొందుతున్న ఫ్యాంటసీ అడ్వెంచరస్ మూవీ 'ఊరు పేరు భైరవకోన'. ఈ చిత్రంలో వర్షా బొల్లమ్మ, కావ్యా థాపర్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. అనిల్ సుంకర సమర్పణలో ఏకే ఎంటర్‌టైన్మెంట్స్‌పై రాజేశ్ దండా నిర్మిస్తున్నారు. చివరి దశకు చేరుకున్న ఈ సినిమా చిత్రీకరణ హైదరాబాద్‌లో జరుగుతోంది. కాగా ఈ చిత్రాన్ని ఫిబ్రవరి 9న విడుదల చేయనున్నట్లు గురువారం చిత్ర యూనిట్ ప్రకటించింది. ''ఊరు పేరు భైరవకోన'లో సూపర్ నేచురల్ ఎలిమెంట్స్ ఉన్నాయి. ఈ చిత్రం ప్రేక్షకులను అలరిస్తుంది'' అని యూనిట్ పేర్కొంది. ఈ సినిమాకు సంగీతం: శేఖర్ చంద్ర.

నవరసాల రాఘవ రెడ్డి


● శివ కంఠమనేని, రాశి

శివ కంఠమనేని హీరోగా, రాశి, నందితా శ్వేత ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'రాఘవ రెడ్డి'. సంజీవ్ మేగోటి దర్శకత్వం వహించారు. స్పేస్ విజన్ నరసింహా రెడ్డి సమర్పణలో లైట్ హౌస్ సినీ మ్యాజిక్ బ్యానర్‌పై కేఎస్ శంకర్ రావ్, జి. రాంబాబు యాదవ్, ఆర్. వెంకటేశ్వరరావు నిర్మించిన ఈ సినిమా జనవరి 4న విడుదల కానుంది. ఈ సినిమా ట్రైలర్‌ను నటుడు, నిర్మాత మురళీ మోహన్ విడుదల చేశారు. సంజీవ్ మేగోటి మాట్లాడుతూ- ''యాక్షన్, డ్రామా, థ్రిల్లర్ అంశాలతో ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా ఈ సినిమాను తెరకెక్కించాం'' అన్నారు. ''మధురపూడి గ్రామం అనే నేను' చిత్రంలో నా పాత్ర రగ్డ్‌గా ఉంటుంది. 'రాఘవ రెడ్డి'లో సిన్సియర్, స్ట్రిక్ట్ ప్రొఫెసర్‌గా నటించాను. చక్కటి విందు భోజనంలా నవరసాలున్న సినిమా ఇది'' అన్నారు శివ కంఠమనేని. ''మా బ్యానర్ నుంచి వస్తోన్న మూడో సినిమా ఇది. మా చిత్రాన్ని ప్రేక్షకులు ఆదరించాలి'' అన్నారు వెంకటేశ్వరరావు. ఈ ట్రైలర్ విడుదల వేడుకలో నటి అన్నపూర్ణ, దర్శకుడు నీలకంఠ, సంగీతదర్శకుడు సుధాకర్ మారియో, ఎడిటర్ ఆవుల వెంకటేశ్, వరా ముళ్లపూడి, నటుడు అజయ్ ఘోష్ మాట్లాడారు. ఈ చిత్రానికి సంగీతం: సంజీవ్ మేగోటి- సుధాకర్ మారియో, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: ఘంటా శ్రీనివాసరావు.

హిట్ అయితే పెద్ద సినిమానే

- సుమన్



● ప్రీతమ్, వేణుగోపాల చారి, సుమన్

''ప్రేక్షకుల సహకారంతో 40 ఏళ్లుగా ఇండస్ట్రీలో ఉన్నాను. చిన్న, పెద్ద సినిమాలనేవి ఉండవు. హిట్ అయితే పెద్ద సినిమా.. ఫట్ అయితే చిన్న సినిమా. 'విక్టర్ ది నెక్స్ట్ గాడ్' సినిమాలో 200 మంది నటీనటులకు చాన్స్ ఉండటం హ్యాపీ. నూతన సాంకేతిక నిపుణులకు కూడా అవకాశం ఇవ్వాలని కోరుతున్నాను'' అని సుమన్ అన్నారు. నూతన నటీనటులతో ప్రీతమ్ దర్శకత్వం వహించనున్న చిత్రం 'విక్టర్ ది నెక్స్ట్ గాడ్'. అమేజింగ్ గ్లోబల్ మూవీ మేకర్స్‌పై రూపొందనున్న ఈ సినిమా టైటిల్ లోగో లాంచ్ వేడుకని హైదరాబాద్‌లో నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన సుమన్ టైటిల్ లోగోని రిలీజ్ చేశారు. ప్రీతమ్ మాట్లాడుతూ- ''ఇదొక సందేశాత్మక చిత్రం. 4 కోట్ల బడ్జెట్‌తో ఈ సినిమా రానుంది. ఏడు దేశాల్లో చిత్రీకరణ జరపనున్నాం'' అన్నారు. ఈ చిత్రానికి కెమెరా: జాకీ-రవి, సంగీతం: రమేష్ ముక్కెర, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: బీఏ వర్మ.

సాక్షి బిజినెస్

శుక్రవారం
22-12-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు	
సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
359	105
70,865	21,255

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)			
నాస్‌డాక్	14,863	▲	86
డోజోన్స్	37,194	▲	112
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,695	▼	21
డాక్స్	16,687	▼	46
షాంఘై	2,919	▲	17
నికాయ్	33,140	▼	535

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై		
బంగారం (99.9 స్వచ్ఛత)		
62,335	▲	33
బంగారం (99.5 స్వచ్ఛత)		
62,086	▲	34
వెండి (కేజీ)		
74,550	▲	808

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఛామపడుత	81.45	85.13
£	బ్రిటన్ పౌండ్	ఛామపడుత	103.07	107.94
€	యూరో	ఛామపడుత	89.22	93.60
¥	జపాన్ ఎన్ (100)	ఛామపడుత	46.00	71.00
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఛామపడుత	55.86	58.66
S$	సింగపూర్ డాలర్	ఛామపడుత	60.33	65.01
SAR	సౌదీ రియాల్	ఛామపడుత	21.25	22.88
UAE D	యూఏఈ దిర్హామ్	ఛామపడుత	21.78	23.57
¥	చైనా యువాన్	ఛామపడుత	10.53	12.60

ఎల్ఐసీకి ప్రభుత్వ మినహాయింపు

పబ్లిక్‌కు 25 శాతం వాటాపై పదేళ్ల వరకూ గడువు



న్యూఢిల్లీ: పబ్లిక్‌కు కనీస వాటా విషయంలో ప్రభుత్వం మినహాయింపునిచ్చినట్లు బీమా రంగ పీఎస్‌యూ దిగ్గజం ఎల్ఐసీ వెల్లడించింది. దీంతో పబ్లిక్‌కు కనీసం 25 శాతం వాటా(ఎంపీఎస్) కల్పించే అంశంలో పదేళ్ల గడువు లభించినట్లు తెలియజేసింది. 2022 మే నెలలో ఐపీవో ద్వారా ప్రభుత్వం ఎల్ఐసీలో 3.5 శాతం వాటా(22.13 కోట్ల షేర్లు)ను విక్రయించింది. దీంతో ప్రస్తుతం ప్రభుత్వ వాటా 96.5 శాతంగా కొనసాగుతోంది. నిజానికి ఐపీవో తదుపరి నిర్ధారిత గడువులోగా లిస్టెడ్ కంపెనీలు పబ్లిక్‌కు 25 శాతం వాటాను కల్పించవలసి ఉంది. అయితే ఆర్థిక వ్యవహారాల శాఖ ఒకేసారి పదేళ్లవరకూ మినహాయింపునిచ్చినట్లు ఎల్ఐసీ స్టాక్ ఎక్స్ఛేంజీలకు తెలియజేసింది. వెరసి 2032 మే వరకూ పబ్లిక్‌కు 25 శాతం వాటా కల్పించే అంశంలో వెసులుబాటు లభించినట్లు తెలియజేసింది. కాగా.. ఈ ఏడాది(2023) మొదట్లో ప్రభుత్వం బ్యాంకులుసహా లిస్టెడ్ పీఎస్‌యూలు పబ్లిక్‌కు కనీస వాటా కల్పించే విషయంలో నిబంధనల్లో సవరణలు చేపట్టింది. తద్వారా ప్రైవేటైజేషన్ తదుపరి ప్రభుత్వ రంగ సంస్థలు ఎంపీఎస్‌ను అమలు చేయవలసిన అవసరాన్ని తప్పించింది. తొలుత పీఎస్‌యూలకు మాత్రమే ఇందుకు వీలుండగా.. ప్రభుత్వ వాటా విక్రయం తదుపరి సైతం వర్తించేలా ఈ ఏడాది జనవరిలో నోటిఫై చేసింది. దీంతో ప్రభుత్వ రంగ కంపెనీలలో వాటా కొనుగోలుకి ఇన్వెస్టర్లు ఆసక్తి చూపేందుకు వీలు చిక్కింది. 2021 జూలైలోనే ప్రభుత్వం అన్ని పీఎస్‌యూలకూ ఎంపీఎస్ వర్తించేలా నోటిఫికేషన్‌ను జారీ చేసిన సంగతి తెలిసిందే.

ఈ వార్తల నేపథ్యంలో ఎల్ఐసీ షేరు బీఎస్ఈలో 0.5 శాతం బలపడి రూ. 765 వద్ద ముగిసింది.

జొమాటో చేతికి షిప్‌రాకెట్!

న్యూఢిల్లీ: ఫుడ్ డెలివరీ లిస్టెడ్ కంపెనీ జొమాటో లిమిటెడ్. ఈకామర్స్ షిప్పింగ్ స్టార్టప్ షిప్‌రాకెట్‌ను సొంతం చేసుకోనుంది. ఇందుకు ఆఫర్‌ను ప్రకటించినట్లు తెలుస్తోంది. సంబంధిత వర్గాల సమాచారం ప్రకారం జొమాటో 2 బిలియన్ డాలర్ల(సుమారు రూ. 16,000 కోట్లు) విలువలో షిప్‌రాకెట్‌కు ఆఫర్‌ను ఇచ్చింది. అయితే తుది నిర్ణయం వెలువడలేదని తెలుస్తోంది. ఈ అంశాలపై ఇటు జొమాటో, అటు షిప్‌రాకెట్ ప్రతినిధులు స్పందించకపోవడం గమనార్హం! పిచ్‌బుక్ గణాంకాల ప్రకారం 2022 ఆగస్టులో షిప్‌రాకెట్ 1.23 బిలియన్ డాలర్ల విలువలో నిధులను సమీకరించింది. సీఈవో, సహవ్యవస్థాపకుడు శాహిల్ గోయెల్ అధ్యక్షతన నడుస్తున్న సంస్థలో బెర్టెల్స్‌మన్ ఇండియా ఇన్వెస్ట్‌మెంట్స్, టిమాసెక్ హోల్డింగ్స్ తదితరాలకు పెట్టుబడులున్నాయి. జొమాటో 2021లో ఇన్వెస్ట్ చేసింది.

ఈ వార్తలతో జొమాటో షేరు ఎన్ఎస్ఈలో 2.8% ఎగసి రూ. 128 వద్ద ముగిసింది.

జీఎంఆర్ భోగాపురం ఎయిర్‌పోర్ట్‌లో...

రూ. 675 కోట్ల పెట్టుబడులు

ఇన్వెస్ట్ చేయనున్న ఎన్ఐఐఎఫ్



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: జీఎంఆర్ గ్రూప్ ఆంధ్రప్రదేశ్‌లోని భోగాపురంలో అభివృద్ధి చేస్తున్న అంతర్జాతీయ విమానాశ్రయ ప్రాజెక్టులో నేషనల్ ఇన్వెస్ట్‌మెంట్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్ (ఎన్ఐఐఎఫ్) రూ. 675 కోట్ల వరకు ఇన్వెస్ట్ చేయనుంది. విమానాశ్రయ నిర్మాణానికి ఏర్పాటైన జీఎంఆర్ విశాఖపట్నం ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ (జీవీఐఏఎల్)లో ఈ మొత్తాన్ని పెట్టుబడి పెట్టేందుకు జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ (జీఏఎల్), ఎన్ఐఐఎఫ్ ఒప్పందం కుదుర్చుకున్నాయి. కంపల్సరీ కన్వర్టబుల్ డిబెంచర్స్ రూపంలో ఎన్ఐఐఎఫ్ ఇన్వెస్ట్ చేయనున్నట్లు జీఎంఆర్ గ్రూప్ తెలిపింది. జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ ప్రాజెక్టులకు సంబంధించి ఇది తమ రెండో పెట్టుబడని ఎన్ఐఐఎఫ్ మాస్టర్ ఫండ్ మేనేజింగ్ పార్ట్‌నర్ వినోద్ గిరి తెలిపారు. హైదరాబాద్ తరహాలో భోగాపురం ఎయిర్‌పోర్ట్ మరో ప్రపంచ స్థాయి విమానాశ్రయంగా ఉండగలదని జీఎంఆర్ గ్రూప్ బిజినెస్ చైర్మన్ (ఎయిర్‌పోర్ట్స్) జీబీఎస్ రాజు తెలిపారు. డిజైన్, నిర్మాణం, ఫైనాన్స్, ఆపరేట్, ట్రాన్స్‌ఫర్ ప్రాతిపదికన 40 ఏళ్ల వ్యవధికి భోగాపురం ఎయిర్‌పోర్టు ప్రాజెక్టును 2020లో జీవీఐఏఎల్ దక్కించుకుంది. ఏపీలోనే అతి పెద్ద విమానాశ్రయంగా ఆవిర్భవించనున్న ఈ ఎయిర్ పోర్టు వార్షిక ప్రయాణికుల సామర్థ్యం తొలి దశలో 60 లక్షలుగా ఉంటుంది. తర్వాత 4 కోట్లకు చేరనుంది.

ఐషర్ నుంచి కొత్త టిప్పర్ ప్రో 8035ఎక్స్‌ఎం



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: వీఈ కమర్షియల్ వెహికల్స్‌లో భాగమైన ఐషర్ ట్రక్స్ అండ్ బసెస్ తాజాగా మైనింగ్ రంగ అవసరాల కోసం 'ప్రో 8035ఎక్స్‌ఎం' పేరిట టిప్పర్‌ను ఆవిష్కరించింది. స్మార్ట్ షిఫ్ట్, ఆటోమేటెడ్ మాన్యువల్ ట్రాన్స్‌మిషన్ టెక్నాలజీని పొందుపర్చిన ఈ ట్రక్కులు మరింత సమర్థమంతంగా పనిచేయగలవని వీఈసీవీ సీనియర్ వీపీ గగన్‌దీప్ సింగ్ గంధోక్ ఈ సందర్భంగా తెలిపారు. హెవీ డ్యూటీ ట్రక్కుల విభాగం ఈ ఆర్థిక సంవత్సరం తొలి ఎనిమిది నెలల్లో 12% వృద్ధి చెందగా తమ సంస్థ 22% వృద్ధి నమోదు చేసిందని చెప్పారు. గత ఆర్థిక సంవత్సరం మొత్తం మీద 19,000 ట్రక్కులను విక్రయించగా, ఈసారి ఇప్పటి వరకు 13 వేల పైగా విక్రయించినట్లు వివరించారు.

అశోక్ లేలాండ్‌కు భారీ ఆర్డర్



న్యూఢిల్లీ: వాణిజ్య వాహనాల తయారీలో ఉన్న అశోక్ లేలాండ్ తాజాగా తమిళనాడు స్టేట్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ (టీఎన్ఎస్‌టీసీ) నుంచి భారీ ఆర్డర్ చేజిక్కించుకుంది. ఇందులో భాగంగా కార్పొరేషన్‌కు అల్ట్రాలో ఎంట్రీ విభాగంలో 552 బస్‌లను అశోక్ లేలాండ్ సరఫరా చేయనుంది. దీర్ఘకాలిక భాగస్వామిగా ఉన్న అశోక్ లేలాండ్ నుంచి ఇప్పటి వరకు 18,477 బస్‌లను టీఎన్ఎస్‌టీసీ కొనుగోలు చేయడం విశేషం.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

22-12-2023	
విశాఖ	605-00
చిత్తూరు	613-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	595-00
విజయవాడ	595-00
రిటైల్ ధర (డజను)	72.00
21-12-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	581-00
వరంగల్	583-00
రిటైల్ ధర	6.40

మైనస్ 586 నుంచి ప్లస్ 359..

భారీ నష్టాల నుంచి కోలుకున్న సెన్సెక్స్

- నిఫ్టీ 105 పాయింట్లు అప్
- ఇంధన, మెటల్, బ్యాంకింగ్ షేర్లకు డిమాండ్
- హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, రిలయన్స్ రయ్



ముంబై: భారీ నష్టాలతో మొదలైన సూచీలు ట్రేడింగ్‌లో బలంగా పుంజుకొని గురువారం లాభాలతో ముగిశాయి. ఇంధన, మెటల్, బ్యాంకింగ్ రంగాల షేర్లు రాణించడంతో పాటు అధిక వెయిటేజీ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్(2%), రిలయన్స్ ఇండస్ట్రీస్(1.40%) షేర్ల ర్యాలీ సూచీల రికవరీకి కలిసొచ్చాయి. సెన్సెక్స్ ఉదయం ఉదయం 586 పాయింట్ల నష్టంతో మొదలైంది. కనిష్ట స్థాయిల వద్ద కొనుగోళ్ల మద్దతు లభించడంతో ఇంట్రాడేలో 452 పాయింట్లు పెరిగి 70,959 వద్ద గరిష్టాన్ని తాకింది. చివరికి 359 పాయింట్లు బలపడి 70,865 వద్ద ముగిసింది. నిఫ్టీ 116 పాయింట్ల నష్టంతో 21,034 వద్ద మొదలైంది. ట్రేడింగ్‌లో 20,977 – 21,150 శ్రేణిలో కదలాడింది. ఆఖరికి 105 పాయింట్లు పెరిగి 21,255 వద్ద స్థిరపడింది. అన్ని రంగాలకు చెందిన చిన్న, మధ్య తరహా షేర్లకు కొనుగోళ్లకు మద్దతుతో బీఎస్ఈ మిడ్, స్మాల్ సూచీలు ఒకటిన్నర శాతానికి పైగా ర్యాలీ చేశాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.1,636 కోట్ల షేర్లను విక్రయించారు. సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.1,464 కోట్ల షేర్లను కొన్నారు. అమెరికా జీడీపీ డేటా వెల్లడి ముందు అంతర్జాతీయ మార్కెట్లు స్తబ్దుగా ట్రేడవుతున్నాయి.

''బేర్ పుల్‌బ్యాక్‌కు ఇది సరైన సమయం కాదు. ఇన్వెస్టర్లు 'పతనమైన షేర్ల కొనుగోళ్ల' వ్యూహాన్ని అనుసరించడంతో బుల్‌బ్యాక్ అయ్యింది. అధిక వాల్యుయేషన్ల కారణంగా కొంత కాలం స్థిరీకరణ అనివార్యం. క్రూడాయిల్ ధరలు క్రమంగా పెరుగుతుండటం, ఆహార వస్తువుల ధరలు అధికమవుతుండటం తదితర కారణాలు గత రెండు 2 నిరంతర ర్యాలీకి అడ్డంకులుగా మారాయి'' అని జియోజిత్ ఫైనాన్సియల్ రీసెర్చ్ హెడ్ వినోద్ నాయర్ తెలిపారు.

ఐనాక్స్ ఇండియా లిస్టింగ్ హిట్



ఐనాక్స్ ఇండియా లిస్టింగ్ హిట్ అయ్యింది. బీఎస్ఈలో ఇష్యూ ధర(రూ.660)తో పోలిస్తే 41% ప్రీమియంతో రూ.933 వద్ద మొదలైంది. ట్రేడింగ్‌లో 50% ర్యాలీ చేసి రూ.990 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని తాకింది. చివరికి 42% లాభంతో రూ.940 వద్ద స్థిరపడింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.8,531 కోట్లుగా నమోదైంది.

- హ్యాపీ ఫోర్జింగ్ చివరిరోజు నాటికి 82.04 రెట్లకు అధిక స్పందన లభించింది. కంపెనీ మొత్తం 83.65 లక్షల ఈక్విటీలను జారీ చేయగా 68.62 కోట్ల షేర్లకు బిడ్లు ధాఖలయ్యాయి. క్యూఐబీ కోటా 220 రెట్లు, సంస్థాగతేతర ఇన్వెస్టర్ల కోటా 62.17 రెట్లు, రిటైల్ విభాగం 15.09 రెట్లు సబ్‌స్క్రైబ్ అయ్యాయి.
- క్రెడో బ్రాండ్స్ మార్కెటింగ్ సంస్థ ముఫ్తీ ఐపీఓకు 51.85 రెట్ల అధిక స్పందన లభించింది. కంపెనీ 71 కోట్ల ఈక్విటీలను జారీ చేయగా 137 కోట్ల షేర్లకు బిడ్లు ధాఖలయ్యాయి. క్యూఐబి కోటా 105 రెట్లు, సంస్థాగతేర ఇన్వెస్టర్ల కోటా 55 రెట్లు, రిటైలర్ల కోటా 20 రెట్లు సబ్‌స్క్రిప్షన్ సాధించాయి.
- ఆర్‌బీజెడ్ పబ్లిక్ ఇష్యూ 17 రెట్లు సబ్‌స్క్రైబ్ అయ్యింది. రూ.100 కోట్ల నిధుల సమీకరణ లక్ష్యంగా కంపెనీ 79 లక్షల ఈక్విటీలను జారీ చేసింది. మొత్తంగా 13.31 కోట్ల షేర్లకు దరఖాస్తులు వచ్చాయి. రిటైలర్ల కోటా 25 రెట్లు, క్యూఐబీ కోటా 13 రెట్లు, సంస్థాగతేతర ఇన్వెస్టర్ల కోటా 9 రెట్లు సబ్‌స్క్రయిబ్ అయ్యాయి.

ఎవల్యూటిజ్ ఆదాయ లక్ష్యం రూ. 650 కోట్లు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఐటీ సేవలు, ఉత్పత్తుల సంస్థ ఎవల్యూటిజ్ వచ్చే రెండేళ్లలో రూ. 650 కోట్ల ఆదాయ లక్ష్యాన్ని నిర్దేశించుకుంది. ప్రస్తుతం ఇది రూ. 430 కోట్లుగా ఉంది. వైజాగ్ కేంద్రం ప్రారంభించి పదేళ్లయిన సందర్భంగా సంస్థ వ్యవస్థాపకుడు, సీఈవో ఎ. శ్రీనివాస ఈ విషయాలు చెప్పారు. భారతీయ టెకీలు 2011లో షికాగో కేంద్రంగా ఎవల్యూటిజ్‌ను ప్రారంభించారు. ఇది దేశీయంగా 2013లో వైజాగ్‌తో మొదలుపెట్టి హైదరాబాద్, నోయిడా, బెంగళూరు తదితర నగరాలకు కార్యకలాపాలు విస్తరించింది. ప్రస్తుతం భారత్‌లో 650 మంది సిబ్బంది ఉండగా.. వైజాగ్, హైదరాబాద్ కార్యాలయాల్లో 500 మంది పైగా ఉన్నారని శ్రీనివాస వివరించారు. పటిష్టమైన వ్యూహాల దన్నుతో రెండేళ్లుగా ఆదాయం 140% వృద్ధి చెందిందని, రాబోయే రోజుల్లోను ఇదే స్ఫూర్తితో పని చేయనున్నామని ఆయన పేర్కొన్నారు. కృత్రిమ మేథ, మెషీన్ లెర్నింగ్, బిగ్ డేటా మొదలైన సాంకేతికతల ఆధారిత సొల్యూషన్స్‌కి సంబంధించి పరిశోధన, అభివృద్ధి కార్యకలాపాలపై గణనీయంగా ఇన్వెస్ట్ చేస్తున్నామని చెప్పారు.

Evolutyz

సాక్షి స్పోర్ట్స్



చాంపియన్ గుకేశ్

చెన్నై గ్రాండ్‌మాస్టర్స్ అంతర్జాతీయ చెస్ టోర్నీలో భారత గ్రాండ్‌మాస్టర్, తమిళనాడు ప్లేయర్ దొమ్మరాజు గుకేశ్ విజేతగా నిలిచాడు. చెన్నై వేదికగా ఎనిమిది మంది గ్రాండ్‌మాస్టర్ల మధ్య ఏడు రౌండ్లపాటు జరిగిన ఈ టోర్నీలో గుకేశ్, తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ ఇరిగేశి అర్జున్ 4.5 పాయింట్లతో సంయుక్తంగా అగ్రస్థానంలో నిలిచారు. అయితే మెరుగైన టైబ్రేక్ స్కోరు ఆధారంగా గుకేశ్‌కు టైటిల్ లభించింది. అర్జున్ రన్నరప్‌గా నిలిచాడు. హైదరాబాద్ గ్రాండ్‌మాస్టర్ పెంటేల హరికృష్ణ 4 పాయింట్లతో మూడో స్థానాన్ని దక్కించుకున్నాడు. చివరిదైన ఏడో రౌండ్‌లో గుకేశ్-హరికృష్ణ గేమ్ 31 ఎత్తుల్లో 'డ్రా'కాగా... అర్జున్ 57 ఎత్తుల్లో సనన్ జుగిరోవ్ (హంగేరి)పై గెలుపొందాడు. టాప్-3లో నిలిచిన గుకేశ్‌కు 18 వేల డాలర్లు (రూ. 14 లక్షల 98 వేలు), అర్జున్‌కు 12 వేల డాలర్లు (రూ. 9 లక్షల 98 వేలు), హరికృష్ణకు 10 వేల డాలర్లు (రూ. 8 లక్షల 32 వేలు) ప్రైజ్‌మనీగా లభించాయి.

భారత్‌దే వన్డే సిరీస్

- సంజు సామ్సన్ సెంచరీ
- చివరి మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా ఓటమి


సంజు సామ్సన్


తిలక్ వర్మ

పార్ల్: దక్షిణాఫ్రికాతో జరిగిన టి20 సిరీస్‌లో సమంగా నిలిచిన భారత జట్టు వన్డే సిరీస్‌ను తమ ఖాతాలో వేసుకుంది. చివరి మ్యాచ్‌లో విజయంతో 2–1తో సిరీస్ రాహుల్ బృందం సొంతమైంది. గురువారం జరిగిన మూడో వన్డేలో భారత్ 78 పరుగుల తేడాతో దక్షిణాఫ్రికాను ఓడించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 296 పరుగులు చేసింది. సంజు సామ్సన్ (114 బంతుల్లో 108; 6 ఫోర్లు, 3 సిక్స్‌లు) వన్డేల్లో తొలి సెంచరీ సాధించగా, తిలక్ వర్మ (77 బంతుల్లో 52; 5 ఫోర్లు, 1 సిక్స్) రాణించాడు. వీరిద్దరు నాలుగో వికెట్‌కు 22.4 ఓవర్లలో 116 పరుగులు జోడించారు. అనంతరం దక్షిణాఫ్రికా 45.5 ఓవర్లలో 218 పరుగులకు ఆలౌటైంది. టోనీ డి జోర్జీ (87 బంతుల్లో 81; 6 ఫోర్లు, 3 సిక్స్‌లు) మినహా మిగతా వారంతా విఫలం కావడంతో సఫారీలకు ఓటమి తప్పలేదు.

తిలక్ అర్ధ సెంచరీ...

అరంగేట్ర మ్యాచ్‌లో వరుస బౌండరీలతో రజత్ పటిదార్ (16 బంతుల్లో 22; 3 ఫోర్లు, 1 సిక్స్) దూకుడుగా ఇన్నింగ్స్ మొదలు పెట్టగా, సాయి సుదర్శన్ (10) విఫలమయ్యాడు. అయితే వీరిద్దరు తక్కువ వ్యవధిలో వెనుదిరగ్గా... రాహుల్ (21) కూడా ప్రభావం చూపలేకపోవడంతో భారత్ స్కోరు 101/3కి చేరింది. ఈ దశలో సామ్సన్, తిలక్ ఇన్నింగ్స్‌ను నిలబెట్టే ప్రయత్నం చేయగా... సఫారీ బౌలర్లు పూర్తిగా కట్టివేయడంతో భారత్ ఒక్కో పరుగు కోసం శ్రమించాల్సి వచ్చింది. సామ్సన్ ఫర్వాలేదనిపించగా... హైదరాబాద్ బ్యాటర్ తిలక్ బాగా ఇబ్బంది పడ్డాడు. తొలి 38 బంతుల్లో కేవలం 9 పరుగులే చేసిన అతను ఒక్క బౌండరీ కూడా కొట్టలేకపోయాడు. ఆ తర్వాత మెరుగ్గా ఆడిన అతను తర్వాతి 38 బంతుల్లో 5 ఫోర్లు, 1 సిక్స్‌తో 43 పరుగులు సాధించి అర్ధసెంచరీ పూర్తి చేసుకున్నాడు. మరోవైపు నిలకడ కొనసాగించిన సామ్సన్ 110 బంతుల్లో కెరీర్‌లో తొలి శతకాన్ని (తన 16వ వన్డేలో) అందుకున్నాడు. ఆ తర్వాత రింకూ సింగ్ (27 బంతుల్లో 38; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) ధాటిగా ఆడటంతో భారత్ మంచి స్కోరు సాధించగలిగింది.

స్కోరు వివరాలు

భారత్ ఇన్నింగ్స్: పటిదార్ (బి) బర్గర్ 22; సుదర్శన్ (ఎల్బీ) (బి) బ్యూరాన్ 10; సామ్సన్ (సి) రీజా (బి) విలియమ్స్ 108; రాహుల్ (సి) క్లాసెన్ (బి) ముల్డర్21; తిలక్ (సి) ముల్డర్ (బి) మహరాజ్ 52; రింకూ (సి) రీజా (బి) బర్గర్ 38; అక్షర్ (సి) ముల్డర్ (బి) బ్యూరాన్ 1; సుందర్ (సి) మార్క్‌రమ్ (బి) బ్యూరాన్ 14; అర్ష్‌దీప్ (నాటౌట్) 7; అవేశ్ (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 22; **మొత్తం (50 ఓవర్లలో 8 వికెట్లకు) 296. వికెట్ల పతనం:** 1–34, 2–49, 3–101, 4–217, 5–246, 6–255, 7–277, 8–293. **బౌలింగ్:** బర్గర్ 9–0–64–2, విలియమ్స్ 10–0–71–1, బ్యూరాన్ హెన్‌డ్రిక్స్ 9–0–63–3, ముల్డర్ 7–0–36–1, మహరాజ్ 10–2–37–1, మార్క్‌రమ్ 5–0–19–0.

దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్: రీజా హెన్‌డ్రిక్స్ (సి) రాహుల్ (బి) అర్ష్‌దీప్ 19; జోర్జి (ఎల్బీ) (బి) అర్ష్‌దీప్ 81; డసెన్ (బి) అక్షర్ 2; మార్క్‌రమ్ (సి) రాహుల్ (బి) సుందర్ 36; క్లాసెన్ (సి) సుదర్శన్ (బి) అవేశ్ 21; మిల్లర్ (సి) రాహుల్ (బి) ముకేశ్ 10; ముల్డర్ (సి) రాహుల్ (బి) సుందర్ 1; మహరాజ్ (సి) రింకూ (బి) అర్ష్‌దీప్ 14; బ్యూరాన్ (సి) సామ్సన్ (బి) అవేశ్ 18; విలియమ్స్ (ఎల్బీ) (బి) అర్ష్‌దీప్ 2; బర్గర్ (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 13; **మొత్తం (45.5 ఓవర్లలో ఆలౌట్) 218. వికెట్ల పతనం:** 1–59, 2–76, 3–141, 4–161, 5–174, 6–177, 7–192, 8–210, 9–216, 10–218. **బౌలింగ్:** ముకేశ్ 9–0–56–1, అర్ష్‌దీప్ 9–1–30–4, అవేశ్ 7.5–0–45–2, సుందర్ 10–0–38–2, అక్షర్ 10–0–48–1.

కుస్తీకి సాక్షి స్వస్తి



- అప్పుడు నిరసన గళం... ఇప్పుడు వీడ్కోలు నిర్ణయం
- డబ్ల్యూఎఫ్ఐ చీఫ్‌గా బ్రిజ్‌భూషణ్ విధేయుడు సంజయ్ ఎన్నిక
- నిరసనగా రెజ్లింగ్‌కు గుడ్‌బై చెప్పిన భారత మహిళా స్టార్ రెజ్లర్ సాక్షి


న్యూఢిల్లీ: సాక్షి మలిక్... మహిళల కుస్తీలో పతకం పట్టుబట్టే స్టార్ రెజ్లర్. కామన్వెల్త్ క్రీడల్లో మూడు పతకాలు... ఆసియా చాంపియన్‌షిప్‌లో నాలుగు పతకాలు... రియో ఒలింపిక్స్‌లో కాంస్య పతకం... ఇవిచాలు సాక్షి ఏస్థాయి రెజ్లరో చెప్పడానికి! దేశానికి పతకాలెన్నో తెచ్చిపెట్టిన ఆమె... గురువారం జరిగిన డబ్ల్యూఎఫ్ఐ ఎన్నికల్లో మాజీ అధ్యక్షుడు బ్రిజ్‌భూషణ్ శరణ్ సింగ్ విధేయుడే అధ్యక్షుడిగా ఎన్నికవడంతో ఇక చేసేదేమీ లేక బయట పోరాటానికి, బౌట్‌లో పతకం ఆరాటానికి సెలవిచ్చింది. కన్నీటి చెమ్మతో బరువెక్కిన హృదయంతో రిటైర్మెంట్ ప్రకటించింది. మహిళా రెజ్లర్లను లైంగికంగా వేధించిన కేసులో నిందితుడైన బ్రిజ్‌భూషణ్ ప్రధాన అనుచరుడు సంజయ్ సింగ్ భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ) కొత్త అధ్యక్షుడిగా ఎన్నికయ్యాడు. బ్రిజ్‌భూషణ్‌పై ఢిల్లీ రోడ్లెక్కి సాక్షి సహా స్టార్ రెజ్లర్లు బజరంగ్ పూనియా, వినేశ్ ఫొగాట్, సంగీత ఫొగాట్ తదితరులు నిరసన తెలిపారు. పగలనక... రాత్రనక... తిండి నిద్రలేని రాత్రులెన్నో గడిపి బ్రిజ్‌భూషణ్‌ను గద్దె దింపాలనుకున్నారు. కానీ ఇప్పుడు ఆయన గద్దె దిగినప్పటికీ ఆయన నీడ సంజయ్ సింగ్ అధ్యక్షుడు కావడంతో జీర్ణించుకోలేకపోయిన సాక్షి తన ఆటకు టాటా చెప్పేసింది. స్టార్ రెజ్లర్లు బజరంగ్, వినేశ్ కూడా సంజయ్ ఎన్నికపై తప్పుబట్టారు.

అవును... అందుకే గుడ్‌బై

'బ్రిజ్‌భూషణ్ మహిళా రెజ్లర్ల పట్ల ప్రవర్తించిన తీరుపై గళమెత్తాం. కదంతొక్కాం. కేసు నమోదు చేయించాం. కానీ డబ్ల్యూఎఫ్ఐ తాజా ఎన్నికల్లో చివరకు ఆయన వర్గమే గెలిచింది. పదవులన్నీ చేజిక్కించుకుంది. అందుకే కెరీర్‌కు గుడ్‌బై చెప్పా. మేం మహిళా అధ్యక్షురాలైతే బాగుంటుందని అనుకున్నాం. కానీ అలా జరగలేదు' అని మీడియా సమావేశంలో సాక్షి వాపోయింది.

15లో 13 పదవులు బ్రిజ్‌భూషణ్ వర్గానివే

మాజీ అధ్యక్షుడు బ్రిజ్‌భూషణ్ డబ్ల్యూఎఫ్ఐలో తన పట్టు నిరూపించుకున్నాడు. ఆయన బరిలో లేకపోయినా... 15 పదవుల్లో ఆయన వర్గానికి చెందిన 13 మంది పదవుల్ని చేజిక్కించుకున్నారు. అధ్యక్ష పదవి ఎన్నికలో ఉత్తరప్రదేశ్ రెజ్లింగ్ సంఘం ఉపాధ్యక్షుడైన సంజయ్... 2010 కామన్వెల్త్ క్రీడల స్వర్ణ పతక విజేత అనిత షెరాన్‌పై 40–7 ఓట్ల తేడాతో గెలిచాడు. అనిత వర్గానికి చెందిన ప్రేమ్‌చంద్ లోచబ్ ప్రధాన కార్యదర్శి పదవి పొందడం... సీనియర్ ఉపాధ్యక్షుడిగా దేవేందర్ సింగ్ కడియాన్ ఎన్నికవడం ఒక్కటే ఊరట. మిగతా 4 ఉపాధ్యక్ష పదవులు బ్రిజ్‌భూషణ్ క్యాంప్‌లోని జైప్రకాశ్ (ఢిల్లీ), అశిత్ సాహా (బెంగాల్), కర్తార్ సింగ్ (పంజాబ్), ఫాని (మణిపూర్)లే సొంతం చేసుకున్నారు. ఉపాధ్యక్ష బరిలో దిగిన మధ్యప్రదేశ్ కొత్త ముఖ్యమంత్రి, మాజీ రెజ్లర్ మోహన్ యాదవ్‌కు కేవలం ఐదు ఓట్లు లభించడం గమనార్హం. కోశాధికారిగా సత్యపాల్ (ఉత్తరాఖండ్), ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులందరూ బ్రిజ్‌భూషణ్ వర్గం వారే ఎన్నికయ్యారు.


డబ్ల్యూఎఫ్ఐ మాజీ అధ్యక్షుడు బ్రిజ్‌భూషణ్‌తో కొత్త అధ్యక్షుడు సంజయ్ సింగ్ (కుడి)

> నిరసన దీక్ష చేపట్టిన రెజ్లర్లపై ఎలాంటి వివక్ష చూపం. ప్రతీకారం తీర్చుకోం. రెజ్లర్లందరిని సమానంగా చూస్తాం. వారికి కావాల్సిన సహకారాలు అందిస్తాం. మేం రెజ్లింగ్ ఆటపైనే దృష్టి పెడతాం. రెజ్లర్ల పొరపాట్లపై కాదు. ఎన్నికైన కొత్త కార్యవర్గమే డబ్ల్యూఎఫ్ఐని నడిపిస్తుంది. రోజువారీ వ్యవహారాల్లో నా ప్రమేయం ఉండదు. వారు కోరితేనే సలహాలిస్తా. –మాజీ అధ్యక్షుడు బ్రిజ్‌భూషణ్


పూజ

ఆసీస్‌ను పడగొట్టిన పూజ

- తొలి ఇన్నింగ్స్‌లో 219 ఆలౌట్
- పూజ వస్త్రకర్‌కు 4 వికెట్లు
- భారత్ 98/1

ముంబై: ఆస్ట్రేలియాతో ప్రారంభమైన ఏకైక టెస్టులో భారత మహిళల జట్టు తొలి రోజు సంపూర్ణ ఆధిపత్యం ప్రదర్శించింది. ముందుగా చక్కటి బౌలింగ్‌తో ప్రత్యర్థిని కట్టడి చేసిన మన బృందం ఆ తర్వాత బ్యాటింగ్‌లోనూ మెరుగైన స్థితిలో నిలిచింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఆస్ట్రేలియా మహిళల జట్టు భారత బౌలర్ల ధాటికి తమ తొలి ఇన్నింగ్స్‌లో 219 పరుగులకే ఆలౌటైంది. భారత జట్టుపై టెస్టుల్లో ఆసీస్ జట్టుకిదే అత్యల్ప స్కోరు. తహీలా మెక్‌గ్రాత్ (56 బంతుల్లో 50; 8 ఫోర్లు) అర్ధ సెంచరీ చేయగా... బెత్ మూనీ (40), కెప్టెన్ అలీసా హీలీ (38), కిమ్ గార్త్ (28 నాటౌట్) కీలక పరుగులు సాధించారు. పేసర్ పూజ వస్త్రకర్ (4/53) నాలుగు కీలక వికెట్లు పడగొట్టగా... స్పిన్నర్లు స్నేహ్ రాణా 3, దీప్తి శర్మ 2 వికెట్లు తీశారు. తొలి ఓవర్లోనే లిచ్‌ఫీల్డ్ (0) రనౌట్ కాగా, అద్భుత బంతితో ఎలీస్ పెరీ (4)ని పూజ బౌల్డ్ చేయడంతో ఆసీస్ కష్టాల్లో పడగా... మెక్‌గ్రాత్, మూనీ మూడో వికెట్‌కు 80 పరుగులు జోడించి జట్టును ఆదుకున్నారు. అనంతరం భారత్ ఆట ముగిసే సమయానికి వికెట్ నష్టపోయి 19 ఓవర్లలోనే 98 పరుగులు చేసింది. స్మృతి మంధాన (49 బంతుల్లో 43 బ్యాటింగ్; 8 ఫోర్లు), షఫాలీ వర్మ (59 బంతుల్లో 40; 8 ఫోర్లు) ఆరంభం నుంచే దూకుడుగా ఆడి తొలి వికెట్‌కు 100 బంతుల్లోనే 90 పరుగులు జత చేశారు. ప్రస్తుతం భారత్ మరో 121 పరుగులు వెనుకబడి ఉంది.

స్కోరు వివరాలు

ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్: మూనీ (సి) స్నేహ్ రాణా (బి) పూజ 40; లిచ్‌ఫీల్డ్ (రనౌట్) 0; ఎలీస్ పెరీ (బి) పూజ 4; తహీలా (సి) రాజేశ్వరి (బి) స్నేహ్ రాణా 50; హీలీ (బి) దీప్తి 38; అనాబెల్ (ఎల్బీ) (బి) పూజ 16; యాష్లీ (సి) యస్తిక (బి) పూజ 11; జెస్ (ఎల్బీ) (బి) దీప్తి 19; అలానా కింగ్ (సి) యస్తిక (బి) స్నేహ్ రాణా 5; గార్త్ (నాటౌట్) 28; లౌరెన్ (సి) స్మృతి (బి) స్నేహ్ రాణా 6; ఎక్స్‌ట్రాలు 2; **మొత్తం (77.4 ఓవర్లలో ఆలౌట్) 219. వికెట్ల పతనం:** 1–2, 2–7, 3–87, 4–103, 5–143, 6–159, 7–160, 8–168, 9–198, 10–219. **బౌలింగ్:** రేణుక 7–0–35–0, పూజ వస్త్రకర్ 16–2–53–4, స్నేహ్ రాణా 22.4–4–56–3, రాజేశ్వరి 13–4–29–0, దీప్తి శర్మ 19–3–45–2.

భారత్ తొలి ఇన్నింగ్స్: షఫాలీ (ఎల్బీ) (బి) జెస్ 40; స్మృతి (బ్యాటింగ్) 43; స్నేహ్ రాణా (బ్యాటింగ్) 4; ఎక్స్‌ట్రాలు 11; **మొత్తం (19 ఓవర్లలో వికెట్ నష్టానికి) 98. వికెట్ల పతనం:** 1–90. **బౌలింగ్:** లౌరెన్ 4–2–12–0, కిమ్ గార్త్ 4–0–34–0, పెరీ 4–0–31–0, యాష్లీ 5–3–8–0, జెస్ జొనాసెన్ 2–1–4–1.

కొత్తగా ఆరు కరోనా కేసులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కొత్తగా ఆరు కోవిడ్–19 పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. తాజాగా నమోదైన కేసులు కలిపి ప్రస్తుతం 19 మంది కరోనా బాధితులకు చికిత్స అందిస్తున్నట్లు రాష్ట్ర ప్రజారోగ్య విభాగం గురువారం ఒక ప్రకటనలో తెలిపింది. కోవిడ్–19 ప్రారంభం నుంచి ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా 8,44,519 మంది కరోనా బారిన పడగా... వీరిలో 8,40,389 మంది రికవరీ అయ్యారు. 4,111 మంది మృత్యువాత పడ్డారు. రాష్ట్రంలో కోవిడ్ రికవరీ రేటు 99.51 శాతం ఉండగా... మరణాల రేటు 0.49 శాతంగా ఉంది. గురువారం రాష్ట్రవ్యాప్తంగా 925 మందికి కరోనా పరీక్షలు నిర్వహించారు. ఇందులో 54 నమూనాలకు సంబంధించి ఫలితాలు వెలువడాల్సి ఉంది.

రోడ్డు ప్రమాద మరణాల్లో ఢిల్లీ టాప్

రెండో స్థానంలో బెంగళూరు • 23వ స్థానంలో హైదరాబాద్

సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ రహదారులు రక్తమోడుతున్నాయి. దేశంలో 10 లక్షలకుపైగా జనాభా ఉన్న నగరాల్లో రోడ్డు ప్రమాద మరణాల సంఖ్య ఢిల్లీలోనే అత్యధికంగా ఉంది. 2022 సంవత్సరంలో జరిగిన రోడ్డు ప్రమాదాలకు సంబంధించి కేంద్ర రవాణా శాఖ గణాంకాల ప్రకారం 1,461 రోడ్డు ప్రమాద మరణాలతో ఢిల్లీ మొదటి స్థానంలో నిలిచింది. గురువారం లోక్‌సభలో టీడీపీ ఎంపీ కేశినేని శ్రీనివాస్ అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. గతేడాది జరిగిన రోడ్డు ప్రమాద మరణాల్లో 772 మరణాలతో బెంగళూరు రెండో స్థానంలో, 765 మరణాలతో జైపూర్ మూడో స్థానంలో నిలిచాయి. ఈ తరహాలోని 50 నగరాల జాబితాలో తెలుగు రాష్ట్రాలకు చెందిన మూడు నగరాలు ఉన్నాయి. ఇందులో 418 రోడ్డు ప్రమాద మరణాలతో విజయవాడ 13వ ర్యాంక్ సాధించగా, 358 మరణాలతో విశాఖపట్టణం 18వ స్థానంలో నిలిచింది. 323 రోడ్డు ప్రమాద మరణాలతో హైదరాబాద్ 23వ ర్యాంక్‌లో ఉంది. అత్యల్పంగా 53 మరణాలతో శ్రీనగర్ 50వ ర్యాంక్‌లో నిలిచింది.

కేంద్ర పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

• వికసిత్ భారత్ సంకల్ప యాత్ర ప్రారంభం



కందుకూరు: కేంద్రం అందిస్తోన్న సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలో ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ పిలుపునిచ్చారు. రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలం మీర్‌ఖాన్‌పేట ప్రభుత్వ పాఠశాలలో గురువారం వికసిత్ భారత్ సంకల్ప యాత్రను కలెక్టర్ భారతి హోళికేరితో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రజలతో ప్రతిజ్ఞ చేయించి మాట్లాడారు. కేంద్రం అమలు చేస్తున్న ఆయుష్మాన్ భారత్, గరీబ్ కల్యాణ్, అన్న యోజన, దీన్‌దయాళ్ అంత్యోదయ యోజన, ఆవాస్ యోజన, ఉజ్వల యోజన, కిసాన్ సమ్మాన్ నిధి, జీవన జ్యోతి బీమా యోజనపై గ్రామీణులకు అర్థమయ్యేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఎల్‌ఈడీ వ్యాన్ల ద్వారా కేంద్ర పథకాలు, ప్రధాని సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు జనవరి 26 వరకు యాత్ర సాగనుందన్నారు. ఆయా పథకాలు అట్టడుగు వర్గాల స్థాయికి చేరుకోవాలన్నదే వికసిత్ భారత్ సంకల్ప యాత్ర ప్రధాన లక్ష్యమని గవర్నర్ పేర్కొన్నారు. పొదుపు సంఘాలకు మంజూరైన రుణాల పత్రాలు, లబ్ధిదారులకు ఆరోగ్య బీమా కార్డులను ఆమె అందించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను తెలియజేసేలా తయారు చేసిన 2024 సంవత్సర నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు.

హోమియోతో కరోనాకు చెక్

సాక్షి, హైదరాబాద్: కరోనా జేఎన్1 వైరస్ వ్యాపిస్తున్న నేపథ్యంలో ఈ మహమ్మారి బారిన పడకుండా 2 హోమియో ఔషధాలు వాడి ఎవరికి వారు రక్షించుకోవచ్చని ప్రముఖ హోమియో వైద్యులు డా.అంబటి సురేంద్ర రాజు 'సాక్షి'కి తెలిపారు. అర్సెనిక్ ఆల్బం 30 (Arsenic Album 30)ను వరుసగా 3 రోజులు, ఇన్‌ఫ్లుయెంజినమ్ 30 (Influenz inum 30)ను వరుసగా 3 రోజులు వాడాలి. ఉదయం 7 గంటలకు పరగడుపున నాలుకపై ఒకటి లేదా 2 చుక్కలు వేసుకోవాలి. ఇలా ఒక్కొక్క మందును వరుసగా 3 రోజులు, రోజుకు ఒకసారి మాత్రమే.. మొత్తం వరుసగా 6 రోజులు వాడాలి. ప్రామాణిక జర్మనీ కంపెనీ మదర్ టింక్చర్‌లు వాడితే ఫలితం బాగుంటుందని డా.సురేంద్ర రాజు తెలిపారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.